# గోరంతదీపం

నవల

- అంజన కొడాలి



శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 211

కౌముది మాసపత్రికలో

జనవరి 2019 సంచిక నుంచి సెప్టెంబర్ 2020 సంచిక వరకూ

వచ్చిన సీరియల్ నవల

# (ప్రారంభం)

**2005 మే నెల.**

నిశిరాత్రిని మేల్కొలిపి, చల్లగాలితో కబుర్లు చెప్పటానికి తొలివెలుగు ముచ్చటపడుతుంది. పచ్చని పొలాలు, నీహారికా బిందు సందోహాలు, గాలికి ఊగులాడే కొబ్బరాకులు పంటకాల్వల మీద పంచుకున్న పల్చటి మంచుతెర.

"రాత్రంతా అసలు నిద్రపోయావా లేదా?" రాధిక మాటలు విని ఉలిక్కిపడి, తన ఆలోచనలు నుండి బైటపడింది అంజలి.

"చాలా రోజులయ్యింది కదా మా ఊరు వచ్చి మరింత అందంగా ఉంది" అంజలి నవ్వుతూ అంది.

"నాకు తెలుసుతల్లీ నీ గురించి ప్రకృతిని ఆస్వాదిస్తూ కూర్చుంటే ఆకలి, నిద్ర ఉండవు నీకు నాలుగేళ్ళ నుంచీ చూస్తున్నా ఇంత భావుకత సెన్సిటివ్‌నెస్ ఉన్నదానిని ఏ ఆర్టిస్టులాగానో అవ్వాలి కానీ మెడిసిన్ ఎలా చదువుతున్నావో అర్థంకాదు" నవ్వింది రాధిక.

"ఇంకొక అరగంటలో ఊరు వస్తుంది. అందరిని నిద్రలేపుదామా" మాట మార్చింది అంజలి.

రాధిక, లక్ష్మి, రఘు, వివేక్, రాజేష్ వీళ్ళందరూ కాబోయే డాక్టర్లు. మంచి స్నేహితులు. హౌస్‌సర్జన్ అయిపోయింది. పి.జి చేయటానికి పరీక్షలు రాశారు. ఇంకా నాలుగు నెలలుంది, రిజల్ట్ వచ్చి జాయిన్ అవ్వటానికి.

అంజలి వాళ్ళ ఊరు గురించి ఎప్పుడూ చెపుతుంది. ఓ పదిరోజులు ఇక్కడ గడపటానికి వస్తున్నారు. దాంతోపాటు ఏమన్నా మెడికల్ క్యాంప్‌లాగా పెడదామా అని ఆలోచన. అది కనక కుదిరితే వాళ్ళ ప్రొఫెసర్‌తో మాట్లాడి క్యాంప్ పెట్టించవచ్చు.

ఒక్క అంజలి తప్ప అందరూ హైదరాబాద్‌లో పెరిగినవాళ్ళే. అంజలి ఇంటర్ కాలేజి, అంతా హాస్టల్స్‌లో ఉండి చదువుకుంది. ఎప్పుడన్నా సెలవలకు వచ్చినా ఓ పది పదిహేనురోజులు అంతే.

అంజలి వాళ్ళ నాన్నగారు సీతారామయ్యగారు పెద్ద మోతుబరి. అంజలి వాళ్ళకు ఒక్కతే కూతురు.

"గూడవల్లి వచ్చింది" కండక్టర్ మాటలు విని అందరూ లేచి సామాన్లతో నెమ్మదిగా దిగారు.

ఇంకా సొంతం తెల్లవారలేదు కానీ పల్లె ఎప్పుడో నిద్రలేచింది.

నీళ్ళ కావిళ్ళు, పాలబిందెలు, సైకిళ్ళ మీద పెట్టుకుని వెళుతున్నారు. ఊరు మధ్యలోని అరుగు దగ్గర సీతారామయ్యగారు పాలేరుతో నిల్చున్నారు.

"ఏమ్మా ప్రయాణం బాగా జరిగిందా? ఏం బాబు మీకెవరికి ఇబ్బంది అనిపించలేదుగా" దగ్గరికి వచ్చి ఆప్యాయంగా అడిగారు.

"నాన్నా, వీరయ్యా వీళ్ళు నా ఫ్రెండ్స్" అందర్ని పేరుపేరున పరిచయం చేసింది.

"సామాన్లు వీరయ్య తెస్తాడు మీరు పదండి."

"పర్లేదు నాన్నా అందరం పట్టుకుంటాం" అంది అంజలి.

"నువ్వు హాస్టల్ ఖాళీ చేస్తున్నావని సామాన్లు ఎక్కువుంటాయని బండి తీసుకొచ్చాడు. ఎలాగూ పొలానికి వెళుతున్నాడు. సామాన్లు ఇంట్లో పడేసి వెడతాడు రండి" అన్నారాయన.

ఇల్లు బస్టాండుకు మరీ దూరంకాదు. రెండు బజార్ల అవతల. గూడవల్లి మరీ చిన్న ఊరుకాదు. మరీ పెద్దది కాదు. వెయ్యి గడపల ఊరు రెండు పెద్ద టౌన్‌ల మధ్య ఉండటం, చుట్టు ప్రక్కల ఇంకా చిన్న పల్లెలుండటంతో ఈ ఊరు బాగానే అభివృద్ధి చెందింది. మంచి ఆదాయమున్న పొలాలు, పాడిపంటలతో సంపన్నమైన ఊరు. కొందరు పెద్దల ప్రోద్భలంతో, సీతారామయ్యగారి చిన్నతనంలోనే, ఊరిలో ఒక హైస్కూలు, లైబ్రరీ ఏర్పాటయ్యాయి. తర్వాత పాలకేంద్రం కూడా వచ్చింది.

మంచితో పాటు చెడు అన్నట్లు. కష్టపడి పని చేయాల్సిన అవసరం లేనివాళ్ళు, తాతలనాటి ఆస్థి బాగా ఉన్నవాళ్ళు, కొందరు పదవుల కోసం... ప్రాతినిథ్యం కోసం రాజకీయాలు చేయటం మొదలుపెట్టారు. పాలకేంద్రం మీద పట్టు, స్కూలు కమిటీ మెంబర్ల మధ్య పోరు మొదలయింది. అసలే చదువుల పేరిట, ఉద్యోగాల పేరిట వలస వెళ్ళే వాళ్ళు ఎక్కువైన ఈ రోజుల్లో ముసలివాళ్ళు, చదువు పెద్దగా అబ్బకుండా అనవసర భేషజాలంతో గొప్పలు పోతూ, రాజకీయాలు చేసే వాళ్ళు మిగిలారు ఊళ్ళో. సీతారామయ్యగారి లాంటి మంచివాళ్ళు కొంతమంది ఉన్నా అది తక్కువ శాతం.

"మీ ఊరు చాలా బాగుంది అంజలి" అన్నాడు వివేక్ లోగొంతుకతో. నీలాగే", ఏం మాటలాడ లేదు అంజలి.

వివేక్ బాగా డబ్బున్నవాళ్ళ అబ్బాయి, బాగా తెలివిగలవాడు చిన్నప్పటినుండి ఏది కావాలన్నా సాధించుకుంటాడు. తెల్లగా, పొడుగ్గా ఉంటాడు. మెడికల్ కాలేజీలో ఒక హీరోగా ఉండేవాడు, చాలామంది అమ్మాయిలు తనతో స్నేహం చేయటానికి ప్రయత్నించినా వివేక్ దృష్టి ఎప్పుడూ అంజలి మీదే నాలుగు సంవత్సరాలుగా ఎంత ప్రయత్నించినా అంజలి ఈ స్నేహాన్ని ఒక పరిధి దాటి ముందుకు రానివ్వలేదు.

ఊరు చూస్తూ నడుస్తున్నారు. ఇళ్ళముందు కళ్ళాపి చల్లి ఆడవాళ్ళు ముగ్గులేస్తున్నారు. ఒకళ్ళిద్దరు అంజలిని పలకరించారు.

"అంజలి.. నీకు ముగ్గులేయటం వచ్చా?" అడిగింది రాధిక.

"చిన్నప్పుడు వేసేదాన్ని అమ్మతో కలిసి తర్వాత ఎప్పుడన్నా సెలవుల్లో"

"ముగ్గులెయ్యటం ఆడపిల్లల లక్షణం. నీకెందుకు?" కొంటెగా నవ్వుతూ అన్నాడు రఘు.

"ఆడపిల్లను కాకపోతే నా వెనకెందుకు పడ్డావు" కోపంగా అంది రాధిక.

"ఎరక్కపోయి పడ్డాను ఇరుక్కుపోయాను." రాగయుక్తంగా అన్నాడు రఘు. రాధ, రఘు ప్రేమించుకున్నారు. ఇంకొక మూడునెలలో పెళ్ళి. కానీ ఒకరినొకరు ఏడ్పించుకునే అవకాశం మాత్రం వదులుకోరు.

రాజేష్ అమెరికా వెళ్ళటానికి ప్రయత్నిస్తున్నాడు. లక్ష్మి వాళ్ళ ఆర్ధిక పరిస్థితి అంత బాగోదు. పిజి రాసింది కానీ ఉద్యోగంలో చేరితే వాళ్ళ ఇంటికి ఆర్ధికంగా చేయూత ఇచ్చినట్లుగా ఉంటుంది అని మధనపడుతుంది.

అంతలోకి అంజలి వాళ్ళ ఇల్లు వచ్చింది. ముందు పెద్దగేటు, తెరిచే ఉంది. బైట పెద్దముగ్గు, ఇంటిదాకా నడిచే దారిలో నాపరాళ్ళు పరిచి ఉన్నాయి. రెండువైపులా బాగా ఖాళీ స్థలం ఉంది. ఒకవైపు పెద్దవడ్లపురి ఉంది. "దీన్ని పురి అంటారు. అంటే వడ్లు దాచుకునే గోడౌన్ అన్నమాట" అంది అంజలి.

"ఎన్ని పూలమొక్కలున్నాయో" సంబరపడుతూ అంది లక్ష్మి.

"అమ్మకు బాగా ఇష్టం" అంది అంజలి.

ఇంటి చుట్టూ పెద్దవరండా. వరండా పై కప్పు పెంకులతో ఉంది వరండా చుట్టూ కనకాంబరాలు, గులాబీలు ఉన్నాయి. ఓ పక్కన పెద్ద విరజాజి చెట్టు, సన్నజాజి తీగపైన డాబా మీదకు పాకింది. గోడ పక్కన మల్లె మొక్కలు, సంపంగ, నిత్య మల్లె, గరుడ వర్ధనం నంది వర్ధనం రంగురంగుల మందారాలు ఉన్నాయి. వీళ్ళ మాటలు విని లోపల నుండి అంజలి వాళ్ళ అమ్మ అన్నపూర్ణ వచ్చింది.

"రండి, బాగున్నారా అందరూ?" అంటూ అంజలి అందరిని పరిచయం చేసింది.

"మీ అందరి గురించి అంజలి దగ్గర వినడమే కానీ, ఇన్నాళ్ళకు చూస్తున్నాను" నవ్వుతూ అన్నారు ఆవిడ.

"ముందు మొహం కడుక్కుని, కాఫీలు తాగండి. స్నానం చేసేసరికి టిఫెను రెడీ అవుతుంది."

"అమ్మా కంగారు పడకు, నేనెంతో వాళ్ళూ అంతే. ముందు రెడీ అవుతాం" అని లోపలకు తీసుకెళ్ళింది.

పెద్ద హాలు, గోడల మీద ఎవరివో పాత ఫోటోలు ఎదురుగా పెద్ద వెంకటేశ్వరస్వామి ఫోటో ఉంది. ఓ పక్కన సోఫా, కుర్చీలు. ఇంకో పక్క ఉయ్యాల బల్ల, హాలుకు ఓ వైపు రెండు గదులున్నాయి. అబ్బాయిల సామాన్లు ఒక గదిలో, అమ్మాయిలవి ఇంకో గదిలో పెట్టించారు. రెండు గదులకు వేర్వేరు బాత్రూములున్నాయి. "వావ్, పల్లెటూర్లో ఇంత మోడ్రన్‌గా ఉంటుందనుకోలేదు. బైట బావి దగ్గర స్నానం చేయాలేమో అనుకున్నా" నవ్వుతూ అన్నాడు రఘు.

"ఇదివరకు ఇది అంతా ఒకటే పెద్ద గదిగా ఉండేది. నాలుగేళ్ళ క్రితం నాన్న ఇలా మార్పించాడు. ఎవరన్నా వచ్చినప్పుడు వీలుగా ఉంటుందని. నా గది వెనుకవైపు ఉంది. మీరు స్నానాలు కానివ్వండి" అని అంజలి వెనక గదివైపు వెళ్ళింది.

హాలునుండి సన్న వసారా వెనుకవైపు వెళుతుంది. ఒకవైపు అంజలి గది, పూజ ఇంకోవైపు తన అమ్మానాన్నల గది, స్టోర్ రూమ్ ఉన్నాయి. ముందు ఇంటికి వెనకాల ఇంకో చిన్న ఇల్లు ఉంది. అది వంటిల్లు. మధ్యలో అంతా నాపరాళ్ళు పరిచి ఉన్నాయి. అంతా స్నానాలు చేసి వంటగదిలోకి వెళ్ళారు. పెద్దగది, ఒక పక్క ఆరుకుర్చీలు, టేబుళ్ళు ఉన్నాయి.

"పూర్ణా, అందరికీ వడ్డించు" అన్నారు సీతారామయ్యగారు. అందరూ పట్టరుకదా ఎలా కూర్చోవాలి అన్నట్లుగా మొహమొహాలు చూసుకున్నారు స్నేహితులు. "నాది అయిపోయింది మీరు కానివ్వండి" అని సీతారామయ్యగారు బైటకు వెళ్ళారు.

వేడి వేడి ఇడ్లీలు, కారంపొడి, నెయ్యి కొబ్బరి పచ్చడి.

"అబ్బా ఎంత బాగున్నాయి ఆంటీ ఇడ్లీలు!" అన్నారు అందరూ.

"ఏదో మా పల్లెటూరి వాళ్ళకు, వంటలు చేయటంలోనే అభిమానం చూపిస్తాం"

"అమ్మా! కాఫీ నాన్నతో కలిసి తాగుదాం, నువ్వు కూడా దా ముందు గదిలోకి, నువ్వు కూడదా ముందు గదిలోకి, అందరం కబుర్లు చెప్పుకుందాం" అంది అంజలి.

"మీరు వెళ్ళండి, నేను మధ్యాహ్నం వంట సంగతి చూడాలి"

"అబ్బా.. అమ్మా, దానికి చాలా టైం ఉంది. పద నువ్వు" గారాంగా చెయ్యిపట్టుకుంది అంజలి.

కాఫీ తాగుతూ ఉయ్యాల బల్లమీద కూర్చుంది అంజలి, "నాకు ఈ ఉయ్యాల బల్ల అంటే చాలా ఇష్టం. చిన్నప్పుడు ఒక్కోసారి దీనిమీదే పడుకునేదాన్ని. ఒకసారి దీనిమీద నుండి పడితే బాగా దెబ్బతగిలింది. అయినా చాలా ఇష్టం."

"నాన్న మెడికల్ క్యాంప్ సంగతి ఏం ఆలోచించారు? ఇంకా ఇక్కడ రాజకీయాలు అలానే ఉన్నాయా, ఎవరన్నా సమర్థించారా"

"లేదమ్మా ఊరు మారింది. నీ చిన్నప్పటిలాగా కాదు. ఇప్పుడు ఊరు ప్రెసిడెంటు ఎవరనుకున్నావు? రవి" సాలోచనగా చూసింది అంజలి.

"గుర్తులేదా పటమటి బజార్లో చంద్రశేఖర్రావు ఉన్నారే ఆయన కొడుకు. నీకంటే పెద్దవాడు కదా అందుకే నీకు గుర్తులేదేమో. ఆ అబ్బాయి అగ్రికల్చర్ యం.యస్.సి చదివి, ఉద్యోగం కోసం పట్నం పోకుండా, ఇక్కడే వ్యవసాయం చేస్తానని ఉండిపోయాడు. నెమ్మదిగా ఊళ్ళో పరిస్థితులు గమనించి, కుర్రాళ్ళను జతచేసుకుని మంచి పనులు చిన్నగా మొదలుపెట్టాడు. మొదట్లో ఏదో కుర్రాళ్ళులే అని ఊరుకున్నారు. కానీ వీళ్ళు పాలెం పనివాళ్ళకు రాత్రిపూట చదువు, కూలీరేట్లు విషయంలో వాళ్ళకు న్యాయం చేయటం చేస్తుంటే, ఈ పనికిమాలిన రాజకీయాలు చేసేవాళ్ళు సహించలేకపోయారు. కొన్ని గొడవలయ్యాయి. కానీ బాగా పట్టుదల ఉన్నవాడు. నాలుగేళ్ళ క్రితం ప్రెసిడెంటుగా పోటీ చేసాడు. అవతలి వాళ్ళు సారా పోయించి, డబ్బులు పంచినా, రవియే గెలిచాడు. చాలా మంచిపేరు సంపాదించాడు. అయినా శత్రువులు కూడా ఉన్నారులే."

"పల్లెల్లో కూడా రాజకీయాలు బాగానే ఉంటాయి" అన్నాడు రాజేష్ "సోమరితనానికి, పిచ్చి పట్టుదలలకు అలవాటయిన జనం, మార్పును ఒప్పుకోరు. వాళ్ళ క్రింద బానిసలుగా పనిచేసిన పాలేళ్ళు కూడా ఓటు హక్కు ఉండటం సహించలేరు. సర్లే ఈ కబుర్లకేం కానీ, నేను రవితో మాట్లాడాను. ఇవాళ ఊరు చూసి రెస్ట్ తీసుకోండి రేపు పంచాయితీ ఆఫీసుకు వెళ్ళి రవిని కలుద్దాం."

"రండి పైన డాబా చూపిస్తా" అని అంటూ పైకి తీసుకెళ్ళింది.

చుట్టూ చూస్తే ఇళ్ళు, కొబ్బరి చెట్లు, అరటిపాదులు, లీలగా మాటలు అందరికీ బాగా నచ్చింది.

"ఈ రవి అనే అతను నీకు తెలియదా అంజలి?"

"నేను ఎప్పుడూ సెలవులకే వచ్చేదాన్ని కదా. వాళ్ళ నాన్నగారు తెలుసు. అతను గుర్తురావటంలేదు" అంది అంజలి.

"ఎంత వయసు ఉంటుందో, హీరోలాగా ఊరును మారుస్తుంటే" డ్రీమీగా అంది రాధిక.

"ఎంత లేదన్నా ఓ 40-45 మధ్య ఉంటుందేమో, నీకు మరీ పెద్దవాడై పోతాడు వదిలేయ్" నవ్వాడు రఘు.

"కుళ్ళు నీకు, నేను వేరే ఎవరినన్నా ఇష్టపడతానని."

అందరూ నవ్వారు.

"భోజనం చేశాక పొలం వైపు వెళదాం"

నర్సి అందరిని భోజనాలకు పిలిచింది. గారెలు, చక్రపొంగలి, పులిహోర, పొట్లకాయకూర, గుమ్మడికాయ పులుసు.

"బాపురే, ఏంటీ ఆంటీ ఇంత శ్రమ పడ్డారు? మేమింకా పదిరోజులుండాలి మీ ఇంట్లో, మీరింత కష్టపడితే మేము ఇవాళే వెళతాం" అన్నాడు వివేక్.

"కాకా పట్టకు వివేక్" నవ్వుతూ అన్నాడు రాజేష్. అందరికి వివేక్, అంజలి కోసం పడే కష్టాలు తెలుసు.

"ఈ అబ్బాయిలకు బుద్ధిలేదు. ఎప్పుడు ఏం మాట్లాడాలో తెలియదు" మనస్సులో విసుక్కుంది లక్ష్మి. పైకి మాత్రం ఆ మాట దాటించటానికి "ఎందుకాంటీ ఇవన్నీ, మేము అంజలిలాంటివాళ్ళమే కదా?" అన్నది.

చిన్నగా నవ్వింది అన్నపూర్ణ "మీరు అందరూ పట్నం వాళ్ళు ఏమి నచ్చుతాయో తెలియదు కదా, అందుకని ఏదో ఒకటన్నా నచ్చుతుందిలే అని చేశాను. మీకు ఏమి ఇష్టమో చెప్పితే అవి చేస్తాను."

అందరి కబుర్లు, గిల్లికజ్జాలతో, పేచీలతో భోజనాలు అయ్యాయి. "నేను మాత్రం ఎక్కడికి రాను. నావల్లకాదు, నిద్రపోతాను" అన్నాడు రాజేష్.

"అంత బద్ధకం ఏంటి నీకు, అమెరికా వెళితే మళ్ళీ ఇలా పల్లెటూరుకు వస్తావా? ఒన్స్ ఎ లైఫ్‌టైమ్ ఛాన్స్" నవ్వూతూ అంది రాధిక.

"బాగా ఎండగా కూడా ఉందిలే. సాయంత్రం వెళదాం" అంది అంజలి.

"మీ ఊళ్ళో ఏం ఉన్నాయి చూడటానికి. ఎక్కడికి తీసుకెళుతున్నావు?" అడిగాడు రఘు.

"ఇది హైదరాబాదు కాదు,  ఓ ఛార్మినార్, ఓ బిర్లా మందిర్ ఉండటానికి పొలాలు, తోటలు ఉంటాయి" అంది రాధిక.

"పొలాలు చూద్దాం ఇవాళ" ఆలోచనగా అంది అంజలి.

ఇప్పుడే ఇంటి దగ్గర్నుండి అందరూ బయలుదేరారు. మధ్యాహ్నం రెండున్నర అయ్యింది. ఇదివరకు ఈ టైమ్‌లో చాలా ప్రశాంతంగా ఉండేది ఊరు సామాన్యంగా అందరూ చాలా పెందలాడే లేస్తారు. కాబట్టి మధ్యాహ్నం ఓ చిన్న కునుకు తీస్తారు. మళ్ళీ త్రం పాలు పిండే పనిదాకా.

ఇదివరకు ఓ మాదిరి తారు రోడ్డు ఉండేది. అదికూడా వ్యవసాయపు ట్రాక్టర్లు అవీ తిరగడంతో కొంచెం పాడైపోయినట్లు ఉండేవి. కానీ ఇప్పుడన్నీ సిమెంటు రోడ్లు వేశారు. మోటార్ సైకిళ్ళు బాగా తిరుగుతున్నాయి. మెయిన్ రోడ్డు మీద నుంచి కాకుండా ఇంటి దగ్గర్నుండి వెనక నుండి బజార్ల మీదుగా పొలాల దగ్గరకు తీసుకెళుతుంది.

"ఎవళ్ళది వెళుతుంది?" ఓ అరుగు మీద కూర్చున్న ముసలావిడ అడిగింది.

అందరూ ఆగారు. "నేను అమ్మమ్మ సీతారామయ్యగారి అమ్మాయిని" అంది అంజలి.

"కళ్ళు సరిగ్గా కనపడటంలేదమ్మా గుర్తుపట్టలా ఏం అనుకోకే" అంది ఆవిడ.

"మీ అమ్మ చెప్పింది నువ్వు సెలవులకు వస్తున్నావని. ఇలా దగ్గరకు రా" అంది.

అంజలి వెళ్ళి ఆవిడ పక్కన అరుగు మీద కూర్చుంది.

"చాలా పెద్దదానివి అయిపోవావు. డాక్టరీ అయిపోయిందంట కదా!?" బుగ్గలు నిమురుతూ అడిగింది.

అంజలి స్నేహితులందరూ ఆవిడనే చూస్తున్నారు. పాతనేత చీర, వేలు ముడివేసుకున్న తెల్లజుట్టు, ముడతలు పడ్డ శరీరం, పక్కన చేతికర్ర.

"నీకు ఒంట్లో ఎలా వుంది అమ్మమ్మ?" అని అడిగింది అంజలి.

"నాదేంది. ఆ పైవాడి పిలుపుకోసం చూస్తున్నా. నీ చదువు అయిపోయిందిగా. ఏమన్నా మందులివ్వు ఇంకా 20 ఏళ్ళు బ్రతకటానికి" గట్టిగా నవ్వుతూ అంది ఆవిడ.

"వీళ్ళందరూ ఎవరూ నీ స్నేహితులా?" ఆరాగా అడిగింది. అందరిని పరిచయం చేసింది అంజలి. "పల్లెటూళ్ళు చూడటానికి వచ్చారా. ఏముంది నాయనా ఇక్కడ చూడడానికి అందరూ పట్నాలకు ఎగబడి పోతంటే నాలాంటి ముసలివాళ్ళం మిగిలాం ఇక్కడ" అంది ఆవిడ.

"ఎవరితో మాట్లాడుతున్నా" లోపల్నుండి ఓ మధ్య వయస్సు ఆవిడ వచ్చింది. "అంజలి నువ్వా సాయంత్రం నేనే వద్దామనుకుంటున్నా. లోపలికి రా అక్కడ ఉన్నావే"

"లేదులే అత్తా. మా స్నేహితులు వచ్చారు. వాళ్ళకు పొలాలు చూపించటానికి వెళుతున్నా. తీరిగ్గా వస్తాలే. ఇంక బయలుదేరతాను. మామయ్యను అడిగానని చెప్పు." అని అంది.

అందరూ బయలుదేరారు. "బంగారు తల్లి. ఎవరింట్లో కాలు పెడుతుందో కానీ..." లీలగా అమ్మమ్మ మాటలు వినపడ్డాయి,

"ఆవిడ మీ అమ్మమ్మా?" అడిగింది లక్ష్మి.

"సొంత అమ్మమ్మ కాదు. కానీ ఈ ఊళ్ళో అందరం వరసలతోనే పిలుచుకుంటాం."

"అయితే ఈ ఊళ్ళో బావలు, చాలామంది ఉండే ఉంటారు అంజలికి. పంచెకట్టు, కోరమీసం టైపు. అందుకే అంజలికి హైదరాబాద్‌లో ఎవరూ నచ్చలేదు" కొంటెగా వివేక వైపు చూస్తూ అంది. రాధిక.

కోపంగా రాధిక వైపు చూశాడు వివేక్. ఈ పదిరోజుల్లో ఎలాగైనా అంజలిని ఒప్పించాలి, పట్టుదలగా అనుకున్నాడు.

ఓ ఫర్లాంగు దూరం వెళ్ళాక నెమ్మదిగా తాటితోపులు, పొలాలు కనపడటం మొదలుపెట్టాయి. తాటితోపుల పక్కన ఓ పెద్ద కాంపౌండ్ లాగా ఉంది.

"ఏంటిది?" అన్నాడు రాజేష్. "ఇది ఒక ఆశ్రమం. ఊళ్ళో ఆడవాళ్ళంతా సామూహికంగా పూజలు, వ్రతాలు చేస్తుంటారు. ప్రవచనాలు అవీ జరుగుతుంటాయి. స్వాతంత్రం టైములో అందరూ రాట్నం కూడా వడికే వారంట" అంది అంజలి.

ఇంకా ముందుకు వెళ్ళారు. సిమెంటు రోడ్డు అయిపోయి మట్టి రోడ్డు వచ్చింది. "ఇదేంటి వరిపొలాలు లేవు" అన్నాడు వివేక్.

"వరి ఆగస్టులో వేస్తారు. ఈ చిన్న మొక్కలనీ మినుము, పెసరు, వేరుశనగ ఇలా ఎవరికి వీలైనవి వాళ్ళు వేస్తారు."

పొలం గట్ల మీద తాటిచెట్లు ఉన్నాయి. పొలంలో అక్కడక్కడా కూలీలు కనిపిస్తున్నారు. "తాటి ముంజులు ఉన్నాయో అయిపోయాయో నాన్నను కనుక్కుంటా. చాలా బాగుంటాయి" ఎక్సైటింగ్‌గా అంది అంజలి. "అవేంటి'?' అన్నారు.

"సస్పెన్స్" నవ్వుతూ అంది.

"ఈ ఎడమ పక్కన ఉన్న పొలం మాదే ఇంకా కాలవ అవతల కూడా ఉంది" అంది అంజలి.

అలవాటులేని నడక అదీ పొలం గట్ల మీద. ఇబ్బందిగానే ఉంది అందరికి. "అనవసరంగా చీర కట్టుకున్నా. ఇంక నా వల్లకాదు. రేపట్నుండీ చుడీదార్లే." గునుస్తూ అంది రాధిక.

కొంచెం ముందల తోటల్లాగా కనిపించింది. "ఏంటది మామిడి తోట?" అడిగాడు రాజేష్.

"మాదికాదు. ఈ ఊరి ప్రెసిడెంట్ అని చెప్పారే నాన్న. వాళ్ళవి పెద్దది కాదు. ఆయనేదో సరదాకి ఓ రెండు ఎకరాలు వేశారు"

అంజలినే చూస్తున్నాడు వివేక్. లేత పసుపు చీరలో, ఈ పొలాల మధ్య వనదేవతలా ఉంది. ఈ పొలం విషయాలు అవీ చెపుతుంటే తనలో ఓ తెలియని మెరుపు గమనించాడు.

"కాసేపు కూర్చుందామా?" అన్నాడు వివేక్. వివేక్ వంక చూశాడు రాజేశ్. అంజలితో ఒంటరిగా ఉండాలనుకుంటున్నాడని అర్ధం అయ్యింది.

"అంజలి వివేక్‌తో నువ్వు కూర్చో. మేం అలా తిరిగివస్తాం" అని అందరిని లాక్కొని వెళ్ళాడు. అంజలి ఏం అంటున్నా వినిపించకుండా.

"అందరం కలిసే వెళ్ళాల్సింది" అంది అంజలి.

"నీతో ఒంటరిగా ఉండాలని నాకు ఉందని. వాళ్ళకు అర్ధం అయ్యింది కానీ. నీకు అర్ధంకాలేదా?" నెమ్మదిగా అన్నాడు వివేక్.

"వివేక్ ప్లీజ్. మళ్ళీ మొదలెట్టకు" చిన్నగా అంది అంజలి.

"లేదు అంజలి. ఇవాళ అటో ఇటో తేలిపోవాలి. నాలుగేళ్ళుగా నీతో స్నేహాన్ని ఇంకొంచెం ముందుకు తీసుకెళ్ళాలని ప్రయత్నిస్తున్నా. నాది ప్రేమ అని ఎన్నోసార్లు చెప్పాను. కానీ నాలో నీకు నచ్చని విషయం ఏంటో నాకు అర్ధం కావటంలేదు."

"నేను ఎప్పుడన్నా నీతో అతి చనువుగా ఉండి నీలో లేనిపోని ఆలోచనలు రేపానా?" నెమ్మదిగా అంది అంజలి.

"లేదు నేను నిన్ను ప్రేమిస్తున్నానని మన ఫ్రెండ్స్ అందరికి తెలుసు. కానీ నువ్వు ఒప్పుకోవు. నేనేమి నిన్ను చీట్ చేయటం లేదుగా. పెళ్ళి చేసుకుందాం, ఈ పెళ్ళిని ఇద్దరి వైపు వాళ్ళు కాదనరు. మరి నీకేంటి ప్రాబ్లమ్? " కోపంగా అన్నాడు.

కాసేపు మౌనంగా ఉంది అంజలి.

కాసేపు మౌనంగా ఉంది అంజలి. "ఐ యామ్ రియల్లీ సారి. నేను నా ఫీలింగ్స్ గురించి ఎప్పుడూ స్పష్టంగానే ఉన్నాననుకున్నా. నీలో చెడ్డలక్షణాలు ఏమీ లేవు కానీ నాకెప్పుడు నువ్వు ఒక మంచి ఫ్రెండ్‌లానే ఉంటావు. అంతకు మించి ఆలోచించలేకపోయాను."

"ఎలా ఎక్స్‌ప్లైన్ చేయాలో అర్ధం కావటంలేదు. ఇద్దరి మధ్య ప్రేమ అనేది ఓ స్పందన. ఆ స్పందన ఒకరిలో లేకపోతే ఆ బంధం పలచపడిపోతుంది. మనిద్దరి మధ్య ఉన్నది స్నేహబంధం ఒక్కటే అని అనుకుంటున్నా."

"నాలుగేళ్ళుగా ప్రేమించిన నన్ను, కాదని ఇంకెవరినో పెళ్ళి చేసుకుంటావా? నా గురించి నీకు బాగా తెలుసు అయినా నన్ను ప్రేమించలేవు. పెళ్ళి చేసుకోలేవు. మీ నాన్నగారు ఎవరిముందో నిన్ను పెళ్ళి చూపులకని కూర్చోపెడితే పదినిమిషాలు చూసి పెళ్ళి చేసుకుంటావా?" కోపంగా అని మొహం తిప్పుకున్నాడు వివేక్.

"ప్లీజ్ కోపం తెచ్చుకోకు. పెళ్ళి, నాకెవరొస్తారో, నీకెవరొస్తారో ఇదంతా ఆలోచించటం లేదు నేను, నాకు మీ అందరి స్నేహం కావాలి. నేను నీ ప్రపోజల్ ఒప్పుకోలేదని. కోపంతో నా స్నేహాన్ని వదులుకోవుగా" అడిగింది అంజలి.

"నా మనస్సు పెళ్ళిమీద లేదు. అర్ధం చేసుకో వివేక్ ప్లీజ్" అంది.

"పద అందరి దగ్గరకు వెళదాం" విసురుగా లేచాడు.

వివేక్ మొహం చూసి అందరికి అర్థం అయ్యింది. ఇంకొంచెం ముందుకు నడిస్తే ఇంకొక సిమెంట్ రోడ్డు వచ్చింది. దాని ప్రక్కన పెద్దకాలువ.

రోడ్డు మీద నడుస్తూ ముందుకెళితే పెద్ద వంతెన కనిపించింది. ఎడం పక్కకి ఊళ్ళోని మెయిన్ రోడ్ మీదకు తిరిగారు.

"ఈ పక్కనే శివాలయం ఉంది. ఓ వంద సంవత్సరాలనాటిది అని అంటారు. ఇదిగో ఇది లైబ్రరీ, నాన్న చిన్నప్పటిది. ఇదే బస్టాండు కం రచ్చబండ" చాలామంది అక్కడ కూర్చుని ఉన్నారు. కొందరు పేకాట ఆడుతుంటే చాలా మంది చూస్తూ కబుర్లు చెపుతున్నారు. ఎవరీ కొత్తవాళ్ళు అన్నట్లు అందరూ చూస్తున్నారు.

నెమ్మదిగా ఇంటికి చేరారు అందరూ. "కాళ్ళు కడుక్కుని రండి టిఫెన్ చేద్దురుకానీ" అన్నారు అన్నపూర్ణగారు.

రాధిక, అంజలి వెనకాలే వచ్చింది. "ఏంటిది అంజలి? ఇంత మూర్ఖంగా నువ్వు వివేక్‌ని బాధపెడుతున్నావు. అంత మంచివాడు, తెలివిగలవాడు, నువ్వంటే ప్రాణం. ఎందుకలా ఏడిపిస్తావు?" కోపంగా అంది.

"ఇదే మా ఇద్దరికి మంచిది రాధీ. నువ్వు చెప్పిందంతా కరక్టే కానీ తనను భర్తగా ఊహించుకోలేను. తనతో కనెక్ట్ కాలేను. ఇప్పుడు నిష్టూరంగా అనిపించినా తర్వాత తానే అర్థం చేసుకుంటాడు. ప్లీజ్ ఇంక వదిలేయ్" సీరియస్‌గా అంది అంజలి.

అందరూ బయటకు వచ్చి వరండాలో కూర్చున్నా సున్నుండలు, కారప్పూస, లడ్డూలు, టీ టేబుల్ మీద పెట్టారు. "వివేక్ ఏడి?" అడిగింది  అంజలి. "తలనొప్పి అని పడుకున్నాడు" చెప్పాడు రాజేష్.

లేచి లోపలికి వెళ్ళింది అంజలి. "నిజంగా తలనొప్పిగా ఉందా?" లేచి కూర్చున్నాడు వివేక్.

"వివేక్, మనిద్దరి మధ్య ఈ టెన్షన్ వద్దు నీకంటే నీ గురించి నాకే బాగా తెలుసు. మనిద్దరం కంపాటబుల్ కాదు. నా పిజి అయిపోయాక నేను పల్లెటూళ్ళో ప్రాక్టీస్ పెడతానంటే నువ్వు ఒప్పుకోలేదు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. మనిద్దరి ప్రపంచాలు ఎంత తేడానో చూపటానికి. ఈ గొడవ వలన నీ స్నేహాన్ని కోల్పోవాలని లేదు. నువ్వు చాలా మంచి ఫ్రెండ్‌వి వివేక్" కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుండగా అంది అంజలి.

కాసేపు ఏం మాట్లాడలేదు వివేక్. నెమ్మదిగా లేచి వచ్చి తన చెయ్యిపట్టుకున్నాడు. "నీ మీద ఎక్కువసేపు కోపంగా కూడా ఉండలేను" పద వెళదాం అన్నాడు. వాళ్ళిద్దర్ని చూసి అందరూ రిలీఫ్‌గా ఫీల్ అయ్యారు.

స్నానం చేసి అందరూ డాబా మీద కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు. చల్లటిగాలి, పక్క ఇళ్ళలోంచి గాలివాటుగా వినిపించే కబుర్లు చాలా బాగుంది అందరికి. నర్సి వచ్చి మల్లెపూల దండలు ఇచ్చి వెళ్ళింది.

సీతారామయ్యగారు పైకి వచ్చారు. "ఊరు చూశారా? ఎలా ఉంది?" అన్నారు.

"ఊరికే పొలం వైపు వెళ్ళాంనాన్న. రేపు ప్రెసిడెంట్ గారిని కలవవచ్చా?" అంది అంజలి.

"రేపు తీసుకెళతాను. తన ఐడియా ఏంటో తెలుస్తుందిగా" అన్నారు ఆయన.

"సర్లే నాన్నా మేం వెళతాం. మీ పనులు మానుకుని ఎందుకు?" అంది అంజలి.

"రండి భోంచేద్దాం. రాత్రి ప్రయాణంలో సరిగ్గా పడుకున్నారో లేదో" తొందరగా తిని పడుకుందురుగానీ" అని లేవదీశారు.

భోంచేస్తూ "నాన్న ప్రెసిడెంట్‌గారితో ఏం మాట్లాడాలో ఎలా మాట్లాడాలో చెప్పండి. సిటీలో ఒక తరహాలో మాట్లాడటం అలవాటయ్యింది. ఇక్కడెలాగో మరి?" అంది.

"రవి చాలా ముక్కుసూటిగా ఉంటాడు. మీ మనసులో ఏముందో చెప్పండి? దాయవద్దు. తన ఆలోచనేదో చెపుతాడు" అన్నారు.

"రవి నెమ్మదిగా, ఈ ఊరు చుట్టుపక్కల పల్లెలలో మార్పు కోసం ప్రయత్నిస్తున్నాడు. ముందుగా రాత్రిపూట బడిని ప్రారంభించాడు ప్రెసిడెంటు అయ్యాక రోడ్లు వేయించాడు. హైస్కూలు కమిటీ మెంబర్లతో గొడవ మాత్రం కాస్త పెద్దదయ్యింది. తనను కొట్టేదాకా వెళ్ళింది."

"ఏమైంది? ఎందుకంత గొడవ?" కుతూహలంగా అడిగాడు రాజేష్. "ఏముంది.. కమిటీ మెంబర్ల అజమాయిషీతో నడుస్తుంది స్కూలు మా చిన్నప్పుడు ఎంతో పేరున్న స్కూలు ఎవరూ పట్టించుకోకపోవటం టీచర్లు కూడా దీన్ని అలుసుగా తీసుకుని సరిగ్గా రాకుండా కొందర్ని కాకాపడుతూ, ఒకళ్ళ మీద ఒకరికి చాడీలు చెపుతూ పాఠాలు సరిగ్గా చెప్పటం లేదు."

"అసలే ఇంగ్లీషు చదువుల మీద మోజుతో పట్నం వెళ్ళే వాళ్ళ సంఖ్య పెరిగింది. రవి ప్రెసిడెంట్ అయ్యాక, అందరికి మీటింగు పెట్టి, అందర్నీ కడిగేశాడు. కమిటీ ఛైర్మన్ లెక్కలు అడిగాడు. దాంతో కోపాలు వచ్చి, పంతాలకు పోయి రవి రాత్రిపూట వస్తుంటే దారి కాచి కొట్టించారు."

"అందరికీ తెలుసు ఎవరు చేయించారో. కానీ రవి కేసు పెట్టలేదు. మళ్ళీ మీటింగు పెట్టి చాలా తెలివిగా అందరి నోళ్ళు మూయించాడు. "ఈ సంవత్సరం స్కూలు బాగానే పని చేస్తుంది. చాలామందికి అర్ధం అయ్యింది, రవి తన స్వార్ధం కోసం కాకుండా ఊరి బాగుకోసం ప్రయత్నిస్తున్నాడని." మనోడు కాస్త పని చేస్తున్నాడని మొదట ఉసికొల్పి, పొగిడి పంచాయితీ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నారు. కానీ తన ముక్కుసూటి తత్వం వచ్చాక ఇప్పుడు వేరే గ్రూప్ తయారయ్యింది. రవికి వ్యతిరేకంగా."

"సిటీలోనే కాదన్నమాట. ఇక్కడ కూడా రౌడీలు ఉంటారా?" అన్నాడు రఘు.

"ఏ ఊరిలో వున్నా మంచీ, చెడూ రెండూ ఉంటాయి. చెడును ఎదిరిస్తే మంచితనం, ధర్మం, న్యాయం మిగులుతాయి. మా తరం అయిపోయింది. మీ తరం వాళ్ళన్నా స్వార్ధం వదిలిపెట్టి దేశాన్ని బాగుచేయాలి" అన్నారు.

పొద్దున్నే మెలకువ వచ్చింది అంజలికి. బైటకి వచ్చి చూస్తే అన్నపూర్ణగారు ముగ్గువేస్తున్నారు.

"రేపట్నుండి నేనే వేస్తాలే అమ్మ. కొంచెం అలవాటు తప్పింది" అని నవ్వుతూ అంది అంజలి.

"పద మొహం కడుక్కున్నావా? కాఫీ ఇస్తాను"

గట్టు మీద కూర్చుని వేడి కాఫీ తాగుతూ నెమ్మదిగా అందరూ లేచి వచ్చారు.

"అందరూ స్నానాలు చేసి రెడీ అవ్వండి. టిఫెను తిని రవిగారిని కలవాలి" అంది అంజలి.

అందరూ రెడీ అయ్యి బయలుదేరారు. హై స్కూలు దగ్గర పంచాయితీ ఆఫీసు దోవలో అంజలికి తెలిసిన వాళ్ళు పలకరించారు.

"ఇదివరకు పంచాయితీ ఆఫీసు పెంకుటిల్లులా ఉండేది. ఇప్పుడు పైన డాబా కూడా వేశారు" అంది అంజలి.

లోపలకు వెళ్ళి ఒకతన్ని అడిగింది. "ప్రెసిడెంటుగారిని కలవాలి. వీలవుతుందా?" అని.

"పైకి వెళ్ళండి" అన్నాడు.

అంజలి గబగబా పైకి వెళ్ళింది. మిగతా అందరూ కింద చూసుకుంటూ నిల్చున్నారు. పైన ఒక వరండా, దాంట్లో నుంచి మూడు గదుల్లోకి వాకిళ్ళు ఉన్నాయి.

ముందు గదిలోకి వెళ్ళబోయింది. ఎక్కడ్నుండి వచ్చిందో ఓ కుక్క పెద్దగా మొరుగుతూ మీదకొచ్చింది. బాగా దడిచిపోయింది అంజలి. ఒకసారిగా పెద్దకేక వేసింది. కుక్కకి మెడలో గొలుసుంది, అది కట్టేసి ఉంది కానీ అది బాగా దగ్గరగా వచ్చేసి అరవటం పెద్దది

చేసింది. అంజలికి విపరీతంగా భయం వేసి వెనక్కి అడుగేస్తూ గుమ్మం తట్టుకుని పడబోయింది. వెనకనుంచి ఎవరో పట్టుకుని "సీజర్" అని గట్టిగా అరిచారు. కుక్క వెనక్కి తగ్గింది.

అంజలి అరుపులకు కింద నుంచి వివేక్ వాళ్ళు పరిగెత్తుకుంటూ వచ్చారు.

ఇంతలోకి అంజలిని పట్టుకున్న అతను "మీకేమీ పర్లేదు సీజర్ కట్టేసి ఉంది. కొత్తవాళ్ళను చూసి కంగారుపడింది" అన్నాడు.

"మా అంజలికి కుక్కలంటే చాలా భయం. అయినా పంచాయితీ ఆఫీసులో కుక్కలకు ఏం పని? " కోపంగా విసుక్కున్నాడు వివేక్.

"పర్లేదు. ఐ యామ్ ఓకె. ఊరుకో వివేక్" నెమ్మదిగా అంది అంజలి.

ఇంకా గుండె దడ తగ్గలేదు. "లోపలికి వచ్చి స్థిమితంగా కూర్చోండి. మంచినీళ్ళు తాగుతారా?" అని అడిగాడు అతను. అతని చేయి ఇంకా అంజలి భుజాల చుట్టూనే ఉంది, వదిలితే పడిపోతుందేమో అన్నట్లు.

నెమ్మదిగా తల ఊపింది. లోపల ఓ బల్ల, నాలుగు కుర్చీలు ఉన్నాయి. నెమ్మదిగా కూర్చుంది. అతను మంచినీళ్ళు ఇచ్చాడు.

"సారీ అనవసరంగా చాలా కంగారు పడ్డాను. నేను ప్రెసిడెంట్ గారిని కలవటానికి వచ్చాను. మీకు చాలా థాంక్స్" అని అప్పుడు చూసింది అతన్ని.

"ఒకే సెంటెన్స్‌లో సారీ, థాంక్స్ రెండూనా! అయితే మీది మా ఊరు కాదన్నమాట. సిటీనుండి వచ్చారా?" నవ్వుతూ అన్నాడు.

పొడుగ్గా, ఛామనఛాయకంటే కొంచెం ఎక్కువగా, తెల్ల కుర్తా పైజమాలో ఉన్నాడు అతన్ని చూడగానే ముందు ఆకర్షించేవి అతని కళ్ళు, చాలా ప్రశాంతంగా అందంగా ఉన్నాయి.

మొగవాళ్ళలో కళ్ళ అందం చూడటం ఇదే మొదటిసారి అంజలికి. ఓ 30 ఏళ్ళు ఉంటాయనుకుంటా.

అతన్నే గమనిస్తున్నానని సిగ్గుపడి "ప్రెసిడెంట్ గారిని కలవాలి.. అవునా?" అన్నాడు నవ్వుతూ.

"నేనే ఈ ఊరి ప్రెసిడెంట్‌ని, నా పేరు రవి" అన్నాడు.

అంజలి మొహం ఎర్రపడింది. ఇంత ఎంబారసింగ్‌గా ఎప్పుడూ అవలేదు.

"సీజర్ తరపున నేను సారీ చెపుతున్నాను. ఈ మధ్య నేను ఎక్కడుంటే సీజర్ అక్కడే ఉండవలసి వస్తుంది. అందుకే తప్పలేదు. వెళ్ళేముందు పరిచయం చేస్తాను. ఇక ముందు ఈ ప్రాబ్లమ్ రాదు." అన్నాడు రవి.

అంజలి మాట్లాడకుండా కూర్చోవటం చూసి, వివేక్ అందర్ని పరిచయం చేశాడు.

"మాకు ఏం చేయాలో ఐడియా లేదు. ఏదన్నా ఈ పదిరోజుల్లో వాలంటరీ వర్క్ చేద్దామని అనుకున్నాం. అంజలి వాళ్ళ నాన్నగారు, మీరు ఐడియా ఇస్తారని అన్నారు" అన్నాడు రాజేష్.

"ఒక్క పదినిమిషాలు ఇవ్వండి నాకు. ఒక ప్రాజెక్ట్ డిజైన్ వేస్తున్నాను. అయిపోయిన తర్వాత మనం మాట్లాడుకుందాం" అని రవి పక్క గదిలోకి వెళ్ళాడు.

"అంజలి ఆర్ యు ఓకె?" అన్నాడు వివేక్.

"ఎంత సిగ్గుగా ఉందో. ఎవరినైతే కలవటానికి వచ్చానో, వాళ్ళ ఎదురుగానే కేకలు పెట్టటం" అంది అంజలి.

"ఇదేంటి ఇంత చిన్నగా ఉన్నాడు ఇతను. అంకుల్ చెప్పినదాన్ని బట్టి, వేరేగా ఊహించుకున్నా. ఇంత చిన్న అతనా ఈ ఊరిని మారుస్తుంది" ఆశ్చర్యంగా అంది రాధిక.

"చాల్లే గట్టిగా అనకు ఎవరన్నా వింటారు" అంది లక్ష్మి.

పావుగంటలో రవి వచ్చాడు "ఎక్కువసేపు కూర్చోపెట్టానా?" అంటూ.

"అబ్బే లేదు లేదు. మీరు బిజీగా ఉన్నారో లేదో కనుక్కోకుండా మేమే వచ్చాం" అన్నారు అందరూ.

"నాకు సీతారామయ్యగారంటే చాలా గౌరవం, నన్ను ముందునుంచీ సపోర్ట్ చేసేవాళ్ళల్లో ఆయన ఒకరు. మీ ఆలోచన గురించి చెప్పి ఓ పదిరోజులుంటారు. అనగానే చాలా ఎగ్జైట్ అయ్యాను. మన పల్లెల్ని బాగుచేసి, సామాజికంగా ఆరోగ్యవంతం చేయాలంటే యంగ్ బ్లడ్ అవసరం. అప్పట్నుండి ఆలోచిస్తున్నా ఏం చేయొచ్చు అని"

"నా ఐడియా చెపుతాను. మీకు నచ్చిందో లేదో ఫ్రాంక్‌గా చెప్పండి" అని అందరి వంక చూశాడు రవి.

"చెప్పండి సర్" అన్నాడు రాజేష్.

"సార్ అంటే ఎవర్నో పిలిచినట్లుంది. రవి అనండి చాలు" నవ్వుతూ అన్నాడు రవి.

అంజలి అతని మొహం మీద నుంచి కళ్ళు తిప్పుకోలేక పోతుంది. ఎవరన్నా గమనిస్తారేమోనని భయం. మళ్ళీ ఏదో ఐస్కాంతం ఉన్నట్లు రవినే చూడటం.

"మా ఊళ్ళో రాత్రిపూట బడి ఉంది. పగలు కూలీ పనికి వెళ్ళిన వాళ్ళు రాత్రి గంటన్నర చదువుకోవాలి. మా ఊరికి ఓ 6 కిలోమీటర్ల దూరంలో చిన్న టౌన్ ఉంది. అక్కడ హాస్పిటల్ ఉంది సో మెడికల్ కాంప్‌లాగా వద్దు. అందరికి శుచి, శుభ్రత, ఆడవాళ్ళకి, మగవాళ్ళకి వేరేగా క్లాసెస్ తీసుకుంటే బాగుంటుంది."

"మీరందరూ కాబోయే డాక్టర్స్. పైగా బైటవాళ్ళు కాబట్టి, మీరు చెప్పేది బాగా నాటుకుంటుందని నా అభిప్రాయం. మీరు ఏమన్నా పోస్టర్స్ తయారు చేస్తామంటే, మెటీరియల్ నేనిస్తాను ఏమంటారు?" అన్నాడు రవి.

"చాలా బాగుంది ఐడియా" ఎగ్జైటింగ్‌గా అంది అంజలి.

"దీంతోపాటు స్మోకింగ్, డ్రింకింగ్, ఎర్లీ మారేజెస్ లాంటి టాపిక్స్ కూడా కవర్ చేయవచ్చు" అంది.

అందరూ చాలా ఎగ్జైటెడ్‌గా ఒప్పుకున్నారు.

"రోజూ రాత్రి 7నుండి. 8.30 దాకా హైస్కూలులో పాఠాలు, ఇవాళ మీరు ప్లాన్ చేసుకోండి. రేపట్నుండి తీసుకెళతాను. ఎన్ని రోజులు అనేది మీ ప్లాన్ బట్టి డిసైడ్ చేద్దాం" అన్నాడు.

**"పోస్టర్స్‌కి** పేపర్ కావాలంటే పక్కగదిలో ఉంటాయి తీసుకువెళ్ళండి"

అందరూ లేచారు. "మేమివాళ ఈవినింగ్‌కల్లా డిసైడ్ చేస్తాం. మా ప్లాన్ మీతో ఎలా, ఎప్పుడు షేర్ చేసుకోవాలి?" అంది అంజలి.

"ఇవాళ ఈవినింగ్ నేను మీకు కాల్ చేస్తాను. ప్రోగ్రెస్ బట్టి డిసైడ్ చేద్దామా?" అన్నాడు.

"నా సెల్ నంబర్ తీసుకోండి" అని అంజలి వెంటనే తన నంబర్ ఇచ్చింది. ఏంటి ఈ ఆత్రం తనకు, ఇతనితో మాట్లాడటానికి మనసులోనే తిట్టుకుంది.

బైటకు వస్తుంటే "అంజలి.." వెనకనుండి రవి పిలిచాడు.

"మీకు కుక్కలంటే భయం అన్నారు. ఒక్కసారి మా సీజర్‌ని పరిచయం చేస్తాను. ఈసారి చూసి అరవదు వస్తారా ఇటు."

"నావల్ల కాదు" అంది అంజలి.

"పర్లేదు నేనుంటాను."

నెమ్మదిగా రవి దగ్గరకు వెళ్ళింది. పెద్ద జాతి కుక్క అది. వీళ్ళవంకే చూస్తుంది. "మీ చెయ్యి ఇటు ఇవ్వండి. వాసన చూస్తుంది" అన్నాడు.

భయపడుతున్న అంజలిని చూసి చెయ్యిపట్టుకుని తీసుకువెళ్ళి సీజర్ దగ్గర చెయ్యిపెట్టాడు. సీజర్ వాసన చూసింది చిన్నగా మొరిగింది.

"ఇంక మీరు ఫ్రెండ్స్ అయ్యారు. మిమ్మల్నేమీ అనదు. మీరందరూ కూడా రండి దగ్గరకు" అన్నాడు.

అందరూ కుక్కదగ్గరకు వచ్చారు. ఇంకా తన చెయ్యి, రవి చేతిలో ఉందని గమనించి, అంజలి నెమ్మదిగా వదిలించుకుంది.

"ఆర్ యు ఓకే?" మృదువుగా అడిగాడు రవి.

నెమ్మదిగా కళ్ళు పైకెత్తి రవిని చూసింది. "ఊ" అంది.

బాబోయ్ ఇతని కళ్ళల్లో ఏదో మాజిక్ ఉంది. ఇంత ఎక్స్‌ప్రెసివ్‌గా అందంగా ఉన్నాయో అయినా పిచ్చెక్కింది నాకు. ఏంటీ ఈ మతిలేని ఆలోచనలు అని తిట్టుకుంది అంజలి.

ఇంటికి వచ్చి అందరూ ఎక్సైటెడ్‌గా ఎలాంటి టాపిక్స్ గురించి మాట్లాడాలి అన్నీ లిస్ట్‌గా రాసుకున్నారు. సాయంత్రానికల్లా ఒక ఐడియా వచ్చింది. నర్సిని అడిగి వాళ్ళ పాలెంలో వాళ్ళ ఇంటి పరిస్థితులు వాళ్ళ అవసరాలు అన్నీ తెలుసుకున్నారు.

"మంచి పని మొదలుపెడుతున్నాం. గుడికి వెళదాం అందరూ స్నానాలు చెయ్యండి" అని హడావుడి చేసింది అంజలి.

గోధూళి వేళ పొలం పనులు పూర్తిచేసుకుని ఎడ్లు ఇంటి మొఖం పట్టాయి. ఆడపిల్లలు ముగ్గురూ చక్కగా చీరలు కట్టుకుని మల్లెపూలు పెట్టుకుని పూజ సామాన్లతో గుడికి బయలుదేరారు.

పాత శివాలయం లోపల్నుండి గంటలు మోతలు వినిపిస్తున్నాయి. కాళ్ళు కడ్డుకుని లోపలికి వెళ్ళారు అందరు. పూజారిగారు అంజలిని పలకరించారు. ప్రదక్షిణాలు పూర్తిచేసి అందరూ అక్కడే కూర్చున్నారు.

"చాలా ప్రశాంతంగా ఉంది ఈ గుడిలో" అన్నాడు వివేక్, అంతలోకి అంజలి సెల్ మోగింది. రవి చేశాడు.

"ఎంతవరకు వచ్చింది ప్రోగ్రెస్ అని ఫోన్ చేశాను" అన్నాడు.

"దాదాపు ఫైనల్ అయ్యింది కానీ మాకు కొన్ని క్వొశ్చెన్స్ ఉన్నాయి. మీరు ఎప్పుడు ఫ్రీగా ఉంటారు?" అని అడిగింది అంజలి.

"అంటే మేము గుడికి వచ్చాం. బయలుదేరబోతున్నాం. మీకు ఖాళీ ఉంటే ఓ అరగంటలో మీకు ఫోన్ చేయొచ్చా?" కంగారుగా అడిగింది.

"పోనీ ఓ అరగంటయ్యాక మీ ఇంటికి వస్తాను మాట్లాడుకుందాం" అని ఫోన్ పెట్టేశాడు.

"లేవండి అందరూ రవిగారు వస్తున్నారు మా ఇంటికి" అని బయలుదేరదీసింది.

ఇంట్లో అన్నపూర్ణగారికి చెప్పింది రవి వస్తున్నట్లు. అంతలో రవి వచ్చాడు. అందరికీ టిఫెన్లు, నిమ్మరసం ఇచ్చారు అన్నపూర్ణగారు.

వాళ్ళు రాసిన ప్లాను చూపించారు. ఆడవాళ్ళను, మొగవాళ్ళను వేరే వేరేగా కూర్చోపెట్టి పర్సనల్ హైజెన్ లాంటి చిన్న ప్రాథమిక విషయాల మీద మాట్లాడటం. మొదటిరోజు అందరికీ డెట్టాల్ సోప్స్ ఇద్దామనుకున్నాం.

రెండవరోజు, చిన్న వయసులో పెళ్ళిళ్ళు, ఎందుకు చేసుకోకూడదు? పిల్లల ఆరోగ్యం మీద.

మూడవ రోజు వాళ్ళ ప్రశ్నలు ఏముంటాయి అడిగాడు రాజేష్.

"డెట్టాల్ సోప్స్ అని ఎందుకన్నామంటే ఇక్కడ పబ్లిక్ టాయ్‌లెట్స్ వలన ఇన్‌ఫెక్షన్స్ చాలా వస్తాయి వాటి గురించి అవేర్‌నెస్ తీసుకురావాలి" అన్నాడు వివేక్.

"మంచి ఐడియా. నేను సోప్స్ తెప్పిస్తాను పంచటానికి" అన్నాడు రవి.

"వద్దు ఇది మా కంట్రిబ్యూషన్. ఎన్ని ఫ్యామిలీస్ ఉన్నాయో చెప్పండి చాలు హైజెనిక్ కిట్‌లుగా ఇస్తాం"

"నాన్న దగ్గర బాగా డబ్బులున్నాయండి హైదరాబాద్‌లో ఓ రోజు పార్టీ ఖర్చు వదులుకుంటే ఇలాంటివి చేయొచ్చు. చెయ్యనివ్వండి" నవ్వుతూ అన్నాడు వివేక్.

"మా ఊళ్ళో ఓ 75 కుటుంబాలు ఉన్నాయి. కూలి చేసేవాళ్ళు, ఇల్లు పనులు, చాకలి పని ఎవరైనా కానీ ఇక్కడ సక్సెస్ అయితే ప్రక్కనే ఉన్న పల్లెల వాళ్ళకు కూడా పెడదాం" అన్నాడు రవి.

అంతలోకి సీతారామయ్యగారు వచ్చారు. వీళ్ళ ఆలోచనలు విని చాలా సంతోషించారు. ఇంక వెళతానని రవి లేచాడు.

"భోంచేసి వెళ్ళండి అంది" అంజలి.

అందరూ బలవంతం చేశారు కానీ రవి "ఇప్పుడే కదా టిఫెన్ చేశాను. స్కూల్‌కి వెళ్ళాలి. ఇంకెప్పుడన్నా ఉంటాలే భోజనానికి" అని బయలుదేరాడు.

అందరూ బైటగేటు వరకు వచ్చారు, "వస్తాను" అని అందరికి చెప్పి అంజలి వంక ఓ క్షణం చూసి, "బై" అని అన్నాడు. తన మొహం ఎవరన్నా చూస్తే ఏం పసికడతారో అని భయం వేసింది అంజలికి. గబగబా లోపలికి వచ్చింది. రవి క్యాజువల్‌గా చెప్పాడో లేక స్పెషల్‌గా చెప్పాడో అర్ధంకాలేదు.

రాత్రి భోజనం చేసేటప్పుడు రవి గురించి రాధిక అడిగింది "ఇంత చిన్న అతను అని అనుకోలేదు అంకుల్ మేము. చాలా హుందాగా వున్నాడు. పెళ్ళి అయిఇందా? ఎంత వయసు ఇతనికి"

"రవికి 30 -31 ఉంటాయనుకుంటా. పెళ్ళికాలేదు. మొదట్లో పల్లెటూర్లోనే ఉంటాడు అనేసరికి వచ్చిన సంబంధాలు కూడా వెనక్కి వెళ్ళాయి. మంచివాడు బోలెడంత ఆస్తి, పెద్ద ఇల్లు. అయినా సరే పల్లెటూరి కాపురం అంటే ఇష్టపడటం లేదు ఎవ్వరూ. ఇలా కొన్ని సంబంధాలు అయ్యేసరికి రవి తెగేసి చెప్పాడు పెళ్ళి చేసుకోనని. నా ఆశయం ఒక్కటే మన చుట్టుపక్కల ఊళ్ళు బాగుపడాలి అని అంతే. నేను పెళ్ళిచేసుకోకపోతే ఈ దేశానికి ఏమి నష్టంలేదు అని. వాళ్ళ అమ్మా నాన్నలకు ఇదే దిగులు. దానికి తోడు ఊళ్ళో గొడవలు"

"మర్చిపోయా అంజలి, మీరు గుడికి వెళ్ళినప్పుడు సరోజ వచ్చిం . గుర్తుందా?" అన్నారు అన్నపూర్ణగారు.

"ఇంకొక నాలుగురోజుల్లో తన పెళ్ళి. నువ్వు వచ్చావని తెలిసి కలవటానికి వచ్చింది. అందర్నీ పెళ్ళికి ఉండాలని, రమ్మని మరీ మరీ చెప్పింది."

"రేపు వెళ్ళి కలుస్తాలే అమ్మ" అంది.

"చిన్నప్పుడు కలిసి ఆడుకునేవాళ్ళం. మాకు దూరపు బంధువు కూడా" అంది అందరితో.

అంజలికి నిద్రపట్టటంలేదు. రాత్రి పది అయ్యింది. ఎన్నడూ లేనిది ఎందుకీ కలవరం. తన గురించి నాకేం తెలుసని ఇంత ఆలోచన. తన గొంతు వింటూ ఉండిపోవాలని. ఆ కళ్ళు.. కిటికీ బైటున్న కొబ్బరాకు మీదుగా జాలువారే వెన్నల తలలోని మల్లెపూలు, టేబుల్ మీదున్న తిలక్ 'అమృతం కురిసిన రాత్రి' అన్నీ కొత్త అర్ధాల్ని ఆలోచన్లని రేకెత్తిస్తున్నాయెందుకని.

వద్దు తప్పు కలిసి పని చెయ్యాలి. నేనింత తొందరగా బైటపడకూడదు. వద్దు. అంజలి నిద్రపో.

రవి కుర్చీలో కళ్ళు మూసుకుని కూర్చున్నాడు. రవి గది డాబా మీద ఉంది. నిద్రపట్టడంలేదు. ఏదో తెలియని అలజడి. కారణం అంజలి. "ఏమైంది ఇవాళ నాకు. ముగ్ధత్వంకు మారురూపంలా ఎప్పట్నుండో మూసి ఉన్న మది గది తలుపులను సున్నితంగా తీసింది.

పొద్దున్న ఎందుకు, సీజర్ వంకతో తన చెయ్యి పట్టుకున్నాడు. సాయంత్రం ఫోన్‌లో కాకుండా ఎందుకు వాళ్ళింటి వెళ్ళాను. తనను చూడటానికేగా.

లేత గులాబి రంగు చీరలో, తలలో మల్లెలు. ఎప్పుడూ నవ్వే కళ్ళు. అందరివంకా చూస్తూ మాట్లాడటానికి ఎంత ప్రయత్నం చేయాల్సి వచ్చింది.

ఏమైంది నాకు? నీ జీవితంలో ఎవరినీ రానివ్వకూడదనుకున్నాకదా అందులో తొలిచూపులోనా? నేనేమన్నా టీనేజర్‌నా? ఏంటీ పిచ్చితనం.

లేదు రేపట్నుండీ జాగ్రత్తగా ఉండాలి. లేకపోతే నా గురించి చీప్‌గా ఊహించుకుంటుంది. అది తను భరించలేడు." చిన్నగా నిట్టూర్చి వెళ్ళి పడుకున్నాడు.

పొద్దున్నే తయారయ్యి మగపిల్లలు, సీతారామయ్యగారితో కలిసి టౌన్‌కి వెళ్ళారు సామాన్లు కొనటానికి. అంజలి, రాధికను లక్ష్మిని తీసుకుని సరోజ వాళ్ళింటికి వెళ్ళింది.

సరోజ వాళ్ళది పాత పెంకుటిల్లు. కానీ అన్ని ఇళ్ళలాగానే ముందు బాగా ఖాళీ ఉంది. పెద్ద పందిరి వేసి ఉంది ఒక వైపు, వసారాలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ పనులు చేసుకుంటున్నారు కొంతమంది ఆడవాళ్ళు.

అంజలి లోపలికి వెళ్ళింది. మంచం మీద చీరలు మడత పెడుతుంది సరోజ. అంజలిని చూసి చాలా సంతోషించింది. రాధికను, లక్ష్మిని పరిచయం చేసింది.

అంతలోకి సరోజ వాళ్ళ అమ్మగారు వచ్చారు. "ఏంటి పిన్ని సరోజకు అప్పుడే పెళ్ళి చేస్తున్నారు? ఇంకా పద్దెనిమిదేళ్ళు కూడా లేవు"

"పెద్ద చదువులు ఎటూ చెప్పించలేదు ఎప్పటికైనా ఒకరి చేతిలో పెట్టాల్సిందే అదే తొందరగా చేస్తే మా భారం తగ్గుతుంది" అన్నారు నవ్వుతూ.

"రా అక్కా చీరలు చూద్దువుగానీ" అంది సరోజ. ముద్దబంతి పువ్వులాగా ఉంది సరోజ పెళ్ళి మాటలవల్ల వచ్చిన సిగ్గు ఏమో కానీ కళ్ళల్లో ఓ మెరుపు ఉంది.

"ఏంటి మీ కాబోయే ఆయన కబుర్లు?" అంది అంజలి.

"గుంటూరు కాలేజీలో లెక్చరర్‌గా చేస్తున్నారు. ఇద్దరు చెల్లెళ్ళు. వాళ్ళ పెళ్ళిళ్ళు అయ్యాక తను చేసుకుంటున్నారు" సిగ్గుగా చెప్పింది.

"మేము ఇచ్చే కట్నంకి సరే అన్నారు. దాంతో అందరికీ నచ్చారు" అంది.

"అక్కా సమయానికి వచ్చావు. నా పెళ్ళి దగ్గరంతా నువ్వే ఉండాలి. నన్ను తయారు చేయాలి" అంది.

"చిన్నప్పుడు, నా వెనకాలే తిరిగేది, సంక్రాంతికి గొబ్బెమ్మలు దగ్గర్నుండి పొలాల గట్ల మీద తిరగటం దాకా. వీళ్ళ అక్క, నేను సరోజ కలిసి చేసేవాళ్ళం" అంది అంజలి రాధిక లక్ష్మితో.

"మరి వీళ్ళ అక్క ఏది?" అంది లక్ష్మి.

"పెళ్ళి కట్నాల దగ్గర పేచీలు వచ్చి, అక్కను మా ఇంటికి పంపరు వాళ్ళు. ఈ పెళ్ళి కుదిరాక నాన్నవెళ్ళి పిలిచి వచ్చారు. మరి వస్తారో లేదో" బెంగగా అంది సరోజ.

మౌనంగా చీరలు చూస్తూ ఉండిపోయారు అందరూ. సరోజ వాళ్ళ అమ్మగారు వచ్చి భోజనానికి ఉండిపొమ్మన్నారు.

"ఇప్పుడు కాదులే పిన్ని, చాలా పని ఉంది మధ్యాహ్నం" అని స్కూల్లో చేయబోయే పని సంగతి చెప్పింది. కాసేపు కబుర్లు చెప్పి బయలుదేరారు అందరూ.

"రేపు పెళ్ళి కూతురును చేస్తున్నాం. సాయంత్రం వచ్చి బొట్టుపెట్టి పిలుస్తాను. కానీ ముందరే చెపుతున్నా. రేపు అందరూ భోజనానికి రావాలి" అన్నారావిడ.

ఇంటికి వచ్చి అన్నపూర్ణగారితో కబుర్లు చెప్తుతూ భోజనం పూర్తిచేసేసరికి సీతారామయ్యగారు, అందరూ సామాన్లతో వచ్చారు.

"అనుకున్నవి అన్నీ తెచ్చాం, కానీ అవి పెట్టడానికి బాగ్ ఏదో దొరకలేదు. ఎలా ఇవ్వాలి?" అన్నాడు వివేక్.

"ముందు భోజనం చెయ్యండి. ఈ లోపల ఆలోచించొచ్చు" అంది అంజలి.

"ఎంత ఆలోచించినా, అన్నిటినీ కలిసి ఎలా ఇవ్వాలో అర్థం కాలేదు" ఉండండి రవిగారిని అడుగుదాం. ఏమన్నా ఐడియా ఇస్తారేమో?" అని అంజలి రవికి ఫోన్ చేసింది.

"హాయ్ అంజలి" అన్నాడు రవి ఎత్తుతూనే.

"సారీ డిస్టర్బ్ చేస్తున్నానా?" అంది అంజలి మొహమాటంగా" లేదు. చెప్పండి" అన్నాడు.

"సాయంత్రం ఇవ్వాల్సిన వస్తువులన్నీ కొన్నాడు వివేక్. అవి పెట్టటానికి బాగ్స్ ఏవీ లేవు. ఎలా ఇవ్వాలి అందరికీ అని"

"వస్తువులా? ఏం కొన్నారు? ఎన్ని రకాలు కొన్నారు? అనవసరంగా ఎందుకు ఇంత ఖర్చుపెట్టారు."

"అబ్బే పర్లేదు. నేనేమీ చెప్పలేదు. తనే తెచ్చాడు" అంది అంజలి.

"నా దగ్గర కూడా బాగ్స్ ఏమీ లేవు. నేను సాయంత్రం ఏడుగంటలకు మీ దగ్గరకు వస్తాను. అందరం కలిసి స్కూల్‌కి వెళదాం."

"మీకెందుకు శ్రమ. మేమే వచ్చేస్తాం" అంది అంజలి.

"లేదు శ్రమేమీ లేదు. సాయంత్రం కలుద్దాం" అని పెట్టేశాడు.

"అన్నం తినేటప్పుడు కూడా ఈ ఫోన్లేంటి. అంజలి అంటే సీతారామయ్యగారి అమ్మాయా?" కుతూహలంగా అడిగారు రవి వాళ్ళ అమ్మ సావిత్రిగారు.

"ఊ.. సాయంత్రం స్కూల్లో మీటింగ్ ఉంది. చెప్పాగా. ఆ అమ్మాయి వాళ్ళ ఫ్రెండ్స్ అందరూ వచ్చారని" అన్నాడు రవి.

"చాలా కాలం అయ్యింది ఆ అమ్మాయిని చూసి ఎలా ఉందో!?" అంది సావిత్రి.

"చాలా అందంగా ముగ్ధంగా ఉంటుంది" మనసులో అనుకున్నాడు రవి. గబగబా భోజనం కానిచ్చి బైటకు వెళ్ళిపోయాడు.

సాయంత్రం 6గంటలకల్లా అందరూ తయారయ్యి కూర్చున్నారు. ఆరున్నరకు రవి వచ్చాడు. జీపు తీసుకుని, రవి జీపు దిగటం చూసి అంజలి లోపలికి వెళ్ళి, ట్రేలో మంచినీళ్ళు కొంచెం టిఫెన్ పెట్టుకుని తీసుకొచ్చింది. తెల్లటి కాటన్ చీర మీద పూలు పడుతున్నట్లున్న డిజైన్ చీరకట్టుకుంది అంజలి.

సంస్కారం కాదని తెలిసినా, చూపు తిప్పకోలేకపోయాడు రవి. "తీసుకోండి" అంది నెమ్మదిగా అంజలి.

"అబ్బే ఇవన్నీ ఎందుకు?" తడబడుతూ అన్నాడు రవి.

"పర్లేదు. అంతా అయ్యేసరికి లేట్ అవుతుంది కదా టీ తీసుకొస్తాను" అని లోపలికి వెళ్ళబోయింది.

"వద్దు వద్దు ఇప్పుడే టీ తాగి వస్తున్నా ఇంటినుండి" అని అట్టపెట్టెలు జీప్‌లో పెడదాం" అన్నాడు.

"మేం పెట్టిస్తాం మీరు కూర్చోండి" అని బైటకు వెళ్ళారు ముగ్గురు మగపిల్లలు.

"ఎంత మంచి పిల్లలో. వివేక్ మరీను. బాగా డబ్బున్నవాళ్ళ అబ్బాయంట. కానీ కల్మషం లేకుండా కలిసిపోయాడు. పొద్దున ఇవన్నీ తనే కొన్నాడు. నేను కొంత డబ్బు ఇస్తానన్నా వినలేదు" అన్నారు సీతారామయ్యగారు.

"అదంతా నిన్ను కాకా పట్టటానికా?" నవ్వుతూ అంది రాధిక అంజలిని చూస్తూ.

నెమ్మదిగా అన్నాకానీ అందరికీ వినిపించింది.

"రాధికి బుద్ధిలేదు ఏదో వాగుతుంది" కోపంగా అంది అంజలి. రవి సాలోచనగా వీళ్ళందరి వైపు చూస్తూ లడ్డు తింటున్నాడు.

"లడ్డూ బాగుంది. నాకు చాలా ఇష్టమైన స్వీటు" అన్నాడు రవి టాపిక్ మారుస్తున్నట్లు.

"నాకు కూడా చాలా ఇష్టం. అందుకని నేనెప్పుడు సెలవులకు వచ్చినా అమ్మ చేస్తుంది" అంది అంజలి.

అందరూ బైటకు వచ్చారు. "మేం డెట్టాల్ సోప్స్, డెట్టాల్ లిక్విడ్, గాజుగుడ్డ, దూది రోక్, యాంటిసెప్టిక్ ఆయింటిమెంట్ తెచ్చాం. అన్నీ వేరే వేరే డబ్బాల్లో వున్నాయి. ఫస్ట్ ఎయిడ్ కిట్‌లాగా ఉంటుంది కదా" అన్నాడు వివేక్.

"చాలా బాగుంది ఐడియా" అన్నాడు సంతోషంగా రవి.

జీప్‌లో అందరూ హైస్కూలుకు వెళ్ళారు. లోపల రెండు క్లాసుల్లో ఆడవాళ్ళు, మగవాళ్ళు కూర్చుని ఉన్నారు. క్లాసులు పక్కపక్కనే ఉండటంతో రవి అందరిని ఉద్దేశించి "ఓ రెండు మూడు రోజులు మామూలు పాఠాలు కాకుండా వేరే విషయాలు నేర్చుకుందాం. ఆడవాళ్ళు ఒక గదిలో మొగవాళ్ళు ఓ గదిలో కూర్చోండి" అన్నాడు.

వీళ్ళందరూ ఎవరు రవిబాబుతో అని అందరూ వాళ్ళల్లో వాళ్ళే మాట్లాడుకుంటూ, వేరే వేరే గదుల్లో కూర్చున్నారు.

"నేను ఆడవాళ్ళ గదిలో, నన్ను పరిచయం చేసుకుంటాను. కొంతమందికి మా నాన్నకానీ, నేను కానీ తెలుసుకదా. మీరు వివేక్ వాళ్ళను ఇంట్రడ్యూస్ చెయ్యండి" అంది రవితో అంజలి.

ఆడవాళ్ళ గదిలోకి నడిచారు అంజలి, రాధిక, లక్ష్మి.

**"నా పేరు** అంజలి. సీతారామయ్యగారి అమ్మాయిని. హైదరాబాద్‌లో డాక్టర్ చదువుతున్నాను. నాతో వచ్చినవాళ్ళందరూ నాతోటి డాక్టర్లు. తను రాధిక, లక్ష్మి అని పరిచయం చేసుకుంది.

రవిగారు చెప్పారు. మీరందరూ రాత్రిపూట బడికి వచ్చి చదువుకుంటున్నారని, చాలా సంతోషంగా వుంది మన ఊళ్ళో మార్పు వచ్చినందుకు. మగవాడు చదువుకుంటే తను ఒక్కడే బాగుపడతాడు. కానీ ఆడది చదువుకుంటే కుటుంబం బాగుపడుతుంది.

పుస్తకాలల్లోని పాఠాలతోపాటు మనకి రోజూ జీవితంలో ఎదురుపడే సమస్యల గురించి కూడా తెలుసుకుని వాటి పరిష్కారం గురించి మాట్లాడుకుంటే బాగుంటుందని ఇలా వచ్చాం."

"ఇవాళ్ళ మనం పరిశుభ్రత, అది లేకపోవటం వల్ల వచ్చే సమస్యల గురించి మాట్లాడదాం. కానీ ముందు మీరు చెప్పండి మీకున్న సమస్యలు పరిశుభ్రం లేకపోవడం వల్ల మీరు పడే ఇబ్బందులు" అంది అంజలి.

కాసేపు అందరూ మొహామొహాలు చూసుకున్నారు. తర్వాత నెమ్మదిగా ఒకామె లేచింది. "నా పేరు నాంచారి అండి. శుభ్రం లేకపోవటం అంటే రోజూ స్నానాలు చేత్తావండి. కానీ ఎందుకో పిల్లలు ఎప్పుడూ జబ్బులు పడతారండి. విరేచనాలు, జలుబు, దగ్గు .. దానివల్ల ఇబ్బంది గదండి అందరికీ"

ఇంకొక ఆమె లేచి "మాకేమో గుడిసెలు కదండి వానొత్తే నీరు కారటం చెమ్మగా వుండటం జరుగుద్దండి. మరి జలుబు జొరాలు తప్పవు కదండి"

"సరే దీని గురించి మాట్లాడుదాం" అంది రాధిక.

"మీకు మరుగుదొడ్లు ఉన్నాయా?"

"అంటే అందరికీ కలిపి ఓ చోట కట్టించారండి. ఆడోళ్ళకు వేరే మొగోళ్ళకు వేరే అందరం వాడుకుంటాం" అంది నాంచారి.

"మరుగుదొడ్లు శుభ్రంగా లేకపోయినా, వాడిన తర్వాత శుభ్రంగా చేతులు కడుక్కోకపోయినా మీకు జబ్బులు చేస్తాయి. చిన్న పిల్లల్లో ఇవి ఇంకా తొందరగా వస్తాయి. చేతులు శుభ్రంగా డెట్టాల్ సబ్బుతో కడుక్కోవాలి. పిల్లలకు నేర్పించాలి. చిన్న పిల్లలకు మనమే గుర్తుపెట్టుకుని చేయాలి" అంది లక్ష్మి.

"ఈ సుతారాలన్నీ ఎక్కడమ్మా? ఎన్ని పనులుంటాయి. పొద్దున్నే ఇంటెడు పని చేసుకుని, అన్నం మూట కట్టుకుని కూలికి వెళ్ళాలి."

"పిల్లలకి అన్నం తినిపించటం నేర్పించలేదా? ఇదీ అలానే. ఎప్పుడూ పిల్లలకి జబ్బులు చేసి, డాక్టర్ల చుట్టూ తిరుగుతుంటే బాగుంటుందా" అడిగింది లక్ష్మి. మేము ఇప్పుడు సబ్బు, గాజుగుడ్డ, దెబ్బతగిలితే రాసుకునే ముందు అన్ని ఇస్తాం కానీ మీరందరూ మేం చెప్పే విషయాలు శ్రద్దగా విని ఆచరించాలి" అంది అంజలి.

టైం ఎలా గడిచిపోయిందో తెలియలేదు. రవి వచ్చి 8.30 అయ్యింది. ఇంక అందరికి పంచుదామా అని అనేవరకు మాట్లాడుకుంటూనే ఉన్నారు.

అందరూ వరసల్లో తీసుకున్నారు. కొందరాడాళ్ళు "రవి బాబు రోజూ పాఠాలకంటే, ఇవాళ్ళ బాగుంది" అన్నారు నవ్వుతూ.

ఇంటికి తిరిగి వస్తుంటే రవి అన్నాడు "మీరందరూ ఏం మాట్లాడాలో ప్లాన్ చేసుకున్నారో లేదో కానీ వివేక్ చాలా బాగా మాట్లాడాడు"

"వివేక్ మంచి ఒరేటర్. బాగా మాట్లాడతాడు" అంది అంజలి.

"రవిగారు నాకు వీళ్ళతో మాట్లాడుతుంటే ఒక ఐడియా వచ్చింది. రేపు, ఎల్లుండి కూడా ఆడవాళ్ళతో మాట్లాడిన తర్వాత మీతో చెప్పుతాను" అంది.

"నా క్యూరియాసిటీ పెంచుతున్నారు" అన్నాడు రవి నవ్వుతూ.

ఇంటి దగ్గర దించేసి "అందరికీ గుడ్ నైట్. థాంక్స్ వివేక్ ఫర్ ది గిఫ్ట్స్ అందరూ చాలా ఆనందించారు" అని రవి వెళ్ళిపోయాడు.

భోజనాల దగ్గర అన్నపూర్ణగారు చెప్పారు "రేపు మధ్యాహ్నం సరోజని పెళ్ళికూతురుని చేస్తున్నారు భోజనాలకు పిలిచింది. అందర్నీ మరీ మరీ రమ్మంది"

"మీరు ఆడవాళ్ళు వెళ్ళండి. మేమెందుకులే. నేను వీళ్ళను పొలం దగ్గరకు తీసుకు వెళతాను" అన్నారు సీతారామయ్యగారు.

"భోజనాలుకు వెళుతున్నాం కదా. నా చీరల్లో మీకు నచ్చినవి తీసుకుని కట్టుకోండి అంది అంజలి.

"చిన్న ఫంక్షన్ కదా, మా చీరలే కట్టుకుంటాలే అంజలి ఇవాళ. రేపు పెళ్ళికి ఎటూ తప్పదు" అది మొహమాటంగా లక్ష్మి.

అటుగా వచ్చిన అన్నపూర్ణగారు అది విని "అమ్మ మొహమాటం ఎందుకమ్మా, ఆడపిల్లలు చక్కగా తయారయ్యి, నగలు, పూలు పెట్టుకుంటే లక్షణంగా ఉంటారు. నేను పూలదండలు, నగలు తీసుకొస్తాను మీరు బట్టలు మార్చుకోండి" అని వెళ్ళారు.

అందరూ తయారయ్యి బైటకు వచ్చారు. అన్నపూర్ణగారు కారేజి సర్ది మగవాళ్ళకు పొలం దగ్గరకు భోజనాలు పంపటానికి సిద్ధం చేస్తున్నారు.

"హాయిగా వాళ్ళందరూ పికినిక్ ఎంజాయ్ చేస్తున్నారు" అంది రాధిక.

"నీ పెళ్ళికూడా తొందర్లో కాబోతుంది. నువ్వు కూడా చూడు పెళ్ళి వేడుకలు ఎంత బాగుంటాయో" అంది లక్ష్మి.

అందరూ నడుచుకుంటూ సరోజ వాళ్ళింటికి వెళ్ళేసరికి సన్నాయి మేళం వినిపిస్తుంది. పందిరి కింద పెద్దపీట వేసి, దానిమీద సరోజను కూర్చోపెట్టారు. తెల్లనేత చీరకు సన్నజరీ అంచు ఉన్న చీర కట్టుకుంది. ఎంతో ముద్దుగా ఉంది.

"ఆలస్యం అయ్యిందా" అంటూ అన్నపూర్ణగారు లోపలికి వెళ్ళారు.

"రండి. రండి ఇప్పుడే కూర్చోపెట్టా రాహుకాలం వెళ్ళాక" అన్నారు సరోజవాళ్ళ అమ్మ.

ఒకళ్ళ తర్వాత ఒకళ్ళు ముత్తైదువులంతా సరోజ పాదాలకు, చేతులకు, చెంపలమీద పసుపురాసి అక్షింతలు వేసి ఆశీర్వదించారు. అంతా అయ్యాక హారతి పాట పాడి లోపలకు తీసుకెళ్ళారు.

కొంతమంది ఆడవాళ్ళు వచ్చి అంజలిని, తన స్నేహితురాళ్ళను పలకరించారు. వాళ్ళు కుతూహలంగా అడిగే ప్రశ్నలకు రాధికకు నవ్వు వచ్చింది. ఒకావిడ వచ్చి లక్ష్మి పక్కన కూర్చుని, వాళ్ళ కుటుంబం గురించి అడగటం మొదలెట్టింది. లక్ష్మి ఇబ్బంది పడటం చూసి రాధిక "ఏంటండి ఇన్ని ప్రశ్నలడుగుతున్నారు. మీ అబ్బాయికి చేసుకుంటారా లక్ష్మిని" అని నవ్వుతూ అడిగింది.

"అబ్బే ఊరికే అమ్మాయి" అందావిడ ఎటూ చెప్పకుండా, అంతలోకి సరోజ మంగళస్నానం చేసి కొత్తచీర కట్టుకుని వచ్చింది.

"అక్కా రాత్రికి గోరింటాకు పెట్టుకుంటున్నాం. మీరందరూ రండి. మా పిన్నిగారమ్మాయి టౌన్‌లో బ్యూటీ పార్లర్‌లో చేస్తుంది. తను మంచి డిజైన్ పెడుతుంది" అంది.

"రాత్రికి స్కూల్‌కి వెళ్ళాలి సరోజ, మేము రాములే" అంది అంజలి.

"అయితే రేపు పొద్దున్న మీ ఇంటికి పంపుతాను" అంది సరోజ.

ఆ రెండు రోజులు బాగా బిజీగా గడిచిపోయాయి. అంజలికి తన ఫ్రెండ్స్‌కి గోరింటాకు పెట్టుకోవటం, రాత్రిపూట స్కూల్‌కి వెళ్ళటంతో ఆడపిల్లలకు పగలుపూట పొలంకు వెళ్ళటం, రాత్రి స్కూల్‌లో మాట్లాడటంతో అబ్బాయిలకు.

ఈ రెండురోజులు రవి కనబడలేదు. ఏదోలా వుంది అంజలికి, ఫోన్ చేద్దామా అని కూడా ఏమన్నా బిజీగా ఉన్నారేమో? ఏమనుకుంటారో అని చెయ్యలేదు.

ఆ రోజు సరోజ పెళ్ళి. రాత్రికి పెళ్ళి కానీ అందరిని మధ్యాహ్నం భోజనాలకు కూడా రమ్మన్నారు. భోజనాలు చేసి పెళ్ళి మండపం డెకరేట్ చెయ్యటంలో రఘు, రాజేష్, వివేక్‌లు సాయం చేస్తున్నారు. అందరూ మెచ్చుకుంటారు పట్నంలో పెరిగారు. డాక్టర్లు ఏం భేషజాలు లేకుండా ఎంత బాగా కలిసిపోయారు. మనతోపాటు పనుల్లో సాయం చేస్తున్నారు అని.

పెళ్ళి మండపం రెడీ అయ్యింది అందరూ టీ తాగుతుంటే సీతారామయ్యగారు వచ్చి వీళ్ళతో కూర్చున్నారు.

"వివేక్ ఇక్కడ మాట్లాడటం సబబో కాదో కానీ ఒకళ్ళిద్దరూ నిన్ను చూసి ఇష్టపడ్డారయ్యా వాళ్ళు అమ్మాయితో సంబంధం మాటాడమని పంపారు. నీ మనస్సులో ఏముందో తెలుసుకుందామని అడుగుతున్నా" అన్నారు.

కాసేపు మౌనంగా ఉన్నాడు వివేక్. రాజేష్, రఘు ఇబ్బందిగా నేల చూపులు చూస్తూ కూర్చున్నారు.

"మీతో ఇలా చెప్పాల్సి వస్తుందని అనుకోలేదు అంకుల్. మీతో ఎలా మాట్లాడాలా అని ఎప్పట్నుండో ప్లాన్ చేశాను. కానీ ఫ్రాంక్‌గా చెప్పుతున్నాను. నాకు అంజలి అంటే చాలా ఇష్టం. కానీ నేను ఎంత ప్రయత్నించినా అంజలి ఒప్పుకోవటం లేదు. తను ఇక ఒప్పుకుంటుందన్న ఆశ కూడా పోతోంది. పిజి అయ్యేలోగా తన మనస్సు మారుతుందేమోనన్న ఆశ"

ఏం మాట్లాడాలో అర్ధం కాలేదు సీతారామయ్యకి. ఈ రకమైన జవాబు వస్తుందనుకోలేదు ఆయన. దాదాపు వారం నుండి అందరూ తన ఎదురుగా ఉన్నా ఏనాడు అనుమానం రాలేదు తనకు. ఎంత సంస్కారం గల పిల్లవాడు. మరి అంజలి ఎందుకు ఒప్పుకోలేదో అన్నపూర్ణని కనుక్కోమనాలి అనుకున్నారు.

"మగపెళ్ళివాళ్ళు విడిదింటికి వచ్చారు. రండి రండి" అని పిలిచారు ఎవరో.

పక్కవీధిలో విడిదిల్లు. అందరూ అటు వెళ్ళారు. లోపలి అంజలి, రాధిక, లక్ష్మి కలిసి సరోజను తయారు చేస్తున్నారు.

"పెళ్ళివాళ్ళు వచ్చేశారు. గౌరి పూజ మొదలెట్టాలి. ఇంకా తయారవ్వటం అవలేదా ఓ బామ్మగారు కోప్పడటం మొదలెట్టారు. "ఏంటో ఈ కాలం పిల్లలకు ఎంతసేపు చేసుకున్నా సోకులు చాలవు. మా కాలంలో మూడుమూరల పూలు తలలో పెట్టి ఓ పట్టులంగా కట్టి తీసుకెళ్ళి పెళ్ళి చేసేశారు" అంది ఆవిడ.

అందరూ నవ్వారు ఆవిడ చెప్పిన విధానంకి.

సరోజ వాళ్ళ అమ్మగారు వచ్చి "మీరందరూ కూడా బట్టలు మార్చుకోండమ్మా" అని హడావుడి చేశారు.

"పిన్ని ఈ వడ్డాణం సరోజకు పెట్టమని అమ్మ ఇచ్చింది" అని అంజలి తన నగల బాక్స్‌లోంచి తీసి ఇచ్చింది.

"వద్దక్కా ఏం అనుకోకు. నాకేం నగలున్నాయో అవే పెట్టుకుంటా. ఒంటిమీదవన్నీ చూసి, అవి నావి అనుకుని కాదని తెలిసి, వాళ్ళు గొడవ పెట్టుకుంటారేమో అక్క పెళ్ళిలో జరిగింది గుర్తులేదా" అంది సరోజ.

పైకి ఎవ్వరూ చెప్పటం లేదు కానీ, సరోజ అక్క లత పెళ్ళికి రాలేదని అందరికీ బాధగానే ఉంది.

సరోజను గౌరి పూజకు తీసుకెళ్ళారు. అంజలి, లక్ష్మి, రాధిక పట్టుచీరలు కట్టుకుని నగలు పెట్టుకున్నారు.

"ఎంత లక్షణంగా ఉన్నారో నా దిష్టే తగిలేటట్టుంది" అన్నారు అన్నపూర్ణగారు.

మగపెళ్ళివాళ్ళు వచ్చారు. అని అంతా బైటకు వెళ్ళారు. పెళ్ళికొడుకుని మండపం మీద కూర్చోపెట్టారు.

''ఏంటి ఇంత ముదురుగా ఉన్నాడు. పక్కన సరోజ చిన్నపిల్లలగా ఉంటుంది'' గొణిగింది రాధిక.

''మనకి కట్నం సమస్యలున్నంత కాలం ఇలా ఆడపిల్లలు సర్దుకోవాల్సిందే'' బాధగా అంది లక్ష్మి.

అంజలి వచ్చే వాళ్ళందరిని చూస్తూ ఒకసారి ఉలిక్కిపడింది.

''ఆ వచ్చేది లతకాదుకదా'' అని గబగబా ఎదురెళ్ళింది.

''లత వచ్చావా'' సంబరంగా అంది అంజలి.

''అంజలిని చూసి కళ్ళెమ్మట నీళ్ళు తిరిగాయి లతకు'',

''ఎన్నో గొడవల మధ్య నన్ను ఒక్కదాన్ని పంపారు. రేపు పొద్దున్నే వెళ్ళిపోవాలి. పోనీలే, అసలంటూ వచ్చాను. ఎక్కడుంది సరోజ'' అంది లత.

''లోపల గౌరీపూజ దగ్గర పద పద'' అంది అంజలి.

అంతలోకి వీళ్ళ దగ్గరకు రఘు, వివేక్, రాజేష్ వచ్చారు.

''చాలా బాగున్నావు రాధి ఈ చీరలో'' అన్నాడు రఘు. పెళ్ళి కూతురులా ఉన్నావు. ఇప్పుడే పెళ్ళి చేసుకుందాం పదా'' అన్నాడు నవ్వుతూ.

''నేను మనసులో అనుకుంది. నువ్వు బైటకు అనగలుగుతున్నావు'' బాధగా అనుకున్నాడు వివేక్ అంజలిని చూసి.

అంజలి కళ్ళు మాత్రం రవిని వెతుకుతున్నాయి. ''ఏంటి తను రావట్లేదా పెళ్ళికి. అంత పరిచయం లేదా'' అనుకుంటుండగా రవి కనిపించాడు వాళ్ళ అమ్మ, నాన్నతో వచ్చాడు.

అందరిని పలకరిస్తూ లోపలికి వచ్చి, అంజలి వాళ్ళను చూసి దగ్గరకు వచ్చాడు.

''నాన్నా నేను చెప్పాకదా సీతారామయ్యగారి అమ్మాయి. వాళ్ళ ఫ్రెండ్స్'' అని పేరు పేరున పరిచయం చేశాడు.

''చిన్నప్పుడు చూశానమ్మా నిన్ను. మేము గుర్తున్నామో లేదో'' అంది సావిత్రి నవ్వుతూ.

''గుర్తున్నారు'' చిరునవ్వుతో అంది అంజలి. అంజలినే చూస్తున్నాడు రవి.

ఎరుపంచు ఉన్న పసుపుపచ్చ చీర కట్టుకుంది. మెడలో కెంపుల నెక్లెస్. తలలోని మల్లెపూలు ముందుకు జారి మెడ మీద పడుతున్నాయి. అందరితో కబుర్లు చెపుతూ మధ్య మధ్య తననే గమనిస్తున్న సోగకళ్ళు. నుదుటి మధ్య పాపిడి బిళ్ళ.

''రండి కూర్చుందాం'' అంటూ వచ్చింది అన్నపూర్ణ.

ఆడవాళ్ళంతా వరండాలో పరిచిన జంపఖానా మీద కూర్చున్నారు.

రఘువాళ్ళు రవితో కలిసి కుర్చీల్లో కూర్చున్నారు.

''ఏంటి వివేక్ మధ్యాహ్నం అంజలి గురించి వాళ్ళ నాన్నగారితో చెప్పేశావు. ఆయన ఏమనుకున్నారో'' అన్నాడు రాజేష్. అతను నెమ్మదిగా అన్నా రవికి వినపడింది. ఒక్కసారిగా నిశారుగా అయ్యాడు. ''ఏం మాట్లాడతున్నారు వీళ్ళు?''

''ఏం చెయ్యను. టాపిక్ వచ్చింది కాబట్టి చెప్పాను. ఆయనకు కూడా తెలియాలిగా తన కూతురిది ఎంత కఠినమైన మనసో'' నవ్వుతూనే అన్నా బాధ వినిపించింది వివేక్ గొంతులో.

''చాల్లే అంజలికి తెలిసిందంటే చాలా బాధపడుతుంది. కొన్ని బంధాలంతే క్లిక్ అవ్వవు. ఆలోచించు'' అన్నాడు రఘు.

"పిజి ఎటూ నేను ఢిల్లీలో చేద్దామనుకుంటున్నా. నేను దూరంగా ఉంటేనన్నా, నా ప్రేమ అర్థం అవుతుందేమో చూడాలి" అన్నాడు వివేక్. "అయినా ఇది నా సమస్య వదిలేయండి."

"ఏంటి అంజలిని ప్రేమిస్తున్నాడా వివేక్. మరి అంజలికి ఇష్టంలేదా? చాలా మంచివాడు, తెలివిగలవాడులాగా ఉన్నాడు కదా. మరి ఎందుకు కాదన్నది?" రవికి కొంచెం అసహనంగా అనిపించింది.

అంతలోకి అంజలి గ్లాసుల్లో పానకం ట్రే మీద పెట్టుకుని తెచ్చింది.

"పానకం ఎప్పుడన్నా తాగారో లేదో మీరు"

"ఎంత సిటీలో పెరిగితే మాత్రం పానకం తెలుసులే. శ్రీరామ నవమికి చేస్తారుగా" అన్నాడు రఘు.

"పెళ్ళిళ్ళలో చేస్తారని తెలియదు. కూల్ డ్రింక్ బదులుగానా" అన్నాడు రాజేష్.

"అలానే అనుకో" అని అందరికి ఇస్తూ రవి దగ్గరకు కూడా వచ్చింది.

రవిని చూస్తూ చిన్నగా నవ్వి "తీసుకోండి" అంది. "ఒక చిన్న రిక్వెస్టు మీకు. ఏమీ అనుకోకపోతే"

"పర్లేదు చెప్పండి"

"మాది కోతిమూక, పెళ్ళికదా అని అల్లరి చేస్తారేమో కొంచెం కంట్రోల్ చెయ్యండి" అంది నవ్వుతూ.

"ఇదిగో మరీ అన్యాయం. మేము ఎంత మంచి వాళ్ళమో ఈ వారం నుంచి అందరూ చూస్తున్నారు" అన్నాడు వివేక్.

పెళ్ళి బాగానే అయ్యింది. మగవాళ్ళు భోజనాలు అయిపోయి పందిట్లో కూర్చున్నారు. "కిళ్ళీలు దొరికాయా మీకు" అంటూ అంజలి ఓ అరడజను కిళ్ళీలు తీసుకుని వచ్చింది.

"మేమందరం వేసుకున్నాం. అవన్నీ నీకోసం తెచ్చుకున్నానని ఒప్పుకోరాదా" నవ్వాడు వివేక్.

"అదేం కాదు పెళ్ళిళ్ళలో కిళ్ళీలే ముందు అయిపోతాయి. అందుకని ముందే తీసిపెట్టా" బుంగమూతితో చెప్పింది అంజలి.

"రవిగారు మీరు తీసుకోలేదనుకుంటా ఇదిగో" అని దోసిలి ముందుకు చూపింది అంజలి.

"నేను ఎప్పుడూ కిళ్ళీ తినలేదు" అంటూ అంజలి చెయ్యివంక చూశాడు.

తెల్లని చేతిలో ఎర్రని గోరింటాకు దోసిట్లో పచ్చటి కిళ్ళీలు. అలాగే చూస్తుండిపోయాడు.

"పెళ్ళి భోజనాలు తిని కిళ్ళీ తినకపోతే పాపం వస్తుంది తినండి" అని చేతులు ముందుకు చాపింది నవ్వుతూ.

మెల్లగా ఒకటి తీసుకుని నోట్లో పెట్టుకున్నాడు.

"బాగా ఎర్రగా పండితే మనల్ని ఎవరో ప్రేమిస్తున్నారంట. నాకస్సలు పండలేదు. నీకు నామీద అస్సలు ఏమీలేదు" కోపంగా అంది రాధిక రఘుతో.

"ఇదెక్కడి గోల తల్లీ నాకు. నీ కిళ్ళీలో సున్నం తక్కువైతే నా తప్పా" నవ్వుతూ అన్నాడు రఘు.

**అర్థంకాక చూస్తున్న** రవితో చెప్పాడు రాజేష్ "రఘు, రాధిక పెళ్ళి చేసుకోబోతున్నారు."

"ఓ మీకు చెప్పలేదు రవిగారు. ఇంకో మూడునెలల్లో మా పెళ్ళి. ఈ లోపల రాధి నన్ను వదిలేయకుండా వుంటే మీరు తప్పకుండా రావాలి" అన్నాడు రఘు.

"మీరు కబుర్లు చెప్పుకోండి. నేను వెళ్ళి అందరికి చెప్పేసి వస్తాను" అని లేచింది అంజలి.

తనతో రాధిక, లక్ష్మి కూడా వెళ్ళి, లత, సరోజ, ఇంక అందరికి చెప్పి బయలుదేరారు.

"అంజలి బంగారు బొమ్మలా ఉంది. డాక్టరు కూడా చదివింది. సంబంధాలు చూస్తారంటనా?" అంది సావిత్రి.

"నేనూ అడిగా సీతారామయ్యని. ఇంకా రెండేళ్ళు స్పెషలైజేషన్ చేస్తుందంట. ఇప్పుడే ఏమీ లేదు అన్నాడు" అన్నారు చంద్రశేఖర్రావు.

"ఎవరికెక్కడ రాసిపెట్టి వుందో మన అబ్బాయిని చూడరాదూ" నిట్టూర్చింది సావిత్రి.

ప్రొద్దున్నే మెలుకువ వచ్చింది అంజలికి. తన ఫ్రెండ్స్ అందరూ ఇంకా నిద్రపోతున్నారు. బైట ముగ్గువేసి కాఫీ తీసుకుని, ఓ పుస్తకం తీసుకుని మేడపైకి వెళ్ళింది.

దేవులపల్లి రాసిన కవితలు చదువుతుంటే, ఫోన్ మోగింది. రవి దగ్గర్నుండి.

ఆశ్చర్యపోతూ తీసింది.

"సారీ పొద్దున్నే లేపేశానా?" అడిగాడు రవి.

"పొద్దున్నే గుడ్ మార్నింగ్ అంటారు సారీ కాదు" నవ్వింది అంజలి.

"ఎప్పుడో లేచాను. నేను తొందరగానే లేస్తాను."

"ఏం చేస్తున్నారు?" అడిగాడు రవి.

"కాఫీ తాగుతూ కృష్ణశాస్త్రి కవితలు చదువుతున్నా" అంది. చిన్నగా నవ్వుతూ.

"అయితే మంచి మూడ్‌లో ఉండగా ఫోన్ చేశానన్నమాట."

"ఏం లేదు రెండురోజుల్నుండీ మిమ్మల్నెవర్నీ కలవలేదు. ఎం.ఎల్.ఏగారు హైదరాబాదునుండి వచ్చారు. ఆయనతో పనివుండి మిమ్మల్ని స్కూల్‌లో పడేసి పట్టించుకోకుండా తిరుగుతున్నానని గిల్టీగా ఉంది" అన్నాడు రవి.

"ఇప్పుడు కూడా ఇంకొక అరగంటలో బయలుదేరి వెళ్ళాలి. మొన్న మీరు ఏదో ఐడియా ఉంది అన్నారు దాని గురించి మాట్లాడటానికి కుదర్లేదు. సాయంత్రం వీలైనంత తొందరగా వస్తాను" గబగబా అన్నాడు రవి.

"ముందు నన్ను మీరు అనటం ఆపండి. తర్వాత సంజాయిషీలు ఇవ్వటం ఆపండి." అంది అంజలి. "మీ పనులు మీకుంటాయి కదా!"

"సాయంత్రం అందరం కలిసి సినిమాకు వెళదాం. నా ట్రీట్. ఏం సినిమానో మీరే సెలక్ట్ చెయ్యండి. బయలుదేరేముందు ఫోన్ చేస్తాను" నవ్వుతూ అన్నాడు.

"సరే కానీ చిన్న సవరణ సినిమాకు వెళ్ళేటట్టైతే మా ఇంట్లో భోంచేసి బయలుదేరదాం. కాదనకూడదు" అంది.

"నేనే పార్టీ ఇవ్వాలి మీకు. మీరు కాదు" అన్నాడు.

"కాదు నన్ను మళ్ళీ మీరు అన్నందుకు, మీకు పనిష్మెంట్."

గట్టిగా నవ్వి "సరే సాయంత్రం ఫోన్ చేస్తాను" అని పెట్టేశాడు.

కిందకు వచ్చింది అంజలి. అందరూ నిద్రలేచారు.

సాయంత్రం సినిమా ప్రోగ్రాం గురించి చెప్పింది. "మీకు థియేటర్స్ కూడా ఉన్నాయా?" అన్నారు అందరు.

"కాలవ అవతల ఒకటుంది ఇంకా పక్కన టౌన్‌లో రెండు మంచి థియేటర్స్ ఉన్నాయి. ఏ సినిమా నచ్చితే దానికి వెళదాం" అంది అంజలి.

సాయంత్రం ఆరవుతుండగా రవి వచ్చాడు. "లేట్ అయ్యింది సెకండ్ షోకి వెళ్ళాలేమో" అంటూ.

"మీరు టైర్ అయితే వద్దులెండి" అన్నాడు వివేక్.

"నాకు మీ అందరితో మాట్లాడుతుంటే మళ్ళీ కాలేజ్ డేస్ గుర్తుకొస్తున్నాయి. చాలా బాగుంది" అన్నాడు రవి.

"ఇంతకీ మీ ఐడియాస్ ఏంటో చెప్పలేదు అంజలి. చాలా క్యూరియస్‌గా ఉంది."

"ఎలాంటి ఐడియానో మీరే చెప్పాలి" అని మొహమాటంగా అంది అంజలి.

"భోజనం చేస్తూ మాట్లాడుకుందురు రండి" అన్నారు అన్నపూర్ణ.

భోజనం చేస్తుండగా చెప్పింది అంజలి. "ఇక్కడ ఆడవాళ్ళతో మాట్లాడుతుంటే చిన్న చిన్న సమస్యలు చాలా ఉన్నాయని అర్థమయింది. పాలెంలో వెనుకబడిన వాళ్ళ సమస్యలు కొన్ని ఊళ్ళో ఆడవాళ్ళ సమస్యలు కొన్ని ఒక సంఘంగా పెట్టి ఆదాయంలోంచి కొంత దాచుకోవటం అలవాటు చేయవచ్చు. చిన్న చిన్న వ్యాపారాలు పెట్టుకోవటానికి ఐడియాలు ఇవ్వటం కానీ, మన ఊళ్ళోని బ్యాంక్‌కి తీసుకెళ్ళి సాయం చేయటం కానీ చేయవచ్చు."

"ఈ సంఘం ఒక కౌన్సిలింగ్ సెంటర్‌లాంటిది. దానికి లీడర్‌లుగా ఓ ముగ్గురు, కాస్త చొరవ, బాగా మాట్లాడే ఆడవాళ్ళను పెట్టవచ్చు. ఏమంటారు? అంది అంజలి.

"నువ్వేంటి ఓ ఉమెన్ ఫార్మ్ పెడుతున్నావు? మొగాళ్ళకు ప్రోబ్లమ్స్ ఉండవా?" అన్నాడు వివేక్.

"పల్లెల్లో ఆడవాళ్ళు బైటకు వచ్చి, వాళ్ళ సమస్యల గురించి అందరి ఎదురుగా చెప్పలేరు. అదే వాళ్ళ గ్రూప్ ఉంటే మొహమాటం లేకుండా మాట్లాడగలుగుతున్నారు" అంది అంజలి.

"బాగుందమ్మా ఈ ఆలోచన." అంది అన్నపూర్ణ.

"బాగుంది ఆలోచన. నేను ఇదివరకు యువజన సంఘం పెట్టాను. జన్మభూమిలాంటి కార్యక్రమాల్లో రోడ్లు వేయటం వీధి లైట్లు తెప్పించటం, ఊళ్ళో బ్యాంక్ ఏర్పాటు చేయించటం ఇలాంటి ఇన్ఫ్రాస్ట్రక్చర్ మార్పుల గురించి పనిచేశాను. కానీ ఇంకా వేరే సమస్యల గురించి మాట్లాడుకుంటేనే కదా తెలిసేది" అన్నాడు రవి. "దీన్ని ఎలా అమలు చేయాలి అనేది ఆలోచిద్దాం" అన్నాడు.

"ఇంతకీ సినిమా ఎక్కడ డిసైడ్ చేశారు?" అంది లక్ష్మి.

"ఊళ్ళో సినిమాకు వెళదాం. నడుచుకుంటూ సరదాగా వెళ్ళొచ్చు" అంది అంజలి.

దోవలో అంతా అంజలి, రవి మాట్లాడుకుంటూనే ఉన్నారు. ఆడవాళ్ళ మీటింగ్‌కి "చేతన" అని పేరు పెట్టారు.

"ఇదిగో మీరు ఈ మాటలు ఆపకపోతే మేం మీతో రాము. వెనక్కి వెళ్ళిపోతాం" అన్నాడు వివేక్.

పల్లెటూరు సెకండ్ షో కాబట్టి ఎక్కువ మంది జనం లేరు. అందరూ లోపలి వెళ్ళారు. రవి ఎవరో కనిపిస్తే వాళ్ళతో మాట్లాడుతూ ఉండిపోయాడు.

సినిమా మొదలుపెట్టారు. ఇక వివేక్, రాజేష్, ఈలలు మొదలుపెట్టారు.

"ఇది పల్లెటూరు ఊరుకోండి" అని విసుక్కుంది లక్ష్మి.

"కాబట్టే అల్లరి చెయ్యాలి" అన్నాడు రఘు. "లాభం లేదు వీళ్ళను విడదీయాలి. లేవండి. మీరు ముగ్గురూ కలిసి కూర్చోవద్దు" అని అబ్బాయిల మధ్యలో లక్ష్మి, రాధిక కూర్చున్నారు.

రవి లోపలకు వచ్చేసరికి అంజలి పక్కన ఖాళీ ఉంది. ఎలా కూర్చోవాలి అని మొహమాటపడ్డాడు.

"కూర్చోండి సినిమా మొదలయ్యింది" అంది అంజలి. కొంచెం వెనక్కి వాలి, సినిమాను చూస్తున్న అంజలిని గమనిస్తున్నాడు రవి. తను ఎంతో ఇన్వాల్వ్ అయ్యి సినిమా చూడటం ముచ్చటేసింది. సెంటిమెంట్ల సీన్లలో కళ్ళనీళ్ళు తుడుచుకోవటం చూసి నవ్వొచ్చింది ఇంత మెచ్యూర్డ్‌గా ఆలోచిస్తుంది. మళ్ళీ ఇంత సెన్సిటివ్ అని.

సినిమా అయ్యాక తిరిగి వస్తుంటే అంజలి అంది రవితో "రేపు శుక్రవారం కదా చాలా మంది ఆడవాళ్ళు ఆశ్రమంకు వస్తారు. లలితా పారాయణంకు, నేను వెళ్ళి మన సంఘం గురించి చెపుతాను. ఏమంటారో చూద్దాం"

"ఒప్పుకుంటారో లేదో చూడాలి" అన్నాడు రవి ఆలోచనగా.

"పర్లేదు. పొద్దున్నే వెళ్ళి నేను జయలక్ష్మి అత్త, మాధవరావు అన్నవాళ్ళ ఆవిడ పద్మ వదినలాంటి వాళ్ళతో మాట్లాడతాను. వీళ్ళు కొంచెం లీడర్స్‌లాంటి వాళ్ళు. వీళ్ళను కొంచెం కదిలిస్తే చాలు" నవ్వింది అంజలి.

"సరే నేను రేపు స్కూల్‌లో కూడా చెపుతాను. మీకు ఫోన్ చేస్తాను. ఏ విషయం" అన్నాడు రవి.

"ఇవాళ సినిమా చాలా ఎంజాయ్ చేశాను మీ అందరితో.. గుడ్ నైట్" వెళ్ళాడు రవి.

"మీ ఇద్దరు చాలా ఎగ్జైటెడ్‌గా ఉన్నారు. ఈ విషయాలు మాట్లాడుకుంటూ" అన్నాడు వివేక్ కొంచెం అసహనంగా. ఏం మాట్లాడలేదు అంజలి.

మర్నాడు అన్నపూర్ణతో కలిసి ఆడపిల్లలు ఊళ్ళో కొందరు ఆడవాళ్ళతో మాట్లాడి ఆశ్రమంకు కూడా వెళ్ళారు. లలితాపారాయణం తర్వాత, అందరితో గ్రామీణ సేవా సమితి గురించి చెప్పారు. కొతమంది చప్పుడించేశారు. "ఆ ఇవన్నీ ఎలా కుదురుతాయి. ఇంట్లో పనులకే ఉన్న సమయం చాలట్లేదు. అయినా ఏమున్నాయి మాట్లాడుకుంటే ఈ మీటింగులన్నీ మగాళ్ళకి మనక్కాదు" ఒక్కొక్కళ్ళు ఒకోరకంగా అన్నారు.

అంజలి ఇది ముందే ఊహించింది, "జయలక్ష్మి అత్త నువ్వేం అనుకుంటున్నావు" అంది.

జయలక్ష్మి అన్నీ ధాటిగా మాట్లాడుతుంది. నిర్మొహమాటంగా ఉంటుంది. తను లేచి "ముందే నీరసంగా మాట్లాడతారెందుకు అందరూ. మనకోసమేగా ఈ మీటింగు. ఏమన్నా సమస్యలుంటే వాటి గురించి మాట్లాడదాం. లేకపోతే ఇంకేమైనా మాట్లాడదాం సహస్రనామాలు చదవటానికి ఆశ్రమానికి రావట్లేదా? అలాగే ఇది. ఇకనుండి ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు ఆశ్రమంలో కలుద్దాం. ఇంత పెద్ద పెద్ద చదువులు చదువుకున్న వాళ్ళు మనగురించి ఆలోచిస్తుంటే, మనం మన గురించి ఆలోచించలేమా?" అని అడిగింది.

ఒకళ్ళతో ఒకళ్ళు మాట్లాడుకుని, "సర్లే ఎల్లుండేగా.. ఆదివారం వస్తాంలే" అన్నారు.

పొద్దున్నే రవి ఫోన్ చేశాడు.

"పొద్దున్నే లేస్తానని చెప్పావుగా అడ్వాంటేజ్ తీసుకుంటున్నా" అని మొదలుపెట్టాడు.

"సంజాయిషీలేవీ ఇవ్వకుండా కన్వర్‌సేషన్ మొదలుపెట్టలేరా?" నవ్వింది అంజలి.

"రాత్రంతా ఒక ఐడియా గురించి ఆలోచిస్తున్నా. నిద్రపోలేదు. మీకు కూడా చెపుదామని చేశాను."

"మైక్రో ఫైనాన్స్ గురించి విన్నారు కదా. మన గ్రామీణ సంఘం వాళ్ళకు అది ఇంట్రడ్యూస్ చేస్తే ఎలా ఉంటుంది?" ఎక్సైటెడ్‌గా అన్నాడు.

"మన పల్లెల్లో వ్యవసాయం పనులు బాగా ఉంటే ఓ రెండు మూడు నెలలు ఉంటాయి. అందుకని వేరే వ్యాపారాలు చేస్తే, పనికి పని, ఆదాయంకు ఆదాయం. ఒక సంవత్సరం పాటు అందరూ, పొదుపు ఉద్యమంలాగా చేయాలి. ఈ లోపల మనకున్న వనరులు, అభిరుచులను ఆలోచించుకుని దానిలో ట్రైనింగ్‌లాగా ఇప్పించవచ్చు."

"మీరు ఆదివారం అందర్నీ కలుస్తున్నారు కదా వాళ్ళకు ఇది చెప్పి ఏమంటారో కనుక్కోండి" అన్నాడు రవి.

"ఐ రియల్లీ అడ్మైర్ యువర్ డెడికేషన్. ఎంత డీప్‌గా ఆలోచిస్తున్నారో" అంది అంజలి.

"మరీ పొగడకు. మన పంచాయితీ పరిధిలో మన ఊరు పక్కన మూడు చిన్న పల్లెలు ఉన్నాయి. నేను ఒక ప్రాజెక్ట్ ప్లాన్ వేశాను, పక్కా ఇళ్ళగురించి. ఆ పని గురించే నేను ఎం.ఎల్.ఏగారితో మీటింగులు. ఏదన్నా చేద్దామంటే ఎందుకు అనేవాళ్ళే కానీ, కాస్త ఎంకరేజ్ చేసేవాళ్ళు లేరు. ఎట్లాగో ఈ ఐడియాకి ఓకె అని సి.ఎంతో మాట్లాడతామన్నారు. ఓట్లు కావాల్సినప్పుడు కనిపిస్తారు జనం. వాళ్ళకి ఏమన్నా చేద్దామని ఆలోచించేవాళ్ళు ఎంతమంది ఉన్నారు?"

"ఎవరి ఆలోచనలు, ఆందోళనలు వారివి. ఎం.ఎల్.ఏ గారిది పెద్దవయస్సు. ఆయన పదవిలో ఉన్నప్పుడే కొడుకుని పైకి తీసుకొద్దామన్న తాపత్రయం. తరువాత ఎం.ఎల్.ఏ అవ్వాలిగా. కొడుకు ఎంతసేపూ కాకాపట్టే బాచ్‌తో తిరగటం తప్పితే, నియోజకవర్గంలో ఏం సమస్యలున్నాయో కూడా పట్టించుకోడు, సర్లెండి పొద్దున్నే మీ బుర్ర తింటున్నాను" అన్నాడు రవి.

"చాలా ఫ్రస్టేషన్‌తో ఉన్నట్లున్నారు" మృదువుగా అంది అంజలి.

"కొంచెం డిసప్పాయింటెడ్‌గా ఉన్నాను. కానీ ఇవన్నీ అలవాటయ్యాయి నాకు, వదిలేయండి. ఏం చేస్తున్నారు ఇవాళ మీరు?"

"రాజోలుకు వెళదామని ఉంది. ఓ చిన్నపాటి టౌన్ చూస్తారుకదా. దానితోపాటు హాస్పిటల్‌కి వెళ్ళి ప్రసాద్ డాక్టర్‌గారిని కలుస్తాం" అంది అంజలి.

"ఇంక ఎన్ని రోజులుంటారు మీ ఫ్రెండ్స్?" అన్నాడు రవి.

"బుధవారం బయలుదేరతారు."

"అయితే మంగళవారం మా ఇంట్లో డిన్నర్ పార్టీ. రేపు పొద్దున్నే నాలుగుగంటలకి రెడీగా ఉండండి ఒక చోటుకు తీసుకువెళతా. "

"ఎక్కడికి తీసుకువెళుతున్నారు? రేపు మధ్యాహ్నం ఆడవాళ్ళతో మీటింగ్ ఉంది" అంది అంజలి.

"మధ్యాహ్నానికి వచ్చేస్తాంలే. సర్‌ప్రైజ్ మీ సిటీ ఫ్రెండ్స్‌కి. మళ్ళీ ఫోన్ చేస్తాను బై" పెట్టేసాడు రవి.

రవి గురించి ఆలోచిస్తూ కూర్చుంది అంజలి.

"ఏం చేస్తున్నావు ఒక్కదానివి పైన" అంటూ వచ్చాడు వివేక్.

"ఏమీలేదు. లేచారా అందరూ? రాజోలు వెళదాం అనుకున్నాం కదా పద రెడీ అవుదాం" అంది అంజలి.

"అబ్బా కాసేపు నాతో స్పెండ్ చేయచ్చుకదా! వచ్చిన దగ్గర్నుండి నీకు ప్రజాసేవ ఎక్కువైంది" కినుకగా అన్నాడు వివేక్.

"ఇవాళంతా సరదాగా తిరుగుదాం. పద. నీకు బోర్ కొట్టి ఇంటికి వెళదాం అనేదాకా రావద్దు సరేనా?" అని లేచింది అంజలి.

రాత్రి భోజనాలప్పుడు చెప్పింది అంజలి "రవిగారు రేపు పొద్దున్నే నాలుగు గంటలకల్లా రెడీగా ఉండమన్నారు. ఎక్కడికో తీసుకువెళతానన్నారు. సర్‌ప్రైజ్ అంట."

"రోజంతా నీతోనే ఉన్నాను. ఎప్పుడు ఫోన్ చేశారు?" మొహం చిట్లించి అన్నాడు వివేక్.

"అంత పొద్దున్నే ఎక్కడికి?" మాట మారుస్తూ అన్నాడు రఘు.

"తెలియదు తొందరగా పడుకోండి నేను లేపుతాను పొద్దున్నే"

"దాన్ని పొద్దున్నే అనరు. అర్ధరాత్రి అంటారు" అన్నాడు వివేక్.

రవి, అంజలి మీద ప్రత్యేకమైన శ్రద్ధ చూపుతున్నాడని అనుమానం మొదలయ్యింది వివేక్‌కి. ఇవ్వాళ హాస్పిటల్ చూడటానికి వెళ్ళినప్పుడు అంజలి మాట్లాడే తీరు చూస్తే చదువయిపోయాక, ఇక్కడ సెటిల్ అయ్యేట్లుంది. చాలా అసహనంగా ఉంది వివేక్‌కు.

మసక వెన్నెల వెలుతురులో కారు వేగంగా వెళుతుంది పల్లెల మధ్యగా వెళ్ళటంతో నిర్మానుష్యంగా ఉన్నాయి రోడ్లు.

రవి సుమో కారు తెచ్చాడు. కార్లో ఏవో అట్టపెట్టెలు కూడా ఉన్నాయి. "ఎక్కడికి వెళుతున్నామో ఇప్పటికన్నా చెపుతారా?" అంది రాధిక.

"ఇంకెంత ఓ గంట. కాస్త ఓర్పు పట్టండి" అన్నాడు రవి.

"నేను గెస్ చేశాను ఎక్కడికి వెళుతున్నామో. వీళ్ళ ఎదురుగా చెప్పనులే" అంది నవ్వుతూ అంజలి.

ఓ గంట ప్రయాణం చేశాక ఓ చిన్నపల్లెటూరు దగ్గరకు వచ్చారు. తొలి వెలుగు పొడచూపుతుంది. నిశ్శబ్ద నీరవంలో పక్షుల కిలకిలలు. దోవ పొడుగూతా కొబ్బరి చెట్లు.

ఊరి లోపల నుండి మట్టి రోడ్డు పట్టింది కారు. దూరంగా సరివి చెట్లు కనపడుతున్నాయి.

"ఆ దూరంగా కనిపించేదేంటి?" ఎక్సయిటింగ్‌గా అడిగాడు రాజేష్.

ముందంతా ఇసుకమేట. కారు ఆపాడు రవి.

"ఓ మై గాడ్ సముద్రమా?" అరిచింది రాధిక.

"అవును. కారు ముందుకు వెళ్ళదింక. ఈ బాక్సెస్ మోసుకు రావటానికి హెల్ప్ చేస్తారా" నవ్వుతూ అన్నాడు రవి.

మెల్లగా వెలుగు రేఖలు విచ్చుకుంటున్నాయి. రేరాజు తన ప్రయాణాన్ని చాలించటానికి ఆయుత్తమవుతున్నాడు. ఓ పక్క పలుచపడుతున్న వెన్నెల. మరోపక్క సముద్రగర్భంలోంచి పైకి వస్తున్న భానుడు.

లేలేత భాను కిరణాలను సముద్రరాజు దోసిలి పట్టి ఉరకలేస్తూ వచ్చే అలలలో పుడమి పాదాలకు అర్పిస్తున్నట్లుగా ఓ అద్భుత దృశ్యకావ్యంలా.

ముందుకు కదల్లేనట్లుగా ఆగిపోయింది అంజలి. అందరూ నీటి దగ్గరకు వెళ్ళారు. అంజలి వెనకే ఆగిపోవటం చూసి దగ్గరకు వచ్చాడు రవి.

ఇంత అద్భుతాన్ని ఎప్పుడూ చూడలేదు. వెళ్ళిపోతున్న చంద్రునికి వీడ్కోలు చెప్పటానికి సూర్యుడు వచ్చినట్లు. ఇది చూపించటానికి తీసుకువచ్చిన రవితో ఏమని చెప్పాలో అర్థంకాలేదు అంజలికి.

"థాంక్యూ" నెమ్మదిగా చూస్తూ చెప్పింది. అంజలి మనస్సు తన కంటి చెమ్మలో అర్థం అయ్యింది రవికి. చిన్నగా నవ్వి తనతో తెచ్చిన జంపఖానాలు పరిచి "కూర్చుందామా కాసేపు?" అన్నాడు.

"ఇక్కడ కూర్చున్నావేంటి? నీళ్ళదగ్గరకు రా" అంటూ దగ్గరకు వచ్చాడు వివేక్.

"నీళ్ళదగ్గరకు మళ్ళీ వెళ్ళొచ్చు. అందరినీ రమ్మను ఒకసారి" అన్నాడు రవి.

అందరూ వచ్చేటప్పటికి పెట్టెలోంచి ఫ్లాస్క్‌లు తీసాడు. కప్పులు, టీ బాగ్స్, షుగర్ తీసి "వేడి టీ తాగుతూ ఇలా సూర్యోదయం చూడటం ఎంత బాగుంటుంది" అన్నాడు రవి.

"చాలా చాలా థాంక్స్ రవిగారు. మంచి గిఫ్ట్ ఇచ్చారు మాకు" అంది రాధిక.

అందరూ మౌనంగా కూర్చుని టీ తాగుతూ సముద్రాన్ని చూస్తున్నారు.

"అంజలి ఒక మంచి పాట పాడవా ప్లీజ్" అన్నాడు వివేక్. రవి ఆశ్చర్యంగా చూశాడు.

"ఊహూ ఇప్పుడు వద్దు" అంది అంజలి.

"అదేంటి నీకు మంచి మూడ్ ఉంటే పాడతావుగా ప్లీజ్ ఒక్కటి పాడు" అంది రాధిక కూడా.

"మా అంజలి చాలా బాగా పాడుతుందండి" అంది రవితో.

"ఇవాళ పాడలేను. వదిలెయ్యి" అంది అంజలి.

ఓ క్షణం అంజలి వంక చూసి "మీకు నీళ్ళలో తడవాలనుంటే వెళ్ళండి. మరీ ఎక్కువ తడవద్దు. దగ్గర్లో ఓ పెద్ద గుడి ఉంది అక్కడికి కూడా వెళదాం" అన్నాడు రవి.

చాలా ప్రశాంతంగా తృప్తిగా అనిపించింది అంజలికి. కాసేపు నీళ్ళల్లో ఆడుకుని అందరూ గుడికి ప్రయాణం అయ్యారు.

"నర్సింహ స్వామి గుడికి ఇక్కడ చాలా ప్రాముఖ్యం ఉంది" అన్నాడు రవి.

"చిన్నప్పుడు ఒకసారి కార్తీక మాసం స్నానాలకు ఈ సముద్రం ఒడ్డుకు వచ్చినట్లు గుర్తు" అంది అంజలి.

దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణం మొదలుపెట్టారు. తోవంతా అందరూ రవికి చాలా చాలా థాంక్స్ చెప్పారు.

అందర్నీ ఇంటి దగ్గర దించి వెళుతూ చెప్పాడు రవి "మంగళవారం రాత్రి మా ఇంట్లో భోజనాలు మీకు" అని వెళ్ళాడు.

**ఫ్రెండ్స్ అందరికీ** సరదాగా గడిచిపోతున్నాయి రోజులు. రాత్రి 9.30 అయ్యింది. నిద్రపట్టక పుస్తకం చదువుతోంది అంజలి. రవి దగ్గర్నుండి ఫోన్ వచ్చింది. "రేపు రాత్రికి మర్చిపోకుండా రండి"

"వస్తాం కానీ నిన్న మీటింగ్‌లో ఏం జరిగిందో వినండి" అని ఆ విశేషాలు చెప్పటం మొదలుపెట్టింది.

"అంజలి.. పడుకున్నావా?" లోపలికి వస్తూ అంది అన్నపూర్ణ.

"లేదమ్మా ఏమన్నా కావాలా?"

"ఏం లేదు వివేక్ గురించి నీతో మాట్లాడమన్నారు నాన్న నన్ను" అవతల ఫోన్‌లో రవి విన్నాడేమోనని గతుక్కుమంది అంజలి "నేను ఓ పదినిమిషాల్లో మళ్ళీ చేస్తాను" అని పెట్టేసింది.

"ఏం మాట్లాడాలి వివేక్ గురించి" అంది అంజలి.

"ఆ అబ్బాయి నిన్ను ఇష్టపడుతున్నాడంట. పెళ్ళి చేసుకుంటాడంట. నీ అభిప్రాయం కనుక్కోమన్నారు నన్ను."

"అమ్మా మేమిద్దరం మంచి ఫ్రెండ్స్ అంతే. నాకు తనను పెళ్ళి చేసుకునే ఉద్దేశం లేదు."

"అదికాదమ్మా పిల్లాడు బావున్నాడు, మంచివాడు. పైగా నీకు బాగా తెలిసినవాడు. మరి ఏంటి ఇబ్బంది?"

"అమ్మా ఇవన్నీ నాకు తెలియవా. తనను పెళ్ళిచేసుకునే ఉద్దేశం ఉండాలని ఏమన్నా రూల్ ఉందా? వదిలేయమ్మా ప్లీజ్ అన్నీ ఆలోచించే ఈ నిర్ణయం తీసుకున్నా. ఇంక ఈ విషయం నా దగ్గర ఎత్తొద్దు" విసుగ్గా అంది అంజలి.

ఓ క్షణం అంజలి వంక చూసి "సర్లే పడుకో" అని బైటకు వెళ్ళింది అన్నపూర్ణ.

తలుపు వేసి వచ్చి ఓ నిమిషం ఆలోచిస్తూ కూర్చుని రవికి ఫోన్ చేసింది.

"సారీ ఇందాక పెట్టేశాను" అంది.

"ఏమన్నా ప్రాబ్లం ఉందా? కొంచెం చిరాగ్గా ఉన్నట్లున్నారు."

"ఏం లేదు. నా పెళ్ళిగోల. వదిలెయ్యండి" వివేక్ గురించి అడుగుదామా అనిపించింది రవికి, కానీ ధైర్యం చాలలేదు. ఏమని అడగాలి? ఎలా అడగాలి. మీకెందుకు అంటే నువ్వంటే ఇష్టం అంజలి అని చెపుతాడా?"

"రోజూ నీతో ప్రొద్దునో, సాయంత్రమో మాట్లాడటం అలవాటయ్యింది. డిస్టర్బ్ చేస్తున్నానేమో పెట్టేస్తాను" అన్నాడు.

"లేదు మీతో మాట్లాడుతుంటే నాకు బాగుంటుంది" గబుక్కున అనేసి నాలిక్కరుచుకుంది అంజలి.

"థాంక్స్" చిన్నగా నవ్వాడు. "మంచి బుక్ చదువుతూ పడుకో మూడ్ బాగుంటుంది. రేపు కలుద్దాం సరేనా?"

ఓకె గుడ్‌నైట్ అని పెట్టేసింది అంజలి.

ఛ గభాల్న అలా అనేశావేంటి? ఏమన్నా అనుకున్నాడా? అంటే చీప్‌గా ఏం మాట్లాడలేదు కదా ఫ్రెండ్లీగానే అన్నా కదా అని సమర్ధించుకుంది.

"జున్నుపాలు ఇచ్చారు తెలిసిన వాళ్ళు. జున్ను చేశాను. ఇదిగో ఈ గిన్నెలో పెట్టాను. సావిత్రికి ఇవ్వు. మీ అందరూ అక్కడ తినచ్చు" అంది అన్నపూర్ణ.

"జున్నంటే ఏంటి?" అంది రాధిక.

"తినబోతూ అడగటం దేనికి? కాస్త ఆగు తెలుస్తుంది అంది అంజలి"

అందరూ బయలుదేరి రవి ఇంటికి వెళ్ళారు. చంద్రశేఖరావుగారిది చాలా పెద్ద ఇల్లు. ఒక పక్క డాబా ఇంకో పక్కన చావిడ ఉన్నాయి. చావిడిలో గేదెలు కట్టేసి ఉన్నాయి ఇంటికి. చావిటికి మధ్య బాగా ఖాళీస్థలం.

ఎదురుగా పెద్ద వరండా కుర్చీలు వరండాకు చివర స్థంభానికి సీజర్ కట్టేసి ఉంది. వీళ్ళు గేటు తీయటం చూసి ఒకతను వచ్చి కుక్కను అవతలకు తీసుకెళ్ళాడు. రవి లోపల్నుండి వచ్చాడు.

"మీ ఊళ్ళో ఏంటి? అందరి ఇళ్ళల్లో ఇన్ని పూలమొక్కలుంటాయి" అంది లక్ష్మి.

"మీ సీజర్‌ను దాచేశారేంటండి" అన్నాడు రాజేష్.

"కొత్తవాళ్ళను చూస్తే హడావుడి చేస్తుందని. లోపలికి రండి" అని తీసుకెళ్ళాడు.

లోపల గదిలోంచి చంద్రశేఖరావు, సావిత్రి వచ్చారు. "ఎలా కాలక్షేపం అవుతుంది సెలవుల్లో" అంటూ.

"అమ్మ జున్ను పంపింది" అని అంజలి సావిత్రికి ఇచ్చింది.

"ఇంకొక పదినిమిషాల్లో వడ్డించేస్తా కూర్చోండి" అంది సావిత్రి.

"మేము ఏమన్నా హెల్ప్‌చేయమా" అడిగింది అంజలి.

"ఏముందమ్మా పని అంతా అయిపోయింది. గిన్నెల్లో సర్దటమే"

"నేను సాయం చేస్తాను. పర్లేదు. అంది అంజలి.

"సరే అయితే లోపలికి రండి ఇల్లు కూడా చూసినట్లుంటుంది"

హాలు దాటగానే ఓ పక్క పూజ గది పెద్దది ఉంది ఇంకో పక్క వేరే గదులేవో ఉన్నాయి. ఓ పక్క పెద్ద డైనింగ్ రూమ్ పది కుర్చీల టేబుల్ ఉంది.

"బాప్‌రే ఎంత పెద్ద డైనింగ్ రూం" అంది లక్ష్మి.

"ఇంటికి ఎప్పుడూ ఎవరో ఒకళ్ళు వస్తుంటారు కదా. చిన్న టేబుల్ చాలదు కదా. మేము ముగ్గురమే అయితే వంటింట్లో చిన్న టేబుల్ ఉంది అక్కడే తింటాం" అంది సావిత్రి.

"మీకు ఒక అమ్మాయి ఉంది కదా" అంది అంజలి గుర్తుచేసుకుంటూ.

"ఓ నీకు గుర్తుందా రవి కంటే పెద్దది. అమెరికాలో ఉంటుంది. మా అల్లుడిది కంప్యూటర్ ఉద్యోగం అక్కడ" సంతోషంగా చెప్పింది ఆవిడ.

అందరూ ఆవిడ మాటలు వింటూ, వంటింట్లో నుండి గిన్నెలన్నీ తెచ్చి టేబుల్ మీద పెట్టారు.

"మీకు నచ్చుతాయో లేదో ఈ పల్లెటూరు వంటలు. రవి బాబేమో అసలు పైన డాబా మీద భోజనం ఏర్పాట్లు చెయ్యమన్నాడు. నేనే పైకీ కిందకు ఎందుకు. భోంచేసి పైకెళ్ళి కబుర్లు చెప్పుకొండి అన్నా" అంది సావిత్రి.

"అసలేంటండి ఇన్ని చేశారు. పెళ్ళి భోజనంలాగా. ఎందుకింత శ్రమ అనవసరంగా" అంది అంజలి.

"శ్రమ ఏమీలేదు. అందర్నీ పిలుచుకురా" అంది సావిత్రి. నాలుగురకాల వెజిటేరియన్, మూడు నాన్‌వెజ్ కూరలతో అందరూ కబుర్లు చెప్పుకుంటూ తిన్నారు.

"చాలా బాగున్నాయి వంటలన్నీ అని అందరూ సావిత్రికి థాంక్స్ చెప్పారు."

"పైన అన్నీ పెట్టించానురా. మీరు పైకి వెళ్ళండి" అంది సావిత్రి.

"ఆ..ఒక్క నిమిషం" అని ఓ గిన్నె తీసుకొచ్చి వాళ్ళముందు పెట్టి తీసుకొండి అన్నాడు.

అంజలి మూత తీస్తే దాంట్లో చక్కగా కట్టిన కిళ్ళీలు గబుక్కున కళ్ళెత్తి రవివైపు చూసింది.

"నీకెన్ని కావాలంటే అన్ని తీసుకోవచ్చు" అన్నాడు నవ్వుతూ.

తనకు కిళ్ళీలు ఇష్టమని గుర్తుపెట్టుకున్నందుకు చాలా సంతోషం వేసింది అంజలికి.

"రండి నా గది దగ్గరకు వెళదాం అని మేడ మీదకు తీసుకువెళ్ళాడు రవి.

పెద్ద, ఖాళీడాబా ఓ పక్క కుర్చీలు టేబుల్ మీద ఏవో పెట్టి ఉన్నాయి. ఓ పక్కన ఒక గది ఉంది.

"ఇదే నా ప్రపంచం" అన్నాడు రవి.

మేడమీద లైట్ లేదు. మర్నాడు పౌర్ణమి కాబోలు.

వెన్నెట్లో కొబ్బరాకుల నీడలు చుట్టూ నిశ్శబ్దం.

"ఇది నాగది" అని లోపలకు తీసుకువెళ్ళాడు.

ఓ పక్క పెద్దది పాత పందిరి మంచం. ఓ పక్క బుక్ షెల్ఫ్, ఇంకోపక్క టేబుల్ దాని మీద లాప్‌టాప్ గోడమీద ఓ పక్క రవివర్మ పెయింటింగ్, ఇంకో పక్క బాపుగీసిన రాధాకృష్ణుల చిత్రం.

నెమ్మదిగా బుక్ షెల్ఫ్ దగ్గరకు నడిచింది అంజలి.

"ఇదిగో నువ్వప్పుడు పుస్తకాలు చూస్తూ కూర్చోకు. మాతో ఉండు" అన్నాడు వివేక్.

అందరూ బైటకు నడిచారు. లైట్స్ ఆఫ్ చేశాడు రవి. పల్చటి వెన్నెల్లో చల్లగాలిలో కాసేపు ఎవరూ ఏం మాట్లాడలేదు.

"అమెరికా ఆలోచన మానేసి ఇలా పల్లెటూర్లో ఉండిపోవాలని ఉంది. ఎంత ప్రశాంతంగా హాయిగా ఉందో" అన్నాడు రాజేష్.

"మీరు ఇక్కడే సెటిల్ అవ్వాలని ఎలా అనుకున్నారు రవిగారు" అడిగాడు రఘు.

"నాకు ముందునుండి వ్యవసాయం అంటే ఇష్టం. అందుకే ఏజీ. ఎమ్.ఎస్సి చేశాను. వ్యవసాయం చేయటం నా చిన్నప్పటిలా లేదు మారిపోయింది. కల్తీ విత్తనాలు. కల్తీ మందుల ప్రభావంతో పంట చేతికి రాకపోవటం పెట్టిన పెట్టుబడి వెనక్కి రాకపోవటంతో చిన్నరైతుల ఆత్మహత్యలు పట్నంకు వలసవెళ్ళే వాళ్ళు ఎక్కువ అవటంతో దొరకని కూలీలు పెరిగిన కూలీరేట్లు. ఒకటా రెండా ఎన్నో సమస్యలు"

"ఏడు ఏళ్ళ క్రితం ఎమ్.ఎస్‌సి అయిన తర్వాత నేను ఏదన్నా ప్రభుత్వ ఎగ్రికల్చర్ డిపార్టుమెంట్‌లో పనిచేద్దాం. లేదా సివిల్స్‌కి ట్రై చేద్దాం. చేతిలో పవరుంటే ప్రజలను బాగా ఎడ్యుకేట్ చేయవచ్చు. ఆధునిక వ్యవసాయ పద్దతులను నేర్పించవచ్చు అని చాలా ఆదర్శంగా అనుకున్నా. కానీ వాస్తవం చాలా భిన్నంగా అయ్యింది.

"చదువు అయిన తర్వాత ఇంటికి వచ్చినప్పుడు నాన్నగారు జబ్బుపడ్డారు. హార్ట్ ఎటాక్ వచ్చింది. అప్పుడే డయాబెటీస్ కూడా బైట పడింది. నాన్న ఆరోగ్యం బాగోకపోవటంతో, వ్యవసాయం ఇలాంటివి అన్నీ చూడటం మొదలెట్టాను. దాంతో సమస్యల గురించి బాగా తెలిసింది.

ఇంట్లో పనులు చేసేవాళ్ళు దొరకటం లేదు. దాంతో ఇంట్లో పాడిగేదెలు ఉండే రోజులుపోయి పాలు కొనుక్కునే రోజులు వచ్చాయి. కూలీలు దొరక్క కూలీ రేట్లు గిట్టక వ్యవసాయం మానేసిన వాళ్ళను చూశాను.

పిల్లలు సిటీలలో ఇరుకుగదుల్లో కాపురం ఉండటానికి ఇష్టపడుతున్నారు కానీ పల్లెటూరు రావటంలేదు. దాంతో ఓ గ్రూపులాగా ఫార్మ్ చేసి కూలీ వాళ్ళ సమస్యలు తెలుసుకుని నెమ్మదిగా చిన్న చిన్న మార్పులు కోసం ప్రయత్నించటం మొదలెట్టాం."

"పంటలు సరిగ్గా పండకపోవటానికి కారణం కల్తీ ఎరువులు, విత్తనాలు నాణ్యమైన వాటి గురించి అవేర్‌నెస్, ఆర్గానిక్ ఎరువు తయారు చెయ్యటం రెగ్యులర్‌గా వ్యవసాయం అధికారులతో మీటింగ్స్ ఆ టైమ్‌లోనే ఇక్కడ తెలిసిన వాళ్ళ పిల్లలు ఓ ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్స్ ఉద్యోగాలు పోయి వేరే జాబ్స్ దొరక్క ఇంటికి వచ్చారు. వాళ్ళను ఒప్పించి కొంత భూమి లీజ్‌కి తీయించి లోన్స్ వచ్చేటట్లు చేసి వ్యవసాయం డెయిరీ ఫార్మ్ ఓపెన్ చేయించాను.

"ఇక అందరూ బలవంతం చేసి ప్రెసిడెంట్‌గా నిల్చోపెట్టారు. ఏదో ఇలా నడుస్తుంది. కానీ రావాల్సిన మార్పు ఇంకా చాలా ఉంది" అన్నాడు రవి.

"చాలా సేపు మాట్లాడాను. రండి స్నాక్స్ తీసుకుందాం" అని టేబుల్ దగ్గరకు తీసుకెళ్ళాడు. అక్కడ జున్ను, పళ్ళు, జిలేబి, పెట్టి ఉన్నాయి.

"జున్ను చాలా బాగుంది" అన్నారందరూ తింటూ.

"చాలా బాగుంది వెన్నెల్లో కూర్చుని ఇలా కబుర్లు చెప్పుకోవటం" అంది రాధిక.

"అంజలి ఇప్పుడన్నా ఒక పాట పాడవా ప్లీజ్. నేను రేపు వెళుతున్నాను. మళ్ళీ ఎప్పుడు చూస్తానో నీ పాట ఎప్పుడు వింటానో" అన్నాడు వివేక్. అందరూ అతన్ని సమర్థించారు.

"ముందు తెలిసెనా ప్రభూ.. .మందిరమిటులుంచెనా" మృదువుగా పాడింది.

ఎంత బాగుందో ఈ వాతావరణంలో ఈ పాట అంది లక్ష్మి.

"ఏదన్నా హిందీ పాట పాడు" అన్నాడు రఘు.

"ఇక చాలు" అంది అంజలి.

"మొన్న సముద్రం దగ్గర తప్పించుకున్నావుగా పాడాల్సిందే" అన్నాడు వివేక్.

చేతివేళ్ళ వంక చూస్తూ నెమ్మదిగా "ఛూకర్ మేనే మన్‌కో కియా తూనే క్యా ఇషారా" పాత హిందీ పాట పాడింది.

పాట అయిపోయిన తర్వాత కూడా ఎవ్వరూ మాట్లాడలేదు.

అంత బాగా పాడుతుందని అనుకోలేదు రవి. పాట భావం. ఇంకా నచ్చింది రవికి.

"ఇంకేవన్నా" అన్నాడు వివేక్.

"ఇంక చాల్లే ఇవాల్టికి" అంది అంజలి.

"కాసేపు పేక ఆడుకుందామా?" అన్నాడు రవి.

"అందరూ ఒప్పుకున్నారు. "నేను ఆడను. నాకు రాదు" అంది అంజలి.

"సరే వద్దు అయితే నువ్వు బోర్ ఫీల్ అవుతావు" అన్నాడు రవి.

"పర్లేదు మీరు ఆడుకోండి నేను ఏమన్నా బుక్ తెచ్చుకోనా మీ రూమ్‌లోంచి" అంది అంజలి.

"పర్లేదు. ఏది నచ్చితే అది తెచ్చుకో పేక పంచండి" అన్నాడు రవి.

ఎన్నో మంచి పుస్తకాలు ఉన్నాయి లోపల. తెలుగు... ఇంగ్లీషు. "అమృతం కురిసిన రాత్రి, ఆనందో బ్రహ్మ, వెన్నెల్లో ఆడపిల్ల, అసమర్థుని జీవితయాత్ర, ఇలా ఎన్నో

"చాలా బాగా పాడావు అంజలి" వెనకునుండి వినిపించే సరికి ఒక్కసారిగా ఉలిక్కిపడి గబుక్కున వెనక్కి తిరిగటంతో కాలు మెలికపడి పడబోయింది అంజలి. గబుక్కున పట్టుకున్నాడు రవి.

"సారీ భయపెట్టానా?" అంటున్నాడు రవి. కానీ ఏమీ అర్థంకావటంలేదు అంజలికి. రవి ఇంత దగ్గరగా నిల్చుంటే ఊపిరి ఆగిపోతున్నట్లుగా గుండె పదింతల వేగంగా ఎందుకు కొట్టుకుంటుంది ఏమవుతుంది తనకు.

నెమ్మదిగా చెయ్యి వదిలి "అంజలి?" అన్నాడు రవి.

"ఏమైంది? ఏమీలేదు" తడబడుతూ చెప్పింది అంజలి.

"ఏమన్నా బుక్ నచ్చిందా?" అడుగుతున్నాడు రవి

"ఇంకా చూడలేదు. చూసి వస్తాను" అని వెనక్కి తరిగింది.

వెనక్కి తరిగి చూసుకుంటూ గది బైటకు రవి రావటం వివేక్ చూశాడు. రవి మొహం మీద చిరునవ్వు చూసి కోపం వచ్చింది.

"ఇంకా అంజలికి బుక్ దొరకలేదా?" కాజ్యుల్‌గా అన్నట్లుగా అడిగాడు వివేక్.

"తనకు బుక్స్ అన్నా, పాటలన్నా చాలా ఇష్టం. బహుశా తన గురించి నాకంటే ఇంకెవరికి ఎక్కువ తెలియదేమో మేమిద్దరం బాగా క్లోజ్."

రవితో ఇదంతా ఎందుకు చెపుతున్నాడు వివేక్ అని వింతగా తనవంక చూశాడు రఘు.

మాట మార్చటానికి "రవిగారు మా పెళ్ళి కార్డ్స్ రాగానే పంపుతాను. పెళ్ళికి తప్పకుండా రావాలి" అన్నాడు రఘు.

"తొందరలోనే అంజలికి నాకు కూడా పెళ్ళి అవుతుందనుకుంటా" అన్నాడు మళ్ళీ వివేక్.

ఏంటి వివేక్ ఇలా పిచ్చిగా మాట్లాడుతున్నాడు, అనుమానంగా చూశాడు రఘు. కానీ వివేక్ కావాలని రవికి ఇదంతా చెపుతున్నాడని అర్థంకాలేదు వాళ్ళకు.

"రవిగారు మీరు తప్పకుండా రావాలి ఆ పెళ్ళికి" అంది రాధిక ఇంతలో అంజలి బైటికి వచ్చి వీళ్ళ దగ్గర కూర్చుంది. కబుర్లు చెప్పుకుంటూ కాసేపు పేకాట ఆడారు.

"అమ్మో పదకొండున్నర అయ్యింది ఇంక ఇంటికి వెళదామా" అంది అంజలి.

"చాలా థాంక్స్ మంచి డిన్నర్‌కి, ఇంక సముద్రం దగ్గరకు తీసుకెళ్ళినందుకు" అంది నవ్వుతూ అంజలి.

"రేపు మీరు బయలుదేరే టైమ్‌కి వచ్చి కలుస్తాను" అని గేటు బైటదాకా వచ్చివాళ్ళను పంపాడు రవి.

పైకి వెళ్ళి కుర్చీలో కూర్చుని ఆలోచిస్తూ ఉండిపోయాడు. అంజలి గురించి తర్వాత వివేక్ గురించి వివేక్ మాటలను అర్థం చేసుకోలేనంత చిన్నవాడు కాదు తను. కానీ తనను చూసినప్పుడు అంజలి కళ్ళల్లో కనిపించే మెరుపు. కేవలం తన ఊహ? ఎందుకు ఈ పరీక్ష. చాలా చిరాగ్గా, అసహనంగా అనిపించింది రవికి.

"మీ ఊరు, మీ ఆతిథ్యం చాలా బాగుంది ఆంటీ" అందరూ అన్నపూర్ణతో అన్నారు.

అందరికీ బట్టలు పెట్టి, సున్నుండలు, కజ్జికాయలు అందరికీ పాకెట్స్‌లో పెట్టి ఇచ్చారు ఆవిడ.

"లేవండి బస్ టైమ్ అవుతుంది" అన్నారు సీతారామయ్య.

"మీరు వద్దులే నాన్న. నేను వెళ్ళి దింపేస్తాను" అంది అంజలి.

"వచ్చేటప్పుడు ఒక్కదానివి రావాలి కదా" అన్నపూర్ణ అంది.

"ఎంత దూరం? రెండు బజార్లకు భయమా? ఇప్పటికే పది అయ్యింది. నాన్న మందులు వేసుకుని పడుకోవాలిగా" అంది అంజలి.

అందరూ బస్టాండుకు బయలుదేరారు. వెళ్ళేటప్పటికి రవి ఉన్నాడు అక్కడ.

"మేము మా ప్రొఫెసర్‌తో మట్లాడాం ఇవాళ్ళ ప్రొద్దున. మెడికల్ కాంప్, ఫ్రీ ఐ ఎగ్జామ్‌కు ఏర్పాటు చేస్తామన్నారు" అన్నాడు రాజేష్.

"మీరందరూ నవ్వినా సరే. నా అమెరికా ప్లాన్ కాన్సిల్ చేసుకుందామని ఉంది."

''వద్దు రాజేష్ అమెరికా వెళ్ళండి. అలాంటి దేశాలు వెళితేనే కదా, టెక్నాలజీ ఎంత పెరిగిందో నేర్చుకునేది. కావాలంటే కొంత కాలం అయ్యాక వెనక్కి రండి'' అన్నాడు రవి.

అంతలోకి బస్ వచ్చింది. వెళ్ళేముందు వివేక్ ''ఫోన్ చేస్తాను అంజలి. నేను చెప్పిన దాని గురించి ఆలోచించు'' అన్నాడు.

రవి ముందు ఈ మాటలు ఇబ్బందిగా అనిపించింది అంజలికి.

బస్సు బయలుదేరింది ''పద మీ ఇంటి దగ్గర దింపుతాను'' అన్నాడు రవి.

మళ్ళీ మీరు మాత్రం ఒంటరిగా వెళ్ళాలి కదా వద్దు నేను వెళతాను''

''లేదు..లేదు.. పద ఒక్కదాన్ని ఎలా పంపుతాను?'' అన్నాడు నెమ్మదిగా నడుస్తున్నారు.

ఇద్దరూ వెన్నెల్లో మౌనంగా ''మీ ఫ్రెండ్స్‌తో బాగా కాలక్షేపం అయ్యిందనుకుంటా మిగతా హాలీడేస్‌లో ఏం చేద్దామని ప్లాన్'' అన్నాడు.

''సంఘంకి వెళతాను. ఉమెన్ ఎంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్స్ గురించి ఇంటర్‌నెట్‌లో చూశాను. డ్వాక్రాలాంటివి మొదలెట్టవచ్చుకదా''

''డ్వాక్రా మొదలుపెడదామని ప్రయత్నించాం. కానీ ఎవ్వరూ పెద్ద ముందుకు రాలేదు. ఇంకా వేరే సమస్యలుండటంతో నేనూ పట్టించుకోలేదు'' అన్నాడు.

**''నేను ఎలా** ప్రోగ్రెస్ అవుతుందో మీకు ఫోన్ చేసి చెపుతాను'' అని '' ఫోన్ చేయచ్చు కదా అప్పుడప్పుడు'' అంది.

''అదేంటి కొత్తగా? అయినా నేనే కదా ఎప్పుడూ ఫోన్ చేసి విసిగించేది. ప్రొద్దునా సాయంత్రం'' చిన్నగా నవ్వాడు. ఇల్లు దగ్గరకు వచ్చింది.

''అంజలి నిన్నొకటి అడగనా?'' చిన్నగా అన్నాడు రవి.

''ఏంటి?''

ఓ క్షణం అంజలి వంక చూసి ''ఏం లేదు ఇప్పుడు కాదులే. గుడ్‌నైట్'' అన్నాడు.

''పర్లేదు అడగండి. లేకపోతే నాకు ఇవాళ నిద్రపట్టదు'' నవ్వింది అంజలి.

''లేదు. ఇంకెప్పుడైనా లోపలికి వెళ్ళి తలుపు వేసుకో'' అన్నాడు.

అంజలి లోపలికి వెళ్ళేదాకా చూసి బయలుదేరాడు. ఏంటి ఈ పిచ్చితనం. వివేక్ గురించి అడుగుదామనా! ఏముంది అడగటానికి క్లియర్‌గా అర్థం అవుతుంది వాళ్ళిద్దరూ ఒకరినొకరు ఇష్టపడుతున్నారని. అనవసరంగా జీవితాన్ని కాంప్లికేట్ చేసుకోవద్దు.

రోజులు నెమ్మదిగా గడిచిపోతున్నాయి అంజలికి. రవి అప్పుడప్పుడు ఫోన్ చేస్తున్నాడు. అంజలి కూడా పాలెం ఆడవాళ్ళ మీటింగ్, ఊళ్ళో మీటింగులతో బిజీగానే ఉంది. మండలాల్లోని డ్వాక్రా గ్రూపులతో మాట్లాడి ఊళ్ళో కూడా డ్వాక్రా గ్రూపులను మొదలెట్టారు. అందరూ పొదుపు కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

అంజలి పి.జి రిజల్ట్స్ వచ్చాయి. రవి ఫోన్ చేసి చెప్పింది.

''కంగ్రాట్స్. ఎక్కడ జాయిన్ అవుతావు?'' అన్నాడు.

"హైదరాబాద్‌లోనే అనుకుంటున్నాను. రాంక్ బాగానే వచ్చింది. జనరల్ సర్జరీలో చేద్దామనుకుంటున్నాను. ఉస్మానియా మెడికల్ కాలేజ్‌లో రావచ్చు" అంది అంజలి.

"వేరే స్పెసిఫికేషన్స్ ఏమన్నా చేస్తావనుకున్నాను అంజలి. ఏంటి అంత మంచి రాంక్ వచ్చి."

"నాకు ఈ ఊళ్ళోనే ఉండాలని ఉంది. సిటీలో ప్రాక్టీస్ చేయను. ప్రసాద్ డాక్టర్‌గారితో మాట్లాడాను. ఆయన హాస్పిటల్లో గైనిక్ ఉన్నారు, పిల్లల డాక్టర్ ఉన్నారు జనరల్ సర్జన్ అవసరం."

"ఈ ఊళ్ళో సెటిల్ అవుతావా! మరి వివేక్ ఒప్పుకున్నాడా ఇక్కడికి రావటానికి?" గబుక్కున అడిగాడు రవి.

"వివేక్ ఎందుకొస్తాడు ఇక్కడికి?"

తడబడుతూ "సారీ పర్సనల్ విషయాలు అడిగినందుకు. నీకూ వివేక్‌కి పెళ్ళి అని" రవిని సాంతం మాట్లాడనీయకుండా "ఎవరన్నారు మా ఇద్దరికీ పెళ్ళి అని?" కొంచెం గట్టిగా అంది అంజలి.

"సారీ అంజలి నిన్ను ఇబ్బంది పెట్టాను. నేనే మిస్సండర్‌స్టాండింగ్ చేసుకున్నానేమో"

"లేదు. ముందు ఎవరన్నారో చెప్పండి"

"మా ఇంట్లో డిన్నర్ రోజున వివేక్ అన్నాడు. త్వరలో మీ పెళ్ళి కూడా అవుతుందని."

"లేదు. మేమిద్దరం ఫ్రెండ్స్ అంతే. తనేమనుకున్నాడో నాకు సంబంధం లేదు. నేను మీతో మళ్ళీ మాట్లాడతాను" ఫోన్ పెట్టేసింది అంజలి.

చాలా చిరాగ్గా, కోపంగా ఉంది అంజలికి. వివేక్ ఇంత స్టుపిడ్‌గా ఎలా చేయగలిగాడు. నేను స్పష్టంగా చెప్పాక కూడా. అందుకే రవి నాతో ముభావంగా ఉంటున్నాడా. వివేక్ వాళ్ళు వెళ్ళాక నన్ను ఇంతవరకూ కలవలేదు. రెండు వారాలయిపోయింది.

రాధికకు ఫోన్ చేసింది అంజలి. "రాధీ నీకు తెలుసా వివేక్ ఏం అన్నాడో మా ఇద్దరికి పెళ్ళి అన్నట్లుగా రవితో అన్నాడంట"

రాధికకు అర్థం అయ్యింది అంజలికి బాగా కోపం వచ్చిందని. "నువ్వు అప్‌సెట్ అవుతావని చెప్పలేదు అంజలి. నువ్వు రవిగారి గదిలో ఉన్నప్పుడు వివేక్, రవితో చెప్పాడు మీ ఇద్దరూ చాలా క్లోజ్ అని, త్వరలో మీ పెళ్ళి కూడా అవ్వొచ్చని. ఏంటీ ఇలా మాట్లాడుతున్నాడు అనుకున్నాం మేం" అంది రాధిక.

"రఘు చెప్పాడు మీ నాన్నగారితో కూడా చెప్పాడంట, నువ్వంటే ఇష్టం అని."

"ఓసారి అమ్మ నన్ను అడిగింది. నేను 'నో' అని చెప్పాను. కానీ రవితో చెప్పాల్సిన అవసరం ఏమొచ్చింది? ఎంత కోపంగా ఉందో" అంది అంజలి.

"వదిలేయ్ అంజలి. ఏదో తన తిప్పలు తను పడుతున్నాడు నిన్ను ఒప్పించటానికి. ఒకటడగనా! రవిగారితో చెప్పినందుకు నీకెందుకింత కోపం వచ్చింది. నువ్వు తనను ఇష్టపడుతున్నావా?" అంది రాధిక.

ఓ క్షణం ఏమీ మాట్లాడలేదు అంజలి. "తెలియదు చిన్నగా అంది. అంటే అతనంటే గౌరవం. ఇంకా ఏమన్నానేమో తెలియటంలేదు."

నవ్వింది రాధిక "కంగ్రాట్స్. నువ్వు కూడా ప్రేమలో పడ్డందుకు. మొదట్లో ఇలానే ఉంటుంది. ఇందాక నీ కోపం చూసి నాకయితే స్పష్టంగా అర్థం అయ్యింది. ఇంకా రెండు మూడు నెలలు అక్కడ ఉంటావుగా కన్‌ఫ్మాం చేసుకో"

"ఛ అదేం లేదు ఊరుకో" మాటమార్చింది అంజలి.

"రిజల్ట్స్ వచ్చాయిగా ఎక్కడనుకుంటున్నారు?

"ఇద్దరం ఇక్కడే ఉందామనుకుంటున్నాం. మద్రాసులో చేద్దామని రఘుకి ఉంది కానీ హైదరాబాదు అయితే అందరికీ దగ్గర్లో ఉండొచ్చు అని డిసైడ్ అయ్యాం"

రవికి గిల్టీగా అనిపించింది. అంజలిని ఇబ్బంది పెట్టాను అని ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఎంగేజ్డ్ వస్తుంది. వివేక్‌కి కానీ ఫోన్ చేసి తిట్టటం లేదు కదా! పోనీ రేపు మాట్లాడతాను. తను కొంచెం నెమ్మదిస్తుందేమో. చాలా కోపం వచ్చినట్లుంది. కానీ తనతో మాట్లాడకపోతే నాకు నిద్రపట్టేట్లు లేదు. ఏం చేయాలి? డాబా మీద నిల్చొని ఆలోచిస్తున్నాడు రవి. చుట్టూ నిశ్శబ్దం. మనసులో అలజడి. తనకెందుకీ ఆలోచనలు. తన ప్రాజెక్ట్ గురించి అంజలికి చెపుదామనుకుని వివేక్ సంగతి ఎందుకు మాట్లాడవలసి వచ్చింది?

ఫోన్ మోగింది... అంజలి నుండి.

"అంజలి" అన్నాడు

ఏం మాట్లాడలేదు అంజలి

"కోపం వచ్చిందా?"

"లేదు. అంటే మీ మీద కాదు. మాట్లాడుతూ హ్యాంగ్ అప్ చేశాను సారీ" అంది అంజలి.

"ఇంతకీ ఎవరిని తిట్టేశావో చెప్పు కోపం తగ్గినట్లుంది" అన్నాడు నవ్వుతూ.

"వదిలేయండి"

"సర్లే నీకింకో విషయం చెపుదామనుకున్నాను. నేను ఓ ప్రాజెక్ట్ ప్లాన్ చేస్తున్నా కదా. అదేంటంటే పాలెంలో అందరికీ పక్కా ఇళ్ళు కట్టించటం. విడిగా కాకుండా రెండు ఫ్లోర్స్ అపార్ట్‌మెంట్‌లాగా ఖర్చు కలిసి వస్తుంది. ఒకో అపార్ట్‌మెంట్‌లో నాలుగు ఇళ్ళు ఉంటాయి. తక్కువ ఏరియాలో ఎక్కువ ఇళ్ళు కట్టించవచ్చు. స్థలం కాకుండా ఒకో ఇంటికి నాలుగు లక్షలు అవుతుంది. ప్రభుత్వం బంజరు భూమిని కేటాయిస్తే అక్కడ కట్టిద్దామని తిరుగుతున్నాను. అది సాంక్షన్ అయ్యింది."

"ప్రక్కనే గురువుపాలెం. మన ఊళ్ళో కలిపి 75 ఇళ్ళు కావాలి. గవర్నమెంటు దగ్గర్నుండీ కేవలం స్థలం వరకే శాంక్షన్ అయ్యింది. ఒక కాంట్రాక్టర్ కూడా దొరికాడు కానీ ఇళ్ళకోసం డబ్బు తొందరగా శాంక్షన్ అయ్యేట్లు లేదు" అన్నాడు.

"కంగ్రాట్స్. అందుకేనన్నమాట నన్ను కలవట్లేదు ఈ మధ్య" గభాల్న అని నాలిక్కరచుకుంది అంజలి

"అంటే బాగా బిజీగా ఉన్నారు కదా..అని"

"పోనీ ఇంటికోసం లోన్‌లాగా తీసుకుంటే" అంది అంజలి.

"ఏ భరోసాతో లోన్ ఇస్తారు బ్యాంక్ వాళ్ళు"

"సర్లెండి ఆలోచిద్దాం ఏదో ఐడియా వస్తుంది" అంది అంజలి.

"రేపు కలుస్తాను. ప్లాన్ చూపిస్తా. గుడ్‌నైట్" ఫోన్ పెట్టేశాడు రవి.

సాయంత్రం రవి వచ్చేసరికి వరండాలో కూర్చుని మల్లెపూలు కడుతూ సీతారామయ్యగారితో మాట్లాడుతుంది అంజలి.

"రా రవి నీ గురించే చెపుతోంది అంజలి. ఇళ్ళసంగతి మంచి ఆలోచనే కానీ నీకు ఇంకో విషయం చెప్పాలి అన్నారు సీతారామయ్య.

"ఊళ్ళో బోసు బాబు ఓ గుంపును తయారు చేస్తున్నాడు. నువ్వంటే పడనివాళ్ళతో. ఈ డ్వాక్రా కార్యక్రమం బాగా నడవటం ఆడాళ్ళు ఇళ్ళల్లోనే పచ్చళ్ళు, పిండివంటలు బిజినెస్సులు మొదలుపెట్టడంతో నువ్వు ఎక్కడ గొప్పొడివైపోతావని కుళ్ళు కాబోలు. అదీకాకుండా నువ్వు వెనుకబడిన తరగతుల వాళ్ళను ఎక్కువ పట్టించుకుంటున్నావని నిన్ను ఇక్కడ్నుంచి దించటానికి చూస్తున్నారు" మళ్ళీ ఏమన్నా గొడవలవుతాయేమో జాగ్రత్తగా ఉండు" అన్నారు."చూద్దాం రండి ఏం చేస్తాడో. అది కాదు ముఖ్యం ముందు పక్కా ఇళ్ళు కట్టించాలి. డబ్బు రెడీ అయితే మూడు నెలల్లో కట్టించొచ్చు అన్నాడు రవి.

"నాకో ఐడియా వచ్చింది. మేము కాలేజీలో దేనికన్నా డబ్బులు కలెక్ట్ చెయ్యాలంటే ఫండ్ రైజింగ్ చేస్తాం ఎవరినన్నా పిలిచి ప్రోగ్రామ్ పెట్టించి దాని టిక్కెట్స్ బాగా ఖరీదుకు అమ్ముతాం. పైగా ఇంకా విరాళాలు ఇమ్మని అడుగుతాం. కొంత డబ్బు ఇలా సమకూరితే మిగతాది లోన్ తీసుకోవచ్చేమో?" అంది అంజలి.

"పల్లెటూళ్ళో విరాళాలు ఎవ్వరూ ఇవ్వరమ్మా. ఇదివరకట్లా కాదు రైతులు ఆర్థికంగా చితికిపోయారు. పదో పరకో అయితేకానీ" నిరాశగా అన్నారు సీతారామయ్య.

"అలా అనకు నాన్న. మన ఊళ్ళో వాళ్ళ పిల్లలు చాలామంది అమెరికాలో, విదేశాల్లో ఉన్నారు. వాళ్ళు ఊరికి చేస్తున్నాం అని సాయంచేయచ్చు కదా ప్రయత్నం చెయ్యకపోతే ఎలా తెలుస్తుంది" అంది అంజలి, "రవిగారు మీరు మాట్లాడట్లేదేంటి?

"ఐడియా బాగానే ఉంది. కొంచెం ఆలోచించాలి దీని గురించి" అన్నాడు రవి.

"మన (రంగారావుగారి అబ్బాయి) సతీష్ ఇక్కడ కోళ్ళఫారం, పుట్టగొడుగులు ఫార్మ్ పెడదామని లోన్ కోసం ప్రయత్నిస్తున్నాడు. మీ వీరయ్య వాళ్ళకు చెప్పండి మంచి నమ్మకమైన పనివాళ్ళు కావాలి. వాళ్ళ పిల్లలు అందరూ పట్నంలో కూలీ పనికి వెళ్ళిపోయారు ఏమన్నా తిరిగి వస్తారేమో కనుక్కోండి" అన్నాడు రవి "నేను ఈలోపల ఈ ఇళ్ళ ఫైనాన్స్ గురించి ఆలోచిస్తాను"

ఇక బయలుదేరతానని లేచాడు రవి. బైటకు సాగనంపటానికి గేట్ దాకా వచ్చింది అంజలి.

"వచ్చే వారం హైదరాబాదు వెళుతున్నా, కాలేజీకి పనులు గురించి" అంది.

"ఎన్నాళ్ళుంటావు?

"ఓ వారం ఉంటానేమో రాధి గొడవ చేస్తుంది. తనకు పెళ్ళి షాపింగ్‌లో హెల్ప్ చేయమని"

రవి ఇంటికి వెళ్ళేసరికి అతని మేనమామ రంగారావు కూర్చుని ఉన్నాడు సావిత్రితో మాట్లాడుతూ రవిని చూడగానే "రా అల్లుడూ బొత్తిగా కనిపించటం మానేశావు. పెద్దోడివి అవుతున్నావు"

"బాగున్నారా అందరూ" కొంచెం ముభావంగా అడిగాడు రవి "పద్మ కూడా వచ్చింది అల్లుడూ. అందరికీ టీ పెడుతుంది లోపల ఎక్కడికి వచ్చినా ఒక్క క్షణం కూర్చోదు. నా కూతురని కాదు గాని ఎంత పనిమంతురాలో" గొప్పగా చెప్పాడు.

ఎట్లాగయినా పద్మని, రవికి ఇచ్చి పెళ్ళిచేద్దామని ఆయన ఆలోచన.

"అమ్మ నేను టీ తాగి వస్తున్నాను. నాకు వద్దు, నాకు కొంచెం పని ఉంది నా గదికి వెళుతున్నా" అని రవి పైకి వెళ్ళిపోయాడు.

"ఎంతసేపయ్యింది వచ్చి" అంటూ లోపలికి వచ్చారు చంద్రశేఖరావు.

"ఇప్పుడే ఓ అరగంటయ్యింది బావా ఏంటి మన రవి పేరు చుట్టుపక్కల మారుమోగిపోతుంది. ఎం.ఎల్.ఏ గారికి చాలా క్లోజ్ అంట. ఇక తర్వాత ఎం.ఎల్.ఏగా మన రవి పోటీ చేస్తే తప్పకుండా గెలుస్తాడు" పొగుడుతున్నట్లుగా అన్నాడు రంగారావు.

"అవన్నీ ఉత్త గాలి కబుర్లు కానీ పట్టించుకోకు" లోపల్నుండి టీ తీసుకుని పద్మ వచ్చింది. లంగా ఓణీ వేసుకుని చిన్నపిల్లలాగా ఉంది.

రంగారావు దగ్గర్లో ఉన్న టౌన్‌లో ఉంటాడు. సావిత్రి వాళ్ళ అన్నయ్య. ఇద్దరు కూతుళ్ళు చిన్నప్పట్నుండి రవికి, పెద్దకూతురు అనితను ఇద్దామనుకున్నారు. అనిత బాగా తెలివిగలది. ఎం.కాం చదివి విజయవాడలో లెక్చరర్‌గా చేస్తుంది.

అనితకి మంచి సంబంధాలు రావటం, రవి పల్లెటూరునుండి కదలననడంతో పంతాలకు పోయి నాలుగేళ్ళ క్రితం అనితకు మంచి సంబంధం చూసి పెళ్ళిచేశారు.

చిన్నకూతురు పద్మకు చదువు ఒంటబట్టలేదు. పదో తరగతి వరకే చదివి ఇంక చదవనని మొండికేసింది. పోనీ పెళ్ళి చేద్దామా అంటే మరీ ఇంత తక్కువ చదువుకుందని మంచి సంబంధాలు రావటం లేదు. దాంతో రాంగారావుకి ఎలాగైనా రవికి ఇచ్చి చేస్తే, పల్లెటూరు, ఆస్తిని కూడా రవి బాగానే చూసుకుంటున్నాడు. మేనత్త కింద సుఖపడుతుందని ఆలోచన చేసి రాకపోకలు ఎక్కువ చేసాడు.

"పద్మా బావపైన ఉన్నాడు. వెళ్ళి టీ ఇచ్చి, మనం తెచ్చిన సున్నుండలు పెట్టిరా" అన్నాడు రంగారావు.

"వాడు ఒద్దన్నాడుగా" అంది సావిత్రి.

"పర్లేదు లేమ్మా. సున్నుండలు పద్మే చేసింది. బాగున్నాయి" అన్నాడు రంగారావు.

మొహం చిట్లించాడు చంద్రశేఖర్రావు. ఆయనకి తెలుసు బావమరిది కీలకాలు, ఆలోచనలు.

"బావా ఈసారి ఏమైనా సరే మీ దగ్గర్నుండి మాట తీసుకునే వెళతాను. పద్మకు రవి అంటే ప్రాణం. ఎన్నాళ్ళని ఇలా పెళ్ళిచేయకుండా కూర్చుంటారు" అన్నాడు రంగారావు.

"పెళ్ళి విషయంలో మేము రవిని బలవంతం చేయము. చెప్పాల్సినవి అడగాల్సినవి ముందే అడిగాము. వాడు మొండికేసాడు. పద్మకు వేరే సంబంధం చూసుకో నువ్వు. అదీకాకుండా పద్మను అసలే చేసుకోనని చెప్పాడు. పద్మకు పద్దెనిమిదేళ్ళు. రవికి 31 చేసుకోనన్నాడు" ఖరాఖండీగా చెప్పారు చంద్రశేఖర్రావు..

"అలా అయితే ఎలా బావా మా అమ్మకూ నాన్నకు పదిహేనేళ్ళు తేడా ఉంది. ఎంత బాగా కాపురం చేశారు. నీకూ మా సావిత్రికి పదేళ్ళు తేడా ఉంది. మీరిద్దరూ బాగోలేదా? అనితను రవికి ఇవ్వలేదని మనసులో పెట్టుకున్నట్లున్నారు. నాదేముంది. అనిత ఆలోచనలు రవితో కలవలేదు. పిల్లల ఆనందమేగా మనకు కావాల్సింది" తెలివిగా అన్నాడు రంగారావు.

"ఇక ఈ విషయం ఇంతటితో ఆపేయ్. సావిత్రీ భోజనాల ఏర్పాట్లు చూడు అన్నారు చంద్రశేఖర్రావు.

"టీ తీసుకో బావ" అంటూ లోపలకు వచ్చింది పద్మ.

రవి కంప్యూటర్ మీద పని చేసుకుంటున్నాడు.

"నేను తాగను వద్దు. ఎలా ఉన్నావు పద్మా?" అన్నాడు రవి.

"బాగానే ఉన్నాను. కంప్యూటర్ మీద ఏం చేస్తావు బావా?" కుతూహలంగా అడిగింది.

"పంచాయితీ పనులు"

"మా ఊళ్ళో కూడా కంప్యూటరు నేర్పే క్లాసులు పెట్టారు" అంది.

"అయితే నువ్వు కూడా నేర్చుకో" అన్నాడు రవి.

"నువ్వు నేర్చుకోమంటే నేర్చుకుంటా బావా" అంది పద్మ.

ఇదంతా మేనమామ ట్రైనింగని అర్థం అయ్యింది. రవికి చిరాకేసి "నాకు కొంచెం పని ఉంది పద్మ, కిందకెళ్ళి, అమ్మని కొంచెం పైకి రమ్మంటావా?" అన్నాడు.

రవి మొహం చూసి కిందకెళ్ళింది పద్మ.

కళ్ళు ముసుకుని, కుర్చీలో వెనక్కి వాలాడు రవి.

"ఏంటి బాబూ ఏమన్నా కావాలా?" అంటూ వచ్చింది సావిత్రి.

"అమ్మా మీ అన్నయ్యకు ఖచ్చితంగా చెప్పు నేను పద్మను పెళ్ళి చేసుకోనని. మనింటికి వస్తే మీ అన్నయ్యగా రమ్మనమను. అంతేకానీ ఇలా సంబంధం తీసుకుని కాదు" గట్టిగా అన్నాడు రవి.

"పోనీ నువ్వు ఎవరినన్నా పెళ్ళి చేసుకుంటే ఈ మాటలు ఆగిపోతాయి. నువ్వేమో అసలు పెళ్ళి మాట ఎత్తవు. మరి ఏం చెయ్యమంటావు?" రాత్రి అక్క ఫోన్ చేసింది. నీ పెళ్ళి గురించే తను కూడా అడిగింది. నీకేమో ఎంతసేపు ఊరిని ఉద్ధరించటానికే టైం సరిపోవటంలేదు." కాస్త కోపంగా అంది సావిత్రి.

"అమ్మా నువ్వు దేనికి దేన్ని ముడిపెట్టి మాట్లాడుతున్నావు? ఇదివరకు ఎన్నిసార్లు చెప్పాను. నేను ఈ ఊరి ప్రెసిడెంట్ అవ్వటానికి, పెళ్ళి చేసుకోకుండా ఉండటానికి సంబంధం లేదు. అయినా నేను పద్మను చేసుకోను. తను ఒక చిన్నపిల్లలాగా ఉంటుంది నాకు. నా మనస్థత్వానికి, తనకు సరిపడదు."

"మరి పెళ్ళి అసలు చేసుకుంటావా లేదా? పల్లెటూరు కాపురానికి ఒప్పుకునే సంబంధాలు కూడా వస్తున్నాయి. నువ్వసలు ఏ సంబంధం గురించి చెప్పబోయినా వినవు. ఎలాగ? ఇలా అయితే" అంది సావిత్రి.

"అమ్మా ఒదిలేయ్. ఒక వయసు వచ్చాక ఎవర్ని పడితే వాళ్ళను పెళ్ళిచేసుకోలేం. నాకు పెళ్ళి ఆలోచన వచ్చినప్పుడు మీకు చెపుతాను సరేనా?" సావిత్రిని శాంతింపచేయటానికి చిన్నగా నవ్వుతూ అన్నాడు రవి.

"నాకు ఈ జీవితంలో ప్రాప్తం ఉందో లేదో నీ పెళ్ళి చూసేందుకు" గొణుక్కుంటూ కిందకు వెళ్ళిపోయింది సావిత్రి.

అంజలి. ఆ పేరు గుర్తొస్తేనే ఎంత హాయిగా ఉంటుంది. అంజలిని ప్రేమిస్తున్నాడతను? అంజలి అంటే ఎందుకో చాలా చాలా ఇష్టం. కానీ తన మనస్సులో ఏముందో కనీసం వివేక్ అయితే లేడని తెలిసిపోయింది. వివేక్, అంజలి పెళ్ళి చేసుకుంటారేమోనన్న ఆలోచన తననెంత బాధించింది. అంజలి పరిచయం అయ్యి ఎన్నాళ్ళయ్యింది తనకు. అంతలోనే ఇంత అనుబంధమా! రోజుకొక్కసారన్నా తనతో మాట్లాడాలని ఎందుకనిపిస్తుంది. నిద్రలేస్తూనే తన ఆలోచన. ఏం చేస్తుందో నిద్రలేచిందో లేదో అని. నిద్రపోవటానికి కళ్ళు మూసుకుంటే కనురెప్పల క్రింద చిరునవ్వుతో అంజలి. ఏంటిదంతా?

అంజలి ఇక్కడే ప్రాక్టీస్ పెడతానంటే ఎందుకంత సంతోషం వేసింది? ఎలా వ్యక్తపరచాలో తెలియక వివేక్ గురించి అడిగాడు. పోనీలే అది అడగటం వల్లే అంజలికి వివేక్ మీదున్న అభిప్రాయం తెలిసింది. అంజలి వ్యక్తిత్వం, మాటతీరు ఎంతో నచ్చింది తనకు, కానీ అంజలి కూడా నన్ను ఇష్టపడాలిగా.

వివేక్ గురించి చాలా ఏళ్ళుగా తెలుసు, బాగుంటాడు, తెలివిగలవాడు. అయినా కాదన్నది. నేను నచ్చుతానని ఏంటి గ్యారెంటీ. అసహనంగా అనిపించింది రవికి. నిద్రపట్టటం లేదు, రాత్రి పది అయ్యింది. రేపు పొద్దున్నే పొలం వెళ్ళాలి.

ఫోన్ మ్రోగింది. అంజలి చేసింది.

"నిద్రలేపేయలేదు కదా" మొహమాటపడుతూ అడిగింది. మళ్ళీ తానే "నిద్రలేపి పిచ్చి క్వొశ్చెన్స్ అడగటమంటే ఇదే"

రవి నవ్వాడు, "లేదు నిద్రరావటంలేదు. బైట డాబా మీద కూర్చున్నా. ఏమన్నా చెప్పాలా?"

"నాకూ నిద్రరావటం లేదు. ఏం చేయాలో తోచక మీకు చేశాను" అంది.

"సరే అయితే నిద్ర వచ్చేదాకా కబుర్లు చెప్పుకోవచ్చు. నేను ఫండ్ రైజింగ్‌కి, ఫారిన్‌లో ఉన్న మన ఊరి వాళ్ళకు ఈమెయిల్ పంపుదామనుకుంటున్నాను. కొంతమంది అన్నా పంపకపోతారా. అదీ కాకుండా మన ఊళ్ళో కూడా మీటింగు పెట్టి అందరి అభిప్రాయం అడుగుతాను. బ్యాంక్ వాళ్ళను కూడా అడుగుతాను" అన్నాడు రవి.

అబ్బా.. ఓ ఆడపిల్ల అర్ధరాత్రి ఫోన్ చేసి మాట్లాడుతుంటే ఇంకేమీ లేవా కబుర్లు చెప్పటానికి? ఇంత మొద్దబ్బాయేంటి?

"రేపు మన సబ్ కలెక్టర్‌గారి దగ్గర అపాయింట్‌మెంట్ తీసుకున్నాను. గవర్నమెంట్ ప్రోగ్రామ్స్ కొన్ని ఉన్నాయి. ఇళ్ళు రుణాలు ఇవ్వటానికి, దాని గురించి మాట్లాడాలి" మళ్ళీ తనే అన్నాడు.

" హైదరాబాదు నుండి వచ్చిన తర్వాత రాత్రిపూట స్కూల్‌కి నేను కూడా వెళ్ళతాను" అంది అంజలి.

"వద్దు అంత రాత్రి పూట ఎందుకు? వారానికి ఒకరోజు ఎటూ మీటింగ్ కోసం వెళుతున్నావుగా. ఇట్స్ నాట్ సేఫ్" అన్నాడు రవి.

"మన ఊళ్ళో సేఫ్ కాదా? అదెప్పట్నుండి?" ఆశ్చర్యంగా అడిగింది అంజలి.

"అంటే మన జాగ్రత్తలో మనం ఉంటే మంచిది కదా. అయినా ఊరునుండి వచ్చాక మాట్లాడుకోవచ్చులే"

"ఎందుకు ఇలా అంటున్నారు. ఏమైంది?"

"నా అనుమానాలు నాకున్నాయి వదిలేయి. ఇంకేమన్నా చెప్పు" అన్నాడు రవి.

"మీరు పుస్తకాలు బాగా చదువుతారేమో! ఎవరివి ఎక్కువ చదువుతారు?" మాట మారుస్తూ అడిగింది అంజలి.

పుస్తకాల గురించి, కాలేజీ గురించి మాట్లాడుకుంటూ ఉండిపోయారు. ఎంతసేపు అలా మాట్లాడుకున్నారో ఇద్దరికీ తెలియలేదు. "బాబోయ్ 1.30 అయింది టైం. సారీ టైం చూసుకోలేదు" టైం చూసి ఉలిక్కిపడిన అంజలి అంది.

"నాకు టైం తెలియలేదు. గుడ్ నైట్" చిన్నగా నవ్వి అన్నాడు రవి.

"అయ్యగారూ నారాయణగారు పురుగుల మందు తాగారంట ఆస్పత్రికి తీసుకెళ్ళారంట" కంగారుగా వచ్చి చెప్పాడు రంగయ్య.

"అయ్యో అదేంట్రా ఎప్పుడు జరిగింది?" అడిగాడు సీతారామయ్య "పొద్దునంటయ్య బజార్లో చెప్పుకుంటున్నారు."

"పూర్ణా నేను హాస్పిటల్‌కి వెళతాను" అని హడావుడిగా బయలుదేరారు.

"ఏ అఘాయిత్యం అవ్వకుండా ఉంటే బాగుండు. దేవుడా" బాధగా అనుకున్నారు అన్నపూర్ణ.

మధ్యాహ్నం రెండు అవుతుండగా నెమ్మదిగా వచ్చారు సీతారామయ్య తిన్నగా పంపు దగ్గరకు వెళ్ళి నీళ్ళు తలమీదనుండి పోసుకుని లోపలకు వచ్చారు.

తడిచి లోపలకు వస్తున్న ఆయనను చూసి "అయ్యో రామా పోయాడా?" అంది అన్నపూర్ణ

ఆశమంలో 'చేతన' మీటింగు నుండి అప్పుడే వచ్చింది అంజలి. "ఎవరో పోయారంట. ఆడాళ్ళందరూ అటు వెళ్ళారు. మీటింగు లేదు అని"

"మన ఊళ్ళోనే ఉంటాడు చిన్న రైతు. ఉన్న 5 ఎకరాలతో ఎలాగో ఇబ్బందులు పడుతూ పిల్లల్ని చదివించాడు. ఇద్దరాడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు. వాళ్ళ కాళ్ళమీద వాళ్ళు నిలబడతారని ఆశపడ్డా. రెక్కలొచ్చాక వాళ్ళ స్వార్థం వాళ్ళు చూసుకున్నారు"

"మూడేళ్ళ నుండి సకాలంలో వానలు పడక పంటలు సరిగ్గా పండలేదు. పండిన పంటలకు గిట్టుబాటు ధర రాలేదు. ప్రభుత్వం పైకి పేపర్లలో ఆ పథకాలు, ఈ పథకాలు అని ప్రకటనలు చేస్తుంది. రైతులు ఆత్మహత్యలు చేసుకున్నప్పుడల్లా దొంగ కన్నీళ్ళు కార్చటం ఫోటోలు తీయించుకోవటం అంతే"

"ఈసారి మినపకి తెగులు పట్టింది. కాయలన్నీ తెప్పల్లయ్యాయి. పంట ఏమీ రాలేదు. దాంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక పురుగులు మందు తాగాడంట. బ్రతికించటానికి డాక్టర్లు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది" నిట్టూర్చారు సీతారామయ్య.

"ఆయన కొడుకులను చదివించారు కదా వాళ్ళు అప్పులు తీర్చటానికి సాయం చేయలేదా" ఆశ్చర్యంగా అడిగింది అంజలి.

"మనుషులు మారిపోతున్నారమ్మా ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఎప్పుడోపోయింది. కానీ కనీసం ఇదివరకు అమ్మ, నాన్న, అన్న ఆప్యాయతలన్నా ఉండేవి. నేను మా అమ్మ, నాన్నలను చూసుకోకపోతే రేపు నా పిల్లలు మాత్రం నన్నెలా చూసుకుంటారు అని ప్రశ్నించుకోవటం లేదు. స్వార్థం పెరిగిపోయింది. రెండు రోజుల క్రితం నారాయణ కొడుకులతో మాట్లాడాడంట. అప్పు తీర్చటానికి సాయం చేస్తారేమోనని, వచ్చే జీతం డబ్బులతో మేమే తిప్పలు పడుతుంటే నీ అప్పు నేనెక్కడ తీర్చేది అన్నాడంట పెద్దకొడుకు. చిన్నకొడుకేమో నువ్వొక్కడివే కొడుకులను చదివించావా అని తలబిరుసుగా మాటాడ్లాడంట"

"అప్పు ఇచ్చినతను వచ్చి, ఆ రెండకరాలు జప్తు చేసుకుంటాను అప్పు క్రింద అన్నాడంట. దాంతో ఇలా" నిట్టూర్చాడు సీతారామయ్య.

"వాళ్ళావిడను చూస్తే చాలా బాధేసింది. కొడుకులు వచ్చేసరికి రేపు అవుతుంది. దహనం రేపు అవుతుంది"

అందరి మనస్సులు భారం అయ్యాయి. అంజలి బయలుదేరి హైదరాబాదు వెళ్ళింది ఆ రాత్రి.

ప్రొద్దున్నే సీతారామయ్య, అన్నపూర్ణ కలిసి నారాయణ ఇంటికి వెళ్ళారు. హడావుడిగా ఉంది ఇంటి ముందు. ఎవరో టి.వి వాళ్ళు వచ్చి రైతు ఆత్మహత్య గురించి మాట్లాడుతూ, అందరి దగ్గరా స్టేట్‌మెంట్లు తీసుకున్నారు. టీవీలో కనపడటానికి ఛోటానాయకులు హడావుడి పడుతున్నారు.

కొడుకులు వచ్చినట్లున్నారు. ఓ పక్కన నిల్చుని 'బాధ'పడుతున్నారు. ఎవరితోనో మాట్లాడుతున్న రవి, దగ్గరకు వచ్చి రేపు మధ్యాహ్నం పంచాయితీ ఆఫీసులో మీటింగు పెట్టానండి ఊళ్ళో పెద్దవాళ్ళతో తప్పకుండా రండి అన్నాడు.

ఊళ్ళోని ఓ 25-30 మంది పంచాయితీ ఆఫీసుకు వచ్చారు.

"నారాయణగారు ఇలా ఆత్మహత్యకు పాల్పడటం నిజంగా దురదృష్టకరం. ఆయన అంత అధైర్యపడి ప్రాణాలు తీసుకోవటానికి కారణాలు కొన్ని వ్యక్తిగతమైనా, దాని వెనక మాత్రం ఆర్థిక పరిస్థితే కారణం. సన్నరైతులు వ్యవసాయం భరించలేని రోజులు వచ్చాయి. సాగుకు కొత్తపాలం కొనుక్కునే ధైర్యం పెద్ద రైతులు కూడా చేయలేకపోతున్నారంటే" మాట్లాడలేకపోయాడు రవి.

"ఇవాళ్ళ నారాయణగారికి వచ్చిన పరిస్థితి ఇక ఏ రైతులకు రాకూడదు. ఈ పరిస్థితికి పరిష్కారం వెతకాలి ఏమంటారు?" అన్నాడు రవి.

"నారాయణగారికి బాగా అన్యాయం జరిగింది. మా కులం వాళ్ళతో మా లీడర్‌తో మాట్లాడతాం. పెద్ద ధర్నా చేయాలని మా లీడర్ అంటున్నారు" బడాయిగా చెప్పాడు రామారావు.

రామారావు రవికి వ్యతిరేక వర్గానికి చెందినవాడు. రవికి ఉన్న మంచి పేరు చూసి భరించలేక ఊరును కులం పేరుతో విడదీయాలని చూస్తున్నాడు. ఊరులోని అధికశాతం ఒక వర్గానికి చెందిన వాళ్ళున్నా వేరే కులాలుకూడా ఉన్నాయి.

"ఏ కులం గురించి మాట్లాడుతున్నావు రామారావు. ఇక్కడుంది ఒక్కటే కులం. రైతుకులం" తీవ్రంగా అన్నాడు రవి, "మతిలేని మాటలు, చేష్టలతో విషయాన్ని ప్రక్కతోవ పట్టించవద్దు."

ఎవ్వరూ మాట్లాడలేదు. రామారావు కోపంగా బోసువంక చూశాడు. ఊరుకో అన్నట్లు సైగ చేశాడు బోసు.

"మనందరికీ ఎదురౌతున్న సమస్య ఇది. కల్తీ విత్తనాలు క్వాలిటీ పరీక్షలు సరిగ్గా జరగని ఎరువులు కల్తీ ఎరువులు పెరిగిన కూలీ విత్తనాల, ఎరువుల రేట్లు దానికి తోడు ప్రకృతి వీటన్నిటినీ ఎదుర్కొని పంట చేతికి వచ్చినా కనీసం గిట్టుబాటు ధర రావటంలేదు. ప్రభుత్వం ప్రకటించే కనిష్ఠ ధర మనకి గిట్టుబాటు కావటం లేదు. దీనికి పరిష్కారం కావాలి ఏమంటారు?" అన్నాడు రవి.

అందరూ వాళ్ళలో వాళ్ళే మాట్లాడుకుంటూ పరిస్థితుల గురించి బాధపడ్డారు.

"సరే మనం ఇప్పుడే ఒక నిర్ణయం తీసుకోనక్కరలేదు. ఎల్లుండి మళ్ళీ ఇదే టైముకి కలుసుకుందాం అప్పటికి అందరూ ఆలోచించి ఏదో ఒక ఐడియాతో రండి. అందరం కలిసి నిర్ణయిద్దాం" అన్నాడు రవి.

బైట వర్షం పడుతుంది. పొలం వెళ్ళే పని వాయిదా వేసి ఇంటికి వెళ్ళాడు రవి సతీష్, రాజా వచ్చారు.

"ఇందాక పంచాయితీ బాబాయి ఇంట్లో మంచి రామాయణం జరుగుతుంటే అక్కడ ఉండాల్సి వచ్చింది" అన్నాడు రాజా.

"వాళ్ళ అమ్మను ఎలా పంచుకోవాలా అనా?" అన్నాడు రవి.

"ఐదో రోజున కర్మ చేసి వెళ్ళిపోతారంట సెలవలు లేవంట. ఆ రెండు ఎకరాలను అమ్మి వాళ్ళ అమ్మను తీసుకువెళతారంట. చెరొక ఆరు నెలలు ఒక్కో కొడుకు ఇంట్లో ఉంచుకుంటారంట. అప్పులు పోగా ఇంకా ఎంత మిగులుతుందో లెక్కలేస్తున్నారు"

"ఎంత ఔదార్యంరా" వ్యంగ్యంగా అన్నాడు సతీష్.

"చిరాకేసిందిరా వాళ్ళ వాగుడు విని. పిన్నిని మాట్లాడవద్దని సైగ చేసి పిన్నికి కీళ్ళవాతం వచ్చి, మోకాళ్ళ ఆపరేషన్ చేయాలన్నారని ఒక్క కాలుకు లక్షరూపాయలవుతుందని చెప్పా. పోనీలే తీసుకెళ్ళండి. ఆపరేషన్ అయ్యాక ఓ సంవత్సరం పాటు కదలకూడదు. మీ దగ్గరుంటే తనకు విశ్రాంతి అన్నాను. వాళ్ళ మొహాలు చూడాల్సింది. 'అబ్బే మాకెలా కుదురుతుంది సిటీలో ఎంత ఖర్చుతో కూడుకున్నది. అందులో పనిమనుషులు దొరకరు. ఒకటా రెండా' అన్నదమ్ములు పోటీపడ్డారు సంజాయిషీలు చెప్పటానికి" అన్నాడు రాజా.

"సొంత తల్లిదండ్రుల దగ్గర ఇంత వ్యాపార బంధాలైపోయాయేంట్రా" బాధగా అన్నాడు సతీష్.

"పిన్ని మొహం చూస్తే బాధేసిందిరా. తనే పాపం ఇదంతా చూసి ఎక్కడికీ రాను. కొన్నాళ్ళు ఒంటరిగానే ఉంటాను అంది. దాంతో సమస్య కాస్త పరిష్కారం అయ్యింది. కాకపోతే ఊళ్ళో ఎవరో చెప్పినట్లున్నారు. ఎకరం నాలుగు లక్షలు పలుకుతుందని. దాంతో ఎనిమిది లక్షలు ఊరికే వదులుకోవాలని లేదు వాళ్ళకు" అన్నాడు రాజా.

''అప్పు ఇచ్చిన సాంబయ్య గొడవ చేస్తున్నాడు. కొడుకులు పట్టించుకోకపోతే తన అప్పు ఎవరు తీరుస్తారని పొలం కొనుక్కుంటాడట'' అన్నాడు రాజా.

''ఓ వారం ఊరుకోమను. ఆలోచిద్దాం'' అన్నాడు రవి.

ఎల్లుండి పంచాయితీలో మాట్లాడవలసిన దానిగురించి ముగ్గురూ చర్చించుకున్నారు ''ఎవ్వరికీ ఈ విషయం చెప్పొద్దు ఎల్లుండిదాకా, కాస్త బైటికి పొక్కిందా వేరొక మడతపేచీ పెడతాడు బోసు'' అన్నాడు రవి.

కాసేపు మాట్లాడి సతీష్, రాజా వెళ్ళిపోయారు. అంజలికి ఫోన్ చేద్దామని ఫోన్ తీశాడు రవి. తను హైదరాబాదు వెళ్ళిందని గుర్తొచ్చింది. ఫోన్ చేస్తే ఏమనుకుంటుందో అని మొహమాటం వేసి ఆగిపోయాడు రవి.

''ఏం ఆలోచించారు అందరూ?'' అడిగాడు రవి అందరివంకా చూస్తూ.

''తుఫాన్లు, అకాలంలో వర్షాలు, తెగుళ్ళులాంటివి మన చేతుల్లో లేవు అవి వస్తే ఏం చేయాలో అప్పుడు ఆలోచించవచ్చు. కానీ మన చేతుల్లో ఉన్నవాటి గురించి ఏం చేయాలో చూడాలిగా'' అన్నాడు ఒకాయన.

''ఎరువులు, విత్తనాల కల్తీలు, నీటి సమస్య ఇది ముఖ్యమైనవి. దీంతోపాటు కూలీకు దొరకకపోవటం దాంతో కూలీరేట్లు పెరిగాయి. ఎలా తట్టుకోవాలి. పెట్టుబడి ఎక్కువ. దిగుబడి తక్కువ అయ్యింది. వ్యవసాయం అలవాటయిపోయి మానలేక చేయటం. దీని బదులు కొనుక్కునేవాళ్ళంతా అమ్మేసుకుని ఆ డబ్బు వడ్డీలకు తిప్పుకున్నా హాయిగా కాలుమీద కాలు వేసుకుని కూర్చోవచ్చు'' విరక్తిగా అన్నాడు ఒకాయన.

''నిజమే కానీ అందరూ ఇలా వ్యవసాయం మానేస్తే మనకు తిండిగింజలు ఎలా దొరుకుతాయి?'' అన్నాడు సీతారామయ్య.

''బోసు, నువ్వేమంటావు?'' అడిగాడు రవి.

''ఏముంది అనటానికి?'' తప్పించుకున్నాడు బోసు.

''నాకొక ఐడియా వచ్చింది అందరూ ఏమంటారో చెప్పండి'' అన్నాడు సతీష్. రాజా, రవి, సతీష్ ముందే అనుకున్నారు. ఈ ఐడియా సతీష్ దగ్గర్నుండీ రావాలని. రవి వ్యతిరేక వర్గం కొంచెం శాంతిస్తుందని. ''మనం రైతు సంఘాలు పెడదాం. ఒక్కో సంఘంలో పది, ప్దిహేను మంది రైతులుంటారు. విత్తనాలు దగ్గర్నుండి పంట చేతికి వచ్చేదాకా ఒకళ్ళకొకళ్ళు సాయం చేసుకోవాలి. మట్టి పరీక్షలు కానీ, వ్యవసాయ ఆఫీసర్లతో మీటింగులు కానీ ఏదైనా?'' అన్నాడు సతీష్.

''అన్ని సంఘాలు కలిపి ఒక లీడర్‌ని ఎన్నుకోవచ్చు. ఏమన్నా పై అధికారుల దగ్గరకు వెళ్ళాలంటే లేకపోతే ఈ ఊరి ప్రెసిడెంటుగా రవినే ఉండచ్చు'' ఈ వ్యవసాయంతో పాటు వేరే వ్యవసాయ సంబంధిత వ్యాపారాలు చేయొచ్చు. కోళ్ళ ఫారం, పాల వ్యాపారం ఇలా ఎవరికి తోచినట్లు డబ్బు ఇచ్చింది ఉన్నవాళ్ళు సామూహికంగా చేయవచ్చు. ఏమంటారు?'' అన్నాడు సతీష్

''వ్యవసాయం చేయటానికే పెట్టుబడి డబ్బులు చాలక అప్పు చేసి చస్తుంటే. ఇంకా వేరే వ్యాపారాలు కూడానా'' వ్యంగ్యంగా అన్నాడు రామారావు.

''పోనీ ఏం చేస్తే ఈ పరిస్థితులు మెరుగుపడతాయో చెప్పు నువ్వు'' అన్నాడు రాజా.

''మన ఎమ్.ఎల్.ఏగారితో మన జిల్లా మంత్రిగారితో మాట్లాడాలి మరి. వాళ్ళు ప్రయత్నిస్తే నష్టపరిహారం ఇప్పించవచ్చుగదా'' అన్నాడు బోసు.

"ముందు మనం మనకు సాయం చేసుకోవాలి కదా. తరువాత ప్రభుత్వం దగ్గరకు వెళ్ళొచ్చు. మనం ప్రయత్నం చేయకుండా సొంతం చేతులెత్తేసి, ప్రభుత్వం వంక చూస్తే ఎలా?" అన్నాడు రవి.

"నేను రవిని సమర్ధిస్తున్నా. ఈ ప్రయత్నాలు ఏమీ ఫలించకపోతే అప్పుడు చూద్దాం ఒప్పుకునే వాళ్ళు చేతులెత్తండి" అన్నారు సీతారామయ్య.

చాలామంది చేతులెత్తారు.

"సరే అయితే మీరు ఎవరికి వాళ్ళు గ్రూప్‌లు ఏర్పరచుకోండి. మీ వీలుబట్టి రేపో, ఎల్లుండో పంచాయితీ ఆఫీసుకు వచ్చి మీ గ్రూపుల వివరాలు, మీ నాయకుడి పేరు ఇవ్వండి. వారానికి ఒకసారి కలిసి సమస్యలు చర్చిద్దాం. ఇంకొన్నాళ్ళల్లో వరి నాట్లు మొదలవుతాయి కాబట్టి. ఇదే మంచి సమయం ఆలోచించుకోవటానికి" అన్నాడు రవి.

రవి ఫోన్ మోగింది. రవి అక్క నీరజ. దగ్గర్నుండి "ఇంటికి ఫోన్ చేస్తే నువ్వు దొరకటం లేదు. ఈ టైంలో చేస్తేనన్నా దొరుకుతావని చేశాను. ఏం చేస్తున్నావు?" అంది నీరజ.

"ఏం లేదక్కా. రాత్రి పది అయ్యింది. ఇంట్లోనే ఉన్నాను. ఏదో కంప్యూటర్‌లో చూస్తున్నా" అన్నాడు రవి.

"ఏరా ఎంతసేపు దేశసేవేనా? అమ్మ నీ పెళ్ళి గురించి బాగా బెంగపడుతుంది. నువ్వేమో పట్టించుకోవు మనకంటూ ఓ తోడు కావాలి కదరా"

"అబ్బా ఇక నువ్వూ మొదలెట్టావా? ఇక అది వదిలేయ్ కానీ. నేను అమెరికాలో సెటిల్ అయిన మన ఊరి వాళ్ళకందరికీ ఒక ఈమెయిల్ పంపుతాను. డొనేషన్ల కోసం కొంచెం నువ్వుకూడా అక్కడ వాళ్ళతో మాట్లాడు."

"నువ్వు మారవురా. సర్లే నేను ఇండియా వస్తున్నాను. పిల్లలకు ఇప్పుడు సెలవులు కదా ముందు అనుకోలేదు. కానీ రావాలనిపించింది" అంది నీరజ.

"అందరూ వస్తున్నారా?" సంతోషంగా అడిగాడు రవి.

"బావగారు రావటం లేదు. నేనూ, పిల్లలు ఓ నెల రోజులు ట్రిప్ అంతే."

"టిక్కెట్ బుక్ చేశాక ఫోన్ చెయ్యి. నేను ఎయిర్ పోర్ట్‌కి వస్తాను" అన్నాడు.

"టిక్కెట్టు కొనేశాం ఇంకో రెండువారాల్లో వస్తాం. నువ్వు హైడరాబాద్‌కి రావొద్దు. మా అత్తగారి ఇల్లు అక్కడే కదా. అక్కడ ఓ వారం ఉండి అప్పుడు మన ఊరికి వస్తాను" అంది నీరజ.

రవి ఫోన్ పెట్టేసి కిందకు వెళ్ళి, అక్క ప్రయాణం సంగతి అమ్మా, నాన్నతో చెప్పాడు. ఎప్పుడో రెండు మూడేళ్ళకొకసారి చూస్తారు వీళ్ళు. నీరజకు ఓ పాప, బాబు.

రవి పైకి వెళ్ళిపోయాడు. "నీరజ, రవితో మాట్లాడి పెళ్ళికి ఒప్పిస్తే బాగుండు. మా అన్నయ్య ఓ పక్క గొడవపెడుతున్నాడు" అంది సావిత్రి.

"నీ మేనకోడలు అని నీకు అభిమానం ఉండొచ్చు కానీ నిజం చెప్పు. నీకు మనఃస్ఫూర్తిగా అనిపిస్తుందా పద్మ, రవికి సరైన జోడీ అని" అన్నారు చంద్రశేఖరరావు.

"ఏదో చిన్నపిల్ల. రవి మనసెరిగి మసులుకుంటుంది కదా అన్న ఆశ. తెలియని పిల్ల కోడలుగా వస్తే రేపు వేరు కాపురం అని పల్లెటూరు కాపురం అని గొడవలు పడితే"

"అందుకే ఈ నిర్ణయం రవికే వదిలెయ్యి. తను చిన్నపిల్లవాడు కాదు. నాకెందుకో తొందర్లోనే తను పెళ్ళి చేసుకుంటాడు. తనకు నచ్చినమ్మాయి దొరుకుతుంది అనిపిస్తుంది" గుంభనంగా అన్నారు చంద్రశేఖర్రావు.

"మీతో ఏమన్నా అన్నాడా?" ఆశగా అడిగింది సావిత్రి.

"లేదు. కానీ నాకెందుకో అలా అనిపిస్తుంది"

**రాధిక,** అంజలి కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. ఇంకొక రెండు వారాల్లో రాధిక నిశ్చితార్థం. దానికి షాపింగ్‌కని రెండు రోజుల్నుండీ చాలా బిజీగా ఉన్నారు. రేపు కాలేజీకి వెళ్ళాలి.

"నా ఎంగేజ్‌మెంట్‌కి కూడా రావచ్చు కదా నువ్వు?" అంది రాధిక.

"లేదులే రాధి పెళ్ళికి వస్తా కదా! అయినా చాలా సంవత్సరాలయ్యింది ఇన్నాళ్ళు అమ్మదగ్గర ఉండి" అంది అంజలి.

"సరే అయితే పెళ్ళికి వారం ముందే రావాలి. కలిసి ఫేషియల్స్ చేయించుకోవటం, గోరింటాకు పెట్టుకోవటం. వావ్.. చాలా ఎంజాయ్ చేయొచ్చు" అంది రాధిక "పెళ్ళిముందు రోజు మన కాలేజి ఫ్రెండ్స్, ఇంకా చుట్టాల్లోని యంగ్‌స్టర్స్ అందరికి డాన్స్ పార్టీ పెట్టాం చాలా సరదాగా ఉంటుంది. దాంట్లో డాన్స్ చేయడానికి రెడీగా ఉండు. మర్చిపోయా, నువ్వు ఇక్కడికి వచ్చాక వివేక్‌కి ఫోన్ చేశావా?" నెమ్మదిగా అడిగింది రాధిక.

"నిన్న తనే చేశాడు. ఈ రెండురోజులు షాపింగ్‌తో బిజీగా ఉంటానన్నాను. రేపు కలుస్తానన్నాడు" ముక్తసరిగా అంది అంజలి.

"ఏదో జెలస్‌గా ఫీల్ అయ్యి చేశాడులే. నేనూ కోప్పడ్డాను తనను" అంది రాధిక.

"నేను క్లియర్‌గా చెప్పినా కానీ వదలకుండా ఇంత స్టుపిడ్‌గా చేస్తాడనుకోలేదు" అంది అంజలి.

"సరే వదిలేయ్. ఇంతకీ రవి విషయాలు చెప్పు"

"ఏముంది చెప్పటానికి ఏమీలేదు. తనంటే నాకిష్టం. కానీ తనకు నేనంటే ఏం అభిప్రాయం ఉందో తెలియదు. మామూలుగానే మాట్లాడతారు. చూద్దాం" అంది అంజలి.

"నా పెళ్ళికి వచ్చినప్పుడు రఘుని కదపమననా?" అడిగింది రాధిక.

"వద్దు రాధి నేను హాండిల్ చేసుకుంటాను. నాకు అర్థం అయినంతవరకు రవి చాలా ప్రత్యేకమైన మనస్తత్వం. చదువు, సంస్కారంతోపాటు బైటకు కనిపించడు కానీ చాలా సెన్సిటివ్ అనిపిస్తుంది. నువ్వు గమనించావా? మనల్ని సముద్రం ఒడ్డుకు తీసుకెళ్ళి సూర్యోదయం చూపటం, వాళ్ళింటికి వెళ్ళినప్పుడు భోజనాలు వెన్నెల్లో తిందామన్నారంట. కానీ వాళ్ళ అమ్మగారు పైకీ, కిందకీ వద్దనేసరికి ఆగారు."

"నాతో ఎప్పుడూ మర్యాదగానే ప్రవర్తిస్తారు. నేను తనని చాలా మందితో మాట్లాడటం చూశాను. రైతులు, కూలీలు, మనతో, పెద్దవాళ్ళతో ఎవ్వరితో మాట్లాడినా గౌరవంగా మాట్లాడతాడు. ఎవర్ని తక్కువ చేయటంకానీ వీడు పనోడు అన్న ఫీలింగ్ కానీ ఉన్నట్లు కనపడదు. పల్లెటూళ్ళో జీతగాళ్ళను విదిలించి మాట్లాడటం చాలా మామూలు. కానీ రవి అలా చెయ్యటం ఇంతవరకు చూడలేదు."

"పైగా ఎవరి స్వార్ధం వాళ్ళు చూసుకుంటున్న ఈ రోజుల్లో ఇలా ఊరికోసం, తాపత్రయ పడేవాళ్ళు అరుదుగా ఉంటారు. అడ్మైరింగ్‌గా అనిపిస్తుంది తనను చూస్తే" అంది అంజలి.

"రెండు రోజులయ్యింది తనతో మాట్లాడి. ఏంటో వెలితిగా ఉంది. కానీ మా ఇద్దరి మధ్య ఇంకా అంత బంధం లేదు. రోజా పని ఉన్నా లేకపోయినా ఫోన్ చేసుకునేంత" ఆలోచిస్తూ అంది అంజలి.

చిన్నగా నవ్వుకుంది రాధిక. "సర్లే పడుకుందాం రా" అంది.

వారం రోజులు చాలా తొందరగా గడిచిపోయాయి. మళ్ళీ స్నేహితులందరూ కలిశారు. ముందు అనుకున్నట్లుగానే వివేక్ ఢిల్లీకి వెళుతున్నాడు పి.జి చెయ్యటానికి. లక్ష్మి వెల్లూరు కాలేజీలో చేరుతుంది. రాజేష్ అమెరికా ప్రయాణం ఇంకా తేలలేదు.

ఒకరోజు మాత్రం అంజలి, వివేక్‌తో కొంచెం గట్టిగా మాట్లాడింది.

వివేక్ కూడా తన మూర్ఖపు పట్టుదల, ప్రవర్తన గురించి సిగ్గుపడుతున్నట్లే కనిపించాడు.

బస్సులో తిరిగి ఊరికి వస్తుంటే చాలా ఆనందంగా అనిపించింది అంజలికి. బస్సు కొంచెం ఆలస్యం అయ్యి తెల్లవారాక ఊరిలోకి వచ్చింది. వస్తున్నట్లు ఎవ్వరికీ చెప్పలేదు. బస్సులోంచి బాగ్ తీసుకుని దిగింది అంజలి. సెల్‌ఫోన్‌లో మెసేజ్ వచ్చినట్లుగా శబ్దం వచ్చినట్లుగా శబ్దం వచ్చింది చూస్తే రవి నుండి "శుభోదయం" అని ఉంది.

చాలా ఆశ్చర్యపడింది ఎలా తెలిసింది తను వస్తున్నట్లు. తెలుసా? లేదూ ఊరికే తను ఎటూ ప్రొద్దున్నే లేస్తుంది కాబట్టి విష్ చేశాడా? చుట్టూ చూసింది. రోడ్డుకు అవతల పక్కనిల్చుని ఉన్నాడు. అంజలి చూసేసరికి చెయ్యి ఊపి, బైకు స్టాండు వేసి వచ్చాడు.

"పొలం వెళుతున్నాను. నువ్వు కనిపించావు బస్సు దిగుతూ" అన్నాడు నవ్వుతూ. నిన్ను తీసుకెళ్ళటానికి ఎవరూ వచ్చినట్లు లేరా బైక్ మీద ఇంటిదాకా దింపుతాను రా"

"వద్దు పర్లేదు. ఎంత దూరం కనుక. నేను వెళతాను" అంది అంజలి.

"వారం రోజులు ఊర్లో లేకపోతే మొహమాటం ఎక్కువైనట్లుంది బండి తెస్తానుండు" అని వెళ్ళి బైక్ తీసుకొచ్చాడు.

అంజలి రవి బైక్ మీద కూర్చుని వస్తుంటే రోడ్ మీద వెళుతున్న ఇద్దరు ముగ్గురు వెనక్కి తిరిగి చూశారు. ఇంటిబైట ముగ్గేస్తున్న సావిత్రి, అంజలిని చూసి ఆశ్చర్యపోయింది.

"ఇదేంటమ్మ వస్తున్నట్లు ఫోన్ చేయలేదు. నాన్న బస్సు దగ్గరకు వచ్చేవాళ్ళుగా."

"ఏమన్నా పెద్ద దూరమా. బస్టాండులో రవిగారు కనిపించి వద్దన్నా వినిపించుకోకుండా దింపారు" అంది అంజలి.

"రా బాబు కాఫీ తాగుదువుగానీ" అంది అన్నపూర్ణ.

"ఇప్పుడు వద్దండి ఇంకోసారి వస్తాను. పొలం వెళుతున్నాను. బై అంజలి..!" అంటూ వెళ్ళిపోయాడు.

ఊళ్ళోకి దిగగానే రవి కనిపించటం ఎందుకో చాలా సంతోషంగా అనిపించింది అంజలికి.

రాత్రి స్కూలులో ఆడవాళ్ళతో మీటింగులో ఉంది అంజలి. వీళ్ళందరూ బడుగు వర్గానికి చెందినవాళ్ళు. కష్టపడి పనిచెయ్యటం, వచ్చిన డబ్బులతో చాలీ చాలక బ్రతకటం. వీళ్ళు, వీళ్ళు ముందు తరం వాళ్ళు, చాకలి పనులు, జీతగాళ్ళుగాను, వ్యవసాయం

కూలీలుగానూ ఉన్నారు. కొంతమంది అరకొర చదువుకున్నోళ్ళు ఏ ఏడో తరగతో, పదో తరగతో చదివి పట్నం ఉద్యోగాలకు వెళ్ళిపోయారు.

వీళ్ళకు కేవలం అక్షరాలు నేర్పిస్తే చాలదని, అంజలి, వాళ్ళ సమస్యల గురించి అడిగి వాటికి చేతనయినంత సలహాలు ఇస్తుంది.

ఇవాళ్ళ తాగుడు, దాని సమస్యల గురించి మాట్లాడుతున్నారు. ఊళ్ళో సారా కొట్టులేదుకానీ కాయకష్టం చేసిన వాళ్ళకి సాయంత్రం అయ్యేసరికి సారా తాగటం అలవాటయ్యింది. పక్క పల్లెల్లో దొంగసారా కాసే చోటు దగ్గరకు రోజూ వెళ్ళటం వాళ్ళ మొగుళ్ళకు అలవాటయ్యింది. డబ్బు, ఆరోగ్యం రెంటికీ నష్టమే.

"ఏం సెయ్యనమ్మ? చెపితే ఇనరు. ఇంక పైగా తాగివచ్చి ఏమన్నా అంటే మమ్మల్ని పిల్లల్ని కొట్టటం సంపాదించిందంతా దానికే పోతాంటే ఇంక దాయటం, పొదుపు ఎక్కడ?"

"అదికాదే మంగ ఈ దొంగసారా కొట్లన్నిటి యెనక ఆ ఎర్నేని రాఘవయ్య బామ్మర్దివి. ఇంక మనమేం సేయలేం. వాటిని మూయించటం రవి బాబు వల్ల కూడా కాదు"

"సరే ఏం చేయలేం అని దిగులు పడితే ఎట్లా ఏదో ఒకటి చేయాలి కదా మీ మొగాళ్ళలో మార్పు తీసుకురాకపోతే మీ బ్రతుకులు ఇలాగే ఉంటాయి. ఎదుఎదుగూ బొదుగు లేకుండా" అంది అంజలి.

"నేనొకటి చెప్తుతాను. మరి మీరు ధైర్యంగా మొండిగా దాని పాటిస్తారని వెనకడుగు వేయకూడదు మరి"

"ఏంటది చెప్పండమ్మ" అన్నారు అందరూ.

"నాకు కొంచెం ఇబ్బందిగా ఉంది చెప్పటానికి" అని కొంచెం ఆగింది అంజలి.

వాళ్ళందరూ ఏం చెబుతుందా అని చూస్తున్నారు.

"ఆడవాళ్ళు తలచుకుంటే ఏమైనా సాధించవచ్చు. ఒకోసారి భార్య కూడా భర్తని మార్చటానికి కఠినంగా ఉండాలి. అంటే నా ఉద్దేశం ఏంటంటే మీ మొగుళ్ళు తాగి ఇంటికి వస్తే లోపలికి రానివ్వకండి."

అంజలి సాంతం పూర్తి చేయకుండానే "అమ్మో ఇంకేమన్నా ఉందా సంపేత్తాడు మావోడు" అంది మంగ.

"సాంతం వినండి. తాగటానికి వెళ్ళేముందే చెప్పండి తాగుడు మానేయమని, దాంట్లోని నష్టాలు అన్నీ చెప్పండి. ఆ తాగుడుకు ఖర్చు అయ్యే డబ్బు ఆదా చేస్తే దేనికి వాడుకోవచ్చో చెప్పండి. ఇంకా వినలేదనుకోండి. ఆఖరి ఆయుధం మీ దగ్గరే ఉంది" అని ఆగింది అంజలి.

"ఆఖరాయుధం ఏంటి?" అంది నర్సి.

"మొగాళ్ళు, ఆడాళ్ళ దగ్గర ఏ విషయంలో లొంగుతారో అదే తాగి వస్తే తలుపు తీయం, కాపురం చేయమని చెప్పండి" నర్మగర్భంగా అంది అంజలి.

"అమ్మో ఇంకేమన్నా ఉందా? గొడ్డును బాదినట్లు బాదుతాడు" అంది నర్సి.

"అసలు మొదట మొగాడు, పెళ్ళాన్ని కొడతాడు. అన్న భయాన్ని పోగొట్టుకోవాలి. ఎందుకు కొడతాడు. మీరు మనుషులుకారా అయినా కొడితే ఎందుకు భరించాలి.

''అయినా మెల్లగా నచ్చచెప్పటానికి ప్రయత్నించండి. వినకపోతే ఏం చేస్తాం? చిన్నపిల్లలకు తాయిలం ఆశ చూపించి పనులు చేయించినట్లు కానీ మీరందరూ ఒకటే మాట మీద ఉండి గట్టిగా ఉంటేనే ఇది సాధించగలరు. బాగా ప్రొద్దుపోయింది. పదండి వెళదాం'' అంటూ లేచింది.

బైటకు వచ్చేసరికి లోపలికి వస్తూ రవి కనిపించాడు, సీజర్‌తో ''మాది ఇప్పుడే అయిపోయింది. ఇప్పుడు వచ్చారేంటి?'' అంది అంజలి.

''రాత్రి పూట ఒక్కదాన్నే వెళ్ళొద్దన్నా కదా. ఇలా స్కూల్‌కి వస్తే నాకు ఫోన్ చేయమన్లేదా'' కోప్పడుతున్నట్లు అన్నాడు రవి. ''సగం దూరం వీళ్ళు ఉంటారుగా. నేను దాదాపు రోజూ వస్తాను. మీకెందుకీ డ్యూటి'' అంది అంజలి.

''నాకేం శ్రమకాదు. ఎటూ సీజర్‌ని తీసుకుని వాకింగ్‌కి వెళ్తా. స్వామి కార్యం స్వకార్యం రెండూ అయిపోతాయి. కానీ నువ్వు ఒక్కొదానివి మాత్రం వెళ్ళొద్దు''

''అది సరేకానీ నేను ఫారిన్‌లో ఉన్న మన ఊరి వాళ్ళకి ఇమెయిల్ పంపాను. చాలామంది బాగానే స్పందించారు. అందుకని బ్యాంకులో ఎకౌంటు తెరిచాను వాళ్ళు పంపిన చెక్కులు వేయటానికి. ఓ నెల రోజుల్లో ఎంత వసూలవుతుందో చూసి ఇంకెంత కావల్సివస్తుందో ప్లాన్ చేయాలి'' అన్నాడు రవి.

''మన సబ్ కలెక్టర్‌గారితో వెళ్ళి మాట్లాడాను. ఆయనకు మనం స్వయంశక్తితో ఇళ్ళు కట్టించే ఆలోచన చాలా నచ్చింది. మనకు సమకూరే డబ్బులు పటి, మిగతాది ప్రభుత్వం నుండి కానీ, బ్యాంక్ నుండి కానీ ఇప్పించటానికి ప్రయత్నిస్తామన్నారు. నాకైతే బ్యాంక్ లోన్ తీసుకుంటే నయం అనిపిస్తుంది. ఏ కష్టం లేకుండా అన్ని అమరిపోతే సోమరితనం పెరిగిపోయి, ప్రతిదానికి చేయిచాచటం అలవాటవుతుంది. అదే బ్యాంక్‌లోన్‌తో, మన డబ్బులతో ఇల్లు కట్టుకుంటే అదే సంతృప్తి కదా'' అన్నాడు.

''ఇవన్నీ నీకు చెప్పుదామని. ఎప్పుడు హైదరాబాద్ నుండి తిరిగి వస్తావా అనుకున్నాను'' అన్నాడు.

''ఏ.. నాకు ఫోన్ చేయచ్చు కదా? ఎందుకు చేయలేదు?'' అంది అంజలి రవి వంక చూస్తూ.

ఏం మాట్లాడలేదు రవి. కాసేపు మౌనంగా నడిచారు. మౌనం ఇబ్బందిగా అనిపించింది రవికి. ''ఎలా జరిగింది హైదరాబాదు ప్రయాణం. మీ ఫ్రెండ్స్ బాగున్నారా?'' అడిగాడు.

''ఊ, బాగున్నారు. రఘు, రాధిక మిమ్మల్ని తప్పకుండా పెళ్ళికి ముందురోజే రమ్మన్నారు. ఏదో పార్టీ పెట్టారులే యంగ్‌స్టర్స్‌కి'' లక్ష్మి వెల్లూరులో చేరుతుంది. వివేక్ ఢిల్లీలోని AIMSలో చేరుతున్నాడు. కార్డియాలజీలో, అందరం కలిసి వీళ్ళ పెళ్ళిలోనే కలిసేది. తర్వాత ఎవరి ప్రయాణంలో వాళ్ళు'' అంది అంజలి.

''చూడాలి మరి పెళ్ళి డేట్ పట్టి అక్క, తన పిల్లలు వస్తున్నారు అమెరికా నుండి ఇంకొక వారంలో'' ఇంతలో అంజలి వాళ్ళు ఇల్లు వచ్చింది.

''ఇలా మీరు రోజూ రావద్దు, మిమ్మల్ని ఇబ్బంది పెట్టటం ఇష్టంలేదు'' అంది అంజలి.

''నా కంపెనీ నచ్చట్లేదా? బోర్ కొట్టిస్తున్నానా?''

''అదేం కాదు. నాకెందుకు బోర్ కొడుతుంది''

''సరే అయితే బుద్దిగా, స్కూల్‌కి వెళ్ళేటప్పుడు నాకు మెసేజ్ చెయ్యి వస్తాను గుడ్ నైట్'' అని వెళ్ళిపోయాడు రవి.

''ఇంత రాత్రిదాకా ఏంటమ్మా అంజలి'' అంది అన్నపూర్ణ.

"పర్లేదమ్మా దాదాపు ఇంటిదాకా అందరూ ఉంటారుగా భయం ఏముంది?" అంది అంజలి.

రోజులు తొందరగా గడిచిపోతున్నాయి. 'చేతన' మీటింగులు, రాత్రిపూట బడి, ఒక్కోసారి, వేరే పల్లెలకు కూడా వెళుతుంది చేతన పనుల మీద.

వారం తర్వాత రాత్రి పూట బడి అయ్యాక, రవి, అంజలి కబుర్లు చెప్పుకుంటూ వస్తున్నారు. అందరూ వెళ్ళిపోయారు.

దూరం నుండి ఓ మోటర్ సైకిల్ వచ్చి వీళ్ళ దగ్గరగా ఆగింది. రవి, అంజలిని పక్కకు లాగి ఎవరు అని చూశాడు బోసు.

"ఏంటి బోసు చూసి నడుపు బండిని" తీవ్రంగా అన్నాడు రవి.

"రాత్రిపూట ఏంటి మీ ఇద్దరూ షికార్లు చేస్తున్నారు" వంకరగా నవ్వుతూ అన్నాడు బోసు. అతని దగ్గర్నుండి తాగినట్లు వాసన వచ్చింది.

"నీకు సంబంధం లేని విషయాలు గురించి మాట్లాడకు" అంజలి చెయ్యి పట్టుకుని పక్కనుండి వెళ్ళబోయాడు రవి.

"ఆగండి ప్రెసిడెంటుగారు. మీరు ఎంతో ఆదర్శవంతులంటూ, అందరూ మిమ్మల్ని తెగపొగుడుతుంటారు మరి మీ ప్రవర్తనేమో ఇలా ఉంది" బండి దిగాడు బోసు.

"ఆగండి నేనడిగిన దానికి జవాబు చెప్పండి సార్"

"బోసు నువ్వు తాగి ఉన్నావు. ఇలా ఓ ఆడపిల్ల ముందు అసభ్యంగా ప్రవర్తించటానికి సిగ్గులేదా? ఇంటికివెళ్ళు" కోపాన్ని అతికష్టం మీద కంట్రోల్ చేస్తూ అన్నాడు రవి.

"నాకెందుకు సిగ్గు. ఇలా మీ ఇద్దరూ హీరో, హీరోయిన్లా చెట్టాపట్టాలేసుకుని తిరగటానికి మీకుండాలి సిగ్గు. నేనేది చేసినా దర్జాగా చేస్తా. మీలాగా ముసుగేసుకుఉని చేయను" అన్నాడు బోసు.

"ఏం డాక్టరమ్మా ఊళ్ళో ఇంకెవ్వరూ నచ్చలేదా నీకు?" దగ్గరికి వస్తూ అడిగాడు.

లాగి బోసు చెంపమీద కొట్టాడు రవి. ఒక్క క్షణం బిత్తరపోయాడు బోసు. "ఎంత ధైర్యమా నన్నే కొడతావా?" అని తిరగబడ్డాడు.

అంజలికి బాగా కంగారేసింది "రవిగారు! ప్లీజ్ వచ్చేయండి. తను ఎలా మాట్లాడితే మనకెందుకు."

రవి పిడికిలి బిగించి బోసుమూతి మీద కొట్టాడు. బోసు తిరగబడి రవిని బలంగా నెట్టాడు. రవి ప్రక్కనే ఉన్న చింతచెట్టుకు కొట్టుకున్నాడు. రవికి, బోసుకు ఇద్దరికి మొహం మీద దెబ్బ తరిగి రక్తం కారుతుంది.

"రవిగారు! ప్లీజ్.. రండి వెళదాం" కంగారుగ ఏడుపు గొంతుతో అంది అంజలి.

"బోసు నీకిదే వార్నింగ్ ఇస్తున్నా. ఇంకోసారి నామీద తిరగపడొద్దు. పోయినసారి పోలీసు కేసు పెట్టలేదని ధైర్యం వచ్చిందేమో. ఇంకోసారి ఇలాంటి ఆలోచన వచ్చినా కానీ నిన్ను జైల్లో పెట్టిస్తా" తీవ్రంగా అన్నాడు రవి. "ఇంకో విషయం ఏదన్నా ఉంటే నాతో పెట్టుకో. ఆడపిల్లలను ఏడ్పించటం మగతనం అనిపించుకోదు. పద అంజలి" అంజలి చెయ్యిపట్టుకుని బయలుదేరాడు రవి.

"పోరా నన్నే బెదిరిస్తున్నావా? అందుకే మరి భయంతో కుక్కను పెంచుకుంటున్నావు" వెనకాల నుండి అరుస్తున్నాడు బోసు.

"మీకు రక్తం కారుతుంది" అంది నెమ్మదిగా అంజలి.

వణుకుతున్న అంజలి గొంతు గమనించాడు రవి. కోపాన్ని దిగమింగి "సారీ అంజలి నామీద కోపంతో, నీతో అసహ్యంగా మాట్లాడాడు" అన్నాడు "మీరు సీజర్‌ను ఎందుకు పెంచుతున్నారు?"

చిన్నగా నిట్టూర్చి అన్నాడు రవి "రెండేళ్ళ క్రితం పొలాల దగ్గర గొడవలయ్యాయి బోసు, కూలీల మీద చెయ్యి చేసుకున్నాడు. నేను అంతా విని కూలీవాళ్ళ తరపున మాట్లాడాను. దాంతో నామీద కక్షగట్టి ఒకరోజు చీకట్లో మనుషులచేత కొట్టించాడు .పెద్ద దెబ్బలు తగల్లేదు కానీ అమ్మ, నాన్న చాలా భయపడ్డారు. దాంతో వాళ్ళ తృప్తికోసం సీజర్‌ను తీసుకొచ్చాను. ఎక్కడికన్నా ఒక్కడినే వెళుతుంటే, సీజర్‌ను తీసుకువెళతాను"

ఇంతలో అంజలి వాళ్ళ ఇల్లు వచ్చింది.

రవి ఇంకా అంజలి చెయ్యిపట్టుకునే ఉన్నాడు "అంజలి ప్లీజ్ అప్‌సెట్ అవ్వకు" అన్నాడు.

"లోపలకు రండి ముందు రాస్తాను" అంది

"పర్లేదు చిన్నదెబ్బే వెళతాను" అన్నాడు

"లేదు మీరు లోపలకు రండి" లోపలకు తీసుకువెళ్ళింది.

సీతారామయ్య, అన్నపూర్ణ కలిసి టి.వి చూస్తున్నారు. రవి దెబ్బలు చూసి కంగారుపడ్డారు.

అంజలి లోపలకు వెళ్ళి ముందు, దూది నీళ్ళు తెచ్చింది.

**"ఏమైంది" అని** అడుగుతున్నారు సీతారామయ్య. రవి ఏం మాట్లాడలేదు.

రవి నుదుటిమీద బాగా గీసుకుంది, చెయ్యి కూడా చెక్కుకుపోయింది.

అంజలి దూదితో దెబ్బలు తుడిచి, మందు రాసి కట్టు కట్టింది. "ఏమైందంటే మాట్లాడరేంటి ఇద్దరూ?" కంగారుతో గట్టిగా అన్నారు సీతారామయ్య.

"బోసు పని" ముక్తసరిగా అంది అంజలి.

"తర్వాత చెపుతాను కంగారు పడాల్సిందేమీ లేదు" నెమ్మదిగా చెప్పాడు రవి.

"ఇంక బయలుదేరతాను"

"నాన్నా, రవిగారిని స్కూటర్ మీద దింపండి" అంది అంజలి.

"అంజలి...." వారిస్తున్నట్లుగా అన్నాడు రవి.

"నాన్నను తీసుకెళ్ళనిస్తారా లేకపోతే నేను రానా?" సూటిగా చూస్తూ అడిగింది అంజలి.

రవిని ఇంటి దగ్గర దింపారు సీతారామయ్య. రవి నెమ్మదిగా జరిగింది చెప్పాడు. సీతారామయ్యకు బాగా కోపం వచ్చింది. "పనికొచ్చే పనులు చేయకపోగా తాగి ఆడపిల్లతో అసహ్యంగా మాట్లాడతాడా!?" అన్నారు.

"నాకు ఈ మధ్య అనుమానం వచ్చింది అక్కడక్కడ వాడి మాటలు విని. అందుకే అసలు అంజలిని రాత్రిపూట స్కూల్‌కి వెళ్ళొద్దన్నా తను వినలేదు. అందుకే నేను తనను ఇంటి దగ్గర దింపుతున్నాను"

"పోన్లేబాబు నువ్వు ఉన్నావు కాబట్టి సరిపోయింది" అంటూ వెళ్ళిపోయారు ఆయన.

ఇంటికి వచ్చిన సీతారామయ్య బోసు ఇంటికి ఫోన్ చేశారు, అతని తండ్రి బుల్లెబ్బాయి ఫోను ఎత్తాడు.

"నేను సీతారామయ్యను మాట్లాడుతున్నా. నీ కొడుకుని నువ్వు కంట్రోల్ చేస్తావా లేదా? నన్ను చెయ్యమంటావా చెప్పు"

"ఏమైంది ఏం చేసాడు వీడు."

"చెయ్యటానికి పనేం లేకపోతే ఇంట్లో గోళ్ళు గిల్లుకోమను. తాగి ఆడపిల్లను, నోటికి ఇష్టం వచ్చినట్లు మాట్లాడతాడా. మా అమ్మాయి స్కూల్ నుండి ఇందాక వస్తుంటే అసహ్యంగా మాట్లాడాలంట" తీవ్రంగా అన్నారు సీతారామయ్య.

"ఈసారి పోలీసు రిపోర్టు ఇస్తాను ఇలాంటి వెధవ్వేషాలు వేస్తే. చెప్పు నీ కొడుక్కి" అని ఫోన్ పెట్టేశారు.

"ఛ ఎంత పరువు తక్కువ ఇది బైటకు తెలిసిందంటే నేనప్పటికీ చెప్పుతూనే ఉన్నా. ఈ రాత్రిపూట వెళ్ళటం ఎందుకు అని. మీరిద్దరూ నన్ను లెక్కచేయలేదు" అంది అన్నపూర్ణ.

"పూర్ణా ఎవరో ఏదో అన్నారని. చెయ్యాల్సిన పనులు ఆపుతామా. బైటకెళితే మన పిల్లను ఎంత మెచ్చుకుంటున్నారో తెలుసా. ఊరికే భయపడుతూ బ్రతక్కూడదు." అన్నారు అనునయిస్తున్నట్లు.

"అంజలి వెళ్ళి పడుకోమ్మా ఇవన్నీ మనస్సులో పెట్టుకోకు" అన్నారు సీతారామయ్య.

నిద్రరావట్లేదు అంజలికి. బోసు మాటలు గురించి ఆలోచించట్లేదు. మనుష్యుల మనస్థత్వం గురించి ఆలోచిస్తుంది. ఎంత విచిత్రంగా ఉంటుందో మనం ఎలాంటి వాళ్ళమైనా ఎవరికన్నా మంచి పేరు వస్తుంటే తట్టుకోలేరు. రవి మీద కోపంతో తన గురించి అలా మాట్లాడాడు. ఫోన్ మోగింది. రవి. "నాకు తెలుసు నువ్వు నిద్రపోయి ఉండవని. ఏం ఆలోచిస్తున్నావు" అన్నాడు ఎత్తంగానే.

"నేను నిద్రపోయాను. మీరే లేపారు" నవ్వుతూ అంది.

"సమస్యే లేదు. నా ఊహ తప్పుకాదు వదిలేయ్ అంజలి. దాదాపు సిటీలోనే పెరిగావు. రకరకాల మనుష్యులను చూశావు. ఎవరన్నా ఏదన్నా అన్నారని మనం బాధపడ్డామనుకో వాళ్ళు గెలిచినట్లే కదా. మనం అలాంటి వాళ్ళను ఎందుకు గెలిపించాలి. మనం చేసేది పనైనప్పుడు ఎవ్వరినీ పట్టించుకోకూడదు. మన పని మనం చేయాలి అంతే" అన్నాడు.

"కాకపోతే నామీద కోపంతో నీ గురించి చీప్‌గా మాట్లాడాడు అదే చిరాక్కా ఉంది."

మీతోనే కదా నాపేరు కలిపింది. నాకేం బాధలేదు. మనస్సులోనే అనుకుంది అంజలి.

"నేనేమీ బాధపడటంలేదు" అంది అంజలి.

చిన్నగా నవ్వి "సరే గుడ్ నైట్" అన్నాడు రవి.

సన్నగా చినుకులు పడుతున్నాయి. వర్షాకాలం చాలా బాగుంటుంది అంజలికి. రోడ్లు బురదగా అవుతాయి, బైటకు వెళ్ళటానికి వీలుకాదు అని అందరూ విసుక్కుంటారు కానీ వర్షంలో తడవటం అంటే చాలా సరదా అంజలికి.

పక్కింటివాళ్ళ పిల్లలు వచ్చారు. "అక్కా కాగితం పడవలు చేస్తావా?" అంటూ

వాళ్ళకి కాగితం పడవలు చేసి వాళ్ళు నీళ్ళల్లో వేసి ఆడుతుంటే వాళ్ళతోపాటు నీళ్ళల్లో తడుస్తూ నిల్చుంది అంజలి.

"అంజలి పకోడీలు అడిగావని చేశాను. పిల్లలకి వద్దని చెప్పటం పోయి నువ్వు కూడా తడుస్తున్నావా లోపలికి రండి అందరూ. జలుబు చేస్తుంది" పిలిచింది అన్నపూర్ణ.

"మేమెవ్వరం రాము కావాలంటే నువ్వేరా" అంది నవ్వుతూ అంజలి.

"ఇదిగో నీ ఫోన్ మోగుతుంది. లోపలికిరా"



కౌముది

రవి దగ్గర్నుండేనేమో రెండు రోజులయ్యింది తనతో మాట్లాడి అనుకుంటూ లోపలికి వెళ్ళింది అంజలి. రవి నుండే ఫోన్. తడిచిన బట్టలు మార్చుకుని జడవిప్పింది ఆరటానికి.

"ఇవిగో తిను పకోడీలు చెయ్యమని అడుగుతావు. వేడి ఆరిపోయాక తింటే బాగుంటాయా!?" ముద్దుగా విసుక్కుంది అన్నపూర్ణ. రవి తిరిగి ఫోన్ చేసాడు అంజలికి.

"బిజీగా ఉన్నావా వర్షం పడుతుంది కదా ఇంట్లోనే ఉన్నావేమోనని చేశాను" అన్నాడు.

"వర్షం పడుతుంది కాబట్టి బిజి. హాయిగా నీళ్ళల్లో తడుస్తూ, చక్కగా ఆడుకుంటుంటే డిస్టర్బ్ చేశారు" అంది నవ్వుతూ.

"ఓ... అయితే చాలా పెద్ద తప్పు చేశాను"

"మరి అస్సలు ఈ తప్పుకు క్షమించగలనో లేదో ఆలోచించాలి. ఊఁ పోనీ ఇంట్లో లేకపోతే మా ఇంటికి రండి. నాతోపాటు పకోడీలు తినచ్చు. అప్పుడు క్షమిస్తా"

"చాలా మంచి ఆఫర్. కానీ ఇంట్లో ఉన్నాను. అక్క, పిల్లలు వచ్చారు. అని చెప్పటానికే చేశాను. వాళ్ళు వచ్చిన రోజే వర్షం అంటే బోర్ అని గోల."

"ఏదీ? మరి వాళ్ళ మాటలేం వినపడలేదు" అంది అంజలి.

"నీకు ఎప్పుడు ఫోన్ చేసినా నా రూములోంచే చేస్తా. అందుకనే వాళ్ళు లేరు" అనేసిన తర్వాత, ఒక్క క్షణం రవి ఇదేంటి ఇలా చెప్పాను ఏమనుకుంటుంది? అనుకున్నాడు.

"వాళ్ళు టైర్డ్‌గా లేకపోతే కలవటానికి ఇప్పుడు రావచ్చా?" అంది అంజలి, రవి మాటలు గమనించనట్లుగా "వర్షం పడుతుందిగా ఎందుకు ఇబ్బంది. పోనీ రేపు రా" అన్నాడు రవి.

"అరే.. మళ్ళీ వర్షంలో తడిచే ఛాన్స్ వచ్చిందని నేననుకుంటుంటే మీరొకరూ"

గట్టిగా నవ్వాడు రవి. "మొదట్లో నిన్ను చూసి చాలా నిదానం ఈ అమ్మాయి అనుకున్నా. కానీ చాలా అల్లరిదానివి" అన్నాడు.

"సర్లే నీ ఇష్టం ఎప్పుడు రావాలంటే అప్పుడురా" అని ఫోన్ పెట్టేశాడు.

"అమ్మా సావిత్రిగారి అమ్మాయి అమెరికానుండి వచ్చిందంట. వెళ్ళి కలుద్దామా? మనకు ఇప్పుడు పనేం లేదుగా" అంది అంజలి.

"వర్షం తగ్గిందా? లేకపోతే రేపు వెళదాం"

"తగ్గిందిలే గొడుగు తీసుకెళదాం పద పద" అని బయలుదేరతీసింది.

"ఒట్టిచేతులతో ఎలా వెళతాం? పిల్లల దగ్గరకు ఊరికే హడావుడి చేస్తావు?" అంది అన్నపూర్ణ.

"నిన్న నాన్న తెచ్చి స్వీట్స్ ఉన్నాయిగా. అవి పెట్టు ఓ డబ్బాలో" అంటూ లోపలికి వెళ్ళి చుడీదార్ వేసుకుని వచ్చింది జుట్టు ఇంకా తడిగానే ఉంది. ఓ క్లిప్ పెట్టి వదిలేసింది.

"చెపితే చాదస్తం అని కొట్టిపారేస్తావు. అలా జుట్టు విరబోసుకుని, బైటకెళితే దిష్టి తగలదూ" అంది అన్నపూర్ణ డబ్బాలో పూతరేకులు కాజాలు పెడుతూ.

"తగిలితే తీసేద్దువుగాని పద... పద" అని హడావుడి పెట్టింది.

అంజలి, అన్నపూర్ణ వెళ్ళేసరికి అందరూ ముందు గదిలో కూర్చుని మాట్లాడుతున్నారు.

"ఏమ్మా నీరజ బాగున్నారా అందరూ" అంటూ పలకరించారు అన్నపూర్ణ.

అంజలి చదువంతా బైట జరగటంతో అంజలికి గుర్తులేదు నీరజ.

"రా వదినా.. అయ్యో వర్షంలో వచ్చారా?" అంటూ ఎదురొచ్చింది సావిత్రి.

"అబ్బే లేదులే తగ్గింది" అంది అన్నపూర్ణ.

అంజలి కళ్ళు రవి కోసం వెతికాయి. ఒక సోఫాలో, నీరజ కొడుకుని ఒళ్ళో కూర్చోపెట్టుకుని ఏదో వీడియో గేమ్ ఆడుతున్నాడు. వీళ్ళ మాటలు విని తల ఎత్తి చూశాడు రవి. ఆకుపచ్చ చుడీదార్‌లో జడవేయకుండా జుట్టు వదిలేయటంతో, మొహం మీద పడుతున్న జుట్టు సవరించుకుంటూ ఎప్పుడూ, ఏ సమయంలో చూసినా ఎంత బాగుంటుంది అంజలి.

నీరజ దగ్గరకు వచ్చి, "ఎప్పుడో చిన్నప్పుడు చూశాను. అంజలి కదూ" అంది "రండి కూర్చోండి. ఇదిగో నా కూతురు శ్రావణి, కొడుకు సాత్విక్" అని పరిచయం చేసింది.

శ్రావణి దగ్గరకు ఓ పదేళ్ళు ఉంటాయనుకుంటా ముద్దుగా ఉంది. "తెలుగు అర్థం అవుతుందామ్మా పిల్లలకు" అడిగింది అన్నపూర్ణ. "శ్రావణి బాగానే మాట్లాడుతుంది, కానీ సాత్విక్ స్కూల్‌కి వెళ్ళటం మొదలుపెట్టాక మర్చిపోయాడు. రోజూ అరుస్తూనే ఉంటే నేను ఆ స్కూలు మాటలు అన్నీ చెప్పాలంటే తెలుగులో రావు. దాంతో ఇంగ్లీషులోనే మాట్లాడతాడు" అంది నీరజ.

అంజలి శ్రావణితో కబుర్లు చెపుతూ అక్కడ స్కూల్ విషయాలు అడుగుతుంది. మామయ్యే కాకుండా ఇంకా ఇంగ్లీషులో మాట్లాడేవాళ్ళు. ఇంకొకళ్ళు దొరకటంతో, శ్రావణికూడా కొత్తలేకుండా మాట్లాడుతుంది.

వీళ్ళకు టిఫిన్ తీసుకురావటానికి లోపలికి వెళ్ళబోయింది సావిత్రి.

"ఇదిగో వదినా పూతరేకులు, కాజాలు" అంది అన్నపూర్ణ తెచ్చిన డబ్బా ఇస్తూ

"ఎందుకివన్నీ ఇప్పుడు?"

"ఈయన రెండు రోజుల క్రితం రాజమండ్రి వెళ్ళారు రైతు సదస్సుకి వస్తూ అక్కడ బాగా చేస్తారని తెచ్చారు" అంటూ అన్నపూర్ణ కూడా సావిత్రితోపాటు లోపలికి వెళ్ళింది.

నీరజ వచ్చి అంజలి పక్కన కూర్చుంది. "మెడిసిన్ అయ్యిందంట కదా. ఏం చేద్దామనుకుంటున్నావు తర్వాత"

"పిజికి హైదరాబాదులో సీటు వచ్చింది. జనరల్ సర్జరీ చేస్తున్నాను" అంది.

"జనరల్ సర్జరీకి బాగా డిమాండు ఉంటుందా?" అంది నీరజ.

"మెడిసిన్ చదివేటప్పుడు ఆంకాలజీ, అదే కాన్సర్ మీద రీసర్చ్ చెయ్యాలి అనుకునేదాన్ని. ప్రాక్టీస్ చేద్దామని ఎప్పుడూ అనుకోలేదు."

"అబ్బో కాన్సర్ మీద అంటే బాగా డిమాండు ఉంది కదా!"

"అవును. ఈ మధ్య మనకు ఇండియాలో కూడా, కాన్సర్ బాగా ఎక్కువైయింది.

"మన జీవన విధానాల్లో మార్పువల్లే అది కూడా"

"మరి ఎందుకు వెళ్ళలేదు ఆంకాలజి వైపు. సీటు రాలేదా?" అంది నీరజ కుతూహలంగా.

"రీసెర్చి చెయ్యటానికి ప్రపంచం అంతా చాలామంది ఉన్నారు. కానీ పల్లెటూళ్ళలో వైద్యం అందించటానికి ఎక్కువమంది ముందుకు రావటంలేదు. అందుకని మనస్సు మార్చుకున్నా" అంది నవ్వుతూ.

సాత్విక్‌తో వీడియోగేమ్ ఆడుతున్నా, వీళ్ళ మాటలు వింటున్నాడు రవి. ఇంతకాలంనుండి అంజలితో మాట్లాడుతున్నా తనతో ఈ విషయం ఎప్పుడూ చెప్పలేదే అని ఆశ్చర్యపోయాడు. కానీ తనుకూడా ఎప్పుడూ అంజలి పర్సనల్ విషయాలు అడగలేదు. ఏదో మొహమాటం. ఒకసారి నోరు జారి వివేక్ సంగతి మాట్లాడినందుకే ఎంతో ఇబ్బంది పడ్డాడు. ''మావాడిలాగానే పల్లెల సేవ చేస్తావన్నమాట'' నవ్వుతూ అంది నీరజ.

''రవిగారితో నన్ను పోల్చద్దు. తను చేసే పనులతో పోలిస్తే నేనేమి చెయ్యటంలేదు.''

''ఏంటి నన్ను పొగడుతున్నావా అక్కా! అంజలి వచ్చి గట్టిగా ఓ రెండున్నర నెలలయ్యిందేమో ఇక్కడ ఆడాళ్ళ సంఘాలు చూడాలి ఎంత స్ట్రాంగ్‌గా ఉన్నాయో. అంతకు ముందు డ్వాక్రా సంఘాలు మొదలెడదామన్నా ముందుకు రానివాళ్ళు మరి ఏం మాట్లిడిందో కానీ రాత్రిపూట చదువుకున్నవాళ్ళు కానీ, పొదుపు కార్యక్రమం కానీ బాగా సాగుతున్నాయి'' ఇంకా ఏదో చెప్పబోయాడు రవి. ఇంతలోకి బైటనుండి కొంచెం పెద్దగా మాటలు వినిపించాయి. రవి బైట గేటు దగ్గరకు వెళ్ళాడు. రవితోపాటు చంద్రశేఖర్రావు కూడా వెళ్ళారు.

లోపల్నుండి సావిత్రి టిఫెన్లు తీసుకొచ్చింది. ''కాసేపు కూడా కూర్చునే పనిలేదు. ఎప్పుడూ ఏదో గొడవ. ఇవ్వాళ నీరజ పుణ్యమా అని రోజంతా ఇంట్లో ఉన్నాడు అనుకుంటున్నా. ఇంతలోనే ఎవరో వచ్చారు'' రవి వెళ్ళినవైపు చూసి విసుక్కుంది సావిత్రి.

కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు. అంతలోకి రవి లోపలికి వచ్చాడు. తన మొహం చూసి బలవంతాన నవ్వు ఆపుకుంటున్నట్లుగా ఉంది''

''ఏమైంది ఏంటా గొడవ నాన్నేరి?'' అడిగింది నీరజ.

''బైటకెళ్ళారు. ఏం గొడవలేదులే'' అన్నాడు నవ్వుతూ.

''గొడవ లేదంటావేంట్రా అంత గట్టిగా అరుస్తుంటే వచ్చినతను'' అంది నీరజ.

''ఏం లేదులే వదిలేయ్. అంజలి కొత్త రకం పాఠాలు చెపుతుంది. దాని ప్రభావం'' అన్నాడు నవ్వుతూ.

''నేనేం చేశాను'' అంది అంజలి ఆశ్చర్యపోతూ.

ఇంతలో శ్రావణి అంది ''అమ్మా, ఊరు చూడటానికి వెళదామా?'' అని.

''రేపు నేను బాగా ఎండవస్తే పొలం దగ్గరకు తీసుకువెళతాను'' అన్నాడు రవి.

''వద్దులే బురదగా ఉంటుందేమో రెండు రోజులాగాక వెళ్ళచ్చులే'' అంది సావిత్రి.

''ఇంక బయలుదేరతాం వదినా. రేపు శుక్రవారం మేము వరలక్ష్మివ్రతం చేస్తున్నాం. అందరూ తప్పకుండా రండి'' అంది అన్నపూర్ణ.

''అదేంటి మొదటివారమే చేసుకుంటున్నారా?'' అంది సావిత్రి.

''వచ్చేవారం అంజలి ఉండట్లేదు, తన ఫ్రెండ్ పెళ్ళికి హైదరాబాదు వెళుతుంది'' అంది అన్నపూర్ణ.

''ఓ... రఘువాళ్ళ పెళ్ళి వచ్చే శనివారం కదూ'' అన్నాడు రవి.

అంజలి ఫ్రెండ్, రవికెలా తెలుసు? ఆశ్చర్యంగా అనుకుంది నీరజ. బైటకొస్తూ. రవి దగ్గర ఆగి నెమ్మదిగా అడిగింది అంజలి.

''ఇంతకీ గొడవేంటో చెప్పలేదు.''

''చెప్పలేను. వదిలేయ్'' అన్నాడు మళ్ళీ నవ్వాపుకుంటూ.

చిరుకోపంతో రవి వంక చూసి వెళ్ళింది అంజలి. ఏమైంది ఎందుకలా నవ్వుతున్నాడు చెప్పొచ్చు కదా.

రవి తన గదిలోకి వెళ్ళాడు. పిల్లల్ని ఆడుకోమని చెప్పి నీరజ రవి దగ్గరకు వెళ్ళింది. డాబామీద పిట్టగోడ దగ్గరగా నిల్చుని ఏదో ఆలోచిస్తున్నాడు రవి.

"పైకి వస్తే, పనేమన్నా ఉందనుకున్నా. ఏం ఆలోచిస్తున్నావు?" అంది నీరజ.

ఉలిక్కిపడి వెనక్కి తిరిగాడు రవి.

మొహం మీద నవ్వు చూసి "ఏంటి అంతలా నవ్వుతున్నావు?"

"ఏం లేదు అంజలి గురించి. తను రాత్రిపూట పాఠాలు అయ్యాక ఆడవాళ్ళతో వాళ్ళ సమస్యలు గురించి మాట్లాడుతూ ఉంటుంది. ఏం మాట్లాడుతుందో నాకు తెలియదు. తను నాకు కూడా చెప్పదు" మళ్ళీ నవ్వటం మొదలుపెట్టాడు.

రవి అంత గట్టిగా నవ్వటం చాలా అరుదు. ఇంతగా నవ్వించిన విషయం ఏంటా అనుకుంది నీరజ.

"ఇందాక ఓ ఇద్దరు పాలెం వాళ్ళు వచ్చారు. వాళ్ళు తాగి ఉన్నారు. వచ్చీ రాగానే మా సంసారాల్లో నిప్పులు పోస్తారా! సదువులు సెపుతామని ఆడాళ్ళని రెచ్చగొట్టి మా సంసారాలు నాశనం చేస్తున్నారు అని అరవటం మొదలుపెట్టారు. నేను, నాన్న, మన రంగ అందరం వాళ్ళని ఊరుకోబెట్టేసరికి చాలా కష్టమైంది. ఇంతకీ విషయం ఏంటంటే సారా తాగొద్దని బాగా గొడవచేస్తున్నారంట. వీళ్ళు వినట్లేదని, రెండువారాల్నుండి, వీళ్ళు తాగివస్తే ఇంట్లోకి రానివ్వటం లేదంట. తాగి వచ్చిన మొగాడితో కాపురం చెయ్యం అని ఖచ్చితంగా చెప్పారంట. ఈ మొగాళ్ళెవరన్నా కోపం వచ్చి కొట్టబోతే ఆడాళ్ళందరూ ఒక్కటయ్యి తిరగబడుతున్నారంట. దీనంతటి వెనకాల ఆడాళ్ళ రాత్రిపూట స్కూల్ వుందని వీళ్ళకి తెలిసిందంట. ఇక నా మీద పడ్డారు నేను చెప్పానని."

"అంజలినే వాళ్ళతో ఇది చెప్పిందని ఏంటి?" అంది నీరజ.

"తనే చెప్పుండాలి. నాకు అనుమానం లేదు. వాళ్ళతో ఏదో చెప్పాను. నేను ఆ పాఠాలు చెప్పను. అయినా వాళ్ళ సంసారం గొడవలు ఊళ్ళోకి తెస్తారని తిట్టి పంపేశాను" నవ్వాడు రవి.

"మంచి ఐడియా ఇచ్చింది అంజలి."

"సరేకానీ అంజలి నీకు ఎన్నాళ్ళుగా తెలుసు?" అంది నీరజ.

"ఈ సెలవల్లోనే అంటే గత 2,3 నెలలుగా. ఏ ఎందుకు అడుగుతున్నావు?"

"ఏం లేదు తన ఫ్రెండ్స్ కూడా నీకు ఎలా తెలుసు?" అంది నీరజ.

"ఓ.. అదా తన ఫ్రెండ్స్ ఓ ఐదుగురు, తనతోపాటు సెలవల్లో వచ్చారు మెడికల్ క్యాంప్ పెడతామని. అలా పరిచయం అయ్యింది. అందరూ మంచివాళ్ళు. మన స్కూల్‌లో ఓ వారం పాటు మాట్లాడారు. ఆ గ్రూపులో వాళ్ళే రఘు, రాధికది పెళ్ళి వచ్చేవారం. నన్నుకూడా రమ్మనమని బాగా గొడవ చేస్తున్నారు. ఒక్కరోజే కదా వెళతానేమో?" అన్నాడు రవి.

రవికి అంజలికి మధ్య స్నేహం కాక ఇంకేదో ఉందన్న అనుమానం వచ్చింది నీరజకి. ఇందాక రవి అంజలి వైపు చూసే విధానం గమనించింది. సాత్విక్‌తో ఆడుతున్నట్లే ఉన్నాడు కానీ అంజలి వంక మధ్య మధ్యలో చూస్తున్నాడు. సరే ఇంకా మూడు వారాలుంటుందిగా. గమనించాలి. అనుకుంది నీరజ.

**శుక్రవారం.** ఎన్నో ఏళ్ళు అయ్యింది. శ్రావణ శుక్రవారం రోజు అంజలి ఇంట్లో ఉండి. అన్నపూర్ణకు ఎంతో సంబరంగా ఉంది. రకరకాల పిండివంటలు తయారు చేయటం కోసం బాగా హడావుడిగా ఉంది బైట పెద్ద ముగ్గు వేసింది అంజలి. దానిని రంగులతో

నింపింది. బైటగేటు నుండి లోపలికి వచ్చే దోవలో కూడా చిన్న ముగ్గులు వేసి, రంగు రంగుల చేమంతులతో నింపింది. దేవుడి దగ్గర అంతా చక్కగా అలంకరించారు ఇద్దరూ కలిసి.

"ఇన్నాళ్ళకు ఇంట్లో లక్ష్మీదేవిలా తిరుగుతున్నావు. నగలన్నీ పెట్టుకో" అని బ్రతిమిలాడి వడ్డాణంతో సహా నగలన్నీ పెట్టింది అన్నపూర్ణ.

పూజ అయ్యాక నగలు తీయబోయింది అంజలి. "అబ్బా ఉంచుకోమ్మా. మళ్ళీ మళ్ళీ పెట్టుకుంటావా రాత్రికి తీద్దువుకానీ" అని ఆపేసింది అన్నపూర్ణ.

కాసేపు మధ్యాహ్నం పడుకుని లేచారు అన్నపూర్ణ. సాయంత్రం పేరంటం దగ్గరకు కావల్సినవని సర్దుతున్నారు. రవి దగ్గర్నుండి ఫోన్ వచ్చింది. కావాలని తీయలేదు అంజలి. మొన్నెందుకు నవ్వారో చెప్పలేదు. తర్వాత ఫోన్ చేయలేదు. నేనేం మాట్లాడను తనతో ఉడుక్కుంది అంజలి. "బిజీగా వున్నావా?" అన్న మెసేజ్ వచ్చింది. దానికి కూడా కోపంతో సమాధానమివ్వలేదు.

సాయంత్రం పేరంటాళ్ళు అందరూ వచ్చారు. నీరజ, సావిత్రి కూడా పిల్లల్ని తీసుకుని వచ్చారు. శ్రావణి చక్కగా బుట్టబొమ్మలాగా తయారయ్యింది. అందరూ చక్కగా పూజ చేసుకుని హారతిచ్చారు. అన్నపూర్ణ, అంజలిని హారతి పాటపాడమంటే, పాడింది. "పాటలు బాగా పాడతావు అంజలి" అంది నీరజ.

"మా శ్రావణి కూడా సంగీతం, డాన్స్ నేర్చుకుంటుంది."

"అయితే శ్రావణి నువ్వు కూడా ఓ పాట పాడాలి" అంది అంజలి.

కాస్త సిగ్గుపడి వాళ్ళ అమ్మవంక చూసి సంగీతంలో ఓ గీతం పాడింది.

"చాలా బాగా పాడావు. చక్కగా అమెరికాలో కూడా నేర్చుకుంటున్నావా?" అని అందరూ పొగిడారు.

ఆడవాళ్ళ పాదాలకు పసుపు రాసి, బొట్టుపెట్టి తాంబూలం ఇచ్చారు అంజలి, అన్నపూర్ణ. అందరూ బయలుదేరారు. నీరజ వాళ్ళు బయలుదేరుతుంటే ఆపింది అన్నపూర్ణ.

"మీరు కూర్చోండి. భోంచేసి వెళ్ళొచ్చు" అని.

"ఇంకోసారి వస్తాంలే. ఇప్పుడెందుకు?" మొహమాటంగా అంది సావిత్రి.

"ఏంకాదు అన్నయ్యకు, రవికి కూడా ఫోన్ చేయండి. సరదాగా కాసేపు కూర్చోవచ్చు కాదనకూడదు" అంది అన్నపూర్ణ.

"అమ్మ ఇంక నగలు తీసేస్తా" అంది అంజలి.

"కాసేపు కళ్ళముందర లక్షణంగా తిరుగుతున్నావని అనుకుంటుంటే చిన్నపిల్లలాగా ఏంటది? ఉంచుకో" కోప్పడింది అన్నపూర్ణ.

చంద్రశేఖర్రావుకి, రవికి ఫోన్ చేశారు భోజనాలకు రమ్మనమని, అందరూ కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు. అన్నపూర్ణ వంటగదిలోకి వెళ్ళింది వేడిగా గారెలు చేయటానికి. అంజలి, నీరజను పిల్లల్ని తీసుకుని డాబా మీదకు వెళ్ళింది.

నిశాదేవి, చీకటి మేలిముసుగు సవరించుకుంటూ ఆకాస రాజును కలవటానికి బయలుదేరింది. ఈ సంగమమే చూడటానికి చిలిపి చంద్రుడు మబ్బుల చాటునుండీ తొంగి చూస్తున్నాడు.

"చాల అందంగా ఉంది అమ్మ ఇక్కడ" ఇంగ్లీషులో అంది శ్రావణి.

"నాకు చాలా ఇష్టం ఇక్కడ కూర్చోవటం. ప్రొద్దునే లేచి ఇక్కడ కూర్చుని పాటలు వింటూనో, పుస్తకాలు చదువుతూనో కూర్చుంటా" అంది అంజలి.

"బోర్ కొడుతుంది నాకు" అన్నాడు సాత్విక్.

"వీడు పూజ దగ్గర ఇంతసేపు కూర్చోవటమే ఆశ్చర్యం" అంది నవ్వుతూ నీరజ.

"సరే క్రిందకు వెళ్ళి దాగుడు మూతలాడుకుందామా?" అంది అంజలి.

"చిన్నప్పుడు వెన్నెల్లో అందరం ఎంత బాగా ఆడవాళ్ళమో రెండు, మూడు బజార్లవరకు ఎక్కడున్నా దాక్కోవచ్చు. ఏంటో ఆ రోజులు మళ్ళీ రావు. ఎంతసేపు ఎవరింట్లో వాళ్ళు వీడియో గేమ్స్ ఆడుకోవటమే" నిట్టూర్చింది నీరజ.

క్రిందకు వెళ్ళాక తొక్కుడు బిళ్ళ ఎలా ఆడాలో నేర్పించింది.

"ఓ ఇది అమెరికాలో కూడా ఆడతాం. కొంచెం వేరేగా" అంది శ్రావణి.

నలుగురూ కలిసి తొక్కుడు బిళ్ళ ఆడుతుంటే పిల్లలు విపరీతంగా ఎంజాయ్ చేశారు. వరండాలో లైట్లు తీసేసి, సాత్విక్‌ని, శ్రావణిని దాగుడుమూతలు ఆడుకోమని చెప్పి నీరజ అంజలి వరండాలో కూర్చున్నారు కబుర్లు చెప్పుకుంటూ.

నీరజకు అంజలి బాగా నచ్చింది. కానీ తన మనస్సులో రవి అంటే కేవలం గౌరవమేనా? ఇంకేమన్నా ఉందో అర్థం కాలేదు. పైగా ఇద్దరికీ వయస్సులో ఆరేళ్ళు తేడా ఉంది. అమ్మతో ఈ విషయం కదపనా? వద్దులే ముందే చెప్పానంటే అమ్మ సంతోషంతో పెళ్ళి ముహూర్తాలు కూడా పెట్టిస్తుంది.

"శుక్రవారం పూట వాకిట్లో లైటు వెయ్యలేదే?" అనుకుంటూ లోపల్నుండి వచ్చారు అన్నపూర్ణ, సావిత్రి.

"పిల్లలు ఆడుకుంటున్నారమ్మా" అంది నీరజ.

"అమ్మో చీకట్లోనా ఇంక చాలు లైట్లు వెయ్యి అంజలి. ఏమన్నా పురుగూ పుట్రా ఉన్నా" అంది అన్నపూర్ణ.

నీరజ పిల్లల్ని పిలిచింది.

"ఐ యామ్ హంగ్రీ" అన్నాడు సాత్విక్.

"రండి కాళ్ళూ చేతులు కడుక్కుందురు. స్నాక్స్ తిందాం" అని లోపలకు తీసుకెళ్ళింది అంజలి.

ఇంతలోకి ముగ్గురు మొగాళ్ళు వచ్చారు.

"ఏంటి ఇంత సైలెంట్‌గా ఉంది. పిల్లలేరి?" అన్నాడు రవి.

"ఇప్పటిదాకా ఆడారు. అంజలి లోపలకు తీసుకుని వెళ్ళింది" అన్నారు అన్నపూర్ణ.

లోపల్నుండి పిల్లలు చేతిలో లడ్డూలు పట్టుకుని తింటూ వచ్చారు.

అంజలి కోసం రవి కళ్ళు వెతికాయి. కనపడలేదు. ఏం చేస్తుంది. ఫోన్ చేస్తే కూడా జవాబులేదు.

"అందరూ రండి భోజనాలకు కింద కూర్చుని తింటానికి ఎవ్వరికీ ఇబ్బంది లేదుగా? లేకపోతే టేబుల్ మీద సర్దుతాను" అంది అన్నపూర్ణ.

వంటింటింకి, ఇంటికి మధ్య స్థలంలో చాపలు వేసి, అరిటాకులు పెట్టి ఉన్నాయి. దగ్గర్లోనే ఏవో గిన్నెలు పెట్టి ఉన్నాయి.

"అందరం ఇక్కడే కూర్చుందాం బాగుంది వెన్నెల్లో" అన్నాడు రవి.

శ్రావణి, సాత్విక్ మీరు టేబుల్ దగ్గర కూర్చుంటారా?" అంజలి గొంతు విని చేతులు కడుక్కుంటున్న రవి చివ్వున తలతిప్పి చూశాడు.

ఎరుపు చీర, నడుముకు వడ్డాణం, మెళ్ళో పెద్దహారం ముందుకు పడిన జడ, తలనిండా పూలు. నుదుటి మీద పడిన జుట్టును ఒకచేత్తో వెనక్కి తీసుకుంటూ, ఇంకో చేతితో నీళ్ళ జగ్గుపట్టుకుని అమృత భాండం పట్టుకున్న మోహినిలా ఉంది రవికి. గొంతు తడారిపోయినట్లుగా అనిపించింది రవికి.

"పర్లేదు అంజలి వీళ్ళు కింద కూర్చోగలుగుతారులే" అంది నీరజ. అందరూ వచ్చి కూర్చున్నారు.

"అమ్మ నువ్వు కూడా కూర్చో, నేను వడ్డిస్తాను" అంది అంజలి.

"మనిద్దరం తర్వాత తిందాంలే" అంది అన్నపూర్ణ.

"వద్దు అందరం కలిసి తిందాం అన్నీ వడ్డించిన తర్వాత. ఇక్కడే ఉన్నాయి కదా మళ్ళీ కావాలంటే" అంది నీరజ.

గారెలు, పూర్ణాలు, పులహోర, గోంగూర పచ్చడి, తమ్మకాయ వేపుడు, గుమ్మడికాయ పులుసు, పాలతాలికలు.

"ఏంటివన్నీ ఇన్ని రకాలు చేశారు" అంజలి వడ్డిస్తుంటే అంది నీరజ.

"మీ అమెరికా పిల్లలకు మన వంటలు చూపొద్దా" అంది సావిత్రి గారెలు వడ్డిస్తున్న అంజలి వైపు చూసి పలకరింపుగా నవ్వాడు రవి. అంజలి తనవైపు చూడలేదు. అరిటాకు వంక చూసి వడ్డించి పక్కకెళ్ళింది. ఏమైంది అంజలికి నా వైపు ఎందుకు చూడటంలేదు. నామీద కోపం వచ్చిందా ఏం చేశాడు తను. అర్థంకాలేదు రవికి.

అందరూ సరదాగా కబుర్లు చెప్పుకుంటూ భోంచేస్తున్నారు. ఇక అంజలితో మాట్లాడకుండా ఉండటం రవి వల్ల కాలేదు.

"మన ఇళ్ళ ప్రాజెక్ట్ ఉంది కదా. దాని గురించి సబ్ - కలెక్టర్‌గారితో మాట్లాడా కదా ఇంకేంటో డిటైల్స్ కావాలంట రేపు రమ్మనమని సాయంత్రం ఫోన్ వచ్చింది ఆయన పి.ఏ నుండి. మన బ్లూ ప్రింట్స్, బడ్జెట్ ప్లాన్ అన్నీ తీసుకెళ్ళాలి. అంజలి నువ్వు కూడా వస్తావా తెనాలి" అంటూ "ముందు సతీష్, నేనూ వెళ్ళాలనుకున్నాం, కానీ సతీష్‌కు ఏదో ఇబ్బంది ఉందని రావట్లేదు. ఒకడినే వెళ్ళటం కంటే, ఈ ఊరిలో జరిగే ప్రోగ్రామ్స్ గురించి ఇంకెవరన్నా కూడా ఆయనకు ఎక్స్‌ప్లెయిన్ చేస్తే బాగుంటుందని" అన్నాడు రవి.

"ఊరి గురించి తప్పితే నీకు మాట్లాడటానికి ఏమీ ఉండవా?" అంది నీరజ.

"నాతో మాట్లాడటానికైతే అస్సలింకేం ఉండవు" మనస్సులో అనుకుంది అంజలి. భోంచేస్తూ రవి తన వంక చూడటం తెలుస్తూనే ఉంది అంజలికి. ఎందుకు తను రవిమీద అలిగింది. ఏమో రవిని కాసేపు మాట్లడకుండా ఏడ్పించాలనేగా కావాలని ఫోన్ ఎత్తలేదు. మరి ఇప్పుడు తెనాలి వెళదాం అంటున్నాడు. వెళ్ళాలా.

"అంజలి రేపు తెనాలి వెళ్ళితే చీరలు కొనుక్కో రాధ పెళ్ళికి కావాలిగా" అంది అన్నపూర్ణ.

"అమ్మా నేను రాధ పెళ్ళికి అన్నీ హైదరాబాదులోనే కొంటాను ఇంకో రెండు రోజుల్లో వెళతాను కదా!" అంది

"పాలతాలికలు పెట్టుకో నీరజ" నీరజ ఆకు మడతపెట్టటం చూసి అన్నారు అన్నపూర్ణ.

"అమ్మో ఇక నావల్ల కాదు. కాసేపు ఆగి తింటాను. ఈలోపల తిన్నది అరగటానికి కాలవదాకా వాకింగ్‌కి వెళతాను" అందరూ నవ్వారు.

"ఈ కాలం పిల్లలు సరిగ్గా తినలేరు. ఓపిక లేక పనులు చేసుకోలేరు" అంది సావిత్రి.

అందరూ లేచారు. గిన్నెలు సర్ది పాలతాలికలు చిన్న చిన్న గిన్నెల్లో సర్ది ట్రేలో పెట్టుకుని ముందు గదిలోకి తెచ్చింది అంజలి.

"వాకింగ్‌కి వెళదాం అన్నావు పద" వాళ్ళ అమ్మ చెయ్యిపట్టుకుని లాగుతున్నాడు సాత్విక్.

"అమెరికాలో వేసవికాలం వస్తే రోజు రాత్రిపూట అందరం వాకింగ్‌కి వెళతాం. ఇందాక మాటవరసకు అన్నా ఇక అది పట్టుకున్నాడు" అంది నీరజ.

"ఇంటికి వెళ్ళేటప్పుడు నడిచి వెళదాం కదా అదే వాకింగ్" సాత్విక్‌తో చెప్పింది.

"అక్కా కం.. పైకి వెళదాం" అని పరిగెత్తాడు సాత్విక్.

"నేను తీసుకొస్తాలే" అని వాళ్ళ వెనకాల వెళ్ళింది అంజలి.

"పోన్లే పిల్లలు బాగా కలిసిపోయారు. ఈ ఉక్కపోత అలవాటు ఉండదు పాపం. దాంతో పాటు దోమలు" అంది అన్నపూర్ణ.

"ఏంటో మా చిన్నప్పుడు ఇన్ని దోమలుండేవి కాదు. లేకపోతే పట్టించుకునేవాళ్ళం కాదేమో?" అంది నీరజ.

చంద్రశేఖర్రావు, సీతారామయ్య రాజకీయాలు మాట్లాడుకుంటున్నారు. రవికి విసుగ్గా ఉంది. మళ్ళీ అంజలి ఎక్కడికో వెళ్ళింది నా దగ్గర లేకుండా ఏంటిది? ఏమైంది తనకు.

"నెమ్మదిగా లేచి ఫోన్‌లో మాట్లాడుతున్నట్లుగా బైటకు వెళ్ళి, మేడమీదకు వెళ్ళాడు.

సాత్విక్, శ్రావణి పరిగెత్తుతుంటే, అంజలి పక్కన నిల్చుని చూస్తుంది.

"నాతో ఎందుకు మాట్లాడటంలేదు?" దగ్గరకు వచ్చి అడిగాడు రవి.

ఉలిక్కిపడింది అంజలి.

"మాట్లాడుతున్నాగా" చిన్నగా అంది.

"ఫోన్ చేస్తే తియ్యటంలేదు. మెసేజ్‌కి రిప్లై లేదు. ఇందాక తెనాలి వస్తావా? అంటే మాట్లాడలేదు. ఏమైంది నీకు. నేనేమన్నా అన్నానా?" అన్నాడు రవి.

"నాలుగురోజులు పట్టిందా నేను అలిగానని తెలుసుకోవటానికి?" అంది అంజలి.

"అలిగావా ఎందుకు?" అన్నాడు రవి.

"అంజలి" ఏదో చెప్పబోయాడు రవి.

"శ్రావణి ఇంక పదండి కిందకు. దోమలున్నాయి" అని ముందుకు నడిచింది అంజలి.

రవి గబుక్కున అంజలి చెయ్యిపట్టుకుని ఆపాడు. "నువ్వు చాలా బాగున్నావు ఇవాళ" గభాల్న అన్నాడు.

స్టన్ అయ్యింది అంజలి. "రేపు పొద్దున్న దాకా ఆలోచిస్తాను నేనేం చేశానో. నాకు ఇంకా అర్థంకాకపోతే మాత్రం నువ్వు చెప్పాలి సరేనా?"

ఏంటి ఈ మనిషి ఒక టాపిక్ నుండి ఇంకోటి అబ్బా ఎలా వేగేది? నిజంగానే నేను బాగున్నానని అన్నాడా లేక భ్రమ?

"రేపు తొమ్మిదిగంటలకల్లా రెడీగా ఉంటావా?" అన్నాడు ఇంకా చెయ్యి వదలకుండా.

"ఊఁ....సరే" అని చెయ్యి, విదిలించుకుని పిల్లలను తీసుకుని కిందకు వెళ్ళింది.

చాలా సిగ్గుగా తడబాటుగా ఉంది అంజలికి. "నువ్వేనా.. నాలో నువ్వేనా?" ఆనంద్ సినిమాలోని పాట గుర్తొచ్చింది.

"అన్ని వంటలు చాలా బాగున్నాయి" అంది నీరజ. "ఉండు ఒక్క నిమిషం. నీకు తాంబూలం ఇవ్వలేదు" అని అన్నపూర్ణ లోపలకు వెళ్ళి పళ్ళెంలో నీరజకు చీర, తాంబూలం, తీసుకొచ్చి బొట్టుపెట్టి ఇచ్చింది.

"చీర ఎందుకు ఇప్పుడు?"

"శుక్రవారం పూట బట్టలు పెడుతుంటే కాదనకూడదు. ఇంట్లో ఉన్నదేదో పెట్టాను" అంది అన్నపూర్ణ. సావిత్రికి కూడా జాకెట్టు గుడ్డ, తాంబూలం ఉన్న ప్యాకెట్ ఇచ్చింది. పిల్లల చేతుల్లో డబ్బులు పెట్టి "వాళ్ళకేం బట్టలు కావలో అవి కొను" అంది.

"ఏంటిదంతా ఇప్పుడు పూర్ణా" అంది సావిత్రి.

అందరు బయలుదేరి గేటు దగ్గరకు వెళుతుంటే, అంజలి పక్కకి వచ్చి రేపు 9కి వస్తాను. రెడీగా ఉండు. నాకైతే ఇవాళ నిద్రపట్టదు" అన్నాడు రవి.

కళ్ళు పెద్దవి చేసి చూసింది అంజలి.

"అదే నువ్వు ఎందుకలిగావ్ అని" నవ్వేసి వెళ్ళిపోయాడు.

బాబోయ్ రవికేదో అయ్యింది ఇవాళ. నాతో మాట్లాడుతుంటే తన గొంతేంటో తేడాగా అనిపించింది ఎందుకు? మంచం మీద పడుకుని ఆలోచిస్తుంది అంజలి. రవికి తనంటే ఇష్టమేనా? లేక తనను ఇష్టపడితే బాగుండు అన్న భావనతో అన్నిటినీ భూతద్దంలో చూస్తోందా తను. "నువ్వు చాలా బాగున్నావు అంజలి" ఇవే మాటలు పదే పదే గుర్తొస్తున్నాయెందుకు?

ఎన్నో భావాలు ఎన్నెన్నో ముచ్చట్లు చెప్పాలనుకున్నవన్నీ చెలియలి కట్టదాటి కలగాపులగమైతే మిగిలేది?

"ఏం బట్టలు వేసుకోవాలి?" బీరువా ముందు నిల్చుని ఆలోచిస్తోంది అంజలి. ఇప్పటికే ఓ అరడజను తీసి పక్కన పడేసింది. తను చీర కట్టుకున్నప్పుడు మెరిసే రవి కళ్ళు గుర్తొచ్చాయి. తన ఫేవరేట్ నగలు చీర తీసి శ్రద్ధగా తయారయ్యింది. అంతా అయ్యాక అద్దంలో చూసుకుని మరీ అతిగా ఉందా? నేను సబ్ కలెక్టర్‌ని కలవటానికి వెళుతున్నానా? పార్టీకా? మార్చేయనా? కాటన్ చీర కట్టుకుంటే డిగ్నిఫైడ్‌గా ఉంటానేమో.. అబ్బ ఇంతగా విశ్లేషించటం అవసరమా?

"అంజలీ రవి వచ్చాడు ఇంకా తయారవ్వలేదా?" బైట నుండి సీతారామయ్య పిలుపు వినిపించింది.

గబగబా బ్యాగ్‌లో డబ్బులు పెట్టుకుని బైటకు వచ్చింది. అంజలిని చూసి "రెడీనా వెళదామా?" అన్నాడు రవి.

రవిని చూసి ఆశ్చర్యపోయింది అంజలి. ఎప్పుడూ కుర్తా, పైజమాల్లో ఉండే రవి, ఇవాళ ఫాంట్, ఫుల్ హాండ్స్ షర్ట్ వేసుకున్నాడు. చాలా హాండ్‌సమ్‌గా ఉన్నాడు.

"వస్తా నాన్నా" అని వెళ్ళి కారులో కూర్చుంది అంజలి.

"ఈ కవరులో సీడీలు ఉన్నాయి. నీకు కావాల్సిన పాటలు పెట్టుకో" కారు పోనిస్తూ అన్నాడు రవి.

వాటిల్లో వెతికి పాత సినిమా పాటలున్న సీడిని పెట్టింది. ఏం మాట్లాడకుండా, కళ్ళు మూసుకుని పాటలు వింటూ కూర్చుంది.

"నువ్వు నామీద ఎందుకలిగావో తెలిసింది" అన్నాడు రవి

కళ్ళు తెరిచి అతని వైపు చూసింది. "మా ఇంటికి వచ్చినప్పటి గొడవ సంగతి నీకు చెప్పకుండా నవ్వినందుకేగా?" నవ్వుతూ అన్నాడు రవి.

ఏం మాట్లడలేదు అంజలి.

"తాగుడు అలవాటును మానిపించే చిట్కాలేవో నేర్పించావంట కదా ఆడాళ్ళకు. నేను చెప్పాననుకుని నా మీద పోట్లాడటానికి వచ్చారు వాళ్ళు. అక్క, అమ్మ ఎదురుగా నువ్వు చెప్పిన ఐడియా ఏంటో ఎలా చెప్పేది? అందుకని చెప్పలేదు" నవ్వు ఆపుకుంటూ అన్నాడు రవి.

మొహం ఎఱ్ఱబడింది అంజలికి. "ఓ అదా విషయం" అనుకుంది. అనవసరంగా చిన్నపిల్లలాగా ప్రవర్తించి తన మీద అలిగి తనతో ఇదంతా మాట్లాడించటం అవసరమా? ఛ

అంజలి మౌనంగా ఉండటంతో "ఏంటీ ఇంకా కోపం పోలేదా?" అన్నాడు.

"కోపం ఏమీ లేదు పాటలు వింటున్నా అంతే" అంది అంజలి.

గట్టిగా నవ్వేశాడు రవి.

"ఎందుకు నవ్వుతారు?" ఉక్రోషంగా అడిగింది అంజలి.

"**ఏంలేదు**. ఆ సీడీల్లో 'ఆనంద్' సినిమా పాటలది లేదా? ఆ పాటలు బాగుంటాయి" అన్నాడు మాట మారుస్తూ.

"ఓ మర్చిపోయా రాత్రి రూములో వింటూ అక్కడే వదిలేశా అనుకుంటా" అన్నాడు రవి.

దోవలో అంతా రవి ఏవో కబుర్లు చెపుతూనే ఉన్నాడు. సబ్ కలెక్టర్ ఆఫీసు చాలా బిజీగా ఉంది. లోపలికి వెళ్ళారు ఇద్దరూ.

"పావుగంట కూర్చోండి పిలుస్తాను" అన్నాడు కలెక్టర్‌గారి పి.ఏ.

కాసేపయ్యాక పిలుపు వచ్చింది. లోపలకు వెళ్ళారు ఇద్దరూ, సబ్ కలెక్టర్ పేరు 'గోపాల్ శ్రీనివాసన్' తెలుగు ఇప్పుడిప్పుడే నేర్చుకుంటున్నాడు. కొంచెం పట్టి పట్టి మధ్యలో ఇంగ్లీషులో మాట్లాడతాడు. అంజలిని పరిచయం చేశాడు రవి.

"మన గవర్నమెంట్‌కి ఒక హౌసింగ్ స్కీమ్ ఉంది రవి. నువ్వు విరాళాలు ప్రోగు అవ్వట్లేదని దిగులు పడొద్దు. నీ ఐడియా నాకు చాలా నచ్చింది. తక్కువ స్థలంలో ఎక్కువ ఇళ్ళు కట్టవచ్చు. అందుకే నేను సంబంధిత ఆఫీసర్లతో మాట్లాడాను. ఒక్కో ఇంటికి లక్షన్నరవరకు ప్రభుత్వం ఇస్తుంది. మిగతా ఎమౌంటు ఎలా?" అన్నారు గోపాల్.

"ఈ మాత్రం చేశారు చాలు సార్. నాకు ముందునుంచి కూడా ప్రతి ఒక్కరి పేరు మీద కొంత బ్యాంకు రుణం తీసుకుందామనే ఉంది. ఎందుకంటే ఫ్రీగా వస్తున్న కొద్దీ వాటి విలువ తగ్గిపోతుంది. మన కష్టంతో సంపాదించుకోవాలన్న తపన తగ్గిపోయి ఎంతసేపూ ఎవరో సాయం చేయాలనే ఎదురు చూస్తారు" అన్నారు రవి.

"ఐ ఎగ్రీ విత్ యు. ఎవరెవరికి ఇళ్ళు కడుతున్నారో వాళ్ళ పేర్లమీద బ్యాంకులో ఎకౌంటు తెరవండి తర్వాత వాళ్ళ అప్లికేషన్ నింపాలి" అన్నాడు గోపాల్.

"ఫారిన్‌లో ఉండే చాలామంది కూడా డబ్బులు పంపుతామంటున్నారు. దానికోసం ప్రగతి అని ఒక ఎకౌంటు తెరిచాను బ్యాంకులో. మా ఊళ్ళో నీటి సమస్యలేదు కానీ, మంచినీళ్ళు అన్నిచోట్లా రావు. అందుకని ట్యాంక్ కట్టించాలనుకుంటున్నా.

పొదుపు కార్యక్రమం కూడా బాగా జరుగుతుంది. పెస్టిసైడ్స్ తక్కువ వాడాలని, మా ఊళ్ళో ఒకతను బైయోమెన్యూర్ తయారు చేసి వెర్మీ కల్చర్‌తో ఎరువు కంపోస్టు వాడుతున్నాడు. దానిగురించి ఇంకా జనాల్లోకి ఎక్కించాలి" అన్నాడు రవి.

"ఐ యాం రియల్లీ ప్రౌడ్ ఆఫ్ యువర్ థింకింగ్ రవి. నీలాంటి వాళ్ళు చాలా తక్కువమంది ఉన్నారు మనదేశంలో. నేను చెప్పిన పనుల ప్రోగ్రెస్ గురించి నాకు చెపుతూ ఉండు" అన్నారు గోపాల్.

అతని దగ్గర సెలవు తీసుకుని బైటకు వచ్చారు. రవిని చూస్తే చాలా గర్వంగా, ముచ్చటగా అనిపించింది అంజలికి. తను ఏ విషయం మాట్లాడుతున్నా ఎంత ఫాసినేట్‌గా, ఉత్సాహంగా మాట్లాడతాడో.

"నేను మీకు ఏ రకమైన హెల్ప్ చేయలేదు. నేనేదో చేస్తానని చెప్పాలని తీసుకొచ్చారు" అంది అంజలి.

"నిన్ను కిడ్నాప్ చేస్తున్నాను ఇప్పుడు. అలా అని చెపితే రావుకదా అందుకని అబద్ధం చెప్పి తీసుకొచ్చా" నవ్వాడు రవి.

"అబ్బా నిజం చెప్పండి"

"నిజమే చెపుతున్నా ఇప్పట్నుండి సాయంత్రందాకా నాతో ఉండాలి. నామీద అలిగి నా ఫోన్ తీయనందుకు నీకు పనిష్మెంటు. ఎక్కడికి వెళుతున్నాం? ఏం చేస్తున్నాం అని అడగకూడదు అన్నాడు రవి కార్ స్టార్ట్ చేస్తూ."

"ఇది కూడా అప్పుడు సముద్రం దగ్గరం తీసుకెళ్ళారు అలాంటి సర్‌ప్రైజేనా?" అంది అంజలి.

"ఊహూం అలాంటిది కాదు. ఇది కేవలం నాకోసం అని కాసేపాగి అడిగాడు రవి 'నిజం చెప్పనా అంజలి'

"ఏంటి ఆగారు చెప్పండి" ఏం చెప్పబోతున్నాడు అన్న ఆతృతతో అడిగింది అంజలి.

"చెప్పను" కారు విజయవాడవైపు వెళుతుంది.

"విజయవాడ వెళుతున్నామా?" అడిగింది అంజలి.

"ఇది తప్పితే ఇంకేదన్నా మాట్లాడు" అన్నాడు రవి.

"సరే కానీ.. ఇందాక ఆఫీసులో నాచురల్ ఎరువులతో ఫార్మింగ్ అన్నారు ఎవరు చేస్తున్నారు?"

"మన నారాయణగారి రెండెకరాలు కొన్నాడు రాజా. ఈ సంవత్సరం దాంట్లో కేవల సహజ పద్ధతుల్లో పండించి దిగుబడి చూసి దాన్ని బట్టి అందులోనూ ఈ విధానాన్ని పరిచయం చేయాలి. ఈ ఆలోచన ఈ మధ్య చాలామందికి వస్తుంది. ఫారిన్‌లో కెమికల్స్ వాడకుండా పండించిన వాటికి చాలా డిమాండు ఉందంట. కృత్రిమ రసాయనాలు, పురుగుల మందులవల్ల, జబ్బులు పెరిగిపోతున్నాయి. భూమిలో సారం తగ్గుతుంది, హైబ్రీడు విత్తనాలవల్ల కూరగాయలులాంటివి ఉత్పత్తి ఎక్కువుంటుంది. ఎక్కువ షెల్ఫ్ లైఫ్ ఉంటుందేమో కానీ సారం ఉండటంలేదు. రుచి ఉండటంలేదు.

"వ్యవసాయంలో విప్లవం రావాలి. అంటే ఉత్పత్తి ఒక్కటే పెరగటంకాదు. తెలుసా ప్రపంచంలో పండించే ఆహారంలో రెండవ వంతు వృధాగా అవుతుంది. ఆహారం పారేయటం ఫ్యాషన్ అయిపోయింది. మంచి పోషక విలువలతో సహజంగా పండించి, వృధా తగ్గిస్తే పండించే ఆహార ధాన్యాలు అందరికీ సరిపోతాయి."

"మనలో సగం సమస్యలకు కారణం స్వార్ధం, ఆలోచనా రాహిత్యం నేను నా పిల్లలు సుఖంగా ఉండాలి. దానికోసం ఎవరి తలమీద ఎక్కి తొక్కినా పర్లేదు అనుకుంటారు. రొయ్యల బిజినెస్సు బాగుంది లక్షాధికారులవ్వాలని పంట భూములని రొయ్యల చెరువులుగా మార్చేశారు. వాణిజ్య పంటలమీద లాభం ఎక్కువొస్తుంది అని దాన్యం పండించటం మానేశారు.

పాలెంలో మన వాళ్ళకు చెప్పాను. వాళ్ళ పిల్లలు సిటీల్లో ఉంటున్నారు కదా. మంచి ఉద్యోగం ఉంటే సరే లేకపోతే ఇరుకుగుడిసెల్లో అనారోగ్యాల మధ్య ఉండటం ఎందుకు ఇక్కడకు రమ్మనమని మన వీరయ్య కొడుకు పిల్లలను తీసుకుని వచ్చేశాడు. రోజంతా చాలా కష్టపడినా గుడిసె అద్దె, నెలఖర్చులు చాలేవి కాదంట దానికి తోడు ఎప్పుడూ పిల్లలకు జబ్బులు. కోళ్ళఫారంలో పనులకు, మన సతీష్ దగ్గర చెయ్యటానికి ఉద్యోగాలు ఉన్నాయి, మనుష్యులే కరువయ్యారు పల్లెల్లో" అన్నాడు రవి.

"మీరీ పనులతో బిజీగా ఉంటే నేనేమో పనిలేక మీమీద అలిగి కూర్చున్నా చిన్నపిల్లలాగా" గిల్టీగా అంది అంజలి.

"నామీద అలిగేవాళ్ళు ఎవరున్నారు నువ్వు తప్పితే ఏం పర్లేదు. కాకపోతే నువ్వు అలిగానని చెప్పు. నాకు అర్ధం కాలేదనుకో కష్టంకదా" నవ్వాడు రవి.

"సరే ఇంతకీ ఎక్కడికి వెళుతున్నామో చెప్పండి ప్లీజ్" అంది అంజలి.

కారు విజయవాడ ఊరిలోకి వచ్చింది.

"ముందు అర్జంటుగా భోంచేయాలి. చాలా ఆకలేస్తుంది. నీకిక్కడ ఏమన్నా మంచి రెస్టారెంట్లు తెలుసా?" అన్నాడు రవి.

"విజయవాడ పెద్దగా తెలియదు"

కారు ఓ రెస్టారెంటు ముందు ఆపాడు. లోపల ఎ/సి సెక్షన్‌లోకి వెళ్ళారు.

"ఏమన్నా స్పెషల్ ఆర్డర్ చేస్తావా?" అన్నాడు.

"మీరు ఆర్డర్ చేసేదే నాకు కూడా. కిడ్నాప్ చేశారుగా... మీ ఇష్టం మరి" అంది అంజలి.

కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేశారు. రవి ఎందుకో చాలా హుషారుగా ఉన్నాడు. ఆ మాటా అడిగింది "చాలా హుషారుగా ఉన్నారు. కలెక్టర్‌గారు మాట్లాడిన విషయం వల్లా?"

"ఓహో..దాని గురించి మాత్రమే కాదు. ఇంటికి వెళ్ళేలోపల చెపుతాలే"

"మళ్ళీ మిస్టీయరియస్‌గా మాట్లాడుతున్నారు" అంది.

"వెళ్దామా" లేచాడు రవి బిల్లు కట్టి ఓ రెండు కిళ్ళీలు కూడా కొన్నాడు, బైటకొచ్చి అంజలికి ఇచ్చాడు.

"ఈ కిళ్ళీల గోల మర్చిపోరా"

"ఎలా మర్చిపోతాను. కిళ్ళీ చూసినప్పుడల్లా. సరోజ పెళ్ళిలో ఓ పది కిళ్ళీలు దాచుకున్న నువ్వే గుర్తొస్తున్నావు" అన్నాడు రవి.

"సర్లే ఇప్పుడెక్కడికి" మాట మార్చింది అంజలి.

కారు ఓ పెద్ద బట్టల కొట్టు దగ్గర ఆగింది.

"హమ్మయ్య ఇప్పటికి విషయం అయ్యింది. నీరజకి, పిల్లలకు బట్టలు కొనటానికి నేను హెల్ప్ చేయాలి. అంతేనా?" అంది అంజలి.

"అవును. బాగానే గెస్ చేశావు"

"మరి వాళ్ళను కూడా తేవచ్చుకదా తనకు నచ్చినవి కొనుక్కుంటుంది"

"షాపింగ్ అంతా హైదరాబాదులో చేశాను. ఇంక ఏమీ కొనను అంది. ఇక అమ్మ వచ్చే శుక్రవారం కట్టుకుంటుంది. కొత్త బట్టలు తే అని చెప్పింది. నాకేమో కొనటం రాదు. అందుకని నిన్ను కిడ్నాప్ చేశా"

"మీ అక్క బట్టలు కొనటానికా? ఇంకా నాతో టైమ్ స్పెండ్ చెయ్యటానికేమో అనుకున్నా" నిరాశగా అనుకుంది అంజలి.

"ఏంటి ఆలోచిస్తున్నావు" అడిగాడు రవి.

"ఏం లేదు పదండి"

పిల్లలకు బట్టలు తీసుకుని చీరల సెక్షన్ వైపు నడిచారు.

"ఇది చాలా కష్టం నీరజకు ఏమి ఇష్టమో నాకెలా తెలుసు" అంది.

"పర్లేదు నీకు నచ్చింది తీసుకో" అన్నాడు.

నీరజకు ఓ చీర సెలెక్ట్ చేశాక, పక్కనే ఓ మంచి ఎంబ్రాయిడరీ చేసిన చీర చూసింది. ఉల్లిపొట్టు రంగు చీరమీద వెండి తీగలు పరచుకున్నట్టు లతలు. చాలా బాగుంది. అమ్మో ఏడువేలా డబ్బులు తేవాల్సింది. అమ్మ అంటూనే ఉంది విన్లేదు తను. ఎంత బాగుందో ఈ చీర అనుకుంది అంజలి ఆ చీర కొంగు మీద వేసుకుని చూస్తూ.

చీరను చూస్తున్న అంజలిని గమనించాడు రవి. తనకు ఈ చీర బాగా నచ్చిందని అర్థం అయ్యింది. ఏమీ గమనించనట్లు 'ఇక వెళ్దామా' అన్నాడు. అంజలి ముందుకు వెళ్ళాక, అంజలికి నచ్చిన చీర కూడా ప్యాక్ చేయమని చెప్పాడు రవి.

బిల్లు కట్టి బ్యాగ్స్ తీసుకుని బైటకొచ్చారు.

"ఇంక ఇంటికి వెళుతున్నామా?" అంది

"ఏ అప్పుడే నా కంపెనీ బోర్ కొట్టిందా? నగల షాప్‌కి కూడా వెళ్ళాలి ఇంకా"

ఇంటికి ఫోన్ చేసి చెప్పింది అంజలి తను విజయవాడలో ఉన్నట్లు. లేకపోతే అన్నపూర్ణ కంగారు పడుతుందని.

నీరజకి, శ్రావణికి నెక్లెస్ సెట్స్ కొన్నాడు. సాత్విక్‌కు చేతిగొలుసుకొన్నారు.

"ప్రొద్దున్నుండి ఇన్ని డబ్బులు బ్యాగ్‌లో పెట్టుకుని తిరుగుతున్నారా?" అంది అంజలి.

"హమ్మయ్య ఈ షాపింగ్ పని ఎలాగో అయిపోయింది. అక్కకు సర్‌ప్రైజ్ చెప్పలేదు. పద బాదం పాలు తాగుదామా?" అన్నాడు రవి.

"బాదం పాలా!"

"పెళ్ళి భోజనం చేసి కిళ్ళీ వేసుకోకపోతే నీకు పాపం ఎలా చుట్టుకుంటుందో విజయవాడ వచ్చి సమోసా తిని బాదం పాలు తాగకపోతే అలా అన్నమాట" అన్నాడు.

"ఈ నగలున్నాయి మనదగ్గర తిన్నగా ఇంటికి వెళదాం ఎక్కడా ఆగొద్దు" అంది అంజలి.

"ఏం పర్లేదు. నగలు నా కంప్యూటర్ బాగ్‌లో పెడతాను. నగలని ఎవరికీ తెలియదు. ఇంక నా దగ్గరే ఉంటుంది. పద పద కార్లో కూర్చో"

బీసెంటు రోడ్డు దగ్గర ఖాళీ చూసి కారు ఆపాడు రవి. అప్పటికే సాయంత్రం ఐదు అవ్వటంతో రోడ్లన్నీ బాగా రద్దీగా ఉన్నాయి.

"మనం కొంచెం నడవాలి. ఈ సందుల్లోకి కారు రాదు అని అంజలి చెయ్యిపట్టుకుని బేకరి దగ్గరకు తీసుకెళ్ళాడు. సమోసాలు తీసుకొచ్చి ఇవి తింటూ ఉండు, బాదం పాలు తీసుకొస్తా" అని వెళ్ళాడు.

"బావా" అని ఎవరో దగ్గరకు వచ్చి పిలిచారు ఆశ్చర్యంగా. నవ్వుతున్న మొహం ఒక్కసారిగా మారిపోయింది.

అంజలి తలెత్తి చూసింది. ఎవరో ఓ అమ్మాయి, రవిని పిలుస్తుంది.

"అనితా బాగున్నావా?" అడిగాడు రవి.

"ఆఁ నువ్వేంటి ఇక్కడ ఇలా? విజయవాడ ఎప్పుడొచ్చావు?" అంజలి వంక ఎవరీ అమ్మాయి అన్నట్లు చూస్తూ అడిగింది.

"అనితా! తను అంజలి. అంజలి.. అనిత మా మేనమామ వాళ్ళ అమ్మాయి. ఇక్కడే విజయవాడలో ఉంటుంది" అని పరిచయం చేశాడు.

"ఇంటికి రావాల్సింది. అయినా ఇప్పుడు మాత్రం ఏమైంది? ఇంటికి పద. చాలారోజులయ్యింది చూసి" అంది అనిత.

"ఎవరీ అమ్మాయి?" అని మళ్ళీ అడిగింది.

"లేదు ఇప్పటికే ఆలస్యం అయింది బయలుదేరాలి" అన్నాడు రవి. అనిత ఏవో అందరిగురించి అడుగుతుంది. అంజలి మౌనంగా ఇద్దరివంకా చూస్తూ బాదం పాలు తాగుతుంది.

రవి ఎందుకలా సీరియస్‌గా అయిపోయాడు? ఏమన్నా కుటుంబ గొడవలేమో?

"నీరజ వదిన వచ్చిందంట కదా ఏదీ తీరిక దొరకటంలు ఉద్యోగం కదా వచ్చే ఆదివారం వీలు చూసుకుని వస్తాలే నువ్వు ఇంట్లోనే ఉంటావుగా?" అంది అనిత.

"ఇంట్లోనే ఉంటా. నాకేం ఉద్యోగం లేదుగా" అన్నాడు రవి.

అంజలి వంక చూసి "బాదంపాలు తాగడం అయిపోయిందా అంజలి? వెళదామా" అన్నాడు.

"నాది అయిపోయింది. మీరు తాగలేదు" అంది అంజలి.

"వద్దులే. పద."

"వస్తా అనితా" అని బయలుదేరాడు. మౌనంగా రవి వెంట వెళ్ళి కారులో కూర్చుంది అంజలి. ఓ నిమిషం అలానే కూర్చున్నాడు రవి నెమ్మదిగా కారు పోనిచ్చాడు. కాస్త దూరం వెళ్ళాక "నాకు అనితతో మాట్లాడటం, తను కలవటం, నాకు నచ్చలేదని నువ్వు గమనించావు. ఏంటి విషయం అని అడగవా అంజలి."

"ఇది మీకు సంబంధించిన విషయం. చెప్పాలనుకుంటే మీరే చెపుతారు. లేకుంటే అది మీ ఇష్టం. నేనెలా అడుగుతాను?" అంది అంజలి.

కాసేపు ఏమీ మాట్లాడలేదు రవి. రవి మూడ్ బాగోలేదని గమనించి బైటకు చూస్తూ కూర్చుంది అంజలి.

"అనిత మా మేనమామ కూతురు. చిన్నప్పట్నుండీ అందరూ మా ఇద్దరికి పెళ్ళి చేద్దామని అనుకున్నారు. అనిత నన్ను ఇష్టపడుతున్నట్లే ఉండేది. నాకు పెళ్ళిగురించి పెద్దగా ఆలోచించకపోయినా అనితే కదా నా భార్య అనుకునేవాడ్ని. కానీ నేను పల్లెటూర్లోనే స్థిరపడతానని తెల్సుకున్న రోజు, అనిత నన్ను పెళ్ళిచేసుకోనని చెప్పేసింది. బాధ్యతలేనివాడినంట. పల్లెటూరులో ఏం బావుకుంటావు? ఓ సంపాదన ఉందా? దర్జా ఉందా? అని నిలదీసింది. నేను ఒకప్పుడు సివిల్స్ ప్రిపేర్ అవుదామనుకున్నా. తను ఓ కలెక్టర్ భార్యగా తన బ్రతుకును ఊహించుకుంది. ఊహించుకున్నది తను, కానీ ఆ ఊహను నేను నాశనం చేసినట్లు మాట్లాడింది. తనకు అర్థం అయ్యేట్లు చెప్పటానికి చాలా ప్రయత్నించాను. పల్లెటూర్లో ఉండే, తను జాబ్ చేయాలంటే చేయొచ్చు. తన సుఖాలకు ఏం లోటుండదు అన్నా వినలేదు. చివరకు నాకు బాగా బాధ కలిగిన విషయం 'ఈ పేడకంపు మధ్య ఉంటూ అత్తమామల మధ్య ఉమ్మడి కాపురం చేయటానికి కాదు నేను నిన్ను పెళ్ళి చేసుకోటానికి ఒప్పుకుంది' అని అంది.

ఆ మాట అన్న తర్వాత ఇక మాట్లాడటానికి ఏమీ మిగల్లేదు అనిపించింది. విజయవాడలో లెక్చరర్గా ఉద్యోగం చేస్తుంది. పెళ్ళి అయ్యింది బ్యాంక్‌లో ఆఫీసర్గా చేస్తున్నాడతను"

మౌనంగా వింటోంది అంజలి. మనస్సు విరిగిపోయి అందుకే పెళ్ళిచేసుకోకుండా ఉండిపోయాడా?

కాసేపు ఊరుకుని రవి మళ్ళీ చెప్పడం మొదలుపెట్టాడు. "ఎవరి జీవితం వాళ్ళు దిద్దుకునే హక్కు వాళ్ళకుంది. నేను చేసింది అదే కానీ నేనంటే ఇష్టం అన్న అమ్మాయి అలా వికృతంగా మాట్లాడేసరికి తట్టుకోలేకపోయాను. మనుష్యులు తమ వాదన సరైనది అని ఋజువు చేసుకోటానికి, అవతల వాళ్ళను ఎంత కించపరచగలరో ఆ రోజు అనిత మాటలు, మా మామయ్య మాటలు విన్నాక అర్థం అయ్యింది.

ఈ అయిదేళ్ళూ పనికిరాని చుట్టరికం, ప్రేమలు అకస్మాత్తుగా మళ్ళీ గుర్తొస్తున్నాయి అందరికి. పెళ్ళి అయిపోయాక చుట్టం చూపుగా ఒక్కసారి కూడా అనిత రాలేదు మా ఇంటికి. కానీ గత సంవత్సరంగా, మా మేనమామ తెగ తిరుగుతున్నాడు ఎందుకో

తెలుసా? తన చిన్నకూతురుతో నా పెళ్ళి జరిపించాలని. తనకు చదువు వంటపట్టలేదు. పెళ్ళిచేద్దామంటే అందరూ చదువులేదని మంచి వద్దంటున్నారు. ఏదో పల్లెటూళ్ళో ఉంటున్నా కదా తెలిసినవాడు వీడికి ఇచ్చి చేస్తే బాగుంటుందని ప్లాన్ వేసి అమ్మను కాకా పడుతున్నాడు.

ఇందాక అనిత ఏమందో విన్నావుగా. నీరజను చూడటానికి వస్తుందంట. అక్క రెండేళ్ళ క్రితం కూడా వచ్చింది. మరి అప్పుడు రాలేదే? వాళ్ళే తెలివిగలవాళ్ళు, మిగతావాళ్ళంతా పిచ్చోళ్ళు, వాళ్ళను మాయ చేయొచ్చు అనుకుంటారు."

నెమ్మదిగా రవి చెయ్యి మీద చేయి వేసింది అంజలి.

కొంచెం ఆవేశం అణుచుకున్నాడు రవి. "సారీ నా సోది అంతా చెపుతున్నాను" అన్నాడు.

"వదిలేయండి. దీని గురించి ఆలోచించొద్దు" అంది అంజలి. కాసేపు మౌనంగా డ్రైవ్ చేశాడు రవి. "ఇవాళ ఎంత ఆనందంగా గడిపానో, నీతో చెప్పాలనుకున్న విషయం చెప్పలేదు. నా మూడ్ అంతా ఖరాబు చేసింది."

"ఏం చెప్పాలనుకున్నారు?" అంది అంజలి.

**"చెప్పాలనుకున్న విషయం** పక్కనపెట్టు. క్రిష్ణ ఒడ్డున కూర్చుని సూర్యాస్తమయం చూద్దామనుకున్నా కుదర్లేదు."

"నాక్కనిపిస్తుంది సూర్యాస్తమయం" అంది నవ్వుతూ అంజలి ప్రశ్నార్థకంగా చూశాడు.

"నా పక్కనే రవి. అంటే సూర్యుడు. మొహం ఎర్రగా ఉంది. సూర్యాస్తమయంలోలాగా"

నవ్వేశాడు రవి.

"ఓ విషయం అడగనా మిమ్మల్ని?" నెమ్మదిగా అంది అంజలి.

"ఏంటి?"

"మీరు ఇంకా అనితను మర్చిపోలేకపోతున్నారా? మీరు పెళ్ళి చేసుకోకుండా ఎందుకుండి పోయారు?"

"లేదు ఆలోచిస్తే నేను అనితను ఎప్పుడూ ప్రేమించలేదు. పిచ్చి ఉదాహరణ ఇస్తున్నానేమోకానీ ఎవరన్నా ఒక బొమ్మను చిన్నప్పుడు ఇచ్చి, ఇది నీది అంటే దాంతో ఒక బంధం ఏర్పడుతుంది. నాదేలే అనిపిస్తుంది. కానీ ఆ బొమ్మలేకపోతే మనం లేము అన్నట్టు కాదుగా. సడన్‌గా ఆ బొమ్మపోతే కొంతకాలం బాధ ఉంటుంది అంతే."

"మన జీవితంలో జరిగే ప్రతి విషయాన్నీ, మనం ప్రేమించే వాళ్ళతో పంచుకోవాలనిపిస్తుంది. నిద్రలేవగానే తన మొహం గుర్తురావాలి. పడుకునే ముందు తన ఊహతో పడుకోవాలి. అది ప్రేమంటే" నెమ్మదిగా అంది అంజలి.

చిన్నగా నవ్వాడు రవి "అయితే అనితను నేను ప్రేమించలేదు. తర్వాత నేను పెళ్ళిచేసుకోకుండా ఏదో శపథం తీసుకుని ఉండలేదు. పల్లెటూళ్ళో ఉంటానంటే సంబంధాలు రాలేదు. దాంతో పెళ్ళంటే ఇంట్రెస్టు పోయింది."

ఊరు దగ్గరకు వచ్చేసింది కారు.

"రేపు రాత్రి హైదరాబాదు వెళుతున్నా. రాధీ ఫోన్ చేసిందా మీకు" అంది అంజలి.

"ఊ చేసింది. శుక్రవారం రాత్రి పార్టీ సంగతి చెప్పింది. శనివారం పెళ్ళి. రెండు రోజులు, మర్నాడు ప్రయాణం. ఇన్ని రోజులంటే ఇబ్బందేమో అని ఆలోచిస్తున్నా"

"మీకు పనులనుండి బ్రేక్ దొరుకుతుంది కదా కాస్త రిలాక్స్ అవ్వచ్చు."

"పెళ్ళికి తప్పకుండా వస్తాను" అన్నాడు. ఇంటిదగ్గర దింపాడు అంజలిని. లోపలికి వచ్చి అన్నపూర్ణగారితో చెప్పివెళ్ళాడు.

❦❦❦

అంజలి హైదరాబాదు వెళ్ళి మూడురోజులయ్యింది. తనతో మాట్లాడాలని మనస్సు కొట్టుకులాడుతుంది. విజయవాడ వెళ్ళినప్పుడు తన మనస్సులోని మాట ఎలాగైనా చెప్పాలని చాలా ప్లాన్ చేశాడు. కానీ అంతా పాడైపోయింది. అంజలికి తనంటే ఇష్టమేనా? అంటే జీవితాంతం తనతో ఉండేంత ఇష్టమా? ఈ మూడురోజులు చాలా అశాంతిగా, అలజడిగా గడిచాయి.

ఏది చేసినా అంజలితో చెప్పాలనిపిస్తుంది. ఇంట్లో ఉండలేక తోటలోకి వచ్చాడు రవి. మామిడితోటలో రవి ఒక చిన్న కాటేజిలాగా కట్టించుకున్నాడు. ఎప్పుడన్నా ఒంటరిగా ఉండాలంటే అక్కడికి వస్తాడు.

ఫోన్ మోగింది. సతీష్

"ఎక్కడున్నావు రవి? నీకోసం ఇంటికి వచ్చాను"

"కూర్చో అక్కడే ఓ పదినిమిషాల్లో వస్తున్నా" అని పెట్టేశాడు రవి. ఇంటికి తాళం వేసి బైక్ స్టార్ట్ చేశాడు.

ఇంటికి వెళ్ళేసరికి సతీష్ ఇంకో అతను ఎవరో ఉన్నారు. రవిని చూసి సతీష్ అన్నాడు "వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ గురించి కన్నుక్కున్నాం కదా కాంట్రాక్టు చేయటానికి ఈయన రెడీగా ఉన్నారు. ఇదివరకు ఈయన వేరే ఊళ్ళల్లో కూడా కట్టారు."

"మొత్తం మూడు నెలల్లో అవచేయొచ్చండి" అన్నాడు అతను. ఇదిగో పేపర్ మీద ఖర్చు తాలూకు వివరాలు ఉన్నాయి. అవసరం అయితే ఫోన్ చేయండి" అని వెళ్ళిపోయాడు.

నీరజ లోపల్నుండి వచ్చింది. 'ఎక్కడికన్నా వెళదాం రా ఊరికే ఇంట్లో ఉంటే పిల్లలకు బోర్' అంది.

"పిల్లలకు నీళ్ళు చూడటం సరదా అయితే హంసలదీవి వెళ్ళొచ్చు లేదా పడవ మీద మోపిదేవి వెళ్ళొచ్చు" అన్నాడు సతీష్

"రవీ! మోపిదేవి వెళదాం చాలా రోజులయ్యింది ఆ గుడికి వెళ్ళి" అంది సావిత్రి.

"సతీష్ నువ్వు కూడా రా మీ ఫ్యామిలీతో సరదాగా ఉంటుంది" అంది నీరజ.

"సరే రాజాను కూడా అడుగుతాను వస్తాడేమో? ఏంటి రవి మాట్లాడవే రేపు ఖాయమేనా?" అడిగాడు సతీష్

"అలాగే అందరూ వెళదామంటే సరే" అన్నాడు రవి.

❦❦❦

నీటిమీద సూర్యకిరణాలు పరివర్తనం చెంది, తళతళ మెరుస్తున్నాయి. నది మధ్యగా పడవ ప్రయాణిస్తుంది. ఓ పక్క పిల్లలు కేరింతలు కొడుతున్నారు. మోపిదేవి వెళ్ళి సాయంత్రం తిరుగు ప్రయాణంలో ఉన్నారు. రవి మనస్సు మన్ను తిన్నపాములాగా ఉంది. అక్కవాళ్ళు రెండేళ్ళ తర్వాత కనిపిస్తే ఎప్పుడూ ఎంతో సరదాగా సంతోషంగా ఉండేవాడు. ఇప్పుడెందుకు ఇలా స్తబ్దుగా ఉన్నాడు.

'తెరచి ఉంచేవు సుమా త్వరపడి నీ హృదయమును బిరబిర ఏ సుందరియో జొరబడితే ప్రమాదము' అన్న కృష్ణశాస్త్రి గీతం గుర్తుకొచ్చింది.

ఇంటికొచ్చిన రవి తలనొప్పిగా ఉందని తన గదికి వెళ్ళి పడుకున్నాడు. 'లాభంలేదు. నా మనస్సులో ఏముందో అంజలికి చెప్పాలి. మహా అయితే తను కాదని అంటుంది. ఫర్లేదు. అస్సలు చెప్పకుండా ఈ సంధిగ్ధంలో కొట్టుకులాడటం కంటే, చెప్పేస్తేనే మనస్సు తేలికవుతుంది. కానీ అంజలి నాతో మాట్లాడకపోతే ఇంకా? పర్లేదు అప్పటి సంగతి అప్పుడు చూడొచ్చు.

లేచి బట్టలు సర్దుకున్నాడు హైదరాబాదు వెళ్ళటానికి. నీరజ వచ్చింది. రవి బట్టలు సర్దుకోవటం చూసింది.

"ఏంటో చాలా ముభావంగా ఉన్నావు ఇవాళ. ఏమైంది?" అని అడిగింది.

"ఏం లేదు. ఏదో ఆలోచిస్తూ అంతే"

"అంజలి మీద నీ అభిప్రాయం ఏంటి?" అడిగింది నీరజ

ఉలిక్కిపడ్డాడు రవి. నీరజవంక చూడకుండా "అదేంటి అలా అడిగావు?" అన్నాడు.

"ఏం లేదు. నీకు నచ్చితే సంబంధం మాట్లాడమని నాన్నతో చెపుతాను."

"అదేం వద్దు. తన మనస్సులో ఏముందో తెలుసుకోకుండా ఏమీ వద్దు" కంగారుగా అన్నాడు రవి.

"అంటే నీకు తనంటే ఇష్టం అనే కదా" రెట్టించింది నీరజ కాసేపు ఏమీ మాట్లాడలేదు రవి.

"రవి నాకైతే గట్టిగా అనిపిస్తుంది అంజలికూడా నిన్ను ఇష్టపడుతుందని నువ్వు 'ఊ' అను పెద్దవాళ్ళతో అడిగిస్తాను. అప్పుడు కాదు అన్నా కానీ ఏదో ఇది పెద్దవాళ్ళ అభిప్రాయం అని అనుకుంటుంది. మీ ఇద్దరికి స్నేహానికి అడ్డం రాదు" నచ్చచెపుతున్నట్టుగా అంది నీరజ.

"అక్కా.. దీంట్లో ఎవ్వరూ కలగచేసుకోవద్దు. ప్లీజ్" అన్నాడు రవి.

"రేపు నేను హైదరాబాదు వెళ్తున్నా. తిరిగి ఆదివారం వస్తాను" అన్నాడు ముభావంగా.

ఫంక్షన్ హాలులోకి చుట్టూ చూశాడు రవి, రాజేష్ కానీ వివేక్ కానీ కనిపిస్తారని. అప్పటికే చాలామంది వచ్చారు. అందరూ దాదాపు ఒకే వయస్సు వాళ్ళు. ఏదో కాలేజీ ఫంక్షనులాగా ఉందిగానీ పెళ్ళి ఫంక్షన్ లాగా లేదు.

ఓ పక్కన డ్రింక్స్, స్నాక్స్ ఉన్నాయి. స్టేజ్ మీద కర్టెన్ వేసి ఉంది. స్పీకర్లోంచి షెహనాయ్ వినిపిస్తుంది.

"హాయ్ రవిగారు ఎంతసేపయ్యింది వచ్చి?" చెయ్యి పట్టుకుని అడిగాడు రాజేష్.

"ఇప్పుడే వచ్చాను. ఎలా ఉన్నావు రాజేష్" అడిగాడు రవి.

"బాగున్నా రండి వివేక్, రఘు అవతల ఉన్నారు. వెళ్దాం"

రఘు రవిని చూసి చాలా సంతోషించాడు. రవి, రఘుకి ఓ కవర్ ఇచ్చి, "మీ ఇద్దరికీ గిఫ్ట్ ఏం కొనాలో తెలియదు" అన్నాడు.

"అయ్యో మీరు రావటమే పెద్ద గిఫ్ట్ మాకు. అంజలి చెప్పింది మీరు చాలా బిజీగా ఉన్నారని. రండి మా ఫ్రెండ్స్‌కి పరిచయం చేస్తాను" అని అందరికి పరిచయం చేశాడు రఘు.

"రండి ప్రోగ్రామ్ మొదలయ్యేలోపు స్నాక్స్ తీసుకుందాం" అన్నాడు వివేక్.

"ప్రోగ్రామ్ ఏంటి?" అన్నాడు రవి.

"తెలీదండి మాకు కూడా. ఈ అమ్మాయిలందరూ కలిసి ప్లాన్ చేశారు. డెకరేషన్‌లాంటి పనులు మాకు అప్పచెప్పారు. మిగతావన్నీ చాలా సీక్రెట్‌గా ఉంచుతున్నారు. నా అనుమానం నన్నేదో బాగా సతాయించటానికి ప్లాన్ వేశారని" అన్నాడు రఘు.

"నాకు కొంచెం తెలుసు. కానీ నీకు చెప్పలేను. నీకు చెప్పానంటే చంపేస్తానన్నారు అంజలి, రాధ" అన్నాడు వివేక్

"ఓరి దుర్మార్గుడా ఇంత దాచావా? ఏంటో కాస్తన్నా చెప్పరా టెన్షన్ తట్టుకోలేకపోతున్నా" అన్నాడు రఘు.

"నా అవసరం కొంచెం ఉంది కాబట్టి చెప్పారు. నేను మాత్రం నీకు చెప్పను కావాలంటే మీ ఆవిడను నువ్వు బ్రతిమలాడుకో"

అందరూ నవ్వారు. అందరూ స్నాక్స్ తెచ్చుకుని కూర్చుని తింటున్నారు. వాళ్ళ నవ్వులు, అల్లరి రవికి చాలా రిలాక్సింగ్‌గా

అనిపించింది.

అంతలోకి స్టేజ్ మీద ఒక లైట్ వెలిగి అమ్మాయి మైక్ తీసుకుని వచ్చింది.

"హాయ్.. నా పేరు అరుణ. నేనివాళ్ళ ప్రోగ్రామ్‌కి ఎమ్.సిగా ఉంటాను. మనందరికి ఫ్రెండ్స్ అయిన రఘు. రాధికకు పెళ్ళి అవుతున్నందుకు ముందుగా కంగ్రాట్స్. ఇవాళ రకరకాల గేమ్స్ ఉంటాయి, తర్వాత ఆటపాటలుంటాయి. తర్వాత డిన్నర్. డిన్నర్ తర్వాత ఓపెన్ డాన్స్ ఫ్లోర్" అందరూ కేకలు వేసి చప్పట్లు కొట్టారు.

"ఓకె ముందుగా రఘుకి, రాధిక మీద ఎంత ప్రేముందో అసలు నిజమైన ప్రేమోకాదో తెలిపే టెస్ట్ పెడుతున్నాం" రఘు స్టేజ్ మీదకు రా.

"అయిపోయాను. నన్నో బకరా చేసి ఆడుకుంటారు వీళ్ళు" గొణుక్కుంటూ వెళ్ళాడు రఘు.

నెమ్మదిగా కర్టెన్ తెరుచుకుంది. స్టేజ్ మీద ఒకే రకం మేలి ముసుగులేసుకుని ముగ్గురు అమ్మాయిలు కూర్చున్నారు.

"రఘు వీళ్ళల్లో రాధిక ఎవరో చెప్పు" అంది అరుణ.

"అన్యాయం. ఎలా చెప్పగలను?" బిక్కమొహం వేసి అన్నాడు రఘు.

"సరే అయితే వాళ్ళ చేతులు పట్టుకుని చెపుతావా రాధిక ఎవరో? కానీ కళ్ళకి గంతలు కడతాం" అని రఘుని తీసుకెళ్ళారు. ముగ్గురమ్మాయిలు చేతులు చాపారు. ఎవరిని చూపిస్తాడా అని అందరూ కుతూహలంగా చూస్తున్నారు. అందరి చేతులు పట్టుకుని వదిలేసి "నాకేం తెలియటంలేదు" అన్నాడు రఘు.

"మరి స్వీట్ నథింగ్స్ చెప్పుకునేటప్పుడు ఓ చేతులు పట్టుకుని మాట్లాడతారు. ఆ మాత్రం తెలియదా?" దబాయించింది అరుణ.

"తప్పు అమ్మాయిది చెప్పానంటే రాధిక చంపేస్తుంది. అసలు ఏ అమ్మాయి చెయ్యి రాధి చెయ్యిలా లేదు అంతే" అన్నాడు రఘు.

అందరూ గోలగోలగా అరిచారు.

"లేదు. కనీసం ఊహించు. వాళ్ళ ముగ్గురులో ఎవరో!?" అంది అరుణ.

"ముగ్గురిలో ఎవ్వరూ కాదనిపిస్తుంది" అన్నాడు రఘు.

"ఫంటాస్టిక్. దీంట్లో రఘు పాస్ అయ్యాడు" అంది అరుణ ముగ్గురమ్మాయిలూ లేచారు నవ్వుతూ. వీళ్ళల్లో అంజలి కూడా ఉంది. గులాబి రంగు గాగ్రా, మీద ఎరుపు ఓణీ. పెళ్ళి కూతురులా ఉంది.

"ఓకె నెక్స్ట్ గేమ్. మేము రాధిక ఇష్టమైనవి ఓ లిస్ట్ రాశాము. ఆ ప్రశ్నలను రఘుని అడుగుతాం. దీని బట్టి రఘుకి, రాధి టేస్ట్ తెలుసోలేదో అర్థం అవుతుంది" అంది అరుణ.

"ఒక్కళ్ళనే అడగటం న్యాయం కాదు. మేము కూడా రాధికను అడుగుతాం" అన్నాడు వివేక్.

అదికూడా అయ్యాక, నాట్యాక్షరి అని, అంత్యాక్షరిలాగా రెండు గ్రూపులుగా ఏర్పడి డాన్స్ చేశారు. దానికి కొంతమంది అబ్బాయిలు కూడా వెళ్ళారు, వివేక్‌తో సహా.

"మంచి పాటలు సెలక్ట్ చేశారు" అన్నాడు రవి రాజేష్‌తో.

"చాలా బాగుంది ఈ ప్రోగ్రామ్"

"ఈ వారం రోజులు అంజలి వచ్చాక, ఈ పాటల సెలక్షన్, ప్రాక్టీస్ ఓ విపరీతంగా బిజీగా ఉన్నారు అందరూ."

"డిన్నర్‌కి పదండి అందరూ" అని ఎనౌన్స్ చేసింది అరుణ.

రవి కళ్ళు అంజలి కోసం వెతుకుతున్నాయి. దూరంగా వస్తూ కనిపించింది. పక్కనే వివేక్ కూడా ఉన్నాడు. ఇద్దరూ గట్టిగా నవ్వుతూ దగ్గరకు వచ్చారు. అంజలి వైపు చూసి పలకరింపుగా నవ్వాడు రవి.

"మీరివాళ వస్తారో రారో అనుకున్నా. వీలవదేమో అన్నారు కదా" అంది అంజలి.

"రాకుండా ఉంటే ఇంత మంచి ప్రోగ్రామ్ మిస్ అయ్యేవాడిని. చాలా బాగుంది" అన్నాడు రవి. "వివేక్ నువ్వు ఇంత బాగా డాన్స్ చేస్తావని చెప్పలేదు"

"ముందు తెలిసినా లేకపోయినా, కాలేజీలో అలవాటవుతుంది ఇదంతా. కానీ ప్లానింగ్ అంతా అంజలిదే" అంజలి వంక చూసి నవ్వుతూ అన్నాడు వివేక్.

అంతలోనే రఘు, రాధిక, లక్ష్మి కూడా వచ్చారు.

"రండి భోంచేద్దాం" అంది అంజలి.

ఓ ఇరవై రకాల వంటలు లేకుండా, సింపుల్‌గా, రుచిగా ఉన్నాయి అన్నీ. అందరూ కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేశారు. అంతలోకి మైక్‌లో అరుణ ఎనౌన్సు మెంటు చేసింది. "అందరూ స్టేజి మీదకు రండి మ్యూజిక్ స్టార్ట్ చేస్తున్నాం. డాన్స్ చెయ్యండి."

"రండి రండి. లేవండి అందరూ" హడావుడి చేశాడు వివేక్.

"నేను కాసేపు కూర్చోవాలి. నా వల్ల కాదు. తర్వాత వస్తాను" అంది అంజలి

"రవిగారు మీరు లేవాలి."

"నాకు ఈ డాన్స్‌లు అవీ రావు. చూసి ఎంజాయ్ చెయ్యటమే. మీరు వెళ్ళండి." అన్నాడు రవి.

"అంజలి. నువ్వు వెళ్ళాలంటే వెళ్ళు నాకు కంపెనీ ఇవ్వటం కోసం ఆగొద్దు" అన్నాడూ రవి.

"అంటే నా కంపెనీ అంత బాగోదా?" బుంగమూతి పెట్టింది అంజలి.

"నేను మాట్లాడలేను నీతో" ఇద్దరికీ చాలా మాట్లడాలని, అడగాలని ఉంది. కానీ ఏం అడగాలో అన్న సందిగ్ధత. కాసేపు మౌనంగా డాన్సులు చూస్తూ ఉండిపోయారు.

రవి వంక చూస్తున్నట్లు అనిపించటంతో అతనివైపు తిరిగింది అంజలి. తననే తదేకంగా చూస్తున్న రవి, చప్పున పట్టుపడ్డట్లుగా తడబడి చూపు తిప్పుకున్నాడు.

"ఏంటి అలా చూస్తున్నారు. నెమ్మదిగా అడిగింది అంజలి.

"ఏం లేదు నిన్ను ఇలాంటి డ్రెస్‌లో ఎప్పుడూ చూడలేదుగా. కొత్తగా ఉన్నావు" అన్నాడు.

"మీలాంటి మనిషిని ఇష్టపడ్డాను చూడండి. నన్ను నేనే తిట్టుకోవాలి. అంత పెద్దకళ్ళున్నాయి. వాటిల్లో కనిపించే భావం, పెదాల దగ్గరకు వచ్చేసరికి వెనక్కి పోతుందా? మీ మనస్సులో ఏముందో ఎలా తెలుసుకోవటం. అస్సలు బైటపడడు" మనస్సులో విసుక్కుంది అంజలి.

"ఏంటి ఆలోచిస్తున్నావు?" అని అడిగాడు రవి.

"ఏం లేదు. ఇంతకీ ఎక్కడుంటున్నారు? అసలు రారేమో అని భయపడ్డాను" అంది గబగబా.

"ఇక్కడే ఓ హోటల్లో ఉన్నాను. రేపు రాత్రి పెళ్ళి అయిన తర్వాత బయలుదేరతాను. కారు తీసుకుని వచ్చానులే"

"ఏంటి రాత్రిపూట కారులో ప్రయాణమా? ఏమీ వద్దు. ప్రొద్దున్నే బయలుదేరితే ఎంతలో వెళతారు కనుక"

"నువ్వు ఎప్పుడు బయలుదేరతావు?" అడిగాడు రవి.

"నేను ఆదివారమే"

"అయితే నాతో రావొచ్చుకదా ఇద్దరం బోర్ కొట్టకుండా వెళ్ళొచ్చు"

"మీకెందుకు ఇబ్బంది?"

"ఇబ్బందా? కొత్తగా మాట్లాడుతున్నావా?" అదేం లేదు. ఇద్దరం ఆదివారం ప్రొద్దున్నే బయలుదేరదాం సరేనా?" అన్నాడు రవి.

మళ్ళీ రవితో 6-7 గంటలు ఒంటరిగా. పిచ్చ సంతోషం వేసింది అంజలికి.

"రండి డాన్సు చేద్దాం" అంది లేస్తూ.

"నా వల్లకాదు. వదిలేయ్ అంజలి."

"ఊహూ ఊరికే అందరితో పాటు అక్కడ ఉండండి. అందరికి డాన్సు వచ్చి చేయట్లేదు. అదో సరదా అంతే" అని చెయ్యిపట్టుకుని లాక్కెళ్ళింది.

"నీకో సర్‌ప్రైజ్ చూపించాలి అంజలి. రేపు చెపుతాను" అన్నాడు రవి.

"అబ్బా మళ్ళీ సర్‌ప్రైజ్ ఏంటి? అందులో రేపటిదాకా.."

"ఈ వంకనన్నా నా గురించి ఆలోచిస్తావు కదా" అన్నాడు రవి.

సరిగ్గానే విన్నదా తను. "ఏమన్నారు?" అడిగింది అంజలి. మాట్లాడలేదు రవి.

"సరే! మీక్కూడా రేపే ఒక సర్‌ప్రైజ్ ఇస్తాను" అంది అంజలి.

ఎంతో సరదాగా గడిచిపోయింది. బయలుదేరుతుంటే రాజేష్ అన్నాడు. "రేపు ప్రొద్దున వచ్చేయండి రవి. అందరం అక్కడే రఘు ఇంట్లో పేకాట కాస్త సరదాగా ఉంటుంది."

"లేదులే రాజేష్, ఫ్రెండ్స్ ఉన్నారు. రేపు కలవాలి. రాత్రి పెళ్ళికి వస్తాను" అని రవి, అంజలి వంక చూసి "ఐ హేడ్ లాట్ ఆఫ్ ఫన్ టుడే, గుడ్‌నైట్" అని చెప్పి వెళ్ళిపోయాడు.

రవి, అంజలి ఒకరినొకరు చూసుకోవటం, మాట్లాడుకునే విధానం గమనిస్తూనే ఉన్నాడు. వివేక్. చాలా బాధగా ఉక్రోషంగా కూడా ఉంది.

**పెళ్ళి మండపం** కళకళలాడుతోంది. చాలామంది వచ్చారు. ఇద్దరూ ఒకే ఊరివాళ్ళు అవ్వటం, క్లాస్‌మేట్స్ మూలానా. అంజలి, లక్ష్మి రెడీ అయ్యి రాధిక దగ్గరకు వచ్చారు. బ్యూటిషియన్ తనకు మేకప్ వేస్తోంది. .

"అయిపోయిందా? గౌరీ పూజకు టైం అయ్యింది" హడావుడిగా వచ్చారు రాధి వాళ్ళ అమ్మగారు.

"ఇంకో పదినిమిషాలు.. అంతే!" అంది రాధిక.

"అమ్మా అంజలి.. ఈ వారం రోజులు ఎంతో సాయం చేశావు. రేపు రాధి, నువ్వు ఇద్దరూ వెళ్ళిపోతే ఇల్లంతా బోసిపోతుంది. ఏంటో పిల్ల పెళ్ళి అని సంతోషపడాలో, రాధీ ఇంట్లో ఉండదని బాధపడాలో!?" బాధగా అన్నారావిడ.

"ఊరుకోమ్మా.. ఊళ్ళోనే ఉంటాగా. ఎప్పుడు కావాలంటే అప్పుడొస్తా. అదంతా సరేకానీ అన్నయ్య వాళ్ళు పెళ్ళికి రాలేదనే బాధగా ఉంది" అంది రాధిక.

రాధిక అన్నయ్య విజయ్ అమెరికాలో ఉంటాడు. ఏవో వీసా గొడవల వల్ల పెళ్ళికి రావటానికి కుదర్లేదు. ఇంట్లో అందరూ దాని గురించి బాధపడ్డారు. "ఏంటో అందరూ ఈ అమెరికా మోజులతో వెళ్ళిపోవటం మంచికి, చెడుకు దేనికీ రావట్లేదు. డబ్బులు సంపాదిస్తే సరిపోతుంది కాబోలు. పంపాడుగా పూలు, గిఫ్టు, ఆనందించండి" అప్పుడే లోపలికి వచ్చిన రాధిక నానమ్మగారు అన్నారు వ్యంగ్యంగా. ఆవిడకు మనవడు దేశం వదిలిపోవటం ససేమిరా ఇష్టం లేదు. మన దేశం గొడ్డుపోయిందా ఉద్యోగాలు లేవా అంటుంది ఆవిడ.

"అబ్బా నానమ్మా అన్నయ్య రావట్లేదు అని తెలిసినప్పట్నుండి కోప్పడుతూనే ఉన్నావు. ఇక ఆపెయ్యి" అంది రాధిక.

రాధి గౌరీ పూజకు లేచింది. "మేము రఘు వాళ్ళ దగ్గరికి వెళ్ళివస్తాం" అని లక్ష్మి, అంజలి బయలుదేరారు.

"భలే ఉన్నారు మీ ఆడపిల్లలందరూ పట్టుచీరల్లో, సాంప్రదాయంగా" అన్నాడు రాజేష్.

"రఘు నువ్వు రాధీని చూడాలి. అస్సలు గుర్తుపట్టలేవు. నగలు, పూలజడ ఎంత బాగుందో!" అంది లక్ష్మి.

"రండి ఎంట్రెన్స్ దగ్గరకు వెళ్దాం. తెలిసిన వాళ్ళు వస్తారేమో" అంది అంజలి.

"రవి ఇంకా రాలేదా?" కళ్ళతో అంతా వెతుకుతూ అనుకుంది అంజలి.

"అంజలి నీతో కాస్త మాట్లాడాలి.. కొంచెం పక్కకి వస్తావా!?" అన్నాడు వివేక్.

ఓ పక్కన నిలబడ్డారు ఇద్దరూ "ఏమైంది వివేక్?"

"నీకు చాలా సారీ చెప్పాలి అంజలి. ఒక్కోసారి మనకి తెలియకుండా మనం ఇష్టపడేవాళ్ళను చాలా బాధపెడతాం."

సాంతం చెప్పనివ్వకుండా ఆపేసింది అంజలి. "వివేక్ ఎందుకివన్నీ ఇప్పుడు? వదిలేయ్"

"లేదు అంజలి నువ్వు రేపు వెళ్ళిపోతావు. తర్వాత నువ్వూ నేనూ ఎప్పుడు కలుసుకుంటామో! చెప్పాలనుకున్నవన్నీ నీ ఎదురుగానే చెప్పాలి ప్లీజ్ చెప్పనివ్వు. నేను నిన్ను చాలా ఇష్టపడుతున్నాను. అది నీకు చెప్పాను కూడా కానీ నువ్వు నో అంటే తట్టుకోలేకపోయాను. అది అహం కావచ్చు లేదా నిన్ను వదులుకోవటం ఒప్పుకోలేకపోవచ్చు. కానీ కారణం ఏదైనా ఒకసారి నో అంటే మళ్ళీ, మళ్ళీ సతాయించకూడదు. నీ అభిప్రాయాన్ని గౌరవించాలని మర్చిపోయాను." అంజలి చేతులు పట్టుకున్నాడు.

"నీ స్నేహం మాత్రం కోల్పోవాలని లేదు అంజలి. రఘు నాతో మాట్లాడాడు. తర్వాత అర్ధం అయ్యింది నిన్నెంత హర్ట్ చేశానో. ఒకవేళ నీ అంతట నువ్వు వచ్చి నన్ను ఇష్టపడుతున్నావంటే నాకంటే, ఈ ప్రపంచంలో అదృష్టవంతుడు లేడనుకుంటా కానీ ఐ విల్ ఆల్వేస్ బి యువర్ ఫ్రెండ్"

వివేక్ మాట్లాడుతుంటే చాలా సంతోషం వేసింది అంజలికి నవ్వుతో మొహం విప్పారింది.

"ఎంత హాపీగా ఉందో వివేక్ నువ్విలా మాట్లాడటం. మనిద్దరి మధ్య ఉన్న అడ్డం పోయినట్లుగా ఉంది."

రవి లోపలకు వచ్చాడు. అంజలి కనపడుతుందేమోనని చుట్టూ చూస్తుంటే వివేక్ అంజలి కనిపించారు. దగ్గరకు వెళ్ళబోయాడు. వివేక్, అంజలి చేతులు పట్టుకుని మాట్లాడటం ఇద్దరి మొహాలు సంతోషంగా ఉండటం చూసి ఆగిపోయాడు.

ఏమైంది తనకు ఎందుకింత జెలసీ. వాళ్ళిద్దరూ స్నేహితులేగా. నవ్వుతూ మాట్లాడుకుంటే తప్పేముంది. తప్పనికాదు. వివేక్ బదులు ఇంకెవరితో మాట్లాడినా ఈ బాధ ఉండేదికాదు. ఏం మాట్లాడుకుంటున్నారు ఇద్దరూ? - ముందుకు వెళ్ళి ఓ ఖాళీ కుర్చీలో కూర్చున్నాడు రవి.

"ఓ మాట అడగనా అంజలి?" అన్నాడు వివేక్

"ఏంటి?"

"నువ్వు రవిగారిని ఇష్టపడుతున్నావు కదూ!?" అన్నాడు.

ఉలిక్కిపడింది అంజలి. "అదేంటి అలా అడిగావు? అదేమీలేదు"

"సర్లే చెప్పాలని లేకపోతే పర్లేదు. కానీ ఎవరికీ తెలియాలని లేకపోతే నీ మొహంలో ఎక్స్‌ప్రెషన్‌ని కంట్రోల్ చేసుకో" నవ్వాడు వివేక్.

"ఏదేదో మాట్లాడూతున్నావ్. పద పెళ్ళి మొదలయ్యేటట్లుంది. రఘుని తీసుకురావాలేమో మీరు. వెళ్ళు వెళ్ళు" అంది అంజలి.

మండపం దగ్గరకు రాబోతున్న అంజలి ఒంటరిగా కూర్చున్న రవిని చూసి దగ్గరకు వెళ్ళింది.

"ఏంటి ఒక్కరే కూర్చున్నారు? ముందుకు రండి. ముంద ఖాళీ పెట్టారు"

"పర్లేదు. ఇక్కడే కూర్చుంటాలే" అన్నాడు రవి.

"లేదు.. లేవండి మీరు" అని ముందర కూర్చోపెట్టి 'ఇప్పుడే వస్తా' అని వెళ్ళి రెండు కూల్‌డ్రింక్స్ పట్టుకుని వచ్చి రవి పక్కన కూర్చింది.

"సింపుల్‌గా బాగుంది అలంకరణంతా. సిటీల్లో ఈ మధ్య పెళ్ళిళ్ళన్నీ సినిమా సెట్టింగ్ మాదిరిగా చేస్తున్నారుగా" అన్నాడు రవి.

"రఘు, రాధి ఇద్దరూ వాళ్ళ పేరెంట్స్‌ని ఒప్పించి సింపుల్‌గా చేస్తున్నారు" అంది అంజలి.

"అది సరే నాకేదో చెపుతానన్నారు. ఏంటది?"

"ఎందుకంత కంగారు. రేపు ప్రయాణంలో చెపుతాలే" అన్నాడు నవ్వుతూ.

"ఇలా అయితే మీతో అస్సలు మాట్లాడను. మీరు మోసం చేస్తున్నారు."

ఇంకేదో అనబోతుండగా రాజేష్ వచ్చి "ఇక్కడ కూర్చున్నారా? ఎక్కడున్నారా అని వెతుకుతున్నా. ప్రొఫెసర్ మాధవ్‌గారు వచ్చారు" అన్నాడు.

"మరి తీసుకురా ఇక్కడికి అందరికి ముందలవైపు ఖాళీ ఉంది. ఈ రెండు వరసలు మనవాళ్ళకోసమే" అంది అంజలి.

ప్రొఫెసర్ మాధవ్ ఇంకొంత మంది కలిసి వచ్చారు. రాజేష్, రవిని మాధవ్‌గారికి ఇంకా ముగ్గురు ప్రొఫెసర్లకి పరిచయం చేశాడు.

"రవి. చాలా ఇంప్రెస్ చేశానయ్యా నువ్వు మా స్టూడెంట్స్‌ని. మేము మెడికల్ కాంప్ మీ ఊళ్ళో పెట్టాలనుకుంటున్నాం నేను మీ ఊరిలోని డా.ప్రసాద్ తో మాట్లాడాను. ముందు మెడికల్ క్యాంప్ పెట్టి, దానికి వచ్చే రెస్పాన్సు బట్టి తర్వాత ఏంటో ఆలోచిస్తాం. పల్లె వాళ్ళు కాబట్టి మీకు వ్యవసాయం పనులు కాస్త తక్కువగా ఉండే టైమ్ చెపితే ఓ శని, ఆదివారాలలో పెట్టచ్చు" అన్నారు ప్రొ.మాధవ్.

రవికి చాలా సంతోషం వేసింది "చాలా థాంక్స్ అండి. అక్టోబరులో పనులు కొంచెం తక్కువగా ఉంటాయి. మీరు తేదీ నిర్ణయించాక ఏర్పాట్లు చూస్తాను" అని తన ఫోన్ నెంబరు, ఈ మెయిల్ ఉన్న కార్డ్ ఇచ్చాడు.

"రండి.. అందరూ కూర్చోండి. రఘు మండపం దగ్గరకు వచ్చాడు" అన్నారెవరో.

పెళ్ళి అంతా సరదాగా గడిచిపోయింది అందరూ భోజనాలకు లేచారు.

రవి, ప్రొఫెసర్‌తో మాట్లాడుతూ భోజనం చేశాడు. అంజలి ఎక్కడా కనపడలేదు భోజనాలదగ్గర.

"గ్రూప్ ఫోటోలు దిగుదాం రండి" అని రాజేష్ అందరిని తీసుకెళ్ళాడు. అంజలి అక్కడ రఘు వాళ్ళ నాన్నగారితో మాట్లాడుతున్నదల్లా, వీళ్ళను చూసి వచ్చి "రండి ఫోటో దిగుదాం" అంది.

ప్రొఫెసర్లతో దిగాక "రండి మీతో ఒకటి దిగాలి" అని రవి చెయ్యిపట్టుకుని లాక్కెళ్ళింది.

"భోంచేశావా నువ్వు?"లో గొంతుతో అడిగాడు రవి

"తినలేదు ఇంకా కొంచెం బిజీగా ఉన్నాను"

రాజేష్, వివేక్ లక్ష్మి కూడా వచ్చి వీళ్ళ పక్కన నిల్చుని, దంపతులతో ఫోటో దిగారు.

రవి ఓ పక్కకి వెళ్ళబోతుంటే రఘు లేచి "రవిగారు ఒక నిమిషం ఇటు రండి మా నానమ్మకు పరిచయం చేస్తాను" అని అందరితో కలిసి, విడిది గదికి తీసుకెళ్ళాడు.

విడిది గదిలో రఘు, రాధిక వాళ్ళ ఇద్దరి కుటుంబాలు ఉన్నారు.

రవిని పరిచయం చేయగానే రఘు వాళ్ళ నానమ్మ, "చాలా మంచి పనులు చేస్తున్నావని రఘు చెప్పాడు నాయనా చాలా సంతోషం" అని చేతిలో ఓ కవరు పెట్టింది.

"ఏంటిది?" అన్నట్లు రవి చుట్టూ చూశాడు.

"తీసి చూడండి. ఏంటి ఆలస్యం?" అంది అంజలి.

కవరు తీసి చూశాడు రవి. లోపల ఎనిమిది లక్షల ముప్పై ఐదువేల రూపాయల చెక్కు ఉంది. అందరూ చప్పట్లు కొట్టారు. రవికి ఏమీ అర్థంకాలేదు.

"రవి ఇటు చూడండి" అని అంజలి, రవి మొహాన్ని ఫోటో తీసింది.

"ఏంటిదంతా?" ఏమీ అర్థంకాక అన్నాడు రవి.

"ఏం లేదు రవి.. నువ్వు చేసే పనులు, దాని కోసం పడుతున్న కష్టం విని పిల్లలందరూ చాలా ఇన్‌స్పైర్ అయ్యారు. వాళ్ళందరూ కలిసి చందాలు వేసుకుని డబ్బు కలెక్ట్ చేశారు. పెళ్ళి కూడా అందుకే సింపుల్‌గా కావాలన్నారు. అందుకే పెళ్ళి ఖర్చు తగ్గించి ఆ డబ్బులు కూడా చందాల్లో కలిపాం. వీటిని మీరే రకంగా ఉపయోగించినా పర్లేదు" అన్నారు రాధికా వాళ్ళ నాన్నగారు.

నోటమాట రాలేదు రవికి. వీళ్ళు ఇంత నిస్వార్థంగా నన్ను నమ్మి..!? అంజలి వంక చూశాడు. నవ్వుతూ తన వంక చూస్తోంది..

"నాకేం మాట్లాడాలో ఎలా కృతజ్ఞతలు చెప్పాలో తెలియడంలేదు" అన్నాడు రవి.

"ఏమీ వద్దు. నిన్ను చూసి కొంతమందన్నా ముందుకొచ్చి, ప్రజల కోసం పనులు చేస్తే, దేశం బాగుపడుతుంది" అంది రాధిక వాళ్ళ నానమ్మ.

పిల్లలందరూ బైటకొచ్చారు. అంజలి చెయ్యిపట్టుకుని పక్కకు లాక్కెళ్ళాడు రవి. "ఇదంతా నీ పనేకదూ?"

"ఏం నచ్చలేదా?" కనుబొమలెగరేస్తూ అంది అంజలి.

"ఏం చెప్పాలో తెలియటంలేదు?" అన్నాడు రవి.

"ఏం చెప్పనక్కరలేదు. అయినా మీరు మనస్సులో ఉండేది బైటకు చెప్పరు కదా!"

"మళ్ళీ ఇదేం కంప్లైంట్"

"ఏమీలేదు. నాకు చాలా ఆకలేస్తుంది. నాకు కంపెనీ ఇవ్వండి భోజనం చేసేదాకా" అని తీసుకెళ్ళింది.

భోజనం చేస్తూ అడిగింది అంజలి "రేపు ఎన్నిగంటలకు బయలుదేరదాం? నాకైతే ఇవాళ నిద్రపట్టదు. ఇప్పుడే ఇంటికి వెళ్ళాలని ఉంది" అన్నాడు రవి.

"వద్దు. నేను పక్కన నిద్రపోతే మీకు డ్రైవింగ్ కష్టం. రేపు ఏడుగంటలకి రండి రెడీగా ఉంటాను" అని వాళ్ళ ఇంటి గుర్తులు చెప్పింది. అందరికీ పేరు పేరున చెప్పి వెళ్ళాడు రవి.

ఆదివారం ప్రొద్దున కావటంతో, రోడ్లు ఖాళీగానే ఉన్నాయి.

"ఏంటి ఆలోచిస్తున్నావు?" అడిగాడు రవి.

"ఏం లేదు. ఈ వారం రోజుల సందడి... రాధి పెళ్ళి.."

"నువ్వు మీ ఫ్రెండ్స్‌తో బాగా క్లోజ్ కదా!"

"నేను ఒక్కదాన్నే కదా! నాకు తోబుట్టువులు ఎవ్వరూ లేరు. అందుకే ఫ్రెండ్స్‌తో బాగా క్లోజ్. చిన్నప్పుడు బాగా గొడవ చేసేదాన్నంటా. నాకెందుకు చెల్లికాని, తమ్ముడు కానీ లేరని." నవ్వింది అంజలి " రాధీతో ఇంకాస్త ఎక్కువ క్లోజ్ నేను. హాస్టల్ ఉన్న ఆదివారాలు వస్తుండేదాన్ని వాళ్ళింటికి. దాంతో వాళ్ళింట్లో వాళ్ళతో కూడా బాగా చనువే నాకు"

కాసేపాగి అన్నాడు రవి " థాంక్స్‌లాంటి చిన్న పదాలు చెప్పటం ఇష్టంలేదు కానీ నీకు ఇంకేం చెప్పాలో తెలియటం లేదు."

"చెక్కు గురించా? రాత్రే చెప్పాగా ఏమీ వద్దు. అందరూ కలిసి చేశారు ఇది. నేను ఒక్కదాన్నే కాదు. మీరు ఎప్పుడో చెప్పారు గుర్తుందా సాయం చేయాలని చాలా మందికి ఉంటుంది కానీ సరైన ఛానెల్ దొరకదు కాస్త మోటివ్ చేయగలగాలి అంతే"

"మీరందరూ ఇలా డబ్బులు సేవ్ చేసి నాకిస్తే, విజయవాడ వెళ్ళినప్పుడు నగల కోసం తేలికగా ఆరులక్షలు ఖర్చు చేశాను."

రవి ఇంకేదో అనబోతుంటే మధ్యలో ఆపింది అంజలి. "చాల్లే ఊరుకోండి. ఇంటి ఆడపడుచు వస్తే తనకు పెట్టే వాటిని ఆపి దేశాన్ని ఉద్ధరిస్తారా? దుబారా ఖర్చులు ఆపితే వచ్చిన డబ్బులు ఇవి."

"మర్చిపోయా. మీకు పెళ్ళి కాలేదని తెలిసి, రాధి వాళ్ళ నానమ్మగారు సంబంధాలు చెప్పారు. డిటైల్స్ చెప్పనా?" నవ్వు ఆపుకుంటూ అడిగింది అంజలి.

"ఏంటీ చాల్లే ఇక ఆపు" అన్నాడు రవి. ఏంటీ అమ్మాయి ఏమనుకుంటుంది టీజ్ చేస్తుందా తనను.

"రాధిక, రఘు పెళ్ళికి గొడవలేం జరగకుండా ఒప్పుకున్నారా వాళ్ళ పేరెంట్స్?" అడిగాడు రవి.

"ముందు ఫ్రెండే కదా. ఇంటికి వస్తుండేవాళ్ళం అందరం. హౌసర్జను చేస్తుండగా ఇద్దరూ, ఇంట్లో చెప్పారు. పెద్దగా అభ్యంతరం చెప్పటానికి కారణాలు దొరకలేదు వాళ్ళకు. రాధీని ఒప్పించటానికి రఘుకి రెండేళ్ళు పట్టింది. ఇద్దరి మధ్యలో నేను ఇరుక్కునేదాన్ని. "చిన్నగా నవ్వుతూ చెప్పింది అంజలి " రాధీకి కూడా ఇష్టమే కానీ ఏదో అనుమానం. ఉన్న ఇష్టాన్ని బైటపెట్టలేక చాలా ఇబ్బంది పడింది. మొన్న పార్టీలో ఆ నాట్యాక్షరి పాటలన్నీ కూడా వాళ్ళిద్దరి ప్రేమకథకు సంబంధించినవే."

కాసేపు మౌనంగా ఆలోచిస్తూ ఉండిపోయాడు రవి. "వివేక్ ఢిల్లీ వెళుతున్నాడా?"

"అవును. అందరిని వదిలి వెళ్ళాలంటే తనకు బాధగా ఉంది. అందులో తనకు రఘు ఇంటరు నుండి ఫ్రెండ్ వివేక్‌కు ఇంట్లో వాళ్ళతో పెద్ద క్లోజ్‌గా ఉండడు. ఒక అక్క, అన్నయ్య. తనకు బాగా డబ్బులున్నవాళ్ళు, డబ్బు, స్టేటస్ ఇవి తప్పితే వేరే భాష అర్థంకాదు. మాతో స్నేహంగా ఉండటం కూడా ఇష్టంలేదు వాళ్ళకు. వివేక్ పట్టించుకోడు. తను ఢిల్లీ వెళ్ళటం చాలా సంతోషంగా ఉంది వాళ్ళ

పేరెంట్స్‌కి. మాకు దూరంగా ఉండొచ్చు. ఇంకా ఢిల్లీలో చదువుతున్న ఎం.పిగారి అమ్మాయితో పరిచయం పెంచి, పెళ్ళిదాకా తీసుకురావచ్చు నవ్వింది అంజలి చూడాలి వివేక్ ఏమంటాడో? పెళ్ళికి పిలవటానికి వెళితే, వివేక్‌వాళ్ళ అమ్మగారు ఈ సంబంధం విషయం చెప్పారంట గొప్పగా. ఫ్రెండ్స్‌తో పార్టీ అంటూ డబ్బులిస్తారు. ఎవరికన్నా సాయం చేయాలంటే మాత్రం ఇవ్వరు. నిన్న ఇచ్చిన చెక్‌లో కూడా వివేక్ రెండు లక్షలు ఇచ్చాడు. చాలా మంచివాడు వివేక్"

"మంచివాడు, తెలివిగలవాడు, పైగా నిన్ను చాల ఇష్టపడతాడు. మరి నువ్వు తనను పెళ్ళి ఎందుకు చేసుకోవటంలేదు. "అడిగాడు రవి "అదిగో అలా చూడకు. జస్ట్ క్యూరియాసిటి. "

కాసేపు మాట్లాడలేదు అంజలి. "ఏమో తనంటే ఎప్పుడూ ఓ ఫ్రెండ్‌లాగానే ఉంటుంది ఇంకేమీ అనిపించలేదు" ముక్తసరిగా అంది.

మధ్యలో భోజనానికి కాసేపు ఆగి తిరిగి ప్రయాణం సాగించారు. వారం రోజుల అలసట, చల్లగాలి.. స్టీరియోలో మంచి పాటలు.. కళ్ళు మూతలు పడుతున్నాయి అంజలికి. ఎప్పుడు నిద్రలోకి జారుకుందో తెలియదు. ఒకసారి కుదుపుకు మెలుకువొచ్చి కళ్ళు తెరిచింది. తన తల రవి భుజం మీద ఉంది. ఉలిక్కిపడి లేచి "సారీ నిద్రపోయాను" అంది.

"నిద్రపోతే సారీ ఎందుకు? బాగా అలిసిపోయినట్లున్నావు. పడుకో పర్లేదు. ఇంకా చాలా ప్రయాణం ఉంది. ఇప్పుడే విజయవాడ దాటాం అన్నాడు."

ఏంటి రెండు గంటలు నిద్రపోయానా? అందులో తన భుజం మీద. సిగ్గుగా అనిపించింది అంజలికి.

"టీ తాగుదామా? కొంచెం ఫ్రెష్‌గా ఉంటుంది" అని తోవలో టీ కొట్టు దగ్గర ఆపాడు రవి.

"ఇందాక మీరు వివేక్ గురించి అడిగితే సరిగ్గా చెప్పుకోలేకపోయాను" టీ తాగుతూ నెమ్మదిగా మొదలుపెట్టింది అంజలి. "ఎందుకో కొంతమందిని చూస్తే ఇష్టం కలుగుతుంది. ఎందుకు కొంతమందితో జీవితాంతం నడవాలనిపిస్తుందో ఎవ్వరికి తెలియదు. నాకు భావుకత ఎక్కువని, అతిగా ఆలోచిస్తానని రాధీ ఎప్పుడూ కోప్పడేది. ఏమో నిజంగానే అన్ని విషయాల్లో కొంచెం ఎక్కువే ఆలోచిస్తానేమో. నేను వివేక్‌ని ఎప్పుడూ వేరే దృష్టితో చూడలేదు. ఇకముందు కూడా చూడలేను అనిపించింది. అందుకే కాదన్నాను. అందరూ నన్ను కోప్పడ్డారు తనను కాదన్నానని. కానీ నిన్న పెళ్ళిలో తను నాకు సారీ చెప్పాడు. నా మనసు తెలిసి కూడా నన్ను వత్తిడి పెట్టినందుకు." ఓ క్షణం ఆగింది. "నేనెందుకిదంతా మీతో ఎందుకు చెపుతున్నానో? రండి వెళదాం" అని వెళ్ళి కారులో కూర్చుంది.

అంజలి ఎందుకింత మధనపడుతోంది!?. తను నన్ను ఇష్టపడుతోందా? లేక కేవలం వివేక్ గురించి చెప్పిందా? ఎందుకో అనిపిస్తుంది తను కూడా నన్ను ఇష్టపడుతోందని. సంతోషంగా అనిపించింది రవికి. ప్రేమను తనకు చాలా అందంగా చెప్పాలి. ఇలా కారులో కాదు.

"నీ కాలేజీ ఎప్పుడు తెరుస్తారు అంజలి?" అడిగాడు రవి.

"ఇంకా రెండువారాల్లో. ఎందుకు?"

"ఇంక రెండు వారాలుందన్నమాట నాకు టైం" లో గొంతుకతో అన్నాడు రవి.

"దేనికి టైం?"

"సర్‌ప్రైజ్" నవ్వాడు రవి.

"సర్‌ప్రైజ్ అంటే గుర్తొచ్చింది. ఏదో చెపుతానన్నారు కానీ ఇంతవరకు చెప్పలేదు"

"రెండు విషయాలు చెప్పాలి. వాటిల్లోది అతి ముఖ్యమైన విషయం. ఇలా కారులో కాదు తర్వాత చెపుతాను. ఏంటో ఎప్పుడు చెప్పాలనుకున్నా ఏదో ఒక అడ్డం వస్తుంది." అన్నాడు రవి. "రెండోది ఇదిగో ఈ లెటర్ చదువు. నాకు ఈ మెయిల్ వచ్చింది. నీకోసం ప్రింటు చేశాను."

లెటర్ చదివింది. అందులో రవి పంపిన ఈ మెయిల్ అందరూ చదివారని, త్వరలో మొదటి విడతగా ఇరవైఐదు వేల డాలర్లు పంపుతామని వాళ్ళు తరపున ఒక త్వరలో ఇండియా వస్తారని అప్పటికల్లా రవి ఓపెన్ చేసిన 'ప్రగతి' అని ఓ నాన్ ప్రాఫిట్ ఆర్గనైజేషన్‌గా రిజిస్ట్రార్ చేయించమని దానివల్ల టాక్స్ ఎగ్జెంప్షన్ వస్తుంది - అని ఉంది..

"ఎవరు పంపారు ఇది" ఎక్సైయిటెడ్‌గా అడిగిందిక అంజలి.

"అమెరికాలో ఉంటున్న మన ఊరివాళ్ళు. ఆ పంపినాయన ఎప్పుడో పాతికేళ్ళ క్రితం అమెరికా వెళ్ళిపోయాడు. డాక్టరు. ఆయన పేరెంట్స్ కూడా చనిపోయారు. ఎప్పుడూ పెద్దరారు మన ఊరు. ఆయన వచ్చేలోపల ఆ డబ్బులను ఎలా ఉపయోగించాలో ఆలోచించాలి పక్కాగా ప్లాను వేయాలి" అన్నాడు రవి.

"కంగ్రాట్స్ ఎంత హాపీగా ఉందో. ఇలా అందరూ రెస్పాండ్ అవుతుంటే" అంది అంజలి.

నీ మొహం మీద ఈ సంతోషం చూడాలనే నేను ఈ విషయం ఫోన్ చేసి చెప్పలేదు, అని మనస్సులో అనుకున్నాడు రవి.

"ముందల మంచినీళ్ళ ట్యాంక్ కట్టించాలి. ప్లాన్ రెడీగా ఉంది. నేను ఈ వారం రోజుల్లో మొదటి బాచ్ ఇళ్ళు కట్టించటానికి లిస్ట్ తయారు చేశాను. ఇంకా ఎవ్వరికీ చెప్పలేదు. వాళ్ళతో బ్యాంకులో ఎకౌంటు తెరిపించి, అప్లికేషన్ పూర్తిచేయించి, పంపించాను. వీళ్ళందరూ అప్లికేషన్ మీద వేలుముద్ర కాకుండా సంతకం పెడుతుంటే ఎంత ఆనందం వేసిందో అంజలి రెండేళ్ళ కష్టం."

ఊరు దగ్గరకు వచ్చింది

"అప్పుడే వచ్చేసింది ఊరు. ఏంటో ఇంకా చెప్పాల్సినవి చాలా ఉన్నాయి" అనుకున్నాడు రవి.

"ఇంకో తమాషా చెప్పనా. మన ఎం.ఎల్.ఏగారు ఫోన్ చేసి వచ్చే మండల ఎన్నికల్లో నన్ను పోటీ చేయమన్నారు. నేను గ్యారంటీగా గెలుస్తానన్నారు నాకు ఇంట్రెస్ట్ లేదనన్నాను."

"అరే ఎందుకు? ఒక్క ఊరికే ఎందుకు పరిమితం అవ్వాలి మీరు?"

"అదికాదులే అధికార పార్టీవాళ్ళు, వల్ల గొడవలస్తున్నాయి. ఆయనకు తెలిసినవాళ్ళను కీలక స్థానాల్లో ఉంచాలని ముందు మన ఊరు మన పరిధిలోని ఊళ్ళు బాగుపడితే తర్వాత చూద్దాం. అంతేకానీ ఇక్కడ సమస్యలు తీరకుండా రాజకీయంగా ఎదగాలని ఏమీలేదు నాకు. అందులో ఈ రాజకీయాలు నాకు సరిపడవు. ఇలాగే హాయిగా ఉన్నాను" అన్నాడు రవి.

అంజలి ఇంటి దగ్గర ఆపాడు కారు.

"రండి కాఫీ తాగి వెళుదురుగాని" అంది అంజలి రవి చేతుల్లోంచి తన సూట్‌కేసు తీసుకుంటూ.

"కాఫీ వద్దు. పద లోపలికి వచ్చి, మీ నాన్నగారిని కలుస్తాను. వాళ్ళ అమ్మాయిని క్షేమంగా తెచ్చానని చెప్పాలి కదా" అన్నాడు నవ్వుతూ.

"క్షేమంగా తెచ్చినందుకు చిన్న ఫీజ్. ఈ కాఫీ నేనే ఇస్తాను" అంటూ లోపలికి వెళ్ళారు.

లోపల సీతారామయ్యగారు పేపరు చదువుతున్నారు.

"అమ్మ పడుకుందా నాన్న?" అంటూ లోపలకు వచ్చింది అంజలి.

"మీరింత తొందరగా వస్తారనుకోలేదమ్మా సాయంత్రం అవుతుందేమో అనుకున్నా"

"కాఫీ పెడతానుండండి" అంటూ లోపలకు వెళ్ళింది అంజలి.

అంజలి కాఫీ తెచ్చేలోపల తనకు అమెరికా నుండి వచ్చిన ఈమెయిల్ సంగతి చెప్పాడు రవి.

"ఈసారి మండల ఎలక్షన్లలో మన పార్టీ మెంబర్లకి మెజారిటీ వస్తే నిన్ను చైర్మనుగా ఎన్నుకుంటారు అంటున్నారు ఊళ్ళో. నిజమేనా?" అన్నారు సీతారామయ్య.

"అదేం లేదండి."

"ఎం.ఎల్.ఏగారు నిన్ను సపోర్ట్ చేస్తారు. నువ్వు గెలవటం ఖాయం అంటున్నారు."

"ఇవన్నీ బట్టి మాటలు ఇంకా ఎలక్షన్‌లకి చాలా టైం ఉంది ఊరికే పుకార్లు ఇవన్నీ" అన్నాడు రవి.

పదిరోజుల్లో వెళుతుంది కాబట్టి ఇంక మీటింగులకు రావటానికి కుదరదని పద్మ వదిన వాళ్ళతో మాట్లాడి ఇంటికి వచ్చింది అంజలి. చీకట్లు ముసురుకుంటున్నాయి. స్నానం చేసి తన డైరీ తీసుకుని మేడమీదకు వెళ్ళింది.

కళ్ళు మూసుకుని ఆలోచిస్తోంది అంజలి. ఇంకో పదిరోజుల్లో వెళ్ళిపోతుంది తను. రవికి తన మనస్సులోని మాట చెప్పలేక పోయింది. రవి కూడా ఏదో చెప్పాలంటాడు కానీ చెప్పడు. తనను నిజంగా ఇష్టపడుతున్నాడా లేదా? తనని చూస్తే నేనంటే ఇష్టమనే అనిపిస్తుంది. మరి ఎందుకు సంశయిస్తున్నాడు. చాలా అశాంతిగా, బాధగా ఉంది. పాత కృష్ణశాస్త్రి కవిత గుర్తొచ్చి

అలికిడైతే చాలు ఆశతో నా కనులు

వెదికాను నలుదిశల అతడేమో అనుకుని.

ఫోన్ మోగింది. రవి దగ్గర్నుండి. తను ఎప్పుడు రవి గురించి ఇలా ఒంటరిగా ఆలోచిస్తున్నా. తన దగ్గర్నుండి ఫోన్ వస్తుంది. ఏదో నా మనస్సు చదివినట్లుగా.

"ఏం చేస్తున్నావు?" ఫోన్ ఎత్తంగానే అడిగాడు రవి.

"ఏం లేదు. డాబామీద కూర్చున్నా" అంది అంజలి.

"రేపు అందరం తోటలో పిక్‌నిక్‌లాగా వెళదామని ఐడియా వేశాను. పాపం అక్కవాళ్ళను ఈసారి ఎక్కడికీ తీసుకెళ్ళలేదు. నువ్వూ వస్తానంటే ప్లాన్ చేద్దాం" అన్నాడు.

"నేనెందుకూ మీరందరూ వెళ్ళండి" ముభావంగా అంది అంజలి.

"అందేంటి అలా మాట్లాడుతున్నావు? అందరం కలిసి వెళితే సరదాగా ఉంటుంది కదా అని, సతీష్, రాజా వాళ్ళను కూడా రమ్మంటాను"

"ఏమో నాకు మూడ్ లేదు, పని ఉంది. నేను రాను మీరందరూ వెళ్ళండి. తర్వాత మాట్లాడతాను" అని పెట్టేసింది ఫోన్. ఎందుకో లోపల్నుండి దుఃఖం తన్నుకు వస్తుంది. ఇంతగా తను రవిని ప్రేమిస్తోంది కానీ తను మాత్రం నాతో మాట్లాడితే ఎంతసేపు ఊరి విషయాలు లేకపోతే అందరితో కలిసి చేసేవి అంతే.

క్రిందనిండి అన్నపూర్ణ పిలిచింది. "అంజలి చీకటి పడుతుంది క్రిందకు రా. ఏం చేస్తున్నావు పైన?"

"కాసేపాగి వస్తాను" మోకాళ్ళ మీద తలపెట్టుకుని కూర్చుంది. ఈ కన్నీరు ఆగదా? ఏ కొన్ని అశ్రువులో మన మధ్య వారధి ఎందుకు కాకూడదు. కన్నీటితో గుండె తేలికవుతుందంటారు. మరి నా గుండె ఎందుకంత బరువెక్కుతుంది?

కళ్ళలో కనిపించే ప్రియుడు

కన్నీటిలో ప్రతిఫలంగా

తుడవకే కన్నీరు తుడవకే చెలీ.

ఎంతసేపు అలా కూర్చుండిపోయిందో అంజలికే తెలియదు.

"అంజలి" పక్కనే రవి గొంతు విని ఉలిక్కిపడి తలెత్తింది. రవిని అక్కడ చూసి, నిజమా కలా అన్న ఆశ్చర్యంలో కళ్ళు తుడుచుకోవాలని కూడా మర్చిపోయింది.

"ఏమైంది నీకు?" పక్కనే కూర్చుంటూ అడిగాడు.

"ఏమీలేదు. మీరేంటి ఇక్కడ?" తలపక్కకి తిప్పుకుని కళ్ళు తుడుచుకుంది.

చేత్తో అంజలి గడ్డం పట్టుకుని తనవైపుకు తిప్పుకున్నాడు.

"ఏమైంది? ఎందుకలా ఉన్నావు?" నెమ్మదిగా అడిగాడు రవి.

రవి తనతో అలా మాట్లాడుతుంటే తనను పట్టుకుని గట్టిగా ఏడవాలని ఉంది. ఎందుకు కూడా అర్థం కావటంలేదు.

"నావైపు చూడు. ఇందాక ఫోన్‌లో మాట్లాడుతుంటే ఎందుకో అనిపించింది నువ్వు దేనికో అప్‌సెట్ అయ్యావని నేనడిగినా నువ్వు ఫోన్‌లో చెప్పవని వచ్చేశాను" తన మొహం వైపు పరీక్షగా చూసి "ఏడుస్తున్నావా ఏమైంది?"

" నాకేం కాలేదు. బాగనే ఉన్నాను. అనవసరంగా నా కోసం ఎందుకొచ్చారు?" అంది అంజలి చెయ్యి తన చేతిలోకి తీసుకుని.

"ఎందుకొచ్చానంటే ఏం చెప్పేది. నువ్వు దిగులుగా ఉంటే నాకు బాగోదు కనుక."

కళ్ళెత్తి రవి వంక చూసింది అంజలి నెమ్మదిగా చూపు తిప్పుకుని "ఏమైందో చెప్పు ప్లీజ్?" అని అడిగాడు.

ఏం మాట్లాడలేదు అంజలి "ఇంకో పదిరోజుల్లో వెళ్ళిపోతున్నావని దిగులుగా ఉందా?" అడిగాడు రవి.

"ఏమీలేదు. నేను బాగానే ఉన్నాను. పదండి కిందకు వెళదాం" అని లేచింది అంజలి.

"రేపు తోటలో పిక్నిక్‌కి వస్తావా మరి?" అడిగాడు రవి.

"అందుకు వచ్చారన్నమాట నన్ను ఒప్పించటానికా?"

"అవును. నువ్వు ఉంటే బాగుంటుంది నాకు. అందరికి కూడా" అన్నాడు రవి.

"అమ్మను అడుగుతాను."

"ఇందాకే ఇద్దర్నీ అడిగేశాను. వాళ్ళు ఒప్పుకున్నారు. నువ్వు కూడా ఒప్పుకుంటున్నావు అంతే" చిరునవ్వుతో అన్నాడు రవి.

"ఒప్పుకోకపోతే?"

"ఒప్పిస్తాను. ఒప్పించేదాకా ఇక్కడే ఉంటాను. మరి నేను రైతు సంఘం మీటింగుకి ఇప్పటికే లేట్ అయ్యారు. నీ ఇష్టం"

"మీటింగు ఉంటే ఇక్కడికెందుకొచ్చారు?"

"మీటింగుకని బయలుదేరుతూ నీకు ఫోన్ చేశాను. నువ్వు అప్‌సెట్‌గా అనిపించావు. ఇక వచ్చేశాను" అన్నాడు రవి.

"నీ కారణమేంటో నాకు తెలియదు. చెప్పాలనిపిస్తే మాత్రం ఫోన్ చెయ్యి సరేనా!?"

మెట్లు దిగాక మళ్ళీ అడిగాడు రవి "ఏమైంది? ఎందుకంత బాధపడుతున్నావు?"

రవి మొహం మీద కన్సర్న్ అర్థం అవుతుంది. తన బాధకు ఎవరు కారణమో ఎలా చెప్పగలదు?

"ఏం లేదు పదండి" లోపలికి వచ్చేసరికి అన్నపూర్ణ సావిత్రితో రేపు తీసుకురావల్సిన వంటలు గురించి మాట్లాడుతోంది.

"సరే వస్తాను. రేపు పదిన్నరకల్లా వచ్చెయ్యండి" అని రవి వెళ్ళాడు.

"ఏం చేస్తున్నావు అమ్మలూ పడుకున్నావా?" గదిలోపలకు వచ్చింది అన్నపూర్ణ.

"లేదమ్మా పుస్తకం చదువుతున్నా. రా"

"ఒక విషయం నిన్ను అడగాలని నిజం చెపుతావా? నా దగ్గర దాయకుండా" అంది అన్నపూర్ణ.

"ఏంటది? అలా అడుగుతున్నావు?"

"నువ్వూ రవి ఒకరినొకరు ఇష్టపడుతున్నారా?"

తడబడింది అంజలి ఏం సమాధానం చెప్పాలో తెలియక "అదేం లేదమ్మా" అంది నెమ్మదిగా.

"పిల్లి కళ్ళు మూసుకుని పాలు తాగుతూ, ఎవ్వరూ చూడలేదని అనుకుందంట. ద్వేషాన్ని, ప్రేమను ఎక్కువసేపు దాచలేం. రవి చాలా మంచివాడు. తనను నువ్వు ఇష్టపడటంలో తప్పులేదు. మరి నా దగ్గర దాపరికం దేనికి?" అంది అన్నపూర్ణ.

"మేమిద్దరం ఈ విషయం గురించి, ఏమీ మాట్లాడుకోలేదు. రవి నా గురించి ఏమనుకుంటున్నారో, నాకు నిజంగా తెలియదు"

"పోనీ నాన్నను మాట్లడమననా?"

"వద్దు. తనంతట తను చెప్పేదాకా ఎవ్వరూ కలగచేసుకోవద్దు"

"నేనంతా గమనిస్తూనే ఉన్నా అంజలి. పెద్దగా చదువుకోకపోవచ్చుకానీ జీవితంలో చాలా చూశాను. కానీ నలుగురిలో తేలిక అవ్వొద్దు నువ్వు. నేను గమనించినట్లే. వేరే వాళ్ళు కూడా గమనిస్తారని గుర్తుపెట్టుకో. నిద్రపోతూ ఆలోచించు. ప్రొద్దున్నే లేవాలి. వంటకాలు చేయాలిగా" అంది అన్నపూర్ణ.

చంద్రశేఖరావు మామిడి తోటలో రెండు, మూడు రకాల మామిడి చెట్లు, కొన్ని జామచెట్లు ఉంటాయి. వాణిజ్య పంటలాగా కాకుండా ఆయన సరదాగా పెంచుతారు.

చేసిన వంటలు ముందరే సీతారామయ్యగారు స్కూటర్ మీద తీసుకెళ్ళారు. అంజలి, సావిత్రి నెమ్మదిగా నడుచుకుంటూ కబుర్లు చెప్పుకుంటూ వచ్చారు.

తోట మొదట్లో వాళ్ళ జీతగాడు కనిపించి అందరూ లోపలవైపు ఉన్నారమ్మా అటు వెళ్ళండి అన్నాడు.

గుబురుగా పెరిగిన చెట్ల మధ్య నీడగా బాగానే ఉంది. కొంచెం ముందుకు వెళ్ళేసరికి, ఓ చిన్న ఇల్లు కనపడింది. అందరూ అక్కడే ఉన్నారు.

"ఇక్కడెవరుంటారు. తోట కాపలా వాళ్ళా?" అడిగింది అంజలి.

"ఇది మా ఋష్యశృంగుడు గారి పర్ణశాల" నవ్వింది నీరజ.

"అర్థంకాలేదా? మా రవి చాలా ఇష్టపడి ఇక్కడ కట్టించుకున్నాడు. ఎవ్వరినీ రానివ్వడు. వాడికి మూడ్ బాగోలేకపోయినా, ఏదన్నా సమస్యతో సతమతమౌతున్నా ఎవ్వరికీ చెప్పకుండా ఇక్కడికి వస్తాడు. ఊళ్ళో ఎవ్వరికీ ఈ సంగతి తెలియదు మాకు తప్ప."

"ఎప్పుడన్నా మేము ఎమ్మెల్యేగారు వచ్చినప్పుడు పార్టీ పెట్టుకుంటాం తాళం ఇవ్వరా అంటే అస్సలు ఒప్పుకోలేదు. దానిని చెత్త మీటింగులతో ఖరాబు చేస్తావా అని. కట్టించినప్పుడు చూపాడు అంతే. మళ్ళీ చూడలేదు మేము "అన్నారు చంద్రశేఖర్రావు గారు.

ఎంత ముచ్చటగా ఉందో కొంచెం పెంకుటిల్లు, రెల్లు గడ్డితో చుట్టూ మల్లెలు, గులాబీలు, ఓ పక్క నైట్‌క్వీన్ చెట్టు. ఇంటి చుట్టూ తిరిగి చూసింది అంజలి. ఇంటి ముందంతా చక్కగా అలికి ముగ్గులేసి ఉంది.

"అవతల ప్రక్కన తోట చూసుకునే రంగన్న తన భార్యా ఉంటారు." అంది సావిత్రి.

జంపుఖానాలు పరిచి ఓ పక్క తెచ్చినవి సర్దారు. సతీష్, తన భార్య రాణి, కొడుకు ప్రదీప్, రాజా కూడా వచ్చారు. "రవి ఏడి?" అడిగాడు రాజా.

"ప్రొద్దున్నే ఏదో ఫోన్ వస్తే వెళ్ళాడు. కాసేపట్లో వస్తానన్నాడు" అంది సావిత్రి.

పిల్లలు పరుగులు తీస్తూ ఆడుతున్నారు. ప్రదీప్‌కు ఓ ఎనిమిదేళ్ళు ఉంటాయి. దాంతో పిల్లలందరూ బాగా కలిసిపోయారు.

అంతలో సతీష్‌కి ఫోన్ వచ్చింది. "ఏమైంది రవి?" అంటున్నాడు. అంజలి అతని వైపు చూసింది. "ఆ.. అలాగా నేనూ రానా? పర్లేదు వస్తాను. సరే అయితే త్వరగా వచ్చెయ్యి" అని పెట్టేశాడు.

"ఏమైంది మళ్ళీ?" అడిగారు చంద్రశేఖర్రావు.

"సాంబయ్యగారు పొలానికి ఎరువు బస్తాలు కొంటే మొత్తం కల్తీ అంట. దాన్నిండా ఎర్రమట్టి, రాళ్ళు ఉన్నాయంట, దాంతో రవిని తీసుకుని ఎరువుల కొట్టుకు వెళ్ళారు. అక్కడ పెద్ద గొడవైందంట. వీళ్ళ గొడవ తెలిసి ఇంకొంత మది రైతులు కూడా వచ్చారంట రవి. పోలీసు కంప్లైంటు ఇచ్చి వస్తానన్నాడు"

"ఒక్కరోజు కాస్త సరదాగా గడుపుదామంటే ఏదో ఒక గోల" విసుగ్గా అంది నీరజ.

"పాపం మీరు ఎప్పుడో రెండు మూడు ఏళ్ళకోసారి వస్తారు. మీకు డిసప్పాయింటెడ్‌గా ఉంటుందేమో కానీ పాపం రైతులు అప్పులు చేసి ఎరువులు కొని బోలెడు పెట్టుబడి పెడతారు వ్యవసాయం మీద. ఇలా మోసం చేసేవాళ్ళని ఎదిరించకపోతే మోసాన్ని ఆపేదెవరూ?" అంది అంజలి.

"ఏ. నీకిలా ప్లాన్ చేసిన తర్వాత. ఎవరైనా రాకపోతే బాధగా ఉండదా?" రెట్టించింది నీరజ.

"లేదు ప్రొఫెషన్ కూడా అలాంటిదే కదా. అర్థరాత్రిపూట ఎవరికన్నా బాగోలేదని కాల్ రావచ్చు. పార్టీమధ్యలో హాస్పిటల్‌కి వెళ్ళే డాక్టర్లు ఎంతోమంది ఉన్నారు. తప్పదు" అంది అంజలి.

రవికి సరైన జోడి. మనస్సులో అనుకుంది నీరజ.

"రండి అటు కాలవ దగ్గరకు వెళదాం" అని రాజా అందరినీ అటు తీసుకెళ్ళాడు. పెద్దవాళ్ళు మాత్రం అక్కడే కూర్చున్నారు.

"రాజా ఏంటి పెళ్ళి ఎప్పుడు చేసుకుంటావు?" అడిగింది నీరజ.

"చూస్తున్నారు అక్కా సంబంధాలు" కొంచెం సిగ్గుగా అన్నాడు రాజా.

"తొందరగా చేసుకో. రవిలాగా ఉండొద్దు."

"మధ్యవర్తి ఎవరో మీ మావయ్య కూతురుని రాజాకు ఇమ్మని అడిగారంట. మీ మామయ్య అంతెత్తున లేచాడంట. మాకు మేనరికం ఉంది" అని అన్నాడు నవ్వుతూ సతీష్.

"ఏంటి రవికి మేనరికం ఉందా? మరి ఆలస్యం దేనికి?" కుతూహలంగా అంది రాణి.

కంగారుగా అంజలి వంక చూసింది నీరజ. అంజలి అస్సలు వినిపించుకుందోలేదో, పిల్లలు అడిగేవాటికి ఏవో సమాధానాలు చెపుతూ వెళుతుంది.

"అదేం లేదు. మాకెవ్వరికీ ఇష్టంలేదు మా మామయ్యే ఏదో అందరి దగ్గరా అట్లా అంటేనన్నా మా అమ్మ ఒప్పుకుంటుందేమోనని ఇలా చేస్తున్నాడు" అంది నీరజ.

ఒంటి గంటయ్యింది. "ఆకలి.. ఆకలి" అని పిల్లలు గోల మొదలుపెట్టడంతో అందరూ వెనక్కి తిరిగి తోటకొచ్చారు. రవి ఇంకా రాలేదు.

అందరం తినేస్తే రవి వచ్చేసరికి అడుగూ బొడుగువి తింటారా?" మనస్సు చివుక్కుమనిపించింది అంజలికి.

అంజలి అందరికీ వడ్డించింది.

"నువ్వు పెట్టుకో అంజలి" అంది సావిత్రి.

"తింటాను. పిల్లలందరివి అయిపోయాక. మీరు తినండి" అంది.

బైకు శబ్దం వినిపించింది. దూరంగా రవి వస్తూ కనిపించాడు.

"ఏంరా ఏమైంది? అడిగారు చంద్రశేఖర్రావు.

చేతులూ, మొఖం కడుక్కుని వచ్చి కూర్చున్నాడు రవి.

"ఏముంది? ఇలాంటి కల్తీ ఎరువులు పోయిన వారం కూడా అమ్మాడంట. ఇద్దరు ముగ్గురు రైతులొచ్చి కంప్లైంటు కూడా ఇచ్చారంట ఆ బాచ్ మొత్తం అమ్మటం ఆపేస్తే ఏ గోలా ఉండేదికాదు. కానీ అలా చెయ్యకుండా ఇంకా మిగతా వాళ్ళక్కూడా అమ్మి, నాకేం తెలుసు, నేను తయారు చేశానా అని దబాయించాడు. ఒక్కోటి బైటకొచ్చేసరికి, పోలీసు కంప్లైంటు ఇచ్చి, కొట్టు సీలు వేయించి ఆ ఎరువు ఎవరి దగ్గర్నుండి వచ్చిందో వాళ్ళమీద అందరి మీద కేసు వేశాం"

రవి మాట్లాడుతుంటే, అంజలి అతని ఎదురుగా విస్తరాకు వేసి అన్నీ వడ్డించటం మొదలుపెట్టింది. నీరజకు చాలా సంతోషం వేసింది, తను అక్క అయ్యుండి కూడా రవి చెప్పే విషయాలు వింటూ ఉండిపోయింది భోజనం వడ్డించకుండా కానీ అంజలి ఎంత బాగా కనిపెట్టుకుంది. ఎలాగైనా వీళ్ళ పెళ్ళి జరిపించాలి.

"ఈ మధ్య టి.వివాళ్ళు కూడా ఏమన్నా జరిగితే హడావుడిగా వస్తున్నారుగా. వాళ్ళు కూడా వచ్చారు. ఇక దాంతో ఓ పెద్ద తిరునాళ్ళలాగా ఉంది అక్కడ. నా పని అయిపోయిందిగా ఇక తప్పించుకుని వచ్చా" అన్నాడు రవి.

"అబ్బా! సుష్టుగా తిన్నాం ఇక ఒక కునుకు వేయాల్సిందే" వెనక్కి వాలుతూ అన్నారు చంద్రశేఖర్రావు.

"రవి నీ కుటీరం మాకు చూపుతావా లేదా? పిల్లలు బాత్రూమ్కు వెళ్ళాల్సివస్తే చెట్ల వెనక్కి వెళ్ళమంటావా? లేక నీ పాలెస్ తలుపులు తీస్తావా?" అంది నీరజ.

"అంతగా వెక్కిరించనక్కరలేదు. ఇదిగో తాళం. వెళ్ళు" అన్నాడు రవి.

పిల్లలు ముగ్గురూ పరిగెత్తారు ఆడుకోవటానికి. అందరూ లేచారు ఇల్లు చూడటానికి. రవి మొహం మీద ఇబ్బంది చూసి అంజలికి వెళ్ళబుద్ది కాలేదు. పిల్లల వెనకాలే తోటలోకి వెళ్ళింది.

అంజలిని ఒకసారి తీసుకొచ్చి ఇల్లు చూపిద్దాం అనుకున్నా కుదరలేదు. కానీ తను వీళ్ళందరితో కలిసి చూడటం నాకిష్టంలేదు. 'హమ్మయ్య' అవతలికి వెళ్ళింది అనుకున్నాడు రవి.

పిల్లలు జామచెట్టు దగ్గర నిల్చుని, కాయలు ఎలా కోయాలా అని ఆలోచిస్తున్నారు.

"అక్కా జాంకాయలు ఎలా కోయాలి?" అడిగింది శ్రావణి.

"చెట్లు ఎక్కడం రాదా? నేను నేర్పించనా?" అంది అంజలి.

"నేను ఫస్ట్" అని వచ్చాడు సాత్విక్.

వాళ్ళ ముగ్గురిని ఒకరి తర్వాత ఒకళ్ళను ఎక్కించి "సరే దిగండి కాయలు పైకి ఉన్నాయి నేను కోస్తాను" అని చెట్టు ఎక్కింది అంజలి.

"నాకు పెద్దది అంటే కాదు నాకే పెద్దది కావాలి తో అని గోలగోలగా అరుస్తున్నారు పిల్లలు.

"మరి నాకేది?" అన్న రవి గొంతు వినబడింది.

"పెద్దవాళ్ళకు నేను కోయను. చిన్నపిల్లలికే" అంది అంజలి.

"సరే మరి నేను కూడా పైకి రానా?"

"ఏం వద్దు" అని ఇంకో నాలుగు కాయలు కోసి కిందకు దిగింది అంజలి.

"చాలా కళలున్నాయి నీకు. చక్కగా పాటలు పాడతావు చెట్లు ఎక్కుతావు. అల్లరి చేస్తావు. నా మీద అలుగుతావు. ఇంకా ఏమేం తెలుసు?" చిలిపిగా అన్నాడు రవి.

**"అన్నీ చెప్పేస్తే** మజా ఏముంది?" కళ్ళెగరేస్తూ అంది అంజలి.

గట్టిగా నవ్వి "నువ్వు నవ్వుతూ సంతోషంగా ఉంటే బాగుంటావు అంజలి" దగ్గరికి వచ్చి మెల్లగా అన్నాడు.

అంజలి మొహం ఎర్రబడింది.

"సారీ లేటుగా వచ్చాకదా" అన్నాడు.

"ఏమీ పర్లేదు. మీరు వెళ్ళిన పని ముఖ్యమైనది కదా."

"సరేకానీ మీ కుటీరం చూడకుండా నన్ను ఆపారు కదా" అంది.

"నేనేం వద్దనలేదే?"

"మీరు అనలేదు. కానీ మీ మొహం చూసి ఆగిపోయా"

"నీకు నేను తర్వాత చూపిద్దామనుకున్నా అంజలి" అన్నాడు రవి.

"కాచ్ ఆడుకుందామా?" అంటూ వచ్చాడు సాత్విక్.

"మీరు ముగ్గురు ఆడండి. నేను పెద్దదాన్ని కదా నన్ను ఈజీగా పట్టుకోలేరు" అంది అంజలి.

"వదలకండి తనని. అన్నీ ఎక్స్క్యూజెస్ చెపుతుంది ఆడటం రాక" వెక్కిరించాడు రవి.

పిల్లలు గోల చేసేసరికి వాళ్ళతో ఆడటం మొదలుపెట్టింది. రవి చెట్టును ఆనుకుని నవ్వుతూ చూస్తున్నాడు. అంజలి వచ్చి రవిని పట్టుకుని మీరు అవుట్ అయ్యారు" అంది.

"అదేంటి? నేను ఆడటంలేదు" అన్నాడు రవి.

"అదే మరి. ఆడకపోతే ఇక్కడ్నుడి వెళ్ళండి. మమ్మల్నెందుకు చూడటం. లేకపోతే ఆడండి"

"మామయ్యా ఆడు.. ప్లీజ్" అంది శ్రావణి

"నీ పని చెపుతా ఉండు" అని పిల్లల్ని కాసేపు ఆడుకోమని అంజలిని పట్టుకోవటానికి తనవెనకే పరిగెత్తాడు రవి.

"నాట్ ఫెయిర్. తొండి ఆడుతున్నారు" అంటూ పరిగెత్తింది అంజలి.

పరిగెత్తి పరిగెత్తి ఓ చెట్టు దగ్గర వగరొస్తూ ఆగిపోయింది ఆంజలి.

దగ్గరికి వచ్చాడు రవి. "ఓడిపోయానని ఒప్పుకుంటావా?" అన్నాడు.

రొప్పుతూ చెయ్యి ఎత్తి ఆగమన్నట్లు సైగ చేసింది. ఇంకా దగ్గరకు వచ్చాడు. ఇద్దరి మధ్యా ఒక్కడుగు దూరం ఉంది.

"ఓడిపోయావు. గెలిచినందుకు నాకేమి ఇస్తావు?" లోగొంతుకతో అడిగాడు రవి.

చప్పున కళ్ళెత్తి చూసింది అంజలి. రవిని అంత దగ్గరగా చూసి రవి కళ్ళల్లో ఆ భావం ఏంటి? గుండె ఎందుకింత వేగంగా కొట్టుకుంటుంది? "వెళ్ళాలి నేను" వినీ వినిపించకుండా అంది అంజలి

"నేనడిగింది అదికాదు."

పక్కకి తప్పుకుని వెళ్ళబోయింది. గబుక్కున చెయ్యిపట్టుకుని ఆపేశాడు రవి. "ఎప్పట్నుండో నీకు ఓ విషయం చెప్పాలనుకుంటున్నా. ఇప్పుడు చెప్పనా?"

"మామయ్యా ఇక్కడున్నావా?" పరిగెత్తుకొచ్చారు పిల్లలు.

"అబ్బా! ఎప్పుడూ ఏదో ఒక అడ్డంకి" అన్నాడు రవి విసుగ్గా.

వచ్చే నవ్వు ఆపుకుంటూ అందరూ కూర్చున్న చోటుకు వెళ్ళింది అంజలి.

"ఏరి వీళ్ళందరూ?" అడిగింది సావిత్రి.

"జాంకాయలు కోసి ఇచ్చాను. వాళ్ళ మామయ్యతో ఆడుతున్నారు" అంది అంజలి.

కబుర్లు చెప్పుకుంటుంటే రవి, పిల్లలు కూడా వచ్చారు.

"శ్రావణి చక్కగా ఓ పాటపాడు" అంది సావిత్రి.

"ఇప్పుడా? నో అమ్మమ్మా టైర్డ్‌గా ఉంది."

"అంజలి పోనీ నువ్వు పాడమ్మా ఏదన్నా. తర్వాత శ్రావణి పాడుతుంది" అంది అన్నపూర్ణ.

"అమ్మా నువ్వేంటి తిప్పి తిప్పి నా మీదకు. వద్దు" అంది అంజలి.

"మంచి గొంతు ఉండటం భగవంతుని ప్రసాదం. అలా అనకూడదు. పాడు" అంది అన్నపూర్ణ.

రవి ఎదురుగా పాడాలంటే ఏంటో ఇబ్బంది అంజలికి.

రాణి, నీరజ కలిసి నిమ్మరసం తయారు చేస్తున్నారు.

"తెలవారదేమో స్వామి నీ తలపుల మునకలో అలసిన దేవేరి అలమేలు మంగకు" శ్రావ్యంగా పాడింది అంజలి.

"ఎంత బాగా పాడతావు అంజలి. అన్నమయ్య కీర్తనా ఇది" అడిగింది నీరజ.

"లేదు సిరివెన్నెల సీతారామశాస్త్రి, శృతిలయలు సినిమా కోసం రాశారు. కానీ అన్నమయ్య పాటల స్టైల్ లోనే ఉంటుంది" అన్నాడు రవి.

ఆశ్చర్యంగా చూసింది అంజలి, ఎందుకంటే ఈ విషయం చాలామందికి తెలియదు.

"శ్రావణి నీకు సినిమా పాటలేమన్నా వచ్చా?" అడిగింది రాణి.

"అమ్మా డాన్స్ చేశామే మేము అది పాడనా?" అడిగింది శ్రావణి.

"నీ ఇష్టం" అంది నీరజ.

"వచ్చే వచ్చే నల్లమబ్బుల్లారా. వీచే వీచే పిల్లగాలుల్లారా" పాట పాడింది. అందరూ చప్పట్లు కొట్టారు.

"అమెరికాలో ఉన్నా మన మాట, పాట మర్చిపోకుండా ఉన్నారు అదే చాలు" అన్నారు సీతారామయ్య.

"ఏమ్మా ఇక అక్కడే ఉండిపోతారా తిరిగి రారా?"

"ఎక్కడి కష్టనష్టాలు అక్కడుంటాయి. మొదట్లో లైఫ్ చాలా బాగుంటుంది. చక్కటి రోడ్లు, ఎవరి పని వాళ్ళు చేసుకోవటం గవర్నమెంటు ఆఫీసులో పని ఉన్నా ఎవరికైనా ఒకటే రూల్. లంచాలు ఉండవు. కరెంటు, నీళ్ళకు ఇబ్బంది ఉండదు. ఇంట్లో దొంగలు పడ్డా, ఒంట్లో బాగోలేకపోయినా 911కి ఫోన్ చేస్తే రెండు నిమిషాల్లో పోలీసులు, అంబులెన్స్ ఇంటిముందు ఉంటాయి. సామాన్య జీవితానికి ఇబ్బంది ఉండదు.

ఇది నాణానికి ఒక వైపు. అందరికి దూరంగా ఉండాల్సి రావటం, భార్యాభర్తల మధ్య ఏదన్నా అలకలొచ్చినా అదే ఇంట్లో కోపం మధ్య ఉంటాము. ఇక్కడ పండక్కో, పెళ్ళిళ్ళకో కాస్త పుట్టింటికి వస్తూ ఉంటే పిల్లలకు, భార్యాభర్తలకు కూడా కాస్త ఎడబాటు వచ్చి ప్రేమ ఎక్కువౌతుంది. అక్కడ అలాకాదు, దాంతో విసుగు, చిరాకు ఎక్కువైపోతాయి. పిల్లలు కూడా రెండు సంస్కృతుల మధ్య నలిగిపోతారు.

అక్కడివాళ్ళతో కలిసిపోవాలని పిల్లలు, మన సంస్కృతి మర్చిపోకూడదని మేము నేర్చుకోని కూచిపూడి, భరతనాట్యాలు, సంగీతం క్లాసులు, తెలుగు క్లాసులు ఒకటేమిటి అన్నిట్లో పెడతాం. అమ్మానాన్నను చూడాలని ఉంటుంది. రాలేము. నాన్నగారికి ఒంట్లో బాగోలేకపోతే నేను రాలేకపోయాను. సాత్విక్ అప్పుడు కడుపులో ఉన్నాడు. విమాన ప్రయాణం చేయకూడదన్నారు. దానివల్ల నా కాన్పు సమయంలో అమ్మ నా దగ్గర లేదు. ఇవన్నీ నాణానికి రెండోవైపు.

తల్లిదండ్రులకు జబ్బు చేస్తే కొంతమంది రాలేరు. పెళ్ళిళ్ళకు రాలేరు. వీసా ప్రాబ్లం కావచ్చు, డబ్బులిబ్బంది అవ్వచ్చు. కారణం ఏదైనా కొంతమందికేమో విదేశాల్లో ఉండే పిల్లలు డబ్బు సంపాదించే లేక ముద్రించే యంత్రాల్లా ఉంటారు. అక్కడ మేము ఉండే ఇల్లు, కారు చూసి చాలా డబ్బులునాయనుకుని ఏదో అవసరం అని అడుగుతారు. మనవాళ్ళేకదా అడిగిందని అప్పుచేసి పంపుతారు. ఒక్కొక్కళ్ళది ఒకోరకం కథ. అంటే అందరూ బాధలు పడుతున్నారని కాదు. ఎక్కడున్నా ఏవో సమస్యలుంటాయి" అంది నీరజ.

"ఏదో లేమ్మా ఎక్కడున్నా సంతోషంగా, ఆరోగ్యంగా ఉంటే అదే చాలు" అన్నారు సీతారామయ్య.

"ఇంకా రెండు రోజుల్లో వెళ్ళిపోతుంది. మళ్ళీ ఎప్పుడు చూస్తానో" బాధగా అంది సావిత్రి.

"సర్లే. ఇక ఇప్పట్నుండీ బాధపడుతు కూర్చుంటావా? పదండింకా చీకటి పడుతుంది" అన్నారు చంద్రశేఖరావు.

రవి వాళ్ళింటికి నడుస్తూ ఆలోచిస్తోంది అంజలి. ఇంకో నాలుగు రోజుల్లో హైదరాబాదు వెళ్ళిపోతుంది. అది వేరే ప్రపంచం. తోటలో రవి ప్రవర్తన గుర్తొచ్చింది. ఏం చెప్పాలనుకున్నాడు తనతో.

చాలా బిజీగా ఉంటున్నాడు రవి. కానీ ఏదో టైములో ఫోన్ చేసి ఓ రెండు నిమిషాలన్నా మాట్లాడుతున్నాడు. ఇందాక ఫోన్ చేసి ఇళ్ళ ప్లానులు వచ్చాయి. వస్తావా చూడటానికి అన్నాడు. అందుకే వెళుతుంది. తనని చూసి నాలుగురోజులయ్యింది. అంతే. కానీ ఎంత ఆతృతగా ఉంది. మరి హైదరాబాదు వెళ్ళాక ఏం చేస్తుంది?

ముందు గదిలో ఉయ్యాలబల్ల మీద కూర్చుని ఉన్నాడు రవి. ఎదురుగా రాజా ఇంకెవరో ఇద్దరు నిల్చుని మాట్లాడుతున్నారు. రవి లేవబోతుంటే "ఇప్పుడే అమ్మను కలిసి వస్తాను" అని వెనక గదిలోకి వెళ్ళింది అంజలి. సావిత్రితో కబుర్లు చెపుతుంటే వచ్చాడు రవి.

"సారీ అంజలి రా బ్లూ ప్రింట్స్ చూపిస్తాను"

ఉయ్యాల బల్లమీద ప్లాన్ పరిచి చూపించాడు రవి. "రెండు గదులు, వంటిల్లు, పక్క బాత్రూం. ప్రతి ఇంటికి నీటి కనక్షన్ ఉంది. పైన నీళ్ళ ట్యాంక్ ఉంటుంది. దానికి మీటరు ఉంటుంది. ఇది ప్లాన్. వాళ్ళకు గేదలు అవీ ఉంటే ఇదిగో కామన్‌గా షెడ్డు కట్టిస్తున్నాం ఈ చివర్లో. దీన్ని అందరికీ చూపి సరే అంటే బ్యాంక్ లోను కోసం అప్లై చేసినప్పుడు ఇవ్వాలి."

"బాగానే ఉంది ప్లాన్ కానీ కామన్‌గా ఒకే చోట గేదలు ఉంచితే గొడవలు రావా?"

రవి ఏదో చెప్పబోతుండగా లోపలికి రవి మేనమామ రంగారావు వచ్చాడు.

"ఏంటి అల్లుడూ ఏం చేత్తన్నా?" అంటూ

రవి పక్కనే నిల్చుని ఉన్న అంజలిని మార్చిమార్చి చూశాడు. రవి మొహం చిరాగ్గా మారటం గమనించింది అంజలి.

"పనిలో ఉన్నాను" అన్నాడు రవి.

"ఆ.. నేనూ వింటున్నాలే. నీకీ మధ్య పనులెక్కువయ్యాయంటగదా" వంకరగా నవ్వుతూ లోపలికి వెళ్ళాడు.

కాసేపు లోపల్నుండీ ఏమీ వినపడలేదు కానీ కాసేపటికి గట్టిగా రంగారావు గొంతు వినబడింది. "ఊరుకో అంటావేంటమ్మా నువ్వు అందరూ నవ్వుతున్నారు వీడిని చూసి. ఎవరో పిల్లతో తిరుగుతున్నాడంట. నా కూతురేమో 'బావా బావా' అంటూ వాడిని తప్పితే పెళ్ళిచేసుకోనని ఖరాఖండిగా చెప్పింది. ఇక్కడ వీడేమో ఇలాంటి పనులు చేస్తూ అందరి నోళ్ళల్లో నానుతున్నాడు.

రవి మొహం ఎర్రబడింది. ఒక్క ఉదుటున లేచి లోపలకు వెళ్ళాడు. అంజలికి అర్థం అయ్యింది ఆయన తనను ఉద్దేశించే అన్నాడని.

"అమ్మా మీ అన్నయ్యతో చెప్పు. ఇంకోసారి ఇలా సంబంధాలు తీసుకుని రావద్దని. నా పెళ్ళి నా ఇష్టం. నేనెలా ఉంటానో నా ఇష్టం. అసలు నేను పెళ్ళి చేసుకోను. అయితే ఏం చేస్తావ్? నీ కూతురిని చేసుకుంటానని నేనెప్పుడూ అనలేదు. నువ్వేదో ఊహించుకుంటే అది నా తప్పుకాదు."

రవి గొంతు గట్టిగా వినిపించింది.

"నీగురించి, ఆ అమ్మాయి గురించి ఎంత చెత్తగా మాట్లాడుకుంటున్నారో అందరూ తెలుసా? అదుగో బైట కూర్చున్న అమ్మాయేనా?"

"అన్నయ్యా ఊరుకో ఏంటా మాటలు" అంది సావిత్రి.

"మర్యాదగా ఈ ఇంట్లోంచి వెళ్ళిపో" తీవ్రంగా అన్నాడు రవి. ఇక ఇక్కడ ఉండటానికి మనస్కరించలేదు అంజలికి. లేచి బయటకు వచ్చి ఇంటికి బయలుదేరింది.

"బైట ఓ మనిషి అందులో ఒక ఆడపిల్ల కూర్చుంది తనకు వినపడుతుందేమో అన్న సంస్కారం లేకుండా ఇంత అసహ్యంగా మాట్లాడతావా" గొంతు తగ్గించి అన్నాడు రవి.

"నేను పెళ్ళంటూ చేసుకుంటే ఆ అమ్మాయి ఒప్పుకుంటే తననే చేసుకుంటా. ఇంక ఎక్కడ ఏం వాగుతావో వాగు" అని విసురుగా బైటకు వచ్చాడు రవి. అంజలి విందేమో ఎంత బాధపడిందో? అనుకుంటూ బైటకి వచ్చాడు.

అంజలి లేదు. బైటకొచ్చి రాజయ్యని అడిగాడు.

"ఇప్పుడే గేటు బైటకెళ్ళారయ్యా" అన్నాడు.

మేడమీదకు వెళ్ళి తలుపు పెట్టుకుని కూర్చున్నాడు. అయితే అంతా వినే ఉంటుంది. తన మొహం ఎలా చూడగలను ఇంకా.

రవి మాటల్లో కోపం అర్థమైనా తను అన్నమాటలు ఎందుకో గుచ్చుకున్నాయి. రవి అందరితో చనువుగానే ఉంటాడు. నాతో ఎప్పుడూ హద్దుమీరలేదు. నాకు ఇష్టం కాబట్టి. తను కూడా నన్ను ఇష్టపడాలనుకున్నా. అది నా ఊహ. అంతే. రవి నాతో ఏమీ చెప్పలేదు కదా! "నేను అస్సలు పెళ్ళిచేసుకోను" ఈ ఒక్క వాక్యం పదే పదే వినిపిస్తుంది నా చెవులకు.

ఆలోచిస్తూ ఇంటికి వచ్చింది అంజలి.

"అప్పుడే వచ్చావేమ్మా? కాగితాలు చూశావా?" వరండాలో కూర్చున్న సీతారామయ్య అడిగారు.

"సొంతం చూడలేదు. రవి వాళ్ళ మేనమామ అనుకుంటా వచ్చారు. లోపల ఏదో గొడవయ్యింది. రవిగారికి ఆయన కూతుర్ని ఇవ్వాలని కాబోలు. ఆయనేదో అరుస్తున్నాడు రవి ఒప్పుకోలేదని. అక్కడ ఉండటం బాగోదని వచ్చేశాను."

"ఎవరు రంగారావా? ఏదో మంతనాలు చేస్తున్నాడు కానీ ఈ సంబంధం ఎవ్వరికీ ఇష్టం లేదు. అయినా రవి బంగారం. తను ఊ అనాలేకానీ మన ఎం.ఎల్.ఏ గారు రెడీగా ఉన్నారు" అన్నారు సీతరామయ్య.

"ఏంటీ?" ఆశ్చర్యంగా అడిగింది అంజలి.

"నిన్న ఊరెళితే మన ఎం.ఎల్.ఏగారి తమ్ముడు కలిశాడు. చిన్నప్పుడు నా క్లాసుమేటేలే. ఆ పరిచయం. తను చెప్పాడు. ఎం.ఎల్.ఏ గారి కొడుకు ఓ పనికిమాలినోడు. ఎట్లాగైనా తన వారసత్వంగా రాజకీయాల్లోకి తీసుకొద్దామని తండ్రికి ఆశ. కొడుకేమో ఎప్పుడూ ఏదో గొడవల్లో ఇరుక్కుంటాడు. రవికి ఈ మధ్య బాగా పేరు రావటంతో రవి మీద కన్నుపడిందట.

తన కూతుర్ని రవికి ఇచ్చి చేస్తే తన వారసుడిగా రవిని రాజకీయాల్లోకి లాగొచ్చని చూస్తున్నాడు. ఇవాళో, రేపో చంద్రశేఖరరావుతో మాట్లాడతాడంట. అయినా అలా అయితే మంచిదేలే. రవిలాంటి వాడికి ఆయన అండ ఉంటే చాలా ఊళ్ళు బాగుపడతాయి. లేకపోతే మరీ రాజకీయాలు భ్రష్టుపట్టిపోతున్నాయి. రవిలాంటి వాళ్ళు ఇలా ఒక్క ఊరికే పరిమితం అవ్వకూడదు" కూతురి మొహంలో మారుతున్న రంగులు గమనించకుండా చెప్పుకుపోతున్నాడు సీతారామయ్య.

అంజలి ఫోన్ మోగింది. రవి దగ్గర్నుండి. తన గదిలోకి వెళ్ళి ఫోన్ తీసింది.

"ఐ యాం రియల్లీ రియల్లీ సారీ అంజలి. నువ్వు అదంతా వినాల్సి వచ్చినందుకు" చాలా బాధగా అన్నాడు రవి గొంతు మామూలుగా ఉంచటానికి ప్రయత్నిస్తూ.

"నేనేం వినలేదు బాధపడటానికి. నాకెందుకు సారి. మీరు లోపలికి వెళ్ళగానే వచ్చేశాను" అంది.

రాజయ్య తర్వాత ఎప్పుడో వెళ్ళిందన్నాడు. తను వినలేదని నన్ను నమ్మించటానికి అబద్దం చెపుతుంది. తను ఖచ్చితంగా వింది, బాధపడే ఉంటుంది. కానీ నాకు తెలియకూడదని ఇలా చెపుతుంది. అమాంతంగా అంజలి దగ్గరకు రావాలనిపించింది.

రవి మాట్లాడకపోయేసరికి మళ్ళీ అంజలినే అంది "ప్లాన్ బాగానే ఉంది. అందులో ఉండేవాళ్ళ అభిప్రాయం కూడా అడగండి. ఇంక ఉంటాను. బై"

"అంజలి. ఒక్క నిమిషం నిన్ను కలవాలి. నీతో ఇంకా చాలా విషయాలు మాట్లాడాలి"

"ఇవాళ్ళ కుదరదు. నన్ను కలవటానికి ఎవరో వచ్చారు."

"పోనీ రేపు" రెట్టించాడు రవి.

"రేపటి సంగతి రేపు చూద్దాం" అని ఫోన్ పెట్టేసింది. ఇంకాసేపు మాట్లాడితే తన మనస్సులోని దుఃఖం గొంతులో వినిపిస్తుందని.

ఫోన్ పట్టుకుని అలాగే కూర్చుండిపోయాడు రవి. అంజలి చాలా బాధపడుతుంది. నాకు తెలుస్తుంది. ఎందుకు నా మనస్సులో మాట చెప్పాలంటే ఇన్ని అడ్డంకులు. నాకే ధైర్యంలేదు. ప్రతీదీ ఎంతో ధాటిగా స్పష్టంగా మాట్లాడగలిగే తను ఈ విషయంలో ఎందుకు పిరికివాడైపోతున్నాడు. లేదు అంజలితో మాట్లాడాలి.

"పాపగారూ పడుకున్నారా?" అంటూ నర్సి గదిలోకి తొంగి చూసింది.

"లేదు ఒక్క నిమిషం బైటకు వస్తున్నా" అని మొహం మీద చల్లనీళ్ళు చల్లుకుని బైటకు వచ్చింది అంజలి.

"మిమ్మల్ని కలవటానికి మా పాలెం వాళ్ళు వచ్చారమ్మా"

బైట ఓ పదిమంది ఆడవాళ్ళు ఉన్నారు.

"రండి కూర్చోండి" అని అరుగుమీద కూర్చుంది అంజలి.

"ఇంకో నాలుగు రోజుల్లో ఊరెల్లిపోతారని నర్సి సెప్పిందమ్మా కలుద్దామని వచ్చాం" అంది మంగ.

"ఇంతకుముందు ఎన్ని ఇసయాల్లో సమస్యలున్నా బైటకి సెప్పేటోళ్ళం కాము. మమ్మల్ని ఒకే సోటుకి తీసుకొచ్చి అందరిదీ ఒకేమాటలా ఎలా ఉండాలో కట్టుగా ఎలా సమస్యల్ని ఎదిరించాలో నేర్పించారమ్మా" అంది రత్తాలు.

"రోజుకి ఒక్క రూపాయి పొదుపు చెయ్యటం మాలో కొంతమందికి ఎంతో కట్టం. కానీ చెయ్యటం మొదలెట్టాక రోజుకు రెండ్రూపాయలు దాయాలన్న కోరిక ఎక్కువైంది. అదీకాకుండా మా ఇంటాయనలు సారా మానేసారు. ఆ డబ్బు దాతన్నాం శానా బాగుంది. ఇదిగో ఈ లచ్చిమి టౌనుకెళ్ళి బట్టలు కుట్టటం నేర్చుకుంటుంది రోజూ. దానికి కట్టాల్సిన డబ్బు మేమే అప్పుగా ఇచ్చాము. రవి బాబు చెప్పాడు మిషను కొంటానికి బాంకు అప్పిప్పిస్తానని. దాంతో ఇది ఇక్కడే మా అందరి బట్టలు కుట్టవచ్చు" అంది మంగ.

అందరూ వాళ్ళు ఏమేం చేయదలుచుకున్నారో చెప్పారు. ఎంతో సంతోషంగా అనిపించింది వాళ్ళ మాటలు వింటుంటే అంజలికి.

రవితో తన సమస్య చాలా చిన్నదిగా అనిపించింది. రవిలాంటి వాళ్ళ లీడర్ షిప్ అందరికీ అందాలి. తను చేసే మంచి పనులకు ఓ పదవి అధికారం కావాలి. రవి నా సొంత కావాలనుకోవటం స్వార్ధమేమో.

"పాపగారు సారా ఉద్యమం అని వేరే ఊళ్ళల్లో సేత్తన్నారంట గదా. మేము కూడా అదే సేతన్నామండి. ఎవురన్నా దొంగసారా కాత్తన్నారని తెలిస్తే ఊరుకోవటంలేదండి. రవి బాబు తాగితే వెయ్యి రూపాయలు జరిమానా అన్నారు కదా దాదాపు మానేశారండి అందరూ. ఎప్పుడో ఒకడు కక్కుర్తి పడతాడు. దొరికాడా ఆడిపనైపోయిందే" నవ్వుతూ చెప్పింది నర్సి.

"ఈసారి మీరు సెలవలకు వచ్చేసరికి శానా మార్పులొత్తాయమ్మా" నవ్వింది రత్తాలు.

కాసేపు మాట్లాడి వెళ్ళారు వాళ్ళు. రాత్రంతా సరిగ్గా నిద్రపోలేదు అంజలి. ఆలోచిస్తూ కూర్చుంది. పొద్దున్నే వాళ్ళ నాన్నతో చెప్పింది సాయంత్రం హైదరాబాదు వెళుతున్నాను టిక్కెట్టు తెప్పించమని.

"అదేంటమ్మా ఇంకో నాలుగు రోజులుంటావనుకున్నా" అంది సావిత్రి.

"రాధీ ఫోన్ చేసిందమ్మా. కాలేజీలో ఏదో ఓరియంటేషన్ ఉందంట. వెళ్ళాలి" అంది.

ఇలా అమ్మా, నాన్నతో అబద్ధం చెప్పటం బాధగానే ఉంది అంజలికి. కానీ తప్పదు. నేనివ్వాళ వెళ్ళిపోవాలి.

గదిలోకి వచ్చి రాధికకు ఫోన్ చేసింది. రేపు ప్రొద్దున్న వస్తున్నట్లు, హాస్టల్ తెరిచేదాకా తనతో ఉంటున్నట్లు.

"ఏమైంది అలా ఉంది నీ గొంతు?" అంది రాధిక.

"వచ్చాక చెపుతా"

రోజంతా, సూట్‌కేసులు ప్యాక్ చేస్తూ బిజీగా ఉంది. రవి రెండుసార్లు ఫోన్ చేసినా ఎత్తలేదు. బిజీగా ఉన్నా అని మెసేజ్ పంపింది. బస్సులో కూర్చున్నాక, రవితో ఏమీ చెప్పకుండా ఇలా వెళ్ళిపోవటం నచ్చలేదు. తనతో మాట్లాడితే ఎక్కడ మనసు నా మాట వినదో అన్న భయం. చాలాసేపు ఆలోచిస్తూ కూర్చుంది. రవికి ఒక ఎస్.ఎమ్.ఎస్ చేసింది. "నేను ఇప్పుడు హైదరాబాదు వెళుతున్నాను. అనుకోకుండా పనివచ్చింది" తను ఫోన్ చేస్తాడేమోనని ఫోన్ ఆఫ్ చేసింది.

**"ఏమన్నా పిచ్చెక్కిందా** నీకు? ఇదేమన్నా సినిమా అనుకున్నావా? ఇంత స్టుపిడ్‌గా ఆలోచిస్తావనుకోలేదు. " గంటనుండి ఆపకుండా రాధి అంజలిని తిడుతూనే ఉంది.

అంజలి ఏమీ మాట్లాడటం లేదు. మౌనంగా వింటుంది.

"అంజలి ఎందుకు చెపుతున్నానో అర్థం చేసుకో. ఇది చిన్నపిల్లలాట కాదు ఇద్దరూ ఒకరినొకరు ఇష్టపడ్డారు. ఎవరి మాటలో విని నువ్విలా వచ్చేయటమేంటి? ఏదో ఒకటి చెప్పు" గట్టిగా అంది రాధి.

రాధి కాస్త ఊరుకో. తనను కాస్త ఊపిరి పీల్చుకుని రెస్టు తీసుకుని రాత్రికి మట్లాడుకోవచ్చులే" అన్నాడు రఘు.

"రఘు ప్లీజ్ నువ్వు మాట్లాడొద్దు. తను ఎంత పెద్ద తప్పు చేస్తుందో నీకు తెలియటంలేదు. ఇద్దరూ ఒకరినొకరు ఇష్టపడుతూ.."

"రవి నన్ను ఇష్టపడుతున్నట్లు ఎప్పుడూ చెప్పలేదు రాధి. అలా అయితే బాగుంటుందని నేననుకున్నా. అదీ కాకుండా మా ఇద్దరి గురించి అందరూ చీప్‌గా మాట్లాడుకోవటం భరించలేను. రవి ఇంకా చాలా పెద్ద పొజిషన్‌కి వెళ్ళాలి. నేను ఈ మూడేళ్ళు తనకు దూరంగా ఉండదలుచుకున్నాను. నిజంగా రవి నన్ను ఇష్టపడితే తర్వాత చూసుకోవచ్చు. ఆ ఊరి బాగు కోసం రవి చాలా కష్టపడుతున్నాడు. ఆ కష్టమంతా ఇలాంటి గాసిప్స్‌తో నాశనం కాకూడదు. ఇంక ఈ టాపిక్ ఇంతటితో వదిలెయ్యండి ప్లీజ్" అంది అంజలి.



కౌముది

సాయంత్రం గుర్తొచ్చింది అంజలికి తన ఫోన్ ఆఫ్‌లో ఉందని. రవినుండి పదిహేను మిస్డ్ కాల్స్ ఉన్నాయి. కాసేపటికే రవి నుండి ఫోన్ వచ్చింది. ఎత్తంగానే "కనీసం వెళ్ళేటప్పుడు నాకు చెప్పాలనిపించలేదా? ఇంక పైగా ప్రొద్దుట్నుండి ఫోన్ ఆఫ్ చేసి ఉంది" కొంచెం కోపంగానే ఉంది రవి గొంతు.

"అనుకోకుండా రావాల్సి వచ్చింది. ఓరియంటేషన్ ఉంది. అందుకే ఫోన్ ఆన్ చేయలేదు. ఓరియంటేషన్ సంగతి రాధి గుర్తుచేసేదాకా మర్చిపోయా. అందుకే అనుకోకుండా బయలుదేరాల్సి వచ్చింది" నెమ్మదిగా అంది అంజలి.

"కావచ్చు కానీ అదే విషయం నాకు ఫోన్ చేసి చెప్పొచ్చుకదా" ఏమీ మాట్లాడలేదు అంజలి.

"ఏమైంది అంజలి నువ్వు దేనికో మధనపడుతున్నావు ఈ మధ్య. కానీ ఎంత అడిగినా చెప్పట్లేదు. ఆ మాత్రం చనువులేదా మన మధ్య మొన్న మా ఇంట్లో జరిగినదానికి బాధపడుతున్నావు కదా? "

"నేనేమీ వినలేదు అని చెప్పాను కదా" అంది అంజలి.

"నువ్వు అంతా విన్నావని నాకు తెలుసు.. అంజలి" అన్నాడు రవి.

"నేను బైటకు వెళ్ళాలి హాస్టల్‌కి కావాల్సినవి కొనాలి, రాధి వాళ్ళు నాకోసం వెయిట్ చేస్తున్నారు"

"అంటే ఫోన్ పెట్టేస్తావన్నమాట. సరే ఇన్నాళ్ళ మన పరిచయంలో.." వాక్యం పూర్తి చేయకుండా ఆపేశాడు రవి.

రవి బాధపడుతున్నాడని అర్థం అవుతుంది. వచ్చే కన్నీళ్ళని ఆపుకుంటూ "మీరు అనవసరంగా ఏదో కారణం ఉంది అనుకుంటున్నారు. ఏమీలేదు. ఐ యామ్ ఫైన్. మీరు అనవసరంగా వర్రీ అవ్వకండి" మృదువుగా అంది అంజలి.

"సరే ఇంక ఉంటాను" అని ఫోన్ పెట్టేశాడు రవి.

నిమిషాలు గంటలుగా గంటలు రోజుల్లా మారిపోతున్నాయి. సెప్టెంబరు నెల గడిచి అక్టోబరు నెల సగం కూడా అయిపోయింది. అంజలిని చూసి నెలన్నర అవుతుంది. ఒక్కసారి కూడా అంజలి తనకు ఫోన్ చేయలేదు. ఎందుకిలా చేస్తుందని కోపం వస్తుంది. నాకు చెప్పచ్చు కదా ఏదన్నా ప్రాబ్లం ఉంటే ఎందుకు చెప్పదు? అన్న ఉక్రోషం వస్తుంది. కానీ ఏదో బలమైన కారణం లేకపోతే ఇంత దూరంగా నన్ను ఉంచాలని ప్రయత్నించదు. ఏదో ఒకరోజు తను మళ్ళీ మామూలుగా అవుతుందన్న నమ్మకంతో అప్పుడప్పుడు తనే ఫోన్ చేస్తున్నాడు. మాట్లాడిన ప్రతిసారి గొంతుకేదో అడ్డం పడినట్లు చెప్పాలనుకుంది.

ఏదో చెప్పలేకపోతున్నట్లు మాట్లాడుతుంది. ఊరి విషయాలు, తన కాలేజ్ సంగతులు అంతే. ఇంక వేరే ఏ విషయం ఎత్తబోయినా ఏదో ఒక వంక చెప్పి ఫోన్ పెట్టేస్తుంది. ఒకసారి కావాలని రెండు వారాలు ఫోన్ చేయలేదు. తను చెయ్యలేదు కానీ, నేను ఫోన్ చేయగానే బిజీగా ఉన్నట్లున్నారు అని అడిగింది.

పోయిన వారం ఇక్కడ మెడికల్ క్యాంప్ జరిగింది, జనరల్ టెస్టులతో పాటు కళ్ళ పరీక్షలు చేశారు. శుక్లాలు ముదిరిన వాళ్ళను గుర్తించి లిస్ట్ చేశారు. ఇంకో రెండు నెలల్లో వచ్చి శుక్లాల ఆపరేషను ఫీజులు తీసుకోకుండా చేస్తామన్నారు. మందులు, ఆపరేషన్ ఖర్చు చూసుకుంటే మనిషికి వెయ్యి రూపాయలు పడుతుంది. 'ప్రగతి' ద్వారా ఈ ఆపరేషన్లు చేయిస్తున్నారు. ఏం జరిగినా చిన్నదైనా పెద్దదైనా అంజలితో పంచుకోవాలనిపిస్తుంది. కానీ తను ఎందుకో ఇద్దరి మధ్య ఈ దూరం పెట్టింది. చూడాలి ఈ తపస్సు ఎన్నాళ్ళు?

''రవి, బైటకి వెళుతున్నావా? ఇప్పుడే ఎం.ఎల్.ఏగారు ఫోన్ చేశారు నీతో మాట్లాడటానికి వస్తారంట. ఇంట్లో ఉండమన్నారు'' చంద్రశేఖరావు.

''ఆయన వస్తున్నారా? ఏ పనిమీద?'' అడిగాడు ఆశ్చర్యంగా.

''ఏమో? రానీ వస్తే తెలుస్తుందిగా'' అన్నారు చంద్రశేఖరావు.

డిసెంబరు నెల. చలి మొదలయ్యింది తొందరగా చీకటి పడుతుంది.

వరి కోతలు కోయించటం, పంచాయితీ పనులు, పక్కా ఇళ్ళు కట్టించే పనులతో రవికి ఊపిరి సలపటంలేదు.

''సావిత్రి ఎం.ఎల్.ఏగారికి భోజనాలు ఏర్పాటు చూడు. శనివారం కదా టిఫెన్లు లాగ చేయించు'' అన్నారు చంద్రశేఖరావు.

చీకటిపడ్డాక రాత్రి ఏడుగంటలప్పుడు వచ్చారు ఎం.ఎల్.ఏ వెంకట్రామయ్య. చెప్పిన టైముకి రారు ఈ రాజకీయ నాయకులు, ఈయన కోసం ఎదురుచూస్తూ నాలుగు గంటలు ఇంట్లో ఉన్నాను. ఇళ్ళు కట్టించే చోట ఇవాళ కరంటు పనిచేస్తున్నారు. అయ్యిందో లేదో ఎన్ని పనులున్నాయో? మనస్సులోనే విసుక్కున్నాడు రవి.

''ఏమయ్యా రవి బొత్తిగా నల్లపూసవైపోయావు'' కారు దిగుతూనే అన్నారయన.

''ఏదో పనుల వత్తిడిలో కలవలేకపోయాను. ఒక్క ఫోన్ చేయాల్సింది వచ్చేవాడిని కదా అనవసరంగా మీరు శ్రమ తీసుకున్నారు'' అన్నాడు రవి.

''లేదులే. ఇది నేను రావల్సిన పని.''

''రండి భోజనాల ఏర్పాటు చేశాం. భోజనం చేస్తూ మాట్లాడుకోవచ్చు'' అన్నారు చంద్రశేఖరావు.

భోజనం చేస్తూ విషయం కదిలించాడాయన ''ఇదిగో రవి మన పార్టీ ఈసారి మండల ఎలక్షన్లలో గెలవాలంటే నీలాంటి వాళ్ళు కావాలయ్యా. నువ్వేమో నీకు ఇష్టంలేదు అని తప్పించుకుంటావు. అలాక్కాదు. నువ్వనుకునే పురోగతి, ప్రగతి కావాలంటే గిరిగీసుకున్నట్లు ఈ ఊరిలో ఉండిపోతే ఎట్లా?''

''మళ్ళీ అదే చెప్పుతున్నందుకు ఏమీ అనుకోవద్దు. ఈ ఊరికి ఇంకా చేయవలిసింది చాలా ఉంది. అప్పుడే ఎంతో సాధించానని నేను అనుకోవటంలేదు. ఈసారికి నన్ను వదిలేయండి. వచ్చే ఎలక్షన్లలో చూసుకుందాం'' అని చెప్పాల్సింది ఖచ్చితంగా చెపుతూనే మాట దాటేశాడు.

''మొత్తానికి గట్టోడివయ్యా నువ్వు. సరేగానీ ఈ లోపల నీ పరపతి ఇంకొంతమందికి తెలుస్తుంది కదా. ఈసారి నేను హైదరాబాదు వెళ్ళేటప్పుడు చెపుతాను. నాతోపాటు రా. సి.ఎంగారికి పరిచయం చేస్తాను. నీలాంటి యువకులు ముందుకు రావాలి. ముసలాళ్ళం మా పని అయిపోయింది'' డాబుగ అన్నాడాయన.

రవి నవ్వేసి ఊరుకున్నాడు. ముందుగదిలోకి వచ్చి కూర్చున్నారు. అందర్ని బైటకు వెళ్ళమని చెప్పి వెంకట్రావు రవి వంక చూసి ''ఇంకో విషయం కూడా నీతో మాట్లాడాలి. మీ నాన్నతో మాట్లాడితే నీ ఇష్టం అన్నాడు. ఇదిగో మా అమ్మాయి ఫోటో. హైదరాబాద్‌లో కంప్యూటర్ ది ఏంటిది ఎం.సి.ఏ చేసింది. ఇంకా వివరాలు కావాలంటే నాన్నతో మాట్లాడు. మా అమ్మాయిని, కట్నం కింద నా రాజకీయ వారసత్వాన్ని ఇస్తా, ఏ విషయం బాగా ఆలోచించుకో. ఒప్పుకుంటావనే అనుకుంటున్నా వస్తా మరి'' అంటూ బయలుదేరారు ఆయన.

స్టన్ అయిపోయాడు రవి. వెంకట్రామయ్య ఇలా మాట్లాడతారని అస్సలు ఊహించలేదు.

''ఏంటి నాన్నా ఇదంతా? నీకు ముందే తెలుసా?'' ఆశ్చర్యంగా అడిగాడు రవి.

"నా దగ్గరకు కబురు చేశాడాయన రెండు మూడుసార్లు నేను ఖచ్చితంగా చెప్పాను అంతా నీ ఇష్టమని. అమ్మాయి బాగానే ఉంది. చదువుకుంది. సావిత్రి ఫోటో చూడు"

"రవి. ఫోటో చూడరా బాగుంది" అంది సావిత్రి.

"అమ్మా, నేను ఫోటో చూడాల్సిన పనిలేదు. ఎందుకంటే నేను ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకోను."

"ప్రాక్టికల్‌గా ఆలోచించు రవి. వెంకట్రామయ్యగారు ఏమన్నారో విన్నావుగా. ఎట్లాగైనా నీకు ఎం.ఎల్.ఏ టిక్కెట్టు ఇప్పిస్తారు. ఆయన కొడుకులాంటి వాళ్ళు రాజకీయల్లో ఉండి భ్రష్టు పట్టించేకంటే నీలాంటి వాళ్ళు ఉంటే బాగుంటుంది కదా" అన్నారు చంద్రశేఖర్రావు.

"నాన్న. నా దగ్గర ఈ ప్రస్థావన మళ్ళీ తేవద్దు. నేను ఇష్టపడ్డ అమ్మాయి ఒప్పుకున్న రోజు మీకే ముందు చెపుతాను" అని తన గదికి వెళ్ళిపోయాడు.

"ఏంటి వీడి గోల?" అర్థం కాలేదు చంద్రశేఖర్రావుకు

"మీకో విషయం చెప్పాలి. నీరజ చెప్పింది. రవి, అంజలిని ఇష్టపడ్డాడంట, కానీ ఇంతవరకు ఆ అమ్మాయితో విషయం చెప్పలేదు. తనేమో హైదరాబాదులో చదువుతుంది. ఏమైందో తను ఈ మధ్య రవితో పెద్దగా మాట్లాడటం లేదంట కూడా. వీడి మనస్సులో ఏముందో తెలియటంలేదు" అంది సావిత్రి.

"వీడికేమన్నా పిచ్చా? ఇష్టపడితే పిల్ల కన్నా చెప్పాలి. లేకపోతే మనకన్నా చెపితే సంబంధం మాట్లాడతాం కదా. ఊరికే మనసులో పెట్టుకుంటే ఏం వస్తుంది. సీతారామయ్య మాత్రం పిల్లకు సంబంధాలు చూడడా"

"నీరజ చెప్పిందంట అడిగిస్తానని ఎవ్వరూ కలగచేసుకోవద్దు అన్నాడంట"

"లాభంలేదు. నేను సీతారామయ్యతో మాట్లాడతాను" అన్నాడు చంద్రశేఖర్రావు.

"ఏంటి ఏదో మాట్లాడాలన్నావు కానీ ఏమీ చెప్పటం లేదు" అన్నాడు సీతారామయ్య.

"మీ అమ్మాయిని మా వాడు ఇష్టపడుతున్నాడని అనుమానం వచ్చింది. నాకేమీ చెప్పలేదు. నీకేమైనా ఈ విషయం తెలుసా?"

"ఆహాఁ నాకేం తెలియదు. ఉండు ఒక నిమిషం. పూర్ణా ఒక్కసారి ఇటురా" అన్నపూర్ణను పిలిచాడు సీతారామయ్య.

అన్నపూర్ణతో విషయం చెప్పి, తనకేమన్నా తెలుసా అని అడిగారు. కొంచెం ఇబ్బందిగా చూసింది.

"నీతో మనమ్మాయి ఏమన్నా అన్నదా? తప్పుకాదు కదా చెప్పు"

"ప్రత్యేకంగా ఏమీ అనలేదు కానీ నేనే అడిగాను ఇద్దరూ ఒకరినొకరు ఇష్టపడుతున్నారా అని. రవిగారు నాతో ఏమీ అనలేదు అని దాటేసింది. సర్లే ఇంకా తన చదువుంది కదా తొందరేముందిలే అని ఊరుకున్నా. కానీ ఊరికి వెళ్ళేముందు దేనికో చాలా బాధపడింది. ఎంతడిగినా హడావుడిగా ముందే వెళ్ళిపోయింది. ఆ రోజు మీ ఇంటినుండి వచ్చింది. రంగారావు వచ్చాడు ఏదో మేనరికం గురించి గొడవ పడుతున్నాడు, నేను వచ్చేశాను అంది. నేనేమో, అది జరిగే పనికాదు, రవిని అల్లుడుగా చేసుకోవాలని ఎం.ఎల్.ఏ గారు ప్రయత్నిస్తున్నారు. రవి పెద్ద పదవులకు వెళితే మంచిది. ఈ సంబంధం ఒప్పుకుంటే బాగుంటుంది రవి అన్నాను" అన్నారు సాలోచనగా సీతారామయ్య ముగ్గురు ముఖాముఖాలు చూసుకున్నారు.

"అంటే మావాడేమో తన మనస్సులోని మాట చెప్పలేదు. మీ అమ్మాయేమో తను ఎం.ఎల్.ఏగారి అల్లుడైతే మంచిది అనుకుందేమో? అందుకేనేమో ఈ మధ్య రవితో సరిగ్గా మాట్లాడటంలేదంట. ఏం పిల్లలయ్యా వీళ్ళు?" అన్నారు చంద్రశేఖర్రావు.

"లేదన్నయ్య వీళ్ళిద్దరూ కూడా ఇంకొకళ్ళని నొప్పించటం ఇష్టపడరు. పెళ్ళి సంబంధం గురించి ఎవరు ముందు మాట్లాడినా అవతలి వాళ్ళు అపార్ధం చేసుకుని మాట్లాడటం ఆపేస్తారని భయం కాబోలు. అన్ని విషయాల్లో ఎంత పెద్దరికంగా ఆలోచిస్తారో ఇద్దరూ. మరి ఈ విషయం అందునా వాళ్ళ జీవితానికి సంబంధించినది. ఎందుకిలా చేస్తున్నారో?" నిట్టూర్చింది సావిత్రి.

జాబిలి చేతికందదు. కానీ వెండి వెన్నెల మాత్రం నన్ను చుట్టుముడుతుంది నువ్వు నా దగ్గరుండవు. కానీ జ్ఞాపకం నన్ను మత్తులా ఆవరిస్తుంది, దుప్పటిలా కప్పుకుంటుంది. నేను లేని ప్రపంచంలో నువ్వు సంతోషంగా ఉంటున్నావేమోనన్న ఆలోచన నన్ను చీల్చేస్తుంది. నేను నీ దగ్గర్నుండి దూరంగా వచ్చేస్తే ఇలాగే వదిలేస్తావా? కిటికీలోంచి బైటకు చూస్తుంటూనే ఆకుల మాటు నుండి జారే పల్చటి వెన్నెల దూరంగా గోడమీద పాకిన బోగన్ విలయా, కిటికీలో నేను పెంచుకుంటున్న క్రోటన్ మొక్క. అన్నీ నావంక జాలిగా చూస్తున్నట్లు ఎందుకనిపిస్తుంది. నువ్వు లేని ప్రపంచంలో నువ్వు సంతోషంగా ఉంటున్నావేమోనన్న ఆలోచన నన్ను చీల్చేస్తుంది. నేను నీ దగ్గర్నుండి దూరంగా వచ్చేస్తే ఇలాగే వదిలేస్తావా? నువ్వు లేని ప్రపంచంలో నేను ఉండగలననుకోవటం నా భ్రమేనా? నా పిచ్చిగానీ నువ్వు లేకపోవటమేంటి? నా ప్రతి క్షణం, ప్రతి శ్వాస.. నీతో నీ తలపులతో నిండిపోతే?

అర్ధరాత్రి పన్నెండు కావస్తుంది. డిసెంబరు 31 రాత్రి. హాస్టల్లో ఎవ్వరూ లేరు. న్యూ ఇయర్ పార్టీలకు వెళ్ళారు. రాధి, రఘు ఎంత బ్రతిమిలాడినా వెళ్ళలేదు అంజలి. ఒంట్లో బాగోలేదన్నది డైరీ రాసుకుంటున్న అంజలి ఫోన్ మోతకు ఉలిక్కిపడింది. రవి దగ్గర్నుండి. ఇప్పటిదాకా మెలుకువగా ఉన్నాడంటే సతీష్ వాళ్ళతో పార్టీ చేసుకుంటున్నాడేమో?

ఫోన్ తీసింది అంజలి. "హ్యాపీ న్యూ ఇయర్ అంజలి" విష్ చేశాడు రవి.

"మీకు కూడా హ్యాపీ న్యూ ఇయర్"

"ఏం చేస్తున్నావు? పార్టీకి ఏమీ వెళ్ళలేదా? వెనకాల గొడవేం వినపడటంలేదు" అన్నాడు రవి.

"లేదు. రాధీ వాళ్ళ ఇంట్లో పార్టీ ఉంది వచ్చాను. గోలగా ఉందని గదిలోకి వచ్చి మాట్లాడుతున్నా"

కాసేపు మౌనంగా ఉన్నారు ఇద్దరూ. "సంక్రాంతికి ఇంటికి వస్తావా?" అడిగాడు రవి.

"ఊఁ వస్తున్నాను. మళ్ళీ మాట్లాడతాను. ఇంక బై" అని పెట్టేసింది.

ఎందుకిలా అబద్దాలు చెప్పి, నన్ను దూరంగా ఉంచుతున్నావు అంజలి. పార్టీ గోలలో నా ఫోన్ శబ్దం వినిపించి, వెంటనే ఎత్తావా? చూద్దాం ఇంకెన్నాళ్ళు ఇలా ఉంటావో అనుకున్నాడు రవి.

"రవి బాబు పటమటి పొలం దగ్గర గొడవ జరుగుతుంది. వెంటనే రండి" సైకిల్ మీద వగరుస్తూ వచ్చి పిలిచాడు యాదయ్య.

"ఏమైంది?" బైకు తీస్తూ అడిగాడూ రవి.

"ఆడకూలీల దగ్గరేదో గొడవయ్యిందంట కొట్టుకుంటున్నారు"

రవి వెంటనే ఇద్దరు ముగ్గురికి ఫోన్ చేసి వాళ్ళను కూడా పొలం దగ్గరికి రమ్మన్నాడు.

రవి వెళ్ళేసరికి రెండు గుంపులుగా నిల్చుని అరుచుకుంటున్నారు. కొంతమంది చేతుల్లో కర్రలు, కొడవళ్ళు, ఉన్నాయి. ఆడవాళ్ళు పక్కన నిల్చున్నారు.

"ఆగండి ఏమైంది?" అంటూ దగ్గరికి వెళ్ళాడు.

"మా ఆడోళ్ళు పొలంలో పనులు సేత్తంటే అసహ్యంగా వాగుతుంటారు ఈళ్ళు. అట్లాంటిది మొన్న ఏకంగా 'నాతో వస్తావా' అని అడిగాడంట మా సుబ్బు చేయిపట్టుకుని. అది ఎదురు తిరిగి అందరిని పిలిసిందంట. బాగోతం బైటపడేసరికి అది అబద్ధాలు చెపుతుందని వెళ్ళిపోయారు. నిన్న మా మొగోళ్ళు కొంతమంది ఎల్లి రామారావుతో మాట్లాడారంట. ఇట్లాంటివి తగవని. దాంతో నిన్న సాయంత్రం మా ఇళ్ళ మీదకు ఎవరో అగ్గిపుల్ల యేసి పారిపోయారు. సీకట్లో అగపళ్ళా ఎవళ్ళో అని. ఎంటనే సూశాం కాబట్టి ఆర్పేశాం. లేకపోతే గూడెం అంతా బుగ్గైపోయేది" ఆవేశంగా అన్నాడు కోటేసు.

"రేయ్ నోటికిష్టం వచ్చినట్లు మాట్లాడకు. మీ ఇళ్ళు తగలెట్టాల్సిన పని మాకేం లేదు."

"అందరూ ఊరుకోండి. ఇంత జరిగితే నాకు వచ్చి ఎందుకు చెప్పలేదు"

"ఏదోలే అందరికీ తెలియటం దేనికి అని నిన్న మాట్లాడాం అయ్యా"

"ముందు ఆడవాళ్ళను వెళ్ళిపొమ్మనండి వెళ్ళి పనులు చూసుకోండి నేను మాట్లాడతాను."

"రామారావ్ ఏంటి ఈ చిల్లర పనులు?" కోపంగా అన్నాడు రవి.

"రవీ అనవసరంగా నువ్వీ అలగా జనాన్ని నెత్తికెక్కించుకుంటున్నావు. ఒకొక్కళ్ళకి పొగరెక్కువైంది. చెప్పులు కింద పడుండాల్సిన వాళ్ళు." మాట పూర్తిచేయలేదు ఇంకా రామారావు కూలీలు మీదకొచ్చారు.

"ఎవర్రా అలగా జనం మరి మా అలగా ఆడాళ్ళ చెయ్యి ఎందుకు పట్టుకున్నావురా? నేను వచ్చి మీ ఇంట్లో ఆడాళ్ళమీద సెయ్యేయ్యనా?" అన్నాడు కోటేసు ఆవేశంగా.

మాటకు మాట పెరిగి ఒకళ్ళ మీదకు ఒకళ్ళు కర్రలేసుకుని వెళ్ళారు.

ఆగండి అంటున్న రవి మాటలు వినిపించుకోలేదు. రవి మధ్యలోకి వెళ్ళేసరికి రవి తల మీద కర్ర దెబ్బపడింది. సరిగ్గా అప్పుడే పొట్టమీద కొడవలి వేటు పడింది. "అబ్బా" అని పెద్దగా అరిచాడు రవి. అందరూ ఒక్క క్షణం ఆగారు. ఆ అరుపుకు నుదిటిమీద పెద్ద దెబ్బ తగిలి రక్తం కారుతుంది. రవి చెయ్యిపెట్టి పొట్ట దగ్గర గాయానికి అడ్డం పెట్టాడు.

ఒక్కసారిగా అందరూ నిశ్చేష్టులైపోయారు. ఆవేశం దిగిపోయింది.

"అయ్యో రవిబాబు" అని వచ్చి కండువా నడుముకి కట్టి "పదండ్రా ఆస్పత్రికి తీసుకెళదాం" అని చేతులు మీద ఎత్తుకున్నారు.

**అందరూ** ఎంత ఆవేశంలో ఊగిపోయినా, రవికి అంత దెబ్బ తగలటం చూసి షాక్ అయ్యారు. పొలాల గట్లమీదుగా మోసుకొచ్చేసరికి, రాజా ఇంకో నలుగురు అక్కడకు చేరుకున్నారు. గట్టిగా నడుము చుట్టూ కట్టి, తలమీద కూడా కట్టుకట్టి, బైకు మీద ఆస్పత్రివైపు పోనిచ్చాడు రాజా. కోటేసు వాళ్ళు కొంతమంది చంద్రశేఖర్రావు దగ్గరికి సైకిళ్ళేసుకుని వెళ్ళారు.

హాస్పిటల్‌కి వెళ్ళేసరికి రక్తం బాగాపోయింది రవికి. లోపలికి తీసుకువెళుతుంటే రాజా చెయ్యిపట్టుకున్నాడు రవి.

"రాజా ఎవరినీ నిగ్రహం కోల్పోవద్దని నేను చెప్పినట్లుగా చెప్పు. నాకేం కాలేదు. ఓ రెండు కుట్లు పడతాయి అంతే" ఇంకేదో చెప్పబోయాడు రవి.

"ఊరుకో రవి. మాట్లాడొద్దు. మేం చూసుకుంటాం" అన్నాడు రాజా.

రవిని లోపలికి తీసుకువెళ్ళారు. కాసేపటికి చంద్రశేఖరరావు, సావిత్రి కారులో వచ్చారు. వెనకాలే పాలెంలో వాళ్ళు, ఊళ్ళోవాళ్ళు కూడా వచ్చేశారు.

"ఎలా ఉన్నాడు రవి? ఏమైంది?" కంగారుగా అడిగింది సావిత్రి.

"కంగారు పడొద్దమ్మా" అని జరిగిన విషయం చెప్పాడు రాజా.

ఓ అరగంట తర్వాత డాక్టర్ ప్రసాద్, కోటేసు బైటకొచ్చారు.

"రక్తం చాలానే పోయింది కానీ రక్తం ఎక్కించాల్సిన పరిస్థితి రాలేదు. రేపటిదాకా చూసి రక్తం ఎక్కిద్దాం. నుదిటిమీద నాలుగు కుట్లు, పొట్టమీద ఏడుకుట్లు పడ్డాయి. మన అదృష్టం ఏంటంటే కత్తిగాటు పొట్టకి లోపలికి వెళ్ళలేదు. వెళితే లోపలి భాగాలు దెబ్బతినేవి. ఓ పావుగంటలో గదిలోకి తీసుకొస్తారు. ఈ ఇద్దరు, ముగ్గురు తప్పితే ఎవ్వరూ లోపలికి వెళ్ళొద్దు" అన్నారు.

సావిత్రి, చంద్రశేఖరరావు, రాజా లోపలికి వెళ్ళారు. రవి మెలుకువగానే ఉన్నాడు. సావిత్రిని చూడగానే "కంగారు పడొద్దు. ఏమీ కాలేదు" అన్నాడు.

సావిత్రికి కళ్ళమ్మట నీరు ఆగలేదు. "ఇలా ప్రాణం మీదకు తెచ్చుకోటానికా నువ్వు ఈ ప్రెసిడెంటు పని చేసేది" అంది.

"సావిత్రి ఊరుకో నువ్వు. రవికేమీ పర్లేదు అన్నారు కదా డాక్టరుగారు. ఒక్క నిమిషం మీరిద్దరు బైటకు వెళ్ళండి. నేను రవితో ఒంటరిగా మాట్లాడాలి. రాజా, నువ్వు సతీష్ వాళ్ళందరితో చెప్పు గొడవలేమీ వద్దని. నేను వచ్చి మాట్లాడతాను" గంభీరంగా అన్నారు చంద్రశేఖరరావు.

వాళ్ళిద్దరూ బైటకు వెళ్ళాక కొడుకువైపు చూసి అన్నారయన "రవి నాకు తెలిసినది నేను చెపుతాను ఔనో కాదో చెప్పు" అని తను విన్నదంతా చెప్పి "ఇదంతా నిజమేనా?" అన్నారాయన.

అవునన్నట్లు తలుపాడు రవి.

"రవి వీళ్ళ గొడవ ఊళ్ళో ఎక్కువైపోతుంది. ఇదివరకు నిన్ను కొట్టిస్తే నువ్వు కేసు పెట్టనివ్వలేదు. ఇప్పుడు ఆడాళ్ళ మీద, అందులో చిన్నపిల్ల మీద చెయ్యివెయ్యటానికి వీళ్ళు ఎంతగా బరితెగించారు. కానీ ఈ విషయం వదిలెయ్యకూడదు. చిలికి చిలికి గాలివాన అవుతుంది. నేను ఇన్‌స్పెక్టర్‌గారితో మాట్లాడతాను. ఊళ్ళో కాపలాకు కాస్త ఓ రెండు రోజులు ఎవరినన్నా పంపని. నేను అందరితో మాట్లాడతాను. నువ్వు దేని గురించీ వర్రీ కాకు. రెస్టు తీసుకో"

"నాన్న జాగ్రత్త. బోసు, రామారావు మనుషులు, కోటేసు వాళ్ళ మీదకు వెళతారేమో?"

"నేను చూసుకుంటా అది ఆలోచించకు" అన్నారు చంద్రశేఖరరావు.

"నాన్నా ఇంకో విషయం. విషయం బైటకు పొక్కకుండా ఉండదేమో? కానీ వీలైనంత వరకు నా పేరు బైటకు రానివ్వద్దు. ఎందుకు ఏంటి అని ఇప్పుడు నన్నేమీ అడగకండి. కానీ ఈ విషయం అంజలికి ఎట్టి పరిస్థితుల్లోనూ తెలియటానికి వీల్లేదు. సీతారామయగారికి ఈ విషయం గట్టిగా చెప్పండి నాన్న ప్లీజ్" అన్నాడు కొంచెం ఇబ్బందిగా చూస్తూ.

కొడుకు వంక తదేకంగా చూశారు చంద్రశేఖర్రావు. తన దెబ్బలకంటే అంజలికి ఈ విషయం తెలిస్తే ఎంత బాధపడుతుందోనని కంగారు పడుతున్నాడు. "సరే చెపుతాలే నువ్వు రెస్ట్ తీసుకో" అని బైటకు వెళ్ళారు.

బైట ఇన్స్పెక్టర్ ఎదురుచూస్తున్నాడు. పరిస్థితి వివరించి కాస్త పోలీస్ పెట్రోలింగ్ ఉంచమన్నారు ఊళ్ళో. ఊళ్ళో ఇద్దరు ముగ్గురు పెద్దమనుషుల మధ్యవర్తులతో మాట్లాడారు. రవి క్షేమంగా ఇంటికి వచ్చేదాకా ఎవరినీ సమయమనం కోల్పోకుండా జాగ్రత్తపడమని.

సీతారామయ్య వచ్చారు "ఎలా ఉంది రవికి?" అంటూ.

"ప్రమాదం ఏమీలేదు. కుట్లుపడ్డాయి. "

"నేను బోసు, రామారావు ఇంటికి వెళ్ళి గట్టిగా మాట్లాడాను. రామారావు కూడా పరిస్థితి ఇలా ఎదురు తిరుగుతుందని అనుకోలేదేమో సిగ్గు పడుతున్నట్లే కనిపించాడు" అన్నారు సీతారామయ్య.

"ఇంకో విషయం. ఈ సంగతి అంజలికి తెలియనివ్వద్దని రవి నాతో చెప్పాడు. అన్నపూర్ణకి కూడా చెప్పు. అంతా బాగుంటే రేపు ఇంటికి తీసుకురావచ్చేమో? అప్పుడు మాట్లడుకుందాం ఏం చేయాలో అన్నారు" చంద్రశేఖర్రావు.

పైకి అందరూ ఊరుకున్నట్లు కనిపించినా, నివురుగప్పిన నిప్పులాగా లోపల కుతకుతలాడుతున్నారు. కులసంఘాల నాయకులు వచ్చి రెచ్చగొట్టటం మొదలుపెట్టారు. కానీ పాలెంలోని పెద్దలు మాత్రం కుర్రాళ్ళను కట్టడిచేశారు. రవి వచ్చి మాట్లాడేదాకా ఎవ్వరూ రెచ్చిపోయి తప్పుడు నిర్ణయాలు తీసుకోవద్దని.

రెండవరోజు రవిని ఇంటికి పంపించారు. వారం రోజుల్లో కుట్లు ఊడదీస్తామన్నారు. రవి రామారావుని పిలిపించి మాట్లాడాడు. చేసిన దానికి పోలీస్ కేస్ దాకా చేసుకుంటాడా లేకపోతే మొదటి తప్పుకింద ఊళ్ళో అందరూ కలిసి శిక్ష విధిస్తారు. దాన్ని ఒప్పుకుంటాడో నిర్ణయం రామారావుకి వదిలేశాడు. మధ్యవర్తులు కూడా రామారావుని బాగా మందలించారు.

పాలెంలో వాళ్ళను పిలిచి, శిక్ష కింద వెయ్యిరూపాయల జరిమానా, అవమానం జరిగిన లక్ష్మి బహిరంగ క్షమాపణ చెప్పించటం. ఇక గొడవ పెద్దది చేయకుండా వదిలేసి ఇక ముందు ఇలాంటివి జరిగితే పోలీసు కేసు పెట్టేట్లు ఒప్పందం చేశాడు. అందరూ ఒప్పుకున్నారు.

"కానీ ఈ ఏడుమాత్రం అతని పొలంలో మేమెవ్వరం పని చేయమయ్యా" అన్నాడు కోటేసు తీవ్రంగా.

"సరే అయితే రేపు అందరూ పంచాయితీ ఆఫీసు దగ్గర కలుద్దాం. మరీ ఎక్కువమందిని పోగేసుకుని రావద్దు. ఇంకో విషయం ఈ విషయం ఇంతటితో మర్చిపోదాం. మీ కులపెద్దలు, కుల సంఘాలవాళ్ళు గొడవచేయమని మీకు చెప్పుతున్నట్లు విన్నా. సమస్యలు మనమే పరిష్కరించుకోవాలి. అందుకే పంచాయితీ ఉంది. మీకు పంచాయితీ నిర్ణయం నచ్చకపోతే అది వేరే విషయం. కానీ కేవలం గొడవ పెద్దది చేసి హీరోలు అయిపోదామనుకుంటే అది తప్పు" అని నచ్చచెప్పాడు రవి.

అందరూ సమ్మతించారు.

"రవి పడుకున్నావా?" అంటూ లోపలకు వచ్చారు చంద్రశేఖర్రావు.

"లేదు నాన్నా రండి లోపలికి" అన్నాడు రవి చదువుతున్న పుస్తకం పక్కకు పెట్టి "నిన్నొక్క విషయం అడగాలి. హాస్పిటల్లో ఉన్నప్పుడు ఈ విషయం అంజలికి చెప్పొద్దన్నావు ఏంటి విషయం?"

రవి ఏమి మాట్లాడకపోయేసరికి మళ్ళీ తనే అన్నాడు. "నువ్వు అంజలిని ఇష్టపడుతున్నావని మా అందరికి తెలుసు. మరి ఈ విషయం తనకు చెప్పావా? ఆ అమ్మాయి అభిప్రాయం ఏంటి?"

"నేను అంజలితో ఏమీ చెప్పలేదు. సరైన సందర్భం రాలేదు" నెమ్మదిగా అన్నాడు రవి.

"సీతారామయ్య తెలియక ఒక తప్పు చేశాడు అని ఎమ్.ఎల్.ఏగారు పలకరించటానికి వచ్చినప్పుడు చెప్పేశాను. ఆయనకు, వాళ్ళ అమ్మాయిని చేసుకోనని ఇంకొకరిని ఇష్టపడుతున్నట్లు కూడా చెప్పాను" అన్నాడు రవి.

"సర్లే జరిగిన విషయం నీకు చెప్పాను. ఇక మీ ఇద్దరు మధ్య ఏముందో మీరే తేల్చుకోండి. మా అందరికి మాత్రం అంజలి బాగా నచ్చింది. నీకు సరైన పిల్ల" అన్నారు నవ్వుతూ చంద్రశేఖర్రావు.

"పడుకో రేపు కుట్లు ఊడదీయించుకోవటానికి వెళ్ళాలి కదా" అంటూ లేచారు.

ఇళ్ళు కట్టే పని అయిపోయింది, నీళ్ళు శుద్ధి చేసే ట్యాంక్ పని కూడా అయ్యింది. కనుమ పండుగరోజు రెండూ ప్రారంభోత్సవం చేయాలని నిశ్చయించారు. ఆఖరి నిమిషంలో ఏమీ తప్పు జరగకూడదని అన్నీ పర్యవేక్షిస్తున్నాడు రవి.

ఎల్లుండి భోగి. పల్లె అందాలు ఇంకా ఇనుమడించే సంక్రాంతి రోజులు పెద్ద ముగ్గులు, గొబ్బెమ్మలు, ఇంటికి వచ్చిన ధాన్యలక్ష్మి, పిండివంటలు ఒకటే హడావుడి.

రేపు అంజలి వస్తుంది పండక్కి. ఆ ఆలోచనే చాలా సంతోషంగా అనిపించింది రవికి. అయినా ఏదో అనుమానం నిజంగా వస్తుందా రాదా అని. పది రోజులయ్యింది తనతో మాట్లాడి. సీతారామయ్యగారికి ఫోన్ చేశాడు రవి. కాసేపు పిచ్చాపాటి మాట్లాడి నెమ్మదిగా అడిగాడు అంజలి వస్తుందా పండగకి అని.

"రాత్రి ఫోన్ చేసింది రవి, రావట్లేదని. ఏవో పరీక్షలున్నాయంట పండగ అయ్యాక. చదువుకోవాలి రాలేను అంది. ఇద్దరం ఎంత అడిగినా కుదరదంది"

మళ్ళీ నన్ను తప్పించుకుంటున్నదన్నమాట. లాభంలేదు. ఈసారి ఎలాగైనా తనతో మాట్లాడాలి అనుకున్నాడు రవి.

సతీష్ వాళ్ళకు పనులు అప్పగించాడు. తను ఊరు వెళుతున్నానని ఇంటికి వచ్చి బట్టలు సర్దుకుని, సావిత్రికి చెప్పాడు ఊరు వెళుతున్నాను రెండురోజుల్లో వస్తానని.

"నిన్న కుట్లు ఊడదీయించుకున్నావు. ఇంతలో ఈ ప్రయాణం ఏంటి?" కంగారు పడింది సావిత్రి.

"లేదమ్మా అర్జంటు పని ఉంది. నాన్నకు చెప్పు" అని బయలుదేరాడు.

చేతికి గోరింటాకు పెట్టుకుంటుంది అంజలి మెహందీ కోన్‌తో. హాస్టల్‌లో చాలామంది పండగకు ఇంటికి వెళ్ళారు. కొంతమంది నార్తిండియన్లు, అలా ఓ పది పదిహేను మంది మాత్రమే ఉన్నారు. ఎందుకని తను ఇంటికి వెళ్ళలేదు. సంక్రాంతి అంటే తనకు ఎంత సరదాగా ఉండేది? అమ్మ ఎంత బ్రతిమిలాడింది. ఎంత బాధగా అనిపించింది రాను అని చెప్పటానికి. కానీ వెళ్తే రవి కనిపిస్తాడు. తనను ఎదుర్కొనే ధైర్యం ఇంకా రాలేదు.

చెయ్యి వంక చూసుకుంది అంజలి. డిజైనులో ఐ లవ్ యు అనే గుర్తులు కలిసిపోయిన డిజైన్. అది పరీక్షగా చూస్తేగాని ఎవరో తెలియదు. ఎవరో పెట్టుకుంటే చూసింది తను. ఎవరి కోసం ఈ డిజైను పెట్టుకుందో, వాళ్ళకు చూపించలేదు.

రాధి పండగకు వాళ్ళ అత్తగారు, అమ్మగారింట్లో జరుపుకుంటుంది. కనీసం అక్కడికైనా రమ్మని బ్రతిమిలాడింది. కొత్త దంపతులు చక్కగా ఇంట్లో పండుగ జరుపుకుంటుంటే తనెందుకు మధ్యలో.

అలా ఆలోచిస్తూ ఎంతసేపు కూర్చుందో తెలియదు. తలుపు కొట్టిన శబ్దం అయ్యింది. తీస్తే హాస్టల్ వాచ్‌మెన్. 'మీకోసం ఎవరో వచ్చారమ్మా' అంటూ.

ఎవరొచ్చారు రఘుకానీ, వివేక్ కానీనా. గోరింటాకు ఆరిపోయింది. కడుక్కుందామా అనుకుని సర్లే ఎవరొచ్చారో చూద్దాం అని కింద వెయిటింగు రూముకు వచ్చింది. కుర్చీలో రవి కూర్చుని ఉన్నాడు. రవి. ఇక్కడ.. మనసుల్లో ఎగిరిపడే సంతోష తరంగాలను. మొహం దాచలేకపోయింది.

"మీరేంటి ఇక్కడ?" అడిగింది అంజలి.

"ఇక్కడ పని ఉండి వచ్చాను. సర్లే నిన్ను కూడా కలవచ్చు కదా అని."

ఒక్కసారి ఫోన్ చేసి రావచ్చుకదా అనుకుంటూ తనవైపు చూసుకుంది. హాస్టల్లోనే కదా ఉండేది అని జీన్సు, టీ షర్టు వేసుకుని జుట్టు ముడిపెట్టుకుని ఉంది.

"ఇదిగో ఈ ప్యాకెట్ నీకు" అంటూ ఓ ప్యాకెట్ ఇచ్చాడు.

"ఏంటివి?" కవరులోంచి తీయబోయింది అంజలి.

"తర్వాత చూడు ఇంటినుండి వచ్చింది" అని.

"నాతో కాసేపు బైటకు వస్తావా అంజలి? ప్లీజ్" అన్నాడు.

అంజలికి ఇలా ఒక్కసారిగా అనుకోకుండా రవిని చూసే సరికి ఏంటో కంగారుగా ఏం చెయ్యాలో తోచనట్లుగా ఉంది.

"సరే. ఈ కవరు రూంలో పెట్టివస్తాను" అని వెళ్ళబోయి "ఇంతకీ ఎక్కడికి వెళుతున్నాం. దాన్ని బట్టి బట్టలు మార్చుకొస్తాను" అంది.

అబ్బా ఏం మాట్లాడుతుంది మతిలేకుండా ఏం బట్టలు కట్టుకోవాలని రవిని అడుగుతుందేంటి తిట్టుకుంది అంజలి.

తనను చూడగానే సంతోషంతో వెలిగిపోయిన అంజలి మొహం, ఇప్పుడు తన కంగారు చాలా క్యూట్‌గా ఉంది రవికి.

"ఈ బట్టల్లో చాలా క్యూట్‌గా ఉన్నావు. మార్చుకోవక్కర్లేదు. ఎక్కడికి వెళదామో నీ ఇష్టం. మీ ఊరు కదా"

రవి అన్నదానికి చాలా సిగ్గుగా తడబాటుగా అనిపించింది అంజలికి. ఇప్పుడే "ఇప్పుడే వస్తా" అని రూంలోకి వెళ్ళి చేతులకున్న గోరింటాకు కడిగింది. బట్టలు మార్చుకోబోతూ అవునూ ఊరినుండి అమ్మ ఏం పంపింది అని కవరు తీసింది. దాంట్లో గిఫ్ట్ రాప్ చేసిన ఓ బాక్స్ ఉంది. సర్లే లేటు అవుతుందేమో తర్వాత చూద్దాం అని చీరకట్టుకుని కిందకు వచ్చింది.

"రాత్రికి ఎన్ని గంటలలోపు రావాలి హాస్టల్‌కి?" అడిగాడు రవి.

"రాత్రి పదికల్లా రావాలి. ఏం అప్పటిదాకా బయట ఉంటామా? ఎక్కడికి వెళదాం?" అంది.

"కాసేపు కూర్చుని మాట్లాడుకునే చోటుకు వెళ్దాం" అన్నాడు రవి తన బట్టలున్న బాగ్ చేతిలోకి తీసుకుని.

ఆటో ఎక్కి లుంబిని పార్కుకు పోనివ్వమంది అంజలి. దోవలో అంతా ఏం మాట్లాడలేదు అంజలి. తనను తాను సంభాళించుకుని, నిదానంగా ఉండటానికి ప్రయత్నించింది. రవి దగ్గర ఏమీ బైటపడకూడదు అని నిర్ణయించుకుంది. నడుచుకుంటూ వచ్చి ఓ బెంచీమీద కూర్చున్నారు.

"ఏంటిలా కిందకు చూస్తూ ఆలోచిస్తున్నావు?" అడిగాడు రవి.

తలెత్తి "ఏం లేదు" అంటూ రవి మొహం పరీక్షగా చూసింది నుదుటి మీద ఏదో దెబ్బలాగా కనిపించింది ఇందాక హాస్టల్‌లో వెలుతురు సరిగ్గా లేక కనపడలేదు.

"ఏంటిది దెబ్బతగిలిందా?" వేలుతో చూపుతూ అడిగింది.

"ఓ ఇంకా కనపడుతుందా? ఏం లేదు చిన్నదెబ్బే"

పరీక్షగా చూసి "చిన్నదెబ్బ అంటారేంటి? కుట్లు కూడా పడ్డాయిలా ఉంది."

"అబ్బా డాక్టరు బుద్దిపోనించావు కాదు. ఎప్పుడో పదిరోజులయ్యింది. ఏంలేదన్నా కదా అయినా నేను ఏదో మాట్లాడాలని వస్తే."

"కుట్లు పడేంత పెద్ద దెబ్బ పదిరోజుల క్రింద తగిలితే నాకెందుకు చెప్పలేదు" అంటుండగానే గొంతు వణికింది అంజలికి, కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

నెమ్మదిగా అంజలి మొహం తనవైపుకు తిప్పుకున్నాడు రవి.

"నాకు ఎప్పుడో తగిలిన దెబ్బ గురించి తలుచుకుంటేనే, ఇప్పుడు నీ కళ్ళల్లో నీళ్ళు ఎందుకు తిరుగుతున్నాయో చెప్పగలవా అంజలి?" మృదువుగా అడిగాడు.

జవాబు చెప్పలేనట్లుగా చూసింది అంజలి. అంజలి చెయ్యి తన చేతిలోకి తీసుకున్నాడు.

"అస్సలు నాదే తప్పు. నేను నీ గురించి ఎలా ఫీల్ అవుతున్నానో ఎప్పుడూ నీకు చెప్పలేదు. లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అని విని నవ్వుకునేవాడిని. అవన్నీ సినిమాల్లో చూపిస్తారు అనుకున్నా. కానీ నిజంగానే నిన్ను మొదటిసారి చూసినప్పుడు, నువ్వు పడబోతుంటే నేను పట్టుకున్నప్పుడు, నీ కళ్ళల్లోకి చూసినప్పుడు నాకు తెలియకుండానే నిన్ను ఇష్టపడ్డాను. మొదట్లో నన్ను నేనే తిట్టుకున్నా ఏంటీ infatuation అని. నిన్ను దూరంగా ఉంచాలనుకున్నా. నా వల్ల కాలేదు. ఎంత దూరంగా ఉందామంటే అంతగా మనస్సు లాగేసేది నీతో మాట్లాడాలని. వివేక్ నిన్ను ఇష్టపడుతున్నాడని తెలిసిన రోజు ఎంత జలసీగా ఫీల్ అయ్యానో. పగలంతా పనులతో బిజీగా ఉన్నా రాత్రి ఒంటరిగా ఉన్నప్పుడు అన్నీ నీ ఆలోచనలే. నీ మనస్సు తెలుసుకునే దాకా చాలా అసహనంగా ఉన్నట్లు అనిపించేది. ఏదో వంకతో నీకు ఫోన్ చేసేవాడిని. నీతో ప్రత్యేకమైన విషయాలు మాట్లాడకపోయినా నీ గొంతు వింటే చాలు అనిపించేది. నీతో పరిచయం పెరిగిన కొద్దీ నీ వ్యక్తిత్వం చాలా నచ్చేది. నిదానంగా, మృదువుగా పరిణితితో ఉండే నీ ప్రవర్తన చాలా నచ్చింది. ఇంకా నువ్వు చేసే అల్లరి ఇంకా నచ్చింది. నిన్ను విజయవాడ తీసుకెళ్ళినప్పుడు చెపుదామనుకున్నా. కానీ నీకు తెలుసుగా వీలవలేదు. తర్వాత కూడా ఎప్పుడూ ఏదో అడ్డం. నువ్వు వెళ్ళేలోపల ఎలాగైనా చెపుదామనుకుంటే నాతో కనీసం చెప్పకుండా వెళ్ళిపోయావు. చాలా బాధ. కోపం వచ్చాయి నీమీద. కానీ నిదానంగా ఆలోచిస్తే అంతా నా తప్పులాగానే అనిపించింది. నా మనసు నీకు తెలియదు. మా మామయ్య మీద కోపంతో 'నేను అసలు పెళ్ళే చేసుకోను' అని అరిచాను. నువ్వది విన్నావు. ఎవరో నేను ఎమ్.ఎల్.ఏ కూతురును చేసుకోవచ్చేమో అంటే నమ్మావు. ఇదంతా నీకు ఎందుకు చెపుతున్నానంటే ఇంక మనిద్దరి మధ్య సందేహాలు వద్దు. నేను నిన్ను చాలా ఇష్టపడుతున్నాను."

ఏమీ మాట్లాడలేదు అంజలి, మౌనంగా వింటూ కూర్చుంది. రవి నోటివెంట ఎప్పట్నుండో ఎదురుచూసిన మాటలు. మనసు నిండిపోయింది. ఏం బదులివ్వాలో తెలియటంలేదు.

"నీకు నేనంటే ఇష్టమని నాకు తెలుసు. కానీ ఒక్కసారి నాతో చెప్పావా?" అన్నాడు రవి.

"ఎలా తెలుసు మీకు?" లో గొంతుకతో అడిగింది అంజలి.

"నన్ను చూడగానే వెలిగే నీ కళ్ళు చెప్పాయి. నేను నిన్ను ప్రేమించటంలేదో అన్న బెంగతో నాతో చెప్పకుండా పారిపోయిన నీ మనసు చెప్పింది."

"నేనేం పారిపోలేదు" అంది అంజలి.

"ఆహాఁ.. అలాగా సరే అయితే ఊళ్ళో ఉన్నప్పుడే నాతో ఫోన్‌లో అర్ధరాత్రి దాకా కబుర్లు చెప్పే నువ్వు నేను ఫోన్ చేసినా ఎందుకు ముక్తసరిగా మాట్లాడేదానివి. ఎందుకు ఒకసారి కూడా ఫోన్ చేయలేదు" అడిగాడు రవి.

"సరే అదికాదు. నాకళ్ళల్లోకి చూసి నిజాయితీగా ఓ విషయం చెపుతావా? ఈ నాలుగు నెలల్లో ఎన్నిసార్లు నాకు ఫోన్ చేద్దామని, ఫోన్ చేతిలో పట్టుకుని, ఫోన్ చేయకుండా పెట్టేశావు"

మొహం తిప్పుకుంది అంజలి. అమ్మో రవి కళ్ళల్లోకి చూస్తూ ఎలా చెప్పగలను? "

"మొహం తిప్పుకోవద్దు నా వంక చూసి చెప్పి" అని అంజలి మొహాన్ని తన వైపు తిప్పుకున్నాడు.

"కొన్ని వందలసార్లు" వినిపించకుండా అంది.

"మరి ఈ చేతిలో ఐ లవ్ యూ అని ఎవరికోసం రాశావు?" నవ్వుతూ అడిగాడు.

ఉలిక్కిపడి గబుక్కున చెయ్యి వెనక్కి లాక్కోబోయింది.

"నేనెక్కడ రాశాను"

"మరి గోరింటాకులో ఈ డిజైన్ ఏంటి? అదీ వదిలేయ్. పండగకు వస్తానని న్యూ యియర్ రోజు నాకు చెప్పి చివరి నిమిషంలో ఎందుకు రానన్నావు? నన్ను చూసే ధైర్యంలేకే కదా?"

"ఏంటీ? లాయర్‌లాగా ఈ ప్రశ్నలు?"

"సరే నువ్వు నాకేం చెప్పనవసరంలేదు. నీ మనస్సు నాకు తెలుసు. పద ఆకలేస్తుంది. ప్రొద్దుటినుండీ ఏమీ తినలేదు" అన్నాడు లేచి.

"ఎప్పుడొచ్చారు హైదరాబాదు. ప్రొద్దునుండి ఎందుకేమీ తినలేదు."

"ఇవాళ్ళ ప్రొద్దున్నే వచ్చాను. నీతో మాట్లాడాల్సినవి రిహార్సల్ వేస్తూ తినలేదు" నవ్వాడు రవి.

ఇద్దరు ఓ రెస్టారెంటుకు వెళ్ళి కూర్చున్నారు.

"అంజలి పండుగకు నాతో పాటు ఊరు రా ప్లీజ్. అసలు నిన్ను తీసుకువెళ్ళటానికే వచ్చాను. ఇవాళ రాత్రికి బయలుదేరొచ్చు మనం" అన్నాడు రవి.

"ఇప్పుడా? ఎందుకంత అర్జంట్‌గా?"

"నీకో సర్‌ప్రైజ్ ఉంది. అలా చూడకు. ఎప్పుడూ ఇలాగే అంటానని. నిజంగా ఐ రియల్లీ వాంట్ యు టు కం విత్ మి"

**"సరే వస్తాను"** అంది అంజలి.

భోజనం చేస్తున్నంతసేపు రవి ఏవో కబుర్లు చెపుతూనే ఉన్నాడు.

భోజనం అయ్యాక మళ్ళీ హాస్టల్‌కి వెళ్ళారు. అంజలి బట్టలు తెచ్చుకోవటానికి మంచం మీద పెట్టి ఉన్న ప్యాకెట్ చూసింది. విప్పి చూస్తే దాంట్లో విజయవాడలో తనకు బాగా నచ్చి పక్కన పెట్టేసిన చీర ఉంది. చీర మడతల్లోంచి ఓ కాగితం పడింది. తీసి చూసింది అంజలి. 'నా నీకు' అని ఉంది.

మంచం మీద కూర్చుండిపోయింది అంజలి. తనకీ చీర నచ్చిందని రవి గమనించినట్లే నాకు తెలియలేదు. ఇలాంటి వ్యక్తినా నేను ఇంత బాధపెట్టాను. ఎంత బాగా రాశాడు 'నా నీకు' అని. అంతకంటే ఏం చెప్పాలి. లేచి చిన్న బ్యాగ్‌లో రవి ఇచ్చిన చీర, ఓ జత బట్టలు పెట్టుకుని బైటకొచ్చింది. బస్టాండుకు వెళ్ళే దోవలో అంజలి ఏమీ మాట్లాడలేదు. చీర గురించి ఏమన్నా అంటుందేమోనని చూశాడు రవి. అంజలి చూసిందా లేదా అనుమానం వచ్చింది కానీ ఎలా అడగాలి?

పండుగ రోజులవ్వటంతో బస్టాండు బాగా రద్దీగా ఉంది. ఆఖరి బస్సులో రెండు సీట్లు దొరికాయి. రాధినుండి ఫోన్ వచ్చింది అంజలికి.

"ఏమైంది ఇద్దరూ పాచప్ అయ్యారా?" అంటూ.

"దేని గురించి మాట్లాడుతున్నావు" అని అడిగింది అంజలి.

"అబ్బా తల్లి ఇంకా సస్పెన్స్‌లో పెట్టకు నన్ను. రవి వచ్చిన దగ్గర్నుండి చచ్చిపోతున్నా. ఏం మాట్లాడుకున్నారో ఇద్దరూ అని" అంది రాధిక.

అంటే రవి రాధి వాళ్ళతో మాట్లాడారా? " ఊరు వెళుతున్నాను. రేపు మాట్లాడతాను" అంది అంజలి.

"ప్లీజ్.. ప్లీజ్ రవి ఏమని చెప్పారో కొంచెం చెప్పవే" టీజింగ్‌గా అంది రాధిక.

"ఊహుఁ లేదు. నా వెనకాల ఇలా చేసినందుకు. నీకంతే కావాలి" అని ఫోన్ పెట్టేసి రవి వంక కోపంగా చూసింది.

అప్పటికే రవి ఈ మాటలు విన్నాడు. చెవులు పట్టుకుని ఉన్నాడు.

"సారీ పొద్దున రఘుకి ఫోన్ చేశాను. నువ్వు ఎక్కడున్నావో తెలుసుకుందామని. నీ దగ్గరకు వచ్చేదాకా వాళ్ళతోనే ఉన్నాను" నవ్వేశాడు.

బస్సులో వెనకాల సీట్లు వచ్చాయి. రాత్రంతా రవి పక్కనే కూర్చోవటం కొంచెం ఇబ్బందిగా, సంతోషంగా అనిపించింది అంజలికి "ఇంత వెనక్కు కూర్చున్నాం ఇక రాత్రంతా నిద్ర ఉండదు కుదుపులతో" అన్నాడు రవి.

కిటికీ పక్క సీటులో కూర్చుని సర్దుకుంటుంటే పొరపాటున మోచెయ్యి రవి పొట్టకు తగిలింది ఒక్కసారిగా "అబ్బా" అని గట్టిగా అన్నాడు రవి.

"ఏమైంది? గట్టిగా తగిలిందా?" అంది అంజలి కంగారుగా. అయినా అంత గట్టిగా పొడుచుకోలేదే అని ఆశ్చర్యపోతూ.

"ఏమీలేదు" అంటూ కూర్చుండిపోయాడు రవి.

"లేదు ఏదో ఉంది. పొట్టలో ఏమన్నా నొప్పిగా ఉందా?" కంగారుగా అడిగింది చెయ్యి పట్టుకుని.

ఓ క్షణం అంజలి కళ్ళల్లోకి చూశాడు రవి. "నువ్వు కంగారు పడకుండా స్థిమితంగా విను. అని జరిగింది చెప్పాడు" పొట్టమీది కుట్లు రేపు తీస్తారు"

కళ్ళమ్మట నీళ్ళు తిరిగాయి అంజలికి "ఇంత జరిగితే నాకు చెప్పాలనిపించలేదా?"

"నువ్వు ఒక్కదానివి ఉంటావు బాధపడతావని"

"నేనసలు మాట్లాడను మీతో"

"మాట్లాడొద్దు. కానీ ఎవరికోసం గోరింటాకుతో ఐ లవ్యు అని రాశావో చెప్పు" తేలిగ్గా నవ్వుతూ అన్నాడు రవి.

"మీకంతా జోక్‌లాగా ఉందా? ఇంకా కుట్టు తీయకుండా ఎందుకు ప్రయాణం చేస్తున్నారు."

"లేదు తెలిస్తే నువ్వు బాధపడతావని చెప్పలేదు. సరే నీకు ప్రామిస్ చేస్తున్నా జీవితంలో ఎప్పుడూ నీ దగ్గర ఏమీ దాచను. సరేనా?"

"నేను జీవితాంతం మీతో ఉంటానని మీతో చెప్పానా?"

"బాబోయ్. అంత పనిష్మెంట్ ఇవ్వకు. ప్లీజ్. రేపు వెళ్ళగానే డాక్టర్ దగ్గరకి వెళదాం సరేనా?"

కాసేపు మాట్లాడలేదు అంజలి. "అమ్మానాన్న రమ్మంటే రాకుండా ఇప్పుడు మీతో ఇలా వస్తే ఏమనుకుంటారు" ఆలోచిస్తూ అంది అంజలి.

"ఏమనుకోరు. సంతోషిస్తారు. చూస్తుండు" అన్నాడు రవి.

"కాసేపు పడుకో పొద్దున్నే ఐదుగంటలకల్లా విజయవాడ వెళుతుంది బస్సు. కారు పంపించమన్నాను. అక్కడ్నుండి కారులో వెళదాం"

"ఊహూఁ ఇవాళ నిద్రరాదు. ఏమన్నా కబుర్లు చెప్పండి" అంది అంజలి.

"ఎప్పుడూ నువ్వు కబుర్లు చెపుతుంటే వినటం నా పని కానీ నాలుగు నెలలుగా నువ్వు వింటున్నావు అంతే. నాతో మాట్లాడడంలేదు. మరి ఇప్పుడన్నా మాట్లాడొచ్చు కదా" లాలనగా అడిగాడు రవి.

"మీ పక్కనే ఉన్నాకదా చీర ఎప్పుడు కొన్నారు?"

"నీకు నచ్చింది కదా. కొన్ని కొన్ని డిటైల్స్ అడగకూడదు. అంతే" అన్నాడు రవి.

"అంజలి, ఒకటడగనా ఎవరో ఎమ్.ఎల్.ఏగారి అమ్మాయిని పెళ్ళి చేసుకోవటం మంచిది. ఆ సంబంధం కుదురుతుంది. అని ఏవేవో చెపితే, నమ్మేసి నన్ను వదిలి వెళ్ళిపోతావా? ఇదేనా నన్ను నువ్వు అర్థం చేసుకుంది. నా ఎదుగుదల కోసం పెళ్ళిని ఒక వ్యాపార బంధంలా మారుస్తానని ఎలా అనుకున్నావు?"

చప్పున చేత్తో రవి నోరు మూసింది "తప్పే. మీ విషయంలో చాలా ఇమెచ్యూర్‌గా ఆలోచించాను. సారీ. కానీ నేను మిమ్మల్ని నిజంగా ఇష్టపడకపోతే ఏం చేసేవారు?" చిన్నగా నవ్వుతూ అడిగింది.

అరచేతిలో చిన్న ముద్దుపెట్టాడు. "సమస్యేలేదు. నీ మొహం మీద ఎక్స్‌ప్రెషన్స్ కంట్రోల్ చేసుకోలేవు నువ్వు. నన్ను చూడగానే నీ మొహం ఎలా అయ్యిందంటే ఏమూలో ఉన్న చిన్న సందేహం కూడా పోయింది."

"రాధి పెళ్ళిలో వివేక్ అడిగాడు, మిమ్మల్ని ఇష్టపడుతున్నానా అని. లేదే అన్నా. చెప్పాలని లేకపోతే పర్లేదు. కానీ నీ ఎక్స్‌ప్రెషన్స్‌ని కంట్రోల్ చేసుకో అన్నాడు."

రాత్రంతా మెలుకువగా ఉండి కబుర్లు చెప్పుకున్నా అలసటగా అనిపించలేదు. ఇంటికి వచ్చేసరికి తొమ్మిదైపోయింది. అంజలిని చూసి సీతారామయ్య, అన్నపూర్ణ చాలా సంతోషించారు.

"సాయంత్రం అంజలిని బైటకు తీసుకెళ్ళొచ్చా" అని సీతారామయ్యను అడిగాడు రవి.

"కొత్తగా అడుగుతావేంటి? మీ ఇష్టం వెళ్ళండి."

"అంజలి సాయంత్రం నాలుగు గంటలకు వస్తాను రెడీగా ఉండు." అన్నాడు రవి.

"సరే డాక్టర్ దగ్గరకు వెళ్ళండి" అని గుర్తుచేసింది.

నవ్వేసి వెళ్ళిపోయాడు రవి.

"ఇద్దరి మధ్య అలకలు, గొడవలు తీరిపోయాయా?" నవ్వుతూ అడిగింది అన్నపూర్ణ

"అలకలేంటి? అదేం లేదు"

"మా దగ్గర ఏమీ దాయక్కర్లేదు. మా అందరికీ చాలా సంతోషంగా ఉంది మిమ్మల్ని చూస్తుంటే. వెళ్ళి స్నానం చేసి రెడీ అవ్వు. టిఫెను తిందువుకాని" అంది అన్నపూర్ణ.

సాయంత్రం చక్కగా తయారయ్యి రవికోసం ఎదురుచూస్తూ కూర్చుంది అంజలి. అన్నపూర్ణ వచ్చి సన్నజాజుల దండ తలలో పెట్టింది. "ఎక్కడికి వెళుతున్నారు సినిమాకా?" అడిగింది అన్నపూర్ణ.

"తెలియదమ్మా? ఏం చెప్పలేదు."

"కాస్త జాగ్రత్తగా ఉండండి. రవి చెప్పాడా జరిగిన గొడవ" అంది అన్నపూర్ణ.

"చెప్పాడు."

"నువ్వంటే అతనికి చాలా ఇష్టం అంజలి. అంత రక్తం పోయి. అంత బాధలోనూ వాళ్ళ నాన్నని చూడగానే. అంజలికి ఈ విషయం ఎట్టి పరిస్థితిలోనూ తెలియటానికి వీల్లేదన్నాడంట" ఇంకా ఏదో చెప్పబోతున్న అన్నపూర్ణ, గేటు తీసుకుని రవి రావటం చూసి మాటలాపేసింది.

"అంజలి వెళ్దామా?" అంటూ వచ్చాడు రవి.

"టీ పెడతాను. కూర్చో రవి" అన్నారు అన్నపూర్ణ.

"ఇప్పుడేమీ వద్దు వెళతాం" అన్నాడు రవి.

ఇద్దరూ రవి బైకుమీద పొలాలవైపు వచ్చారు. పొలం గట్ల మీద నెమ్మదిగా బైకు పోనిస్తూ తోటలో ఆపాడు బైకును.

"ఎన్నాళ్ళనుండో నిన్ను ఇక్కడకు తీసుకొద్దామంటే ఇప్పటికి కుదిరింది" అంటూ ఇంటి తాళం తీసి "నా చిన్ని ప్రపంచంలోకి స్వాగతం" నాటకీయంగా అన్నాడు రవి.

పొందికగా ఉంది లోపల. ముందుగది, ఓ నాలుగు వెదురు కుర్చీలు, ఓ పడక్కుర్చీ, గోడలమీద బాపు బొమ్మలు, ఓ పక్క చిన్న వంటిల్లు.

"ఇటు పక్క బెడ్ రూమ్, టేబుల్, కుర్చీ, స్టీరియో ఉన్నాయి. ప్రశాంతంగా, ఒద్దికగా ఉంది.

రవి వెనకాల నుండి దగ్గరకు వచ్చి అంజలి నడుం చుట్టూ చెయ్యివేసి, దగ్గరకు హత్తుకున్నాడు "నచ్చిందా?"

రవి తన చుట్టూ ఇలా చేతులు వేస్తే ఎందుకింత ధైర్యంగా, నిబ్బరంగా ఉంది. ఇలాగే ఉండిపోవాలనిపిస్తుంది.

"ఏం మాట్లాడవే" మళ్ళీ రెట్టించాడు రవి.

"చాలా బాగుంది" నెమ్మదిగా అంది అంజలి.

"అంజలి మనం పెళ్ళి ఎప్పుడు చేసుకుందాం" అంజలిని వదలకుండా అలాగే పట్టుకుని అడిగాడు.

గబుక్కున తన వైపు తిరగబోయింది అంజలి. "ఊహూ నిన్ను వదలాలని లేదు. ఎన్నిసార్లు ఇక్కడ కూర్చుని, నీతో గడిపినట్లు ఊహించుకున్నానో ఇప్పటికి ఇదంతా కలేనేమో అనిపిస్తుంది" అన్నాడు రవి.

"మీరు ఎప్పుడంటే అప్పుడే" అంది అంజలి.

అంజలి చెంపమీద మృదువుగా ముద్దుపెట్టాడు. కళ్ళు మూసుకుంది అంజలి. ఈ క్షణం ఇలాగే ఆగిపోతే బాగుండు.

నెమ్మదిగా వదిలాడు అంజలిని. "రా బైట కూర్చుందాం. ఇక్కడే ఇలాగే ఉంటే ఇద్దరికీ మంచిదికాదు" అన్నాడు.

అంజలి మొహం ఎర్రబడింది అతని భావం అర్థం అయ్యి బైటకొచ్చి మెట్లమీద కూర్చున్నారు.

"మన పెళ్ళి అయ్యాక మనిద్దరం ఇక్కడే కాపురం పెడదాం. ఊళ్ళో ఉండొద్దు సరేనా?" అడిగాడు రవి అంజలి చెయ్యి తన చేతిలోకి తీసుకుని.

"నిన్నట్నుండీ చూస్తున్నాను. నేనే మాట్లాడుతున్నా. నువ్వేమీ చెప్పట్లేదు. అడగట్లేదు. ఏమైంది నీకు."

"ఏం అవలేదు. మీరు మొదటిసారి ఇట్లా మాట్లాడుతున్నారు. అందుకే వింటూ ఉండిపోయా." రవి వంక చూస్తూ అంది అంజలి.

"కనీసం ఎవరికోసం ఇలా చేతిలో 'ఐ లవ్యూ' రాశావో చెప్పొచ్చు కదా! ఇన్నిసార్లు అడుగుతుంటే"

సిగ్గుపడిపోయింది అంజలి. "మా కాలేజ్‌లో ఒక అబ్బాయి ఉన్నాడు. బాగానే ఉంటాడు. నా వెనకాల పడుతున్నాడు. అందుకని తన కోసం" అంది నవ్వు బిగపట్టుకుంటూ.

"రాక్షసి" ముద్దుగా బుగ్గపట్టుకున్నాడు రవి.

"పద ఓ చోటుకు తీసుకెళతాను. అసలైతే ఎల్లుండిదాకా చూపించకూడదనుకున్నా. కానీ నేనాగలేను" అని బైకు మీద కూర్చోపెట్టి కాలవగట్టు పక్కపొలెంలో వాళ్ళ కోసం కట్టిన పక్కా ఇళ్ళదగ్గరకు తీసుకువెళ్ళాడు.

"అరే ఇళ్ళు కట్టించడం అయిపోయిందా? చెప్పలేదు" అంది అంజలి.

"మరి అదే కదా నీకు చూపించాలన్నది. ఎల్లుండి కనుమరోజు కాలనీ ప్రారంభోత్సవం. ఆ రోజంతా చాలా ప్రారంభోత్సవాలున్నాయి. మంచినీళ్ళు ప్యూరిఫైంగ్ ప్లాంట్ కూడా అయిపోయింది. ఎమ్.ఎల్.ఏ గారు, సబ్ కలెక్టర్, ఇంకా అమెరికా నుండి డాక్టరుగారు వస్తున్నారు."

ఇంటిలోపల పనులన్నీ అయిపోయాయి. తోరణాలు కడుతున్నారు. "ముందు 30 ఇళ్ళు అనుకున్నాం కదా కట్టటం మొదలుపెట్టాక ఇంకా చాలామంది వచ్చి అడిగారు. ఇదిగో ఆ పక్క రెండో ఫేజ్ కింద ఇంకో 50 ఇళ్ళు కట్టిస్తున్నాం. ఒక్కసారి పొదుపు రుచి చూసిన ఆడవాళ్ళు మూలానే చాలా మార్పు వచ్చింది. ఇదంతా నీ వల్లే. సారా ఉద్యమం కానీ పొదుపువల్ల కానీ, మొత్తానికి అందరి మనస్థత్వాల్లో మార్పు వచ్చింది. చదువుకుంటున్న పిల్లలు కూడా ఏ పనీ తక్కువకాదు. చిన్నదికాదు అని నేర్చుకున్నారు"

''ఇప్పుడే నెమ్మదిగా అడుగులు వేస్తున్నాం. వచ్చే సంవత్సరానికి వ్యవసాయంలో కూడా పురోగమిస్తే చాలు'' రవి అనర్గళంగా మాట్లాడుతుంటే, మెరిసే అతని కళ్ళని, మొహాన్ని చూస్తుంది అంజలి. ఎంత ఫాసినేట్‌గా మాట్లాడతాడు. చాలా ముచ్చటగా అనిపిస్తుంది అంజలికి.

అంతా చూపించాక, ఇంటి దగ్గర దింపాడు రవి. ''రేపు కలుస్తాను'' అంది అంజలి చెయ్యి పట్టుకుని అన్నాడు రవి.

''చెయ్యి వదిలితే కదా నేను లోపలికి వెళ్ళేది. మళ్ళీ రేపు కలిసేది'' నవ్వుతూ అంది అంజలి.

''నా దగ్గరే ఉండిపోవచ్చు కదా మూడురోజులు, మళ్ళీ హైదరాబాదు వెళతావంటే ఏంటో బాలేదు'' అన్నాడు రవి.

''అలాగే లోపలికి వచ్చి మా అమ్మా నాన్నను అడగండి. మీరు మా ఇంటికి వచ్చి ఉంటారో నన్ను తీసుకెళతారో'' చిలిపిగా అంది అంజలి.

నవ్వేసి వెళ్ళిపోయాడు రవి.

రాధిక ఫోన్ చేసింది నిద్రపోయేముందు ''తల్లీ ఇకనైనా చెపుతావా మీ లవ్‌స్టోరీ'' అంటూ.

''ఏముంది చెప్పటానికి నీకు తెలియంది కాదుగా'' సిగ్గుగా అంది అంజలి.

''ఇంతకుముందు నీ ప్రేమను పొందిన రవి లక్కీ అనుకున్నా. నేను మొన్న రవితో మాట్లాడుతుంటే నువ్వే లక్కీ అనిపించింది'' అంది రాధిక. ఇద్దరూ చాలాసేపు కబుర్లు చెప్పుకున్నారు.

సంక్రాంతి పండుగ పల్లెలోని ప్రతి ముంగిట ముందు పెద్ద ముగ్గులు, గొబ్బెమ్మలు, గొబ్బెమ్మలను పసుపు, కుంకుమ బంతిపూలతో అలంకరించే ఆడపిల్లలు. సందడి సందడిగా ఉంది. స్నానం చేసి కొత్తచీర కట్టుకుని తలతుడుచుకుంటూ వంటింట్లోకి వచ్చింది అంజలి.

''స్నానం అయింపోయిందా? దా కూర్చో గారెలు అయిపోయాయి తిందువుగాని'' అన్నారు అన్నపూర్ణ.

''గుడికి వెళదామన్నావు'' గారెలు తింటూ అడిగింది అంజలి.

''ఎందుకమ్మా ఇంత హైరానా పడతావు. గుడినుండి వచ్చాక నిదానంగా చేసుకోవచ్చుకదా. ఇప్పుడు గారెలు తింటే అంత తొందరగా ఆకలవుతుందా? అంది అంజలి.

''ఇంతకీ నువ్వు తిన్నావా? నాన్న ఎక్కడ?''

''నాన్న తిన్నారు. నేను కొంచెం పొంగలి తింటాను. కొంచెం జ్వరంగా ఉంది. గారెలు వద్దులే''

''జ్వరంగా ఉందా? నాకెందుకు చెప్పలేదు. ఇంకలే అక్కడ్నుండి'' కంగారుగా అంది అంజలి.

''అబ్బా! ఏం లేదు టాబ్లెట్లు వేసుకున్నాలే. ఇప్పుడు తేలిగ్గానే ఉంది. ఎందుకు నూనెతో చేసినవి అని. అంతే'' తన నుదుటి మీద చెయ్యేసి చూస్తున్న అంజలి చెయ్యి తీస్తూ అంది అన్నపూర్ణ.

''సర్లే రా ఇంక గుడిదాకా రాగలవా? నాన్న స్కూటర్ మీద రా నువ్వు. నేను నడుచుకుంటూ వస్తాను'' అంటూ గొడవ చేసి వాళ్ళిద్దరినే పంపింది అంజలి.

వెళ్ళేదారి అంతా ఎవరో ఒకళ్ళు పలకరిస్తూనే ఉన్నారు అంజలిని. గుడికి వెళ్ళేసరికి అక్కడ అన్నపూర్ణతో మాట్లాడుతూ కనిపించింది సావిత్రి.

"ఏమ్మా బాగున్నావా?" అడిగింది సావిత్రి.

కొంచెం సిగ్గుగా అనిపించింది అంజలికి. రవి తనకోసం హైదరాబాదు వచ్చినట్లు తెలుసా? అని ఏం మాట్లాడాలో తెలియనట్లు, చిన్నగా తలూపింది అంజలి.

"సరే నేను వస్తాను పూర్ణ. సాయంత్రం వచ్చి కలుస్తాను" అని వెళ్ళింది సావిత్రి.

గుడిలో పూజ చేయించుకుని వస్తూ మనస్సులో అనుకుంది అంజలి. పెద్ద... నిన్నేమో ఈ మూడురోజులు నాతో ఉండు అన్నాడు రవి. ఇప్పుడేమో ప్రొద్దున్నుండి కనపడటం లేదు. ఛ ఇలా ఆలోచిస్తుందేంటి? రేపు ఎంత పని ఉంది. దానికోసం పాపం బిజీగా ఉన్నాడేమో? పోనీ నేనే చేస్తాను. ఏమన్నా సాయం చేయొచ్చేమోనని అడుగుతా.

ఇంటికి వచ్చాక అన్నపూర్ణ చెప్పింది అందరితో "సాయంత్రం సావిత్రి వస్తానంది. ఏమన్నా స్వీటు, హాటు చేస్తాను" అని హడావుడి పడింది.

"అమ్మా కాసేపు పడుకో నువ్వు. అంత ప్రత్యేకంగా చెయ్యాల్సినదేం ఉంది. ఇంట్లో అరిశెలు అవీ ఉన్నాయిగా" అంది అంజలి.

"కాదులే ఏమన్నా చేద్దాం. ప్రత్యేకంగా చెప్పింది వస్తున్నట్లు అన్నయ్యగారు కూడా వస్తారంట."

ఎందుకు వస్తున్నట్లు నా గురించి మాట్లాడటానికా? రవికూడా వస్తారా?

సాయంత్రానికి పలహారాలు చేసి, గదిలో తలదువ్వుకుంటుంటే హడావుడిగా లోపలకు వచ్చింది అన్నపూర్ణ. "అంజలి, సావిత్రివాళ్ళు వచ్చారు. పళ్ళు, పూలు తీసుకుని. నీతో మాట్లాడటానికేమో? త్వరగా చీర మార్చుకో" అంటూ బైటకెళ్ళింది.

రవి వచ్చారా? తను ఇచ్చి చీర కట్టుకోనా? తను రాకపోతే నిన్న రాగానే జాకెట్టు కుట్టమని ఇచ్చి మంచి పనిచేసింది. అనుకుంటూ రవి ఇచ్చిన చీర కట్టుకుంది అంజలి.

నెమ్మదిగా ముందు గదిలోకి వచ్చింది అంజలి. తను ఎన్నోసార్లు వాళ్ళింటికి వెళ్ళింది. కానీ ఇవాళ ఎందుకు ఇంత బెరుగ్గా ఉంది వీళ్ళముందుకు రావాలంటే. రవి ఓ పక్కన నిల్చుని ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. "రామ్మా ఇటు వచ్చి కూర్చో" అంది సావిత్రి. ఆ మాట విని వెనక్కి తిరిగి చూశాడు రవి. తను తెచ్చిన చీరలో, ఊహించిన దానికంటే చాలా అందంగా ఉంది అంజలి. తను ఇచ్చిన చీరకట్టుకోవటం చాలా సంతోషంగా అనిపించింది.

"సరే ఇంతదాకా వచ్చాక ఇక ఆలస్యం దేనికి? రవికి మీ అమ్మాయిని ఇవ్వటానికి ఏమన్నా అభ్యంతరం ఉందా?" అడిగారు చంద్రశేఖర్రావు.

"నీ ఇష్టం, నా ఇష్టం ఏమీలేదు దీంట్లో. వాళ్ళిద్దరూ ఇష్టపడ్డారు. పెళ్ళి చెయ్యటం వరకే నా బాధ్యత" నవ్వారు సీతారామయ్య.

"సరే అయితే రాహుకాలం అయ్యాక రావాల్సి వచ్చింది. అమ్మాయికి పసుపు కుంకుమ పెట్టి, సరే అనుకుంటే పెళ్ళి వేసవి కాలం సెలవులో చేయచ్చు ఏమంటారు?" అన్నారు చంద్రశేఖర్రావు.

"ఏంటి అంజలి కొత్తగా సిగ్గుపడుతున్నావు? మేమేదో కొత్తవాళ్ళమైనట్లు" నవ్వుతూ అంది సావిత్రి.

అన్నపూర్ణ లోపలకు వెళ్ళి, తాంబూళంలో పసుపు, కుంకుమ తాంబూలం పెట్టుకుని వచ్చింది.

"రవి ఇలారా" పిలిచింది సావిత్రి.

రవి వచ్చి అంజలి పక్కన కూర్చున్నాడు. అంజలికి బొట్టుపెట్టి పళ్ళు, పూలు చేతిలో పెట్టింది సావిత్రి. "రవి ఈ ఉంగరం అంజలికి పెట్టు"

"అంజలి ఈ ఉంగరం పెట్టు" అని అంజలి చేతికి ఇచ్చింది అన్నపూర్ణ.

అంజలి ఆశ్చర్యపోయింది. ఇదేంటి ఉంగరాలు ఇంత తొందరగా ఎలా కొన్నారు? అసలీ ఏర్పాట్లు ఎప్పుడు చేశారు.

"తర్వాత తీరిగ్గా ఆశ్చర్యపోదురుగానీ ముందు ఉంగరాలు మార్చుకోండి" అంది నవ్వుతూ సావిత్రి.

ఉంగరం పెడుతూ నెమ్మదిగా అన్నాడు రవి "నీతో ఒంటరిగా మాట్లాడాలి ఎలా?" అని.

"నాకేం తెలుసు" అంది అంజలి రవికి ఉంగరం పెడుతూ.

లేచి అందరి కాళ్ళకు నమస్కరించారు. ఉండండి టిఫెన్లు తీసుకొస్తా అని లోపలికి వెళ్ళింది అన్నపూర్ణ. అంజలి కూడా లోపలకు వెళ్ళింది.

"అమ్మా ఈ ఉంగరాలు అవీ ఎప్పుడు కొన్నారు? నేను వచ్చింది నిన్నే కదా?" అంది అంజలి టిఫెను ప్లేట్లలో సర్దుతూ.

"మీరిద్దరూ ఒకళ్ళనొకళ్ళు ఇష్టపడుతున్నారని తెలిసినప్పుడే పైకి చెప్పకపోతే మాకు తెలియదనుకున్నారా?" నవ్వింది అన్నపూర్ణ.

టిఫెను తీసుకుని ముందు గదిలోకి వెళ్ళేసరికి రవిలేడు.

"వాడు డాబామీద ఉన్నాడమ్మా అక్కడికే తీసుకెళ్ళు" నవ్వింది సావిత్రి.

రవిని అసలేం చెయ్యాలి. నన్నింత ఇబ్బంది పెడుతున్నారు. అందరి ఎదురుగా మెట్లు ఎక్కుతూ అనుకుంది అంజలి.

"హమ్మయ్య ఇప్పటికి వచ్చావా? ఎంతసేపట్నుండి చూస్తున్నాను."

అంజలి చేతిలోని ట్రే తీసుకుని కింద పెడుతూ అన్నాడు రవి

"నేనసలు మీతో మాట్లాడను. ఎంత ఎంబరాసింగ్‌గా అనిపించిందో ఇలా అందరి ఎదురుగా మీ దగ్గరకు రావాలంటే" కినుకగా అంది.

అంజలి చెయ్యిపట్టుకుని తన పక్కన కూర్చోపెట్టుకుని "ఎంబరాసింగ్ అవటం దేనికి? ఇప్పుడు మనకు లైసెన్సు వచ్చింది" నవ్వుతూ అన్నాడు.

**చెయ్యి వెనక్కు** లాక్కోపోయింది అంజలి, వదలకుండా చెయ్యి ఇంకా గట్టిగా పట్టుకున్నాడు.

"నేను ఊహించినదానికంటే చాలా బాగున్నావు ఈ చీరలో" అన్నాడు.

"ఈ బుంగమూతిలో ఇంకా బాగున్నావు. ఇలాగే మొహం పెట్టుకుని కూర్చున్నావంటే తరువాత జరిగేవాటికి నేను బాధ్యుడిని కాను" దగ్గరికి వంగుతూ అన్నాడు రవి.

"మరీ ధైర్యం ఎక్కువైపోతుందే" రవిని పక్కకి నెడుతూ అంది అంజలి.

"ఇదిగో ఈ టిఫెన్ తినండి. నేనే చేశా"

"అబ్బా! రొమాంటిక్ మూడ్ ఎలా పాడుచేయబుద్ది అవుతుంది నీకు?" గిన్నెలోని కేసరిని స్పూనుతో తీసి అంజలి నోటికందించాడు రవి.

"అంజలి..." కిందనుండి అన్నపూర్ణ పిలిచింది.

"టీ పంపిస్తున్నా. ఇంకేమన్నా కావాలా?"

"పూలు ఉన్నాయమ్మా. దారం పంపు మాల కడతాను" అంది అంజలి.

"చూశావా మనిద్దరం ఎలాంటి పొజిషన్‌లో ఉన్నామో కాస్త సర్దుకుంటామని మీ అమ్మగారు అలా పిలిచారు నిన్ను" నవ్వుతూ అన్నాడు రవి.

"ఛ. అస్సలు సిగ్గిలేదు మీకు."

నర్సి వచ్చి టీ ఇచ్చి వెళ్ళింది. టీ తాగి, రవితో కబుర్లు చెపుతూ సన్నజాజులు కోసింది అంజలి.

పూలు కట్టే అంజలి చేతులవంక చూస్తూ "సో ఇంకా నీకు చేతనైన కళల్లో ముగ్గు వేయటం, పూలు కట్టటం, వంట చేయటం. నీకు తెలియనివి ఇంకేమన్నా ఉన్నాయా?" అడిగాడు రవి.

"ఊహూ, ఏమీ లేవు. ట్రాక్టర్ కూడా తోలాను ఒకసారి. పొలంలో నాట్లు వేయటమే రాదు" చిలిపిగా నవ్వింది అంజలి.

అంజలి భుజాల చుట్టూ చేతులు వేసి, ముందుకు వంగి బుగ్గమీద ముద్దు పెట్టుకున్నాడు. "నీకు దూరంగా ఉండటం నావల్ల కాదనిపిస్తుంది."

సిగ్గుపడింది అంజలి. "ఏంటి... ఎవరైనా చూస్తే" లోగొంతుతో అంది.

"ఐ డోంట్ కేర్. రాత్రి ఫోను చేద్దామనుకున్నా. కానీ మొన్నకూడా నీకు నిద్రలేదు అని బలవంతాన ఆగాల్సి వచ్చింది" అన్నాడు.

"రేపు నాకూ వెళ్ళాలని లేదు. కానీ తప్పదు" అంది అంజలి.

"నువ్వు నాతో మాట్లాడని ఈ నాలుగునెలలు ఎలా గడిపానో నాకే తెలియదు. రాత్రిపూట డాబామీద కూర్చుని, నీ పాటలు, మాటలు గుర్తుచేసుకునేవాడిని. పెళ్ళి అయ్యాక మనిద్దరం అలా డాబామీద కూర్చున్నప్పుడు వెన్నెల్లో, నువ్వు పాట పాడుతున్నట్లు ఊహించుకునేవాడిని."

"నేను ఒప్పుకోకుండానే, నాతో జీవితం ఊహించుకున్నారా?"

"ఇప్పుడూ మాత్రం నాతో ఏమన్నా చెప్పావా? కానీ నాకు నీ మనసు తెలుసు. కానీ ఒకటి చెప్పు. నువ్వు ఎప్పుడు పాట పాడినా అది నన్ను ఉద్దేశించి, నాకోసం పాడినట్లు ఎందుకనిపించేది నాకు."

"ఎందుకంటే మీకోసం ఆ పాటలు ఎన్నుకున్నాను కాబట్టి."

రవి ఏదో అనబోతుంటే ఫోన్ మోగింది. తీశాడు రవి. "ఆ.. ఇప్పుడే అయ్యింది. ఇదిగో నా పక్కనే ఉంది మాట్లాడు" అని అంజలికి ఫోన్ ఇచ్చాడు.

"ఎవరు?" అన్నట్లు కళ్ళు ఎగరేసింది అంజలి. మాట్లాడు అని సైగచేశాడు.

"హలో" అంది అంజలి.

"కంగ్రాట్స్. మొత్తానికి మీ ఇద్దరి అలకలు తీరాయన్నమాట" అంది నీరజ అవతలనుంచి.

గబుక్కున కళ్ళెత్తి రవి వంక చూసింది.

"మంచి పనిచేశావు, వాడితో సరిగ్గా మాట్లాడకుండా. లేకపోతే వాడికి ఈ జన్మకు ధైర్యం వచ్చేది కాదేమో నీతో మాట్లాడటానికి అని నవ్వి మరి పెళ్ళి ఎప్పుడనుకుంటున్నారు?" అంది నీరజ.

"మీరు ఎప్పుడొస్తే అప్పుడు" అంది అంజలి.

"మొన్నేగా వచ్చాం. మళ్ళీ వెంటనే అంటే ఇబ్బంది అంజలి.."

"పర్లేదు. నా చదువు కూడా అవలేదుగా. మీకు వీలున్నప్పుడు రండి అప్పుడే చేసుకుంటాం. మీరు లేకుండా ఏంటి?" అంది అంజలి.

రవి ఫోన్ లాక్కున్నాడు. "అక్కా, నీకు పుణ్యం ఉంటుంది. నేను టిక్కెట్లు పంపుతాను. 'మే'లో వచ్చేయి. ఇంకా ఆలస్యం చెయ్యకు రేపు మాట్లాడతాను" అని ఫోన్ పెట్టేశాడు.

"పదండి కిందకు వెళదాం. చీకటిపడిపోయింది. బాగోదు" అంది అంజలి లేస్తూ.

"నాకు బాగానే ఉంది ఇక్కడ కూర్చోవటం. వెళ్దాంలే ఉండు."

"అమ్మవాళ్ళు ఏమనుకుంటారు" రవి చేతినుండి తన చెయ్యి విడిపించుకుంటూ అంది అంజలి.

"సరే రేపు నువ్వు మొత్తం నా పక్కనే ఉండాలి సరేనా? మొహమాటపడి అటూ ఇటూ వెళ్ళకు. పూజ దగ్గర మనిద్దరం కలిసి చేద్దాం సరేనా?" అన్నాడు రవి.

"సరే ఇంక పదండి కిందకు" ట్రేలో అన్నీ సర్దుతూ అంది అంజలి.

"నన్ను అండి అని పిలవద్దు రవి అను చాలు"

"ఇది పల్లెటూరు. పేరు పెట్టి పిలవరు" అంది అంజలి.

"సరే. మనిద్దరం ఉన్నప్పుడు మాత్రం ఈ అండి, గిండి అన్నావంటే ఊరుకోను"

"బాబోయ్ పెళ్ళికాకుండానే ఇంత పెత్తనమా నా మీద?" కిందకు వెళుతూ నవ్వింది అంజలి.

"ఏరా తనివి తీరా కబుర్లు చెప్పుకున్నారా?" నవ్వింది సావిత్రి.

"ఎక్కడ? వెళ్దాం వెళ్దాం అని ఒకటే గోల. ఏమీ మాట్లాడలేదు" అంజలి వంక చూసి నవ్వాడు రవి.

"భోజనం చేసి వెళ్ళండి" అంది అన్నపూర్ణ.

"లేదులే వెళతాం పూర్ణ. నాకు పనులున్నాయి. రేపు అందరూ వస్తున్నారుగా. మా ఇంట్లో భోజనాలు. ఆ ఏర్పాట్లు చూడాలి" అంది లేస్తూ సావిత్రి.

"నేనూ ఏదన్నా సాయం చేస్తాను. నాకేమన్నా పనులు చెప్పండి" అంది అంజలి రవితో.

"పనులేమీ లేవు, రేపంతా నా పక్కనే ఉండు చాలు" అన్నాడు రవి.

ప్రొద్దున్నే స్నానం చేసి రెడీ అయ్యి కూర్చుంది. అంజలిని రవి వచ్చి తీసుకెళతానని ఫోన్ చేశాడు.

రవి వచ్చినట్లు బైక్ శబ్దం విని, బైటకు వచ్చింది అంజలి.

"ఎప్పుడూ ఇంత అందంగా ఎలా ఉంటావు నువ్వు?" అంజలిని చూడగానే అన్నాడు రవి.

"కళ్ళు ఓసారి టెస్టు చేయించుకోండి. ఏమన్నా ప్రాబ్లం ఉందేమో?"

సీతారామయ్యగారు దగ్గరకు వచ్చేసరికి మాటలు ఆపేశారు.

"ప్రారంభోత్సవం తొమ్మిదిన్నరకు కదా వచ్చేస్తా ఆ టైముకి" అన్నారు సీతారామయ్య.

"తొందరగా రండి. దా.. కూర్చో ఆలస్యం అవుతుంది" అన్నాడు రవి అంజలితో.

"గాంధీ కాలనీ" అన్న పెద్ద బోర్డు పెట్టారు. బాగా హడావుడిగా ఉంది రాజకీయ బానర్లు ఏమీ ఉండటానికి లేదని కట్టడి చేశాడు రవి.

తోరణాలు, పూలదండలు కట్టి ఉన్నాయి. రవిని చూసి సతీష్ వచ్చాడు.

"హైస్కూలులో మీటింగుకు ఏర్పాట్లన్నీ పూర్తి అయ్యాయి రవి. ఇక్కడ ప్రారంభోత్సవం చేశాక, మంచినీళ్ళ ప్లాంటు, తర్వాత మీటింగు, ఎం.ఎల్.ఏగారి సెక్రటరీతో మాట్లాడి తొమ్మిదికల్లా రావాలని గుర్తు చేశాను. సబ్‌కలెక్టర్‌గారు వచ్చేస్తారు టైమ్‌కి. ఇంకా అమెరికా నుండి వచ్చిన డా.ప్రభాకర్ ప్రసాదుగారింట్లో దిగారు" అని వరసనే కాగితం చూసుకుంటూ చెప్పుకుపోయాడు.

"దండలూ అవీ వచ్చాయా? రాజా ఏడి?" అడిగాడు రవి.

"రాజా ఇప్పుడే మీ ఇంటికి వెళ్ళాడు. భోజనాల దగ్గర ఏమన్నా కావాలేమోనని.. నువ్వు వద్దన్నావనుకో కాని ఏమన్నా కూల్ డ్రింక్స్ లాంటివి తెప్పిస్తే బాగుంటుందేమో రవి. పెద్దవాళ్ళు వస్తున్నారు" అన్నాడు సతీష్.

"వద్దు ఒకళ్ళకిచ్చి ఒకళ్ళకి ఇవ్వకపోతే బాగోదు. తొక్కిసలాట అవుతుంది. తర్వాత భోజనాలు ఉన్నాయి కదా. మర్చిపోయా ఇంకోమాట. నిన్న, నాకూ అంజలికి ఎంగేజ్‌మెంట్ అయింది" అన్నాడు రవి.

"నిజమా ఎవ్వరికీ చెప్పకుండా చప్పుడు లేకుండా ఏంటిది. పోన్లే నాకు చాలా సంతోషంగా ఉంది" అన్నాడు సతీష్ రవి చెయ్యి పట్టుకుని.

"అంజలి మొత్తానికి మా వాడిని దారిలోకి తెచ్చావు" అన్నాడు సతీష్ అంజలి వంక చూస్తూ.

"సర్లే తర్వాత మాట్లాడుకుందాం. ఇళ్ళ కాగితాలు ఇచ్చే వాళ్ళందరిని ఓ చోట కూర్చోమని చెప్పావా?" అన్నాడు రవి.

సబ్ కలెక్టరుగారి కారు వచ్చింది. డా.ప్రభాకర్ గారు, ప్రసాదు డాక్టరుగారు ఇంకా ఊళ్ళో పెద్దలు అందరూ వచ్చారు. అందరూ కబుర్లు చెప్పుకుంటుండగానే ఎమ్.ఎల్.ఏ గారు కూడా మంది మార్బలంతో వచ్చారు. ఎమ్.ఎల్.ఏ గారి కారులోంచి ఆయన కొడుకు, కూతురు కూడా దిగారు.

ఎమ్.ఎల్.ఏ వెంకట్రామయ్యగారి కూతురు వంక కుతూహలంగా చూసింది అంజలి. చాలా కాస్ట్లీ చుడీదారులో అందంగా, స్టైలుగా ఉంది ఆ అమ్మాయి.

రవి ఎదురెళ్ళాడు "రండి. అందరూ వచ్చేశారు. ప్రోగ్రాం మొదలుపెడదాం" అంటూ రిబ్బను కత్తిరించాక, కాలనీలో అంతా తిప్పి చూపించాడు. కాలనీ మధ్యలో ఓ చోట పొయ్యిపెట్టి ఉంది. అందరూ రవిని పొయ్యి వెలిగించమన్నారు. రవి అంజలిని, కుండకు బొట్టుపెట్టి పాలు పోయమని, తను పొయ్యి వెలిగించాడు. ఎవరీ అమ్మాయి అనుకున్నారు వెంకట్రామయ్యగారు. అవతలవైపు ఉన్న మినరల్ వాటర్ ప్లాంటు, సబ్‌కలెక్టరు గారు ప్రారంభోత్సవం చేశారు. అంతా అయ్యాక కారుల్లో హైస్కూలు వైపు వెళ్ళారు మీటింగుకని.

వెంకట్రామయ్యగారు రవి చెయ్యిపట్టుకుని "మళ్ళీ మీటింగు హడావుడి మా అమ్మాయిని పరిచయం చెయ్యలేదు నీకు. పేరు హరిత. రవి అని చెప్పాను కదమ్మా" అని పరిచయం చేశాడు ఆయన.

అంజలిని పిలిచి పరిచయం చేద్దామా అన్న చిలిపి ఊహ వచ్చింది రవికి. మరీ బాగోదేమో అని హరితవంక చూసి నవ్వుతూ "నమస్తే" అన్నాడు.

అంతలో అంజలి వచ్చి "రవి ఆలస్యం ఉందా ఇంకా? లేక మొదలుపెట్టొచ్చా?" అంది.

"ఎవరీ అమ్మాయి? ఎప్పుడూ కలవలేదు" వెంకట్రామయ్య అడిగారు ఆరాగా.

రవి చెప్పేలోపే, అంజలి అంది "నా పేరు అంజలి అండి. ఈ ఊరే. సీతారామయ్యగారి అమ్మాయిని."

"పద స్టేజ్ మీదకు వెళదాం" అని రవి అంజలితో అన్నాడు. మీటింగు బాగానే జరిగింది. ఎమ్.ఎల్.ఏ గారు రాజకీయ ఉపన్యాస ధోరణిలో చెప్పారు. కలెక్టరుగారు, డా.ప్రభాకర్‌గారు చక్కగా మాట్లాడారు. ఊళ్ళో జరుగుతున్న కార్యక్రమాల గురించి, ఇంక సాధించాల్సినవి చక్కగా చెప్పారు. కాలనీ వాళ్ళకు ఇళ్ళ కాగితాలు పంచారు. శుద్ధి చేసిన మంచినీళ్ళు 20లీటర్ల క్యానులో రెండు రూపాయలకే అమ్ముతున్నారు. ఆ వచ్చిన డబ్బులు, లాభం కోసం కాకుండా, ఖర్చులకు సరిపోవటానికి మాత్రమే. అందరికీ భోజనాలు అక్కడే అని చెప్పారు.

"ఇందాక నన్ను చెప్పనివ్వకుండా ఆపావు. కానీ నేను నిన్ను పరిచయం చేయాలి పద. మనిద్దరికి పెళ్ళి అని ఎంత తొందరగా చెపితే అంత మంచిది" అన్నాడు.

"ఎమ్.ఎల్.ఏ గారి అమ్మాయి చాలా బావుంది. బాగా ఆలోచించుకోండి మరి" నవ్వింది అంజలి.

"నిన్నూ... ఉండు నీ పని తర్వాత చెపుతాను. రా నాతో" అని అంజలిని అందరి దగ్గరకు తీసుకెళ్ళాడు.

ఎమ్.ఎల్.ఏగారు, కలెక్టరుగారు అందరూ నిల్చుని మాట్లాడుతున్నారు. "రండి భోజనాలదగ్గరకు. ఏదో సింపుల్‌గా చేయించాను. అందరికీ భోజనాలు పెట్టించాలని" అన్నాడు రవి.

"ఏంటయ్యా భోజనాల ఖర్చు అంతా నువ్వే పెట్టుకున్నావంట" అడిగారు ఎమ్.ఎల్. గారు.

"ఇందాక మీటింగు హడావుడిలో పరిచయం చెయ్యటానికి కుదర్లేదు. తను అంజలి, నేను పెళ్ళిచేసుకోబోయే అమ్మాయి" అన్నాడు రవి.

స్టన్ అయ్యారు వెంకట్రామయ్య. తన కూతురిని చూశాక, మాట్లాడాక, తప్పకుండా రవి పెళ్ళికి ఒప్పుకుంటాడనుకున్నారాయన. హరిత కోపంగా చూసింది ఆయన్ని. బలవంతాన తీసుకొచ్చారు ఆయన కూతుర్ని.

"కంగ్రాట్స్. ఇంతకు ముందు కలిశాను కదా! ఇద్దరు ఒకే థాట్స్ ఉన్నవాళ్ళు పెళ్ళి చేసుకోవటం నిజంగా లక్కీ" అన్నారు సబ్‌కలెక్టర్ గోపాల్.

"అవును. చాలా మంచి సలహాలు ఇస్తుంది తను. కేవలం వాటిని ఇంప్లిమెంట్ చెయ్యటమే నా పని" నవ్వాడు రవి.

"కాస్త ఎక్కువ చేసి చెపుతున్నారు రవిగారు నా గురించి" సిగ్గుగా అంది అంజలి.

"పిజి చేస్తుంది. అయ్యాక నా దగ్గరే ప్రాక్టీస్ చేస్తుంది" అన్నాడు డా.ప్రసాద్ ప్రభాకర్‌తో.

"ఏమయ్యా ఒక్కమాట చెప్పలేదు నాతో" కొంచెం తేరుకుని అన్నారు వెంకట్రామయ్య.

"ఎంగేజ్‌మెంట్ ఇంత తొందరగా అని అనుకోలేదు. కానీ అనుకోకుండా నిన్నే అయ్యింది. పెళ్ళి వేసవిలో" అన్నాడు రవి. అప్పటికే ఒకళ్ళ నుండి ఒకళ్ళకి రవి పెళ్ళి కుదిరిందని పాకిపోయింది. అందరూ వచ్చి రవిని పలకరించారు. రవికి ఉన్న పరపతి గమనించిన వెంకట్రామయ్య ఉసూరు మనిపించింది. తన అల్లుడు కానందుకు.

సతీష్ వచ్చి అందరిని భోజనాల దగ్గరకు పిలిచాడు. రెండు కూరలు, పచ్చడి, సాంబారు, మజ్జిగ, అరటిపండుతో సింపుల్‌గా, అందరికీ ఒకే రకమైన భోజనం పెట్టించాడు రవి.

అందరి భోజనాలు అయ్యి బయలుదేరేసరికి రెండు దాటింది. రవి, సతీష్ దగ్గరి వచ్చాడు. "నీ మీద పని పెడుతున్నాను. కాస్త ఇవన్నీ సర్దించటం అవీ చూస్తావా. అంజలి రాత్రికి వెళుతుంది తనతో కాసేపు ఉందామని.

"భలేవాడివే. అంతగా చెప్పాలా? వెళ్ళు" అన్నాడు సతీష్.

తోటలో కూర్చున్నారు రవి, అంజలి.

"ఏంటి ఆలోచిస్తున్నారు?" అని అడిగింది అంజలి.

"మనుష్యుల ఆలోచనలు ఎంత విచిత్రంగా ఉంటాయో కదా అని. నాది అని అనుకున్న తర్వాత స్వార్థం పెరిగిపోతుంది."

"దేని గురించి మాట్లాడుతున్నారు?"

"నా గురించే. నువ్వు నన్ను ఇష్టపడుతున్నావు అని తెలిసినప్పట్నుండి నిన్ను అస్సలు వదిలి ఉండాలని లేదు. ఇంకా నీ చదువుకోసం వేరే చోటులో ఉంటానన్న ఆలోచనే కష్టంగా ఉంది. నాది ఎంత స్వార్థమో కదా. నా కోసం నీ కెరీర్ పాడు చేయాలనుకోవటం, పెళ్ళి చేసుకుని, నా దగ్గరే ఉంచుకోవాలనుకోవటం"

"ప్రేమలో ఈ మాత్రం స్వార్థం ఉండాలి. మీ సుఖం కోసం నన్ను అణగదొక్కి, అది నాశనం చేస్తే అది దుర్మార్గం అవుతుంది. మీదికాదు."

"మనం పెళ్ళి ఈ వేసవిలో చేసుకోవద్దు. నీ చదువయ్యాక చేసుకుందాం. పెళ్ళైపోతే నిన్ను తిరిగి పంపనేమో"

అంజలి రవి చెయ్యి తన చేతిలోకి తీసుకుంది " ఎందుకిలా బెంగగా ఉంది రవి మీకు.?"

"ఏమో? నా జీవితంలోకి నన్ను అర్థం చేసుకుని, ఇష్టపడే వ్యక్తి వస్తుందనుకోలేదు. తీరా వచ్చాక నాకు ఎందుకో భయం వేస్తుంది. ఇది కలకాలం ఉంటుందా అని"

"మీకు గుర్తుందా? మొన్న హైదరాబాదులో నన్ను అడిగారు ఏం మాట్లాడట్లేదేంటి అని. సరిగ్గా మీరు ఇప్పుడన్న మాటలే. నాకూ అనిపించాయి. ఈ ఆనందం నిలుస్తుందా అని. కానీ ఎందుకో ఇప్పుడా భయం, బెంగపోయాయి నాలో. "

అంజలి కళ్ళలోకి చూశాడు రవి.

అతని కళ్ళల్లో తనపట్ల కనిపించిన ప్రేమ చూసి చలించిపోయింది అంజలి.

చాలాసేపు ఇద్దరూ మౌనంగా కూర్చుండిపోయారు. మాట్లాడుకోవటానికి, తెలుసుకోవటానికి ఇంకేమీ మిగిలినట్లుగా అనిపించలేదు. ఆ మౌనంలో, ఆ ప్రశాంతతలో ఇద్దరి మనస్సులు మమేకమైనట్లుగా అనిపించింది.

రాష్ట్రంలోని వేడెక్కుతున్న రాజకీయ పరిణామాలు, రాబోతున్న ఎన్నికల హడావుడి, పల్లెపల్లెకు వ్యాపించింది. ఎంపిటిసి ఎన్నికలకు ఈ సంవత్సరం బాగా ప్రతిష్టాత్మకంగా, రాజకీయ నాయకులు, గల్లీ నాయకులు, ఎవరి పార్టీలవారు వాళ్ళ పార్టీ తరపున ప్రచారం చేస్తున్నారు.

రవికి చుట్టుపక్కల ఊళ్ళల్లో పెరుగుతున్న పరపతి గమనించి, అధిష్టాన ప్రతిపక్ష మధ్యవర్తులు తమ పార్టీ తరపున ఎంపిటిసి ఎన్నికల్లో పోటీ చేయమని ఎప్పట్నుండో అడుగుతున్నారు. కానీ వాళ్ళందరినీ సున్నితంగా తిరస్కరించాడు రవి. కానీ ఊళ్ళోని పెద్దలు, రవిని బాగా బలవంత పెట్టటంతో ఆలోచనలో పడ్డాడు రవి.

"నాన్నా నేను వచ్చే ఎలక్షన్‌లో పోటీ చేద్దామనుకుంటున్నా. దానికోసం ఇంకా చేయాల్సిన కసరత్తు చాలా ఉంది. ఇంకా టైముంది కాబట్టి ఇప్పుడే ఈ విషయం బైటకు తెలియనివ్వకుండి" రాత్రి భోజనాలు చేస్తున్నప్పుడు అన్నాడు రవి.

"ఆలోచన మంచిదే, కానీ ఈ రోజుల్లో రాజకీయాలంటే బాగా డబ్బుతో కూడుకున్న వ్యవహారం. రాజకీయాలు తక్కువ పెట్టుబడి ఎక్కువ లాభం పొందే వ్యాపారం అయిపోయిందని నీకు తెలుసుకదా. నిజాయితీగా ఉండేవాళ్ళ రోజులు కాదు. నువ్వు ముక్కుసూటిగా వెళతావు. ఆలోచించుకో బాగా" అన్నారు చంద్రశేఖర్రావు.

"అందుకే ఈ ఎలక్షన్లలో బాగా గమనించి, నిర్ణయం తీసుకుంటా" పడుకునే ముందు అంజలికి ఫోన్ చేసి మాట్లాడటం రోజూ అలవాటయ్యింది రవికి.

"వచ్చే ఆదివారం నీ దగ్గరకు వద్దామనుకుంటున్నా. ఫ్రీగా ఉంటావా?" అడిగాడు రవి.

"ఏంటి? ఏమన్నా పనిమీద వస్తున్నారా?" అడిగింది అంజలి.

"నిన్ను చూసి నెల అయ్యింది అందుకుని వస్తున్నా."

"మేము మెడికల్ కాన్ఫరెన్స్‌కి ఢిల్లీ వెళుతున్నాం ఉండను."

"ఓ, సర్లే తర్వాత మాట్లాడతాను."

"ఏమన్నా అర్జెంటుగా మాట్లాడాలా? అలా అంటున్నారు."

"అర్జెంట్ విషయం కాదులే కలిసినప్పుడు మాట్లాడుకోవచ్చు" కాసేపు కబుర్లు చెప్పి ఫోన్ పెట్టేశాడు రవి.

ఎడతెరపి లేకుండా రెండు రోజుల్నుండి వర్షం ఈదురుగాలితో పడుతోంది. అకాల వర్షంతో చేలు మునిగిపోయి, కోస్తా జిల్లాల రైతులు నెత్తిన గుడ్డవేసుకుని కుర్చున్నారు. రెండో పంట మీద వచ్చే డబ్బులే అసలు లాభం రైతుకి. పంట చేతికొస్తుందన్న సమయంలో ఇలా వర్షం రావటం, మినుము, పెసర, వేరుశెనగ, పళ్ళ తోటలు, ఒకటేంటి అన్ని రకాల రైతులు నష్టపోయారు.

శవం మీద వాలిన రాబందుల్లా, రాజకీయ నాయకులు వాలిపోయారు. ప్రతిపక్షం నాయకులు, అధికార పక్షాన్ని దుమ్మెత్తి పోశారు. పంట రాయితీలు కల్పించాలి, రుణాలు మాఫీ చేయాలని. ప్రభుత్వం హడావుడిగా ఎకరాకు ఇంత నష్టపరిహారం ప్రకటించింది. అది చేతికి ఎప్పుడొస్తుందో మధ్య అధికారులు లంచాలకు ఎంత వెళ్ళిపోతుందో ఎవరికి తెలుసు?

రవికి క్షణం తీరిక ఉండటంలేదు. వ్యవసాయ అధికారులతో పాటు, పొలాలకు వెళ్ళి ఎవరి పొలాలు, ఎంత నష్టం జరిగిందో లెక్కలు వేయించి, ఇళ్ళు కూలిన వాళ్ళకు పునరావాసం ఏర్పాటు చూసుకోవటంలో తలమునకలైపోయాడు.

ఎంపిటిసి ఎన్నికలు పదిహేనురోజుల్లోకి వచ్చేసాయి. రవి ఊళ్ళో అందరికీ ప్రత్యేకంగా పాలెంలో వాళ్ళకు ఓటు హక్కు గురించి, ప్రలోభాలకు లొంగకుండా మనకు మంచి చేసే నాయకులని ఎలా ఎన్నుకోవాలో, దానివల్ల పొందే లాభాలు పదేపదే వివరించాడు. "ఏ నాయకులన్నా ఓట్ల కోసం డబ్బులు పంచితే వాళ్ళ ముఖం మీదే మీకు ఓటు వెయ్యం అని చెప్పేయండి. ఓటు కోసం మీరు డబ్బుకానీ, వస్తువులు కానీ తీసుకుంటే అది లంచం తీసుకున్నట్లే. ఈ ఖర్చు చేసిన డబ్బులు తిరిగి సంపాదించటానికి వాళ్ళు తర్వాత లంచం తింటారు. ప్రతిఒక్కళ్ళూ వెళ్ళి ఓటు వేయాలి. మీకు ఏ అభ్యర్థి నచ్చితే వాళ్ళకు వేయండి. కానీ ఎవరికి ఓటు వేస్తున్నారో వాళ్ళు మనఃస్ఫూర్తిగా మీకు సహాయం చేస్తారు. మీ కోసం పనిచేసే నాయకులని నమ్మితే ఓటు వేయండి" అన్నాడు రవి.

రవి ఊళ్ళో ప్రతి బజారులో, అన్ని వార్డుల్లో స్పీకర్లు పెట్టించాడు. పంచాయితీ ఆఫీసు నుండి ఏదన్నా ప్రకటన చేసినా, అందరికీ వినబడేటట్లు.

ఎన్నికలు ప్రశాంతంగానే జరిగాయి. చుట్టుపక్కల ఊళ్ళల్లో. క్రమంగా రవి పట్టుదలతో చేసే ప్రతి పని, తను చిత్తశుద్ధితో పనిచెయ్యటంతో అందరికీ తలలో నాయకుడుగా ఎదిగాడు. ప్రతి సంవత్సరం ఉండే కరెంటు సమస్యను ఎదుర్కోటానికి పొలాల్లో సోలార్ పానెల్స్ పెట్టించాడు. దాన్నుండి మోటార్లు వేసుకోవచ్చు. నీళ్ళకు ఇబ్బంది ఉండదు. రోడ్డు మీద ఎవరన్నా చెత్త పారేస్తే పంచాయితీకి పన్ను కట్టాలి. వీలైనంత చెత్త బయో ఎరువు తయారు చేయటానికి పడేస్తున్నారు. లేకపోతే రోజూ చెత్త తీసుకెళ్ళే వాళ్ళు వచ్చినప్పుడు ఆ చెత్త డబ్బాలోనే పడేయాలి.

ఒక్క నాలుగు నెలల్లోనే చాలా మార్పులు వచ్చాయి పారిశుధ్యంలో. రాబోయే వేసవిలో ఇళ్ళల్లో కూడా కరెంటు ఇబ్బంది లేకుండాణ కొంతమంది సోలారు విద్యుత్తు ఏర్పాట్లు చేసుకున్నారు. వ్యవసాయ అనుబంధ ఇతరేతర వ్యాపకాల మీద ఆసక్తి ఏర్పడింది అందరికి. వ్యవసాయ పనులు తక్కువ ఉన్న రోజుల్లో పోరంబోకుగా తిరిగే కుర్రాళ్ళు కూడా ప్రత్యామ్నాయ వ్యాపారుల, ఉపాధులు వెతుక్కోవటంతో ఊర్లో గొడవలు తగ్గిపోయాయి.

"**మీ మామయ్య** దిగులుగా ఉన్నాడు రవి. కూతురు పెళ్ళి గురించి" ప్రొద్దున్నే టిఫెను పెడుతూ నెమ్మదిగా అంది సావిత్రి.

"కొంచెం నేల మీద నడిస్తే చాలా సంబంధాలు వస్తాయి. అవి పనికిరావుగా మీ అన్నయ్యకు" వెటకారంగా అన్నారు చంద్రశేఖరావు.

"ఎవరికైనా పిల్లలు సుఖపడాలనే ఉంటుంది కదా" సమర్ధిస్తున్నట్లుగా అంది సావిత్రి.

"అమ్మా మీ అన్నయ్యతో చెప్పు రాజాకి ఇస్తాడేమో? ఎనిమిది ఎకరాల పొలం ఉంది. మంచివాడు, ఇద్దరక్కల పెళ్ళిళ్ళు అయిపోయాయి. వేరే బాధ్యతలు లేవు. తను ఇంకా అభివృద్ధి అవుతాడు అన్న నమ్మకం నాకుంది. అడుగు. ఏమంటాడో. తను సరే అంటే నేను రాజాతోనూ వాళ్ళ ఇంట్లోనూ మాట్లాడుతాను" అన్నాడు రవి.

"అది సరే మరి నీ పెళ్ళి మాటేంటి? ఇంకా ఎన్నాళ్ళు ఆగుతారు సరే అనుకున్నాక" అడిగింది సావిత్రి.

"అక్క ఎప్పుడొస్తుందో మరి. తను వచ్చాకే చేసుకుందాం అంటుంది అంజలి నాదేమీ లేదు" అన్నాడు రవి.

"నిజమే తనవైపు తోబుట్టువులు ఎవ్వరూ లేరు. మనకి ఉన్న ఒక్క ఆడపిల్ల, ఎక్కడో ఉంది. అన్నిటికీ దూరాభారం ఖర్చుతో కూడిన పని" నిట్టూర్చింది సావిత్రి.

"నేను ఫోను చేసి అమ్మాయితో అల్లుడితోనూ మాట్లాడతానులే వాళ్ళేమంటారో దాన్నిబట్టి నిర్ణయించుకుందాం" అన్నారు చంద్రశేఖరావు.

అంజలి, రవి టాంక్‌బండ్ మీద నడుస్తున్నారు. సాయంత్రం కావటంతో బాగా సందడిగా ఉంది. ఇద్దరూ కలుసుకుని ఈసారి రెండు నెలలయ్యింది. రవికి పనుల వత్తిడి పెరగటం లేకపోతే అంజలి బిజీగా ఉండటంతో కలవటానికి కుదర్లేదు.

"హాస్టల్లో ఉండకుండా అపార్టుమెంటు అద్దెకు తీసుకుని ఉందామనుకుంటున్నా" అంది అంజలి.

"అదేంటి హాస్టల్లో సేఫ్‌గా ఉంటుంది, ఇంకాపైగా వంట చేసుకోవటంలాంటివి ఉండవు" ఆశ్చర్యపోయాడు రవి.

"దాదాపు ఇంకా రెండున్నర ఏళ్ళు ఇక్కడే ఉండాలి. ఎప్పుడన్నా మీరు వస్తే హోటల్లో ఉండనక్కర్లేదు కదా"

"ఎప్పుడో వచ్చే నాకోసం ఎందుకు అంజలి. ఒక్కదానివే నువ్వు అపార్ట్‌మెంట్‌లో ఉంటే నాకు బాగోదు" అది సర్లే కానీ నీతో చాలా ముఖ్యమైన విషయం మాట్లాడాలి దా కూర్చుందాం" అన్నాడు రవి.

ఇద్దరూ భేల్ పూరీ తెచ్చుకుని తింటూ కూర్చున్నారు.

"నేను రాజకీయాల్లోకి ఎంటర్ అవుదామనుకుంటున్నా అంజలి, అంటే వచ్చే జెడ్పిటిసి కానీ జిల్లా ఎన్నికల్లో కానీ పోటీచేద్దామనుకుంటున్నా. నీ అభిప్రాయం ఏంటి? నాకు తెలుసు ఇదివరకు ఎప్పుడూ నేను ఇలా రాజకీయాల మీద ఇంట్రెస్ట్ ఉన్నట్లు నీతో అనలేదు. కానీ ఈ మధ్య అందరూ నన్ను బలవంతం చేయటంతో ఆలోచిస్తున్నాను ఏమంటావు?"

ఏం మాట్లాడాలో అర్థంకాలేదు అంజలికి. రవిలాంటి నాయకులు మనకు చాలా అ అవసరం, యువకులు రాజకీయాల్లోకి రావాలి అని అందరూ అనుకునేదే, కానీ రాజకీయాల్లో, రవిలాంటి ముక్కుసూటిగా వెళ్ళేవాళ్ళు నెగ్గుకురాగలరా? రాజకీయాల్లో పైకి రావాలంటే పైరవీలు చేయాలి, రౌడీయిజంను చేసినా చేయకపోయినా, చూసీచూడనట్లు వదిలేయాలి ఎన్ని చదవట్లేదు పేపర్లో.

"ఏంటి అంతగా ఆలోచిస్తున్నావు?" అంజలి చెయ్యి తన చేతిలోకి తీసుకుంటూ అన్నాడూ రవి.

"నేనేం చెప్పగలను మీకు?" రవి వంక ఓ క్షణం చూసి నెమ్మదిగా అంది అంజలి.

"నాకు తెలుసు అంజలి. నువ్వు ఎందుకు భయపడుతున్నావో" లాలనగా అన్నాడు రవి.

"నేనూ ఇదివరకు అలాగే అనుకునేవాడిని. రాజకీయాలు నాకు సరిపడవు. ముక్కుసూటిగా ఉంటాను. తెల్లవారితే చాలు ఒకళ్ళనొకళ్ళు విమర్శలు చేసుకోవటం, తిట్టుకోవటం మీద ఉన్న శ్రద్ధ, ప్రజలకోసం ఏం చేస్తున్నాం అనుకునే నాయకులు చాలా తక్కువైపోయారు. ఒప్పుకుంటా కానీ అందరూ ఇలాగే అనుకుని, చదువుకున్నవాళ్ళు, ప్రజలకోసం తాపత్రయపడేవాళ్ళు, దూరంగా ఉంటే దేశం రానాను దొంగల రాజ్యంగా మారుతుంది. తెలుసా విదేశాల్లో రాజకీయాల్లోకి రావాలంటే బాగా చదువుకున్నవాళ్ళని, అందునా రాజనీతి శాస్త్రంలో చదువుకున్న వాళ్ళు ముందుకు వస్తారు. మనది చూడు ఎంత దౌర్భాగ్యమో వీధి గూండాలు, ఆకు రౌడీలు కూడా ఎమ్మెల్యేలు అయిపోతున్నారు"

"ఇవన్నీ నాకూ తెలుసు. కాని వీటన్నిటితోపాటు మీ గురించిన నా స్వార్థం నన్ను భయపెడుతుంది" అంది అంజలి.

రవి ఏమీ మాట్లాడకపోయేసరికి మళ్ళీ తనే అంది. "ఈ రాజకీయ వాతావరణంలో మీరు ఎలా నెగ్గుకొస్తారో అన్న భయంతోపాటు ఈ నిర్ణయంతో మన జీవితం ఎలాంటి మలుపు తిరుగుబోతుందో అర్థంకావటంలేదు"

"దేని గురించి మాట్లాడుతున్నావు?"

"ఇప్పటికే మీకు తీరిక ఉండటంలేదు. ఇంకా ఇలా రాజకీయాల్లోకి వెళితే, క్షణం తీరిక ఉంటుందా మీ కుటుంబం కోసం నాకోసం అవును నాది స్వార్థమే కావచ్చు. కానీ నువ్వు నాతో మాత్రమే కాసేపు ఉండాలనుకోవటం లేదా మనిద్దరం సంవత్సరానికి ఒకసారి ఎక్కడికైనా వెకేషన్‌కి వెళ్ళాలనుకోవటం స్వార్థమా? అదీ కాకుండా. నేను డాక్టర్ని పల్లెటూరులో ప్రాక్టీసు నువ్వు రాజకీయ పనులతో రోజుల తరబడి వేరే ఊళ్ళల్లో ఉంటే ఎంత కష్టం" అంది అంజలి. కాస్త దిగమింగుకుని.

"సారీ మీరు ఉత్సాహంగా మీ ఫ్యూచర్ ప్లాన్స్ గురించి చెపుతుంటే నేను డిస్కరేజ్ చేస్తున్నాను."

"నువ్వు నాతో ఏదన్నా చెప్పటానికి అంతగా ఆలోచించనవసరంలేదు. మోర్ వోవర్ సారీ అని అస్సలు చెప్పకు. ఏదైనా నువ్వు బాగా ఆలోచించి చెపుతావని నాకు తెలుసు" మృదువుగా అన్నాడు రవి.

"నేను కూడా మనిద్దరి జీవితం. ఈ నిర్ణయం వల్ల ఎలా ఇంపాక్ట్ అవుతుందో అని ఆలోచించాను. నిజం చెప్పాలంటే కొంచెం భయంగా కూడా ఉంది. అందుకే ఎవరు బలవంతం పెట్టినా నేను మొన్న జరిగిన ఎలక్షన్లలో పోటీ చేయలేదు. నిదానంగా ఆలోచిద్దాం. నా ఐడియా ఇది అని చెప్పానంతే ఇంకా చాలా టైం ఉంది నిర్ణయం తీసుకోటానికి. నువ్వు టెన్షన్ పడకు" అన్నాడు రవి.

కాసేపు మౌనంగా కూర్చున్నారు ఇద్దరూ.

"మనం పెళ్ళి ఎప్పుడు చేసుకుందాం?" అడిగాడు రవి. "అక్క వాళ్ళతో మాట్లాడారు నాన్న. ఈ వేసవిలో రావటానికి కుదరకపోవచ్చు మనల్ని పెళ్ళి చేసుకోమంది. వచ్చే సంవత్సరం వస్తుందంట"

"తొందరేముంది తను వచ్చాకే చేసుకుందాం"

"నీకేం తొందర అలాగే అంటావు. లేకపోతే ఓ పని చేద్దాం. ఇప్పుడు రిజిష్టర్ మ్యారేజ్ చేసుకుని అక్క వచ్చాక మళ్ళీ చేసుకుందాం."

"నీ పిచ్చి ఐడియా నీ దగ్గరే ఉంచుకో ఇన్నిసార్లా?"

"కాదు ఆలోచించు. నువ్వన్నట్లు అపార్ట్‌మెంట్ తీసుకుంటే నేను వస్తూ పోవచ్చు కదా. అదే పెళ్ళి చేసుకుంటే నేను నీ దగ్గరున్నా ఎవ్వరికీ అభ్యంతరం ఉండదు."

"అమ్మో మీకు కావాలంటే ఎలాగైనా కన్విన్స్ చేస్తారే" అంది అంజలి నవ్వుతూ.

"పెళ్ళి చేసుకోకపోతే ఏమైంది? నేను మరో తొందరగా ఒప్పుకున్నానని బాధగా ఉంది. కొన్నాళ్ళు డేటింగ్ చేద్దాం. తర్వాత పెళ్ళిచేసుకోవచ్చు. సరదాగా ఉంటుంది"

"నీకు ఆటగా ఉంది కదూ నా పాట్లు చూస్తుంటే. నేను ఎదురుగా ఉంటే నా విలువ తెలియటంలేదు. నీకు చెప్పకుండా ఎక్కడికన్నా వెళ్ళిపోతే ఏం చేస్తావ్?"

చప్పున నోరు మూసింది అంజలి. "ఏం మాటలవి ఇలా ఎప్పుడూ మాట్లాడొద్దు. మీ ఇష్టం. ఇవాళ పెళ్ళిచేసుకోమన్నా నేను రెడీనే"

"ఏయ్ ఊరికే అన్నాను. ఇంత సెన్సిటివ్ అయితే ఎలా?" భుజాల చుట్టూ చెయ్యివేసి దగ్గరకు తీసుకున్నాడు రవి.

"సార్ పూలు తీసుకుంటారా?" ప్రక్కనుండి వినిపించింది. గులాబీపూలు బుట్టలో పెట్టుకుని ఓ పదేళ్ళ పిల్ల నిల్చుని ఉంది.

"కొంటాం కానీ చదువుకునే వయస్సులో ఈ పనులేంటి నువ్వు?" అడిగాడు రవి.

"ఇస్కూలికి పోతన్నా సారూ. సాయంకాలం పూలమ్ముతా" అంది ఆ పిల్ల

"మంచి పని చేస్తున్నావు. ఈ పూలన్నీ తీసుకుంటా కానీ. ఇంక ఇంటికి వెళ్ళు చీకటి పడుతుంది. ఒక్కదానివి ఇలా తిరగటం మంచిది కాదు"

"ఎంతైయ్యింది?"

"ఒక్కో పువ్వు ఐదు రూపాయలు సారు. పది పువ్వులున్నాయి. మొత్తం యాభై రూపాయలు" అందా పిల్ల సంతోషంగా.

"ఇదిగో ఈ రెండొందలు తీసుకో. స్కూలుకు కావాల్సినవి కొనుక్కో."

"వద్దు సారు పని చేయకుండా డబ్బులు తీసుకోను. పూలకి ఎంతివ్వాలో అంత చాలు"

"ఇంత చక్కటి వ్యక్తిత్వం ఎంతమందికి ఉంటుంది అంజలి" అని మళ్ళీ ఆ పాపతో అన్నాడు.

"పర్లేదు నువ్వు చక్కగా చదువుకుంటున్నావని ఇస్తున్నా తీసుకో" అని ఇచ్చాడు.

"అందరికి క్లాసులు తీయటమేనా మీ పని" నవ్వింది అంజలి.

"పిల్లలు చదువుకోవాలి. ఈ వయస్సులో హాయిగా ఉండాలి. ఇలా కష్టపడుతుంటే బాధగా ఉంటుంది" అన్నాడు రవి, "పదవెళ్దాం డిన్నరు తిన్నాక, నిన్ను హాస్టల్ దగ్గర దించాలి కదా"

"అడ్వాన్స్డ్ హాపీ బర్త్‌డే" పూలగుత్తులు అందిస్తూ అన్నాడు రవి.

"మీకెలా తెలుసు?" ఆశ్చర్యపోయింది అంజలి.

"మరదే అన్ని డిటైల్స్ అడగకూడదు అని ఇదివరకే చెప్పాకదా. ఇవాళ్ళ ఎందుకొచ్చాను నేను? రేపు నీ బర్త్‌డే అని. నువ్వు చెప్పిన అపార్ట్‌మెంట్ ఐడియా బాగానే ఉన్నట్లు అనిపిస్తుంది. నేను వచ్చినప్పుడు మనకు కొంచెం ప్రైవసి ఉంటుంది కదా" అన్నాడు రవి.

చప్పున తలెత్తి నవ్వుతున్న రవి వంక కోపంగా చూసింది అంజలి.

"స్టాప్.. స్టాప్... అలా చూడకు. పద డిన్నర్‌కి వెళదాం"

చైనీస్ రెస్టారెంటుకు వెళ్ళారు. బైట గార్డెన్‌లో కూర్చున్నారు. మంద్రంగా ఏదో వాయిద్యం వినిపిస్తుంది స్పీకర్లోంచి చల్లగాలి టేబుల్ మీద కాండిల్స్ చాలా అందంగా ఆహ్లాదంగా ఉంది.

"నాకెప్పుడూ ఒకటి అర్థంకాదు" అన్నాడు రవి. ఏంటి? అన్నట్లు చూసింది అంజలి.

"ఇలా వచ్చినప్పుడు ఎదురెదురుగా కూర్చుంటే బాగుంటుంది. ఒకరి వంక ఒకరు చూసుకోవచ్చు. లేదా పక్కపక్కనే కూర్చుంటే బాగుంటుందా? అప్పుడు ఏదన్నా చేయాలంటే దగ్గరగా ఉంటావు."

అతని భావం అర్థం అయ్యి, చేతిమీద చిన్నగా కొట్టింది అంజలి.

"ఏంటి కథ ఇవాళ? ఎక్స్ట్రా హుషారుగా ఉన్నారు"

"రులు.. మీరులు.. మానమంటే వినవా?"

"సరే ఏంటింత హుషారుగా ఉన్నావో చెప్పు?"

అంజలి చెయ్యి తన చేతిలోకి తీసుకున్నాడు.

"నీ దగ్గర ఉంటేనే నా మూడ్ అంతా చాలా బాగుంటుంది. ఊళ్ళో ఉన్నప్పుడు కూడా, ఎంత చిరాకులోనూ, పని వత్తిడిలోను. కాసేపు నిన్ను తలచుకుంటే నా అలసట, చిరాకు అంతా మాయమైపోయినట్లుగా ఉంటుంది. ఏం మాయ చేసావో నన్ను."

అంజలి ఏదో అనబోతుండగా, పక్కనుండి "అంజలీ?" అని వినపడింది. తలెత్తి చూసింది అంజలి, తన బ్యాచ్ మేట్స్ సాగర్, వీరేంద్ర, ఇంకెవరో ఇద్దరమ్మాయిలతో ఉన్నారు.

"ఇందాకట్నుండీ చూస్తున్నా అంజలి అబ్బాయితో ఉందేంటా అని?" అన్నాడు సాగర్.

"తను.. ఫియాన్సీ..రవి.. వీళ్ళు నా బ్యాచ్‌మేట్స్" అని పరిచయం చేసింది.

"ఓ...ఫియాన్సీనా!.. ఏంటా అంజలి అబ్బాయిలను దూరంగా ఉంచుతుంది అనుకున్నా మీరన్నమాట కారణం. లక్కీ అండి మీరు" అన్నాడు వీరేంద్ర.

"మొహం చిట్లించింది అంజలి. అంజలి మొహంలో చిరాకు గమనించాడు సాగర్. "కేరీ ఆన్. మళ్ళీ కలుద్దాం" అని వీరేంద్రను లాక్కెళ్ళాడు.

"నీకు ఫిదా అయిన బ్యాచ్‌లో వాళ్ళా వీళ్ళు" నవ్వాడు రవి.

"ఛ చిరాకేస్తుంది. ఒక్కోసారి వీళ్ళ వాగుడు వింటే. కాబోయే డాక్టర్స్, ఎంత రెస్పెక్టబుల్ ప్రొఫెషన్‌లో ఉండి ఎంత ఛీప్ గా బిహేవ్ చేస్తారో"

"కాలేజిలో ఉన్నప్పుడే కదా ఇలా ఉండేది. ఇదే సరదా అని అనుకుంటారు.  చాలామంది. వదిలేయ్. నేనేం చెపుతాను. ఎవరి మూలానన్నా మనం అప్‌సెట్ అయితే వాళ్ళు మనమీద గెలిచినట్లే అవునా?"

వెయిటర్ వాళ్ళు ఆర్డర్ చేసినవన్నీ తెచ్చాడు. తింటూ అడిగాడు రవి "అవునూ అడగటం మర్చిపోయా వివేక్ ఎలా ఉన్నాడు? ఈ మధ్య తనగురించి ఏమీ చెప్పటంలేదు."

"నేనూ ఢిల్లీ కాన్ఫరెన్స్‌కి వెళ్ళినప్పుడూ చూడటమే. రెండు నెలలయ్యింది. మన పెళ్ళి సంగతి చెప్పాను. కొంచెం అప్‌సెట్ అయినట్లుగా అనిపించాడు. పైకి పెద్దగా ఏమీ అనలేదు. ఫోన్లు చేయటం తగ్గించాడు. నేను కూడా కొన్నాళ్ళు తనతో పెద్ద మాట్లాడదలచుకోలేదు. కాస్త తను ఊరట చెందాక మాట్లాడతాను. రఘుతో మాత్రం చెప్పాను. వివేక్‌తో ఎప్పుడూ మాట్లాడుతూ ఉండమని."

కాలం వేగంగా పరిగెత్తుతుంది. చూస్తుండగానే రెండు సంవత్సరాలు గడిచిపోయాయి. ఇంకొక ఆరునెలల్లో అంజలి చదువు పూర్తి అవుతుంది. ఊరు చాలా మారింది ఆధునిక వ్యవసాయ పద్ధతులు, చదువు, కనీస అవసరాలు మెరుగుపరచుకోవటంతో. రైతులకు వ్యవసాయం నష్టంగా అనిపించటంలేదు. రవి చొరవ తీసుకుని దగ్గరలో కోల్డు స్టోరేజిలు కట్టించాడు. దానికి నిరుద్యోగులైన యువకులను ప్రోత్సహించి, బ్యాంకు రుణాలు ఇప్పించి సాధించాడు. ఊరిలో కంప్యూటర్ పెట్టించి కొంతమందికి ఎలా వాడాలో నేర్పించారు. పాల ఉత్పత్తిలో జిల్లాలోనే ప్రప్రథమంగా నిలిచింది ఈ ఊరు. విదేశాల నుండి కూడా భారీగా విరాళాలు రావటంతో, ఆ ధనాన్ని సక్రమంగా వినియోగిస్తూ చుట్టుపక్కల పల్లెలలో కూడా అభివృద్ధి కార్యక్రమాల్ని చేపట్టారు.

గత మూడు సంవత్సరాలుగా, గ్రామంలో ఒక్క పోలీసు కేసు కూడా లేకుండా ఆదర్శవంతంగా తీర్చిదిద్దినందుకు, ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఉత్తమ గ్రామం అవార్డు అందుకున్నాడు రవి.

ఇంకొక రెండు నెలల్లో పెళ్ళి చేద్దామని పెద్దలందరూ నిర్ణయించారు. రవి ఒప్పుకోలేదు. ఇంకా అంజలి చదువు పూర్తికాలేదని కానీ వేసవి సెలవల, నీరజ రాగలుగుతుందని అందరూ ఒప్పించారు.

రవి, అంజలి పెళ్ళి అంటే ఒక్క ఊరిలోనే కాదు, చుట్టుపక్కల ఊళ్ళో అందరికి పండగలాగానే ఉంది. చుట్టు పక్కల పది పల్లెల్లో అందరిని ఊరబంతికి పిలిచారు. హైస్కూలు గ్రౌండును శుభ్రపరిచి భోజనాలకు ఏర్పాట్లు చేశారు.

రేపే పెళ్ళి. రవికి చాలా అసహనంగా ఉంది. వారం రోజులయ్యింది అంజలిని చూసి. కనీసం ఫోనులో మాట్లాడుతున్నాంలే అనుకుంటే నిన్న ఇంక ఫోన్‌లో కూడా మాట్లాడను అని గట్టిగా చెప్పేసింది. ఈ రెండు రోజులన్నా కాస్త విరహంతో ఉండాలంట. మరీ అల్లరి ఎక్కువైపోతుంది అంజలికి. ఉడుక్కున్నాడు రవి.

నీరజ వచ్చింది రవి దగ్గరకు.

"ఏంరా రేపు పెళ్ళి అంటే టెన్షన్‌తో నిద్రపట్టటం లేదా?" నవ్వుతూ అడిగింది.

"అదేం లేదక్కా. ఊరికే కూర్చున్నా."

"నాకు చాలా సంతోషంగా ఉంది రవి, ఇన్నాళ్ళకైనా నువ్వు పెళ్ళి చేసుకుంటున్నావు అందులో అంజలిలాంటి అమ్మాయిని అందమైన అమ్మాయిలు చాలామంది దొరుకుతారు. కానీ అందమైన మనస్సు. వ్యక్తిత్వం ఉన్నవాళ్ళు అరుదుగా ఉంటారు" అంది నీరజ.

చిన్నగా నవ్వాడు రవి. "నువ్వన్నది నిజమే అక్కా! అంజలితో నా జీవితం చాలా ఎక్సయిటింగ్‌గా ఉంటుందని నా నమ్మకం. అన్ని విషయాల్లో ఎంతో మెచ్యూర్డ్‌గా ఆలోచిస్తుంది. నా దగ్గర ఓ చిన్నపిల్లలాగా మారిపోతుంది. అలుగుతుంది, పోట్లాడుతుంది. మంచి స్నేహితురాలిలాగా సలహాలు ఇస్తుంది. తనతో చాలా ఆనందంగా ఉండగలుగుతాను."

రవి, అంజలిల పెళ్ళి మరీ ఆర్భాటం లేకుండా, సింపుల్‌గా ఆనందంగా జరిగిపోయింది.

ఎమ్మెల్యే వెంకట్రామయ్యగారు ఉపన్యాసం ఇచ్చారు. నేను రవి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సింది ఏమీలేదు. మీ అందరికి బాగా తెలుసు. కానీ అతని జీవితంలోని ఒక ముఖ్యమైన రోజు ఇది. ఈ సందర్భంగా కాని విషయాలు మీకు గుర్తుచేద్దామనుకుంటున్నా.

రవి పట్టుదల, కృషివలన ఈ రోజు మన మండలం, ఎంతో సుభిక్షింగా ఉంది. ప్రకృతి వైపరీత్యాలను కూడా తట్టుకునే ప్రణాళికలను చేసుకున్నాడు. మద్యపానంలాంటి దురలవాట్లనుండి సంసారాలను కాపాడగలిగాడు. ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలన్న తన కృషి హైస్కూలు బాగుకోసం తను పడిన తపన వలన, ఈ సంవత్సరం నూరు శాతం ఉత్తీర్ణత సాధించాం.

వ్యవసాయేతర, వ్యవసాయం అనుబంధ వ్యాపారాలు పెరిగాయి. దానితో పట్టణాలను వలస వెళ్ళే వారి సంఖ్య చాలా తగ్గింది. పాల ఉత్పత్తిలో జిల్లాలో అగ్రగామిగా ఉన్నాం. సహకార సంఘాల వలన అందరికి మేలు జరుగుతుంది.

ఇవన్నీ ఒక ఎత్తు. ఇక రవి జిల్లా పరిషత్తు ఎన్నికల్లో గెలిచి, తన ఆలోచనను, జిల్లా వ్యాప్తంగా, రాష్ట్ర వ్యాప్తంగా సమర్ధవంతంగా అమలు పరిచి, ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకురాగలడన్న నమ్మకం నాకుంది.

కానీ ఇక్కడ ముఖ్యంగా నేను చెప్పదలచింది ఏంటంటే రవి ఒక మార్గ దర్శకత్వం నిర్దేశించాడు. కానీ మన ఇల్లు, మన గ్రామం, మన జిల్లా, మన రాష్ట్రం మన దేశం వీటిని బాగు పరచుకోవటం మనందరి బాధ్యత. ఈ విషయం అందరూ అర్ధం చేసుకుంటారని ఆశిస్తాను.

ఇంకొక విషయం మన గ్రామానికి దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ప్రెసిడెంట్ అవార్డు వచ్చింది. ఈ విషయం నాకు ఢిల్లీలో ఉన్న మన ఎం.పి.గారి ద్వారా తెలిసింది. ఇంత సంతోషకరమైన వార్తను పంచుకోవటానికి, రవి పెళ్ళికంటే మంచి సందర్భం రాదు.

రవి, అంజలిల జీవితం సంతోషంగా, ఆదర్శవంతంగా ఉండాలని ఆశీర్వదిస్తున్నా" అంటూ ముగించారు.

చప్పట్లతో ఆ ప్రదేశం అంతా దద్దరిల్లింది.

పల్చని వెన్నెల తోట అంతా పరుచుకుంది. మత్తుగా సంపెంగ, మల్లెల సువాసన.. లేత గులాబి రంగు చీర, మెడలో పచ్చగా మెరిసే తాళి, చేతినిండా గాజులు తలలో పూలు ముగ్ధమనోహరంగా ఉంది అంజలి. తననే తదేకంగా చూస్తున్న రవిని చూసి సిగ్గుపడింది అంజలి. మృదువుగా అతని మొహం పక్కకు తిప్పింది "ఎంతసేపు చూస్తావు?"

అంజలి చెయ్యి పట్టుకుని, తన పక్కన కూర్చోపెట్టుకున్నాడు. వెన్నెల్లో తోటలో రవికి అత్యంత ఇష్టమైన ప్రదేశంలో ఇలా కూర్చోవటం చాలా బాగుంది అంజలికి.

"ఏంటి ఆలోచిస్తున్నావు. నాతో జీవితం ఎలా ఉంటుందనా?" మృదువుగా అడిగాడు రవి.

"మీతో జీవితం నాకు మూడేళ్ళ క్రితమే మొదలయ్యింది. ఇప్పుడు కొత్తగా ఆలోచించేదేముంది?"

"ఒకరకంగా నిజమే కానీ ఇప్పుడు మనం ఒక ఇంట్లో ఇన్నాళ్ళకు కలిసి ఉండబోతున్నాం" అంటూ అంజలిని తనవైపుకు తిప్పుకుని చెంపమీద ముద్దుపెట్టాడు.

సిగ్గుగా నవ్వింది అంజలి.

"చాలా ఆనందంగా, సంతృప్తిగా ఉంది అంజలి.

**(సమాప్తం)**

## చిన్నమాట...

*2012 చివరాఖరిలో ఊపిరి పోసుకున్న చిన్న ఆలోచన -*

*ఒక మంచి వ్యక్తి, సత్సంకల్పంతో రాజకీయాలలోకి వచ్చి ఊరు, జిల్లా రాష్ట్ర అభివృద్ధికి దోహదపడితే ఎంత బాగుంటుంది. ఈ సమాజం ఆ వ్యక్తి ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ, ప్రలోభాలకు లొంగకుండా కేవలం తన జనం బాగుండాలన్న కాంక్షతో ముందుకు వెళ్ళలేరా?*

*ఈ ఆలోచన, ఇతివృత్తంతో ఒక అందమైన ప్రేమకథ చెప్పాలనిపించింది. 2013 జనవరిలో మొదలుపెట్టి ఏప్రిల్లో రాయటం ముగించాను. చిన్నప్పటినుండి రంగనాయకమ్మ, చలంగార్ల ఆలోచింపచేసే రచనలు, తిలక్, కృష్ణశాస్త్రి, కీట్స్ భావుకత, తెలుగు ఇంగ్లీషు భాషా బేధం లేకుండా ఎన్నో మంచి పుస్తకాలను పరిచయం చేసి, చదివే అవకాశం ఇచ్చిన అమ్మా -నాన్నలు - వారిద్దరి పుట్టిన ఊరు అయిన 'గూడవల్లి 'లో కథ అల్లుకున్నాను.*

*నా మొట్టమొదటి రచన, ఒక నవల 'గోరంతదీపం'. దాదాపు ఒక సంవత్సరం ఎవ్వరికీ చూపించలేదు. తరువాత ధైర్యం చేసి కిరణ్ప్రభ గారికి పంపితే, ఆయన చదివి ప్రచురిస్తామన్న రోజు నమ్మశక్యంగా అనిపించలేదు.*

*నా మొదటి ప్రయత్నాన్ని ఉత్సాహపరచిన కిరణ్ప్రభగారు, వ్యక్తిగత కారణాలవలన నేను వెంటనే ప్రచురణకు ఇవ్వకపోయినా, మళ్ళీ మూడేళ్ళకు నేను తిరిగి వారికి ఈ మెయిల్ పంపితే, అంతే ఆదరంగా ప్రచురించటానికి ఒప్పుకున్నారు. కాంతిగారు ఎంత ప్రోత్సహిస్తారంటే - నా మీద నాకే బోలెడు నమ్మకం పెరిగిపోతుంది రోజు రోజుకు. వారిద్దరి మంచి మనస్సు, ఆదరాభిమానాలకు సర్వదా కృతజ్ఞతలు.*

*నన్ను ఎప్పుడూ, ప్రతి అంశంలోనూ ప్రోత్సహించే వ్యక్తులు నా జీవితంలో ఉండటం నా అదృష్టం. ప్రతి నెల ప్రచురణలో నా మొదటి ప్రయత్నం మళ్ళీ చదవటం మాత్రం వర్ణించలేని అనుభూతి.*

***- అంజన కొడాలి***